భారతి

మాసపత్రిక

సంపాదకుడు


శివలెంక శంభుప్రసాద్

ఏప్రిల్ 1965

సంపుటము 42 : : సంచిక 4

విడిపత్రిక వెల ఒక రూపాయి


ఏప్రిల్
విడుదల!



శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు 27-వ పుణ్యవర్ధంతి :
చైత్ర శుద్ధ ద్వాదశీ సోమవారం 12-4-65.

విషయానుక్రమణిక

ఏప్రిల్ 1965

నా ప్రశ్న

శ్రీ సాతలపాటి గంగాధరం

అడిగేదే అయితే నా ప్రశ్న
అందరూ చెప్పేవాళ్ళు జవాబు.

కదలాడే నీళ్ళమీది నీడ
ఒదుగుతుందా కెమెరా యంత్రానికి!

మదిలో మెదిలే తరంగాలు
మాటలకి అందగలిగితే
ఎందుకీ మథనమంతా?

అంతరంగంలో ఎగిరి గంతులేసే శైలూషి
భాషావేదిక మీదకు తీసుకరాగానే
ముఖం మాడి సొగసు వీడి
చెక్కిన కొయ్యబొమ్మలా తయారవుతుంది.

పర్వతాలమధ్యా
పచ్చిక బీళ్ళ మధ్యా
పాటపాడుతూ—పరుగులెడుతూ
పారిపోతున్న సెలయేటి జవరాలికి
అడ్డుకట్ట వేయగానే—
అదిరిపోయి
అందమంతా చెదరిపోయినట్లు
పదాల సంకెళ్ళకు
భావకురంగాలు
రక్తం గ్రక్కి నేల కూలుతున్నాయి.

మానసముద్రలో—మనోవీధిని
ఎగిరిపోతున్న రాజహంసను

పదశరఘాతంతో గురిచూచి
పడగొట్టివేశాడు; ఆదికవి అయినాడు.

ఒక కిరాతకుని ఘాతుకాన్ని
తిలకించి—తిలకించ లేక
విలపించి—విలపించ లేక
అదేఘాతుకాన్ని తనూ చేశాడు—
కాకుంటే కొద్ది తేడాలో!

కత్తి పుచ్చుకుని
కదళీవృక్షాన్ని, ఇలా
ఖండించరాదని, తనే
ఖండించి చూపాడు.

అడిగేదే అయితే నా ప్రశ్న
అందరూ చెప్పేవాళ్ళే జవాబు.

మనః ప్రవృత్తి పూర్తిగా
మాటలకి లొంగగలిగితే
మరలా, ఏముంది మనసుకు ఘనత?
కనుకొలుకుల్లో తళతళలాడే
కన్నీటి బిందువులకు లేని విలువ
శంఖంలో పోసిన
పైడుకాలువలోని నీళ్ల కెలా వచ్చింది?

నిశ్చల కాసార నీరంలో బింబించే
నీలాకాశపు నిర్మల సౌందర్యం
నడిచేస్తూ వడివడిగా గంతులెడుతూ కదలిపోయే
సరిత్ప్రవాహంలో
కనబడక పోవడానికి
కారణ మేమిటి?

చంచల లీలాకల్మష మనః చక్షువుకు
చంచల్లీలా మనోహర ప్రభామూర్తి
సందర్శన భాగ్యం
కలగక పోవడానికి
కారణ మేమిటి?

నన్నయ యయాతి చరిత్ర

శ్రీ వడలి మందేశ్వరరావు

ఒక మహాకవి నన్నయభట్టారకుని ఒక కుంజరముతో పోల్చాడు. ఆ కవి ఆదికవి నలా ఎందుకు పోల్చాడో నాకు తెలియదుగాని, భారతేతిహాస రచనలో నన్నయ పోకడ సామజ గమనాన్ని స్ఫురింపజేస్తుంది:

ఆదిపర్వ తృతీయాశ్వాసమున 'సురాసుర వంశావతార కీర్తనము' విన్న జనమేజయునికి మరొక్క కోర్కె కల్గింది

"అభ్యస్తవేద వే—దాంగులు విధి దత్త
దక్షిణా ప్రీణిత—ధరణి దేవు
లవిరతాశ్వమే—ధావభృథస్నాన
పూతమూర్తులు కృత—పుణ్యులహిత
వర్గ జయుల్ ప్రాప్త—వర్గ చతుష్టయుత్
సత్యాది సద్గుణ—జన్మ నిలయు
లా భరతాది మ—హా మహిపాలకు
లిద్ధ యశోర్థు లెం—దేనిఁ బుట్టి
రట్టి కౌరవాన్వ—యంబు పాండవ నృప
రత్నములకు వారి—రాశియైన
దాని వినగ వలతుఁ—దద్దయుఁ బ్రీతితో
విప్రముఖ్య నాకు—విస్తరింపు."

(1—3—86)

అని జనమేజయుడు వైశంపాయనుని అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు కౌరవవంశ వివరణము ప్రారంభించాడు. అందులోని తొలి పద్యము చంపకమాల :

"నిరుపమ ధర్మమార్గ పరి
నిష్ఠితులై మహినెల్లఁ గాచుచుం
బరఁగిన తొంటి పూరు కురు
పాండు మహీశుల పేర్మిఁ జేసి భూ
భరవహనక్షమం బగుచుఁ
భారత కౌరవ పాండవాన్వయం
బురుగుణ సంపదం బెరిఁగి
యొప్పె సమస్త జగత్ప్రసిద్ధమై."

(1—3—88)

ఆలోచించగా వెనకటి సీసపద్యము, ఈ చంపకమాల— రెండూ కూడ ఒకే వంశ ప్రశస్తిని తెలియజేసే పద్యాలు. కాని, వెనుకటి సీసపద్యగతి అణకువతో ఒక విషయాన్ని తెలుసుకొనవలెనన్న ఉత్కంఠతో అడిగినట్లుండగా, ఈ వృత్తగతి ఇతిహాసోపన్యాసానికి భూమిక అన్న స్ఫురణ కల్గిస్తోంది. ఈ పద్యగతి సామజగమనాన్ని పోలి ఉన్నది. ఇక్కడినుండి యీ ఆశ్వాసమందలి 95 వ పద్యము వఱకు ఈ వంశ మందలి రాజులను గూర్చి వరుసగా ఏకరువు పెట్టటమే జరిగింది. ఈ వంశ మొక మహారణ్యమంత విశాలమైనదన్నచో ఈ వంశ వివరణ విధానము గజగమనాన్ని అనుకరించిన దన వచ్చును. అరణ్యములో సవిలాసముగా కరచాలనము చేస్తూ నడచిపోయే కరిరాజ గమనాన్ని స్ఫురింపజేస్తుంది యీ కథ నము. అంతేకాదు; ఆ కరిరాజు ఒక్కొక్కసారి ఒక కొమ్మనో, ఒక రెమ్మనో, ఒక సుందర పుష్పాన్నో తన హస్తముతో సవిలా సంగా స్పృశించినట్లే, ఈ కథనంలో కూడా అక్కడక్కడ ఒక్కొక్క విషయం సవిలాసంగా స్పృశింపబడింది. అట్టి వానిలో ఒకటి పురూరవుని కథ. తర్వాత నహుషుని గూర్చి ఒక్క పద్యంలో చెప్పబడింది. ఇది మత్తేభ మవడం ఒక విశేషం.

"చతురంభోధి పరీత భూవలయమున్
సద్వీపసారణ్య సత్

క్షితిభృత్కం బగుదాని భూరి భుజ శ
క్తిం జేసి పాలించుచుం
గ్రతువుల్ నూ ఱొనరించి కీర్తి వెలయం
గా దిక్కులన్ నిర్జితా
హితుఁడై యా నహుషుండు దాఁ బడసె దే
వేంద్రత్వముం బేర్మితోన్." (1—3—93)

ఈ పద్యం కథనములోని గంధ సింధుర గమనానికి ఒక ఊతాన్ని ఇవ్వడానికేగాక కవిత్వ తత్వ విచారణకుకూడా మంచి అవకాశాన్ని ఇస్తుంది. ఈ పద్యములో చెప్పిన విషయమునకు వాడిన శబ్దములకు గల మైత్రి అపూర్వమైనది. శబ్దోచ్చారణము పూర్తికాకమునుపే, శబ్దార్థమునకై ఆలోచించక పూర్వమే ఇందలి శబ్దములన్నీ కరిగి దివ్యభావాపగ లయిపోతున్నాయి. పద్యములో లోకోత్తరమైన విషయముకాని, ఆధ్యాత్మిక తత్త్వము కాని లేకపోవచ్చును. కాని ఇందులో కానవచ్చేది వడియగట్టిన కవితామృతము. ఇందులో శబ్దమునకు అర్థమునకు గల హద్దులు అన్నీ తుడిచివేయబడ్డాయి. శబ్దోచ్చారణమే ఉదాత్తభావ స్ఫోరకమై అర్థమాలోచనామృతమవుతోంది. అంతేగాక శబ్దోచ్చారణ వల్లనే అర్థస్ఫూర్తి కూడ కల్గడంవలన ఈ పద్యము ఆపాత మధురమై, ఆలోచనామృతమై సంగీతానికి కవితకు గల అవధులు కానరాకుండా చేసింది. ఆదికవి నన్నయలోని యీ లక్షణమే నూతన మార్గాలను సృష్టించిన శ్రీనాథుని, పెద్దనను ఎక్కువగా ఆకర్షించింది.

మత్తేభగమనంలో నడుస్తూన్న కథ పూరుని వఱకు సాగింది. యయాతి వఱకు నడచిన చరిత్ర సహజంగానే కనబడింది జనమేజయునికి. పురూరవుడు గర్వంచే శాపాన్ని పొందాడు. నహుషుడు నూరు క్రతువులు చేసి దేవేంద్రత్వాన్ని పొందాడు. యయాతి ఇట్టి అద్భుత విశేషలనేమి సాధించకపోగా, అతని జీవితంలో మానవత్వ స్ఫురణ విపరీతంగా కనబడుతుంది. అతడు యాగాలు చేశాడు; శుక్రపుత్రి అయిన దేవయానిని వివాహమాడాడు. శుక్రశాపంవలన జరాభార పీడితు డయాడు. ఇన్ని యాగాలు చేసినా, యయాతికి విషయోపభోగాభిలాష వదలక పెరుగుతూనే ఉన్నది. అందుచేత తన కొడుకులలో నొకనిని తన వార్ధక్యాన్ని భరించమన్నాడు. దేవయాని వలన కనిన తన సంతాన మెవ్వరూ అతని వార్ధక్యాన్ని దాల్ప నొల్లకపోతే, శర్మిష్ఠయం దాతడు కన్న ముగ్గురు కొడుకులలో కడపటివాడైన పూరుడు తండ్రి వార్ధక్యాన్ని తాను భరించి, తన యౌవనాన్ని తండ్రి కిచ్చాడు. యయాతి ఈ పూరుడే రాజ్యానికి అర్హుడని నిర్ణయించాడు.

ఇందులో ఒకదాని కొకటి పొసగని అంశాలు అనేకము ఉన్నాయి. క్షత్రియుడయిన యయాతి బ్రాహ్మణకన్య అయిన దేవయాని నెలా వివాహమాడాడు ? శుక్రుడు ఈ వివాహానికి అలిగియుండడు. ఏమంటే అతడు యయాతిని శపించుట యయాతి ఐదుగురు కొడుకులను కన్న తర్వాత జరిగిన విషయము. అంటే శుక్రునికి ఈ వివాహము అంగీకార మైనదే అన్నమాట. అయితే ఇక అల్లుని మామ శపించుట ఎందులకు సంభవించినది ? అందును, అందఱును అల్లుని ఆయురారోగ్యములను కోరుట సహజము కాగా, శుక్రుడు తన జామాత వృద్ధు అవాలని శపించుట ఏమిటి ? వృషపర్వుడు రాక్షసరాజు. అతని కాచార్యుడు శుక్రుడు. అట్టి వృషపర్వ శుక్రుల కూతుండ్రు యయాతికి భార్యలగుట ఎట్లు సంభవించినది ? శుక్రుడు శపించగా యయాతి వృద్ధు అయాడు. ఆ వార్ధక్యాన్ని కొడుకుల కీయదలిస్తే, శుక్రుని శాపఫలం మాత్ర మేమి అనుభవించినట్లు ? యయాతికి పెద్దకొడుకు తనకు మనవడు నయిన యదువునకు రాజ్య మీయక తన శాప ఫలాన్ని అనుభవించడానికి అడ్డువచ్చిన శర్మిష్ఠ కనిష్ఠ సంతానమునకు రాజ్యమును కట్టబెడుతూ ఉంటే శుక్రు డెలా వూరుకున్నాడు ?

జనమేజయుడు ఇన్ని సందేహములను వెలిబుచ్చలేదు. కాని, అత డడిగిన ప్రశ్నలలో పై సందేహములన్నీ ఇమిడి ఉన్నాయి.

"వర్ణధర్మముల్ గాచుచు—వసుధ యెల్ల
ననఘ చరితుఁడై యేలిన—యయ్యయాతి
భూసురోత్తము భార్గవ—పుత్రియైన
దేవయానిని దా నెట్లు—దేవిఁ జేసె ?

విపుల తేజంబునను దపో—వీర్యమునను
జగ దనుగ్రహ నిగ్రహ—శక్తియుక్తు
డయిన యట్టి యయాతికి—నలిగి యేమి
కారణంబున శాపంబు—కావ్యుఁ డిచ్చె ?"

యయాతి కథలో సరిపడని సంగతులుగా పైన కొన్ని పేర్కొనబడినవి. వానిని జనమేజయుని ప్రశ్నలతో పోలిస్తే ఒక చిత్రమైన తేడా కనబడుతుంది. జనమేజయుని దృష్టిలో పొసగని అంశాలకు ప్రాముఖ్యం లేకపోలేదు గాని, పొత్తు కుదరని ధర్మాలకు అతడు ఆశ్చర్య పడుతున్నాడు. ధర్మాసనం నుంచి అతడు పరిశీలించగా అతనికి మొదటి సందేహము కల్గింది. రెండవ సందేహము మొదటి సందేహానికి 'ఉపసందేహం' వంటిది.

అంతేగాకుండా యీ రెండు పద్యాలు యయాతి కథను రెండు భాగములుగా విభజిస్తున్నాయి. మొదటి ప్రశ్నకు సమాధానంగా కచదేవయానుల కథలను, రెండవ

ప్రశ్నకు సమాధానంగా యయాతి పూరుని రాజ్యాభిషిక్తుని చేసేవఱకు జరిగిన కథను వూహించుకొనవచ్చును. మిగత కథను గూర్చి తర్వాత వివరిస్తాను.

యయాతి చరిత్రలోని కథా నిర్మాణము చాల పరిణితి నందింది. ఇది నిజానికి కొన్ని కథల సంపుటి. ఇందలి కథలు: (1) దేవతలు మృతసంజీవని విద్యను సంపాదించడము (2) కచ దేవయానుల కథ (3) శర్మిష్ఠ దేవయానికి దాసి కావడం (4) దేవయాని యయాతిని వివాహమవడం (5) శర్మిష్ఠ యయాతి వలన పుత్రలాభాన్ని పొందడం (6) యయాతి శాపగ్రస్తుడవడం—పూరునికి రాజార్హత కల్గడం (7) యయాతి ఉత్తమ లోకాలను పొందడం. ఈ కథలన్నీ చాల నేర్పరితనంతో ఒకే కథగా అల్లబడ్డాయి.

కథాప్రారంభమే చాలా చిత్రంగా ఉన్నది. యయాతి కథను చెప్పమని జనమేజయుడు కోరగా, "వృషపర్వుడనే రాక్షసరాజు ఉన్నాడు. అతనికి శుక్రు డాచార్యుడు" అని వైశంపాయనుడు ప్రారంభించాడు. తర్వాత దేవాసుర యుద్ధములో శుక్రుని సంజీవనీ విద్య ప్రయోజనాన్ని వివరించాడు. ఆమీద దేవలోకములో దేవతల అలజడి, బృహస్పతి పుత్రుడైన కచుని వద్దకు దేవతలందరూ వెళ్లడము చెప్పాడు. యయాతి చరిత్రకు క్షణక్షణమూ మనము దూరమవుతూన్నట్లు మనకు తోస్తుంది. కాని యీ సంజీవనీ విద్యను సాధించడానికి కచుని ప్రయత్నముతోపాటు కథలో దేవయాని ప్రాముఖ్యం కూడా క్షణక్షణమూ పెరుగుతూ వచ్చింది. "దుహితృ స్నేహంబునం జేసి యద్దేవయాని పలుకులు శుక్రుం డతిక్రమింపండు, గావున నీ నేర్పు విధంబున దాని చిత్తంబు వడసి శుక్రు నారాధించిన నీ కిష్టసిద్ధియగు" నన్నారు కచునితో దేవతలు. ఒక దృష్టినుండి చూస్తే దేవకార్యాన్ని కచుడు సాధించడంలో దేవయానికి గల సంబంధము అతి స్వల్పమైనదే. కచుడు దానవుల వలన హతు డగుటలో తెలియరాగున నున్న యీ పాత్ర హఠాత్తుగా విపరీతమైన ప్రాముఖ్యములోనికి వచ్చింది. కథలో ఈమెకు గల ప్రాముఖ్యాన్ని సూచించడానికి నన్నయ ఈమెచేత వృత్తములో మాట్లాడించాడు :

"వాఁడి మయూఖముల్ గలుగు
వాఁ డపరాంబుధిఁ గ్రుంకె ధేనువుల్
నేఁడిట వచ్చె నేకతమ
విష్ణుమెయిన్ భవదగ్ని హోత్రముల్
పోఁడిగ వేల్వఁగాఁ బడియె
బ్రొద్దును బోయెఁ గచుండు వేనియున్
రాఁడు వనంబులోన మృగ
రాక్షస పన్నగ బాధ నొందెనో !"

ఈ కథలో ఇదే తొలి వృత్తం. ఈ పద్య ప్రయోజనాలలో ఒకటి కథలో మన దృష్టిని దేవయాని వైపునకు మళ్లించడం. రెండవసారి కచుని దానవులు చంపినప్పుడు "వానికి నేను శోకింప కెట్లుండుదు" నని దేవయాని శుక్రునితో అన్న మాటలు మత్తేభ వృత్తములో నుండుట గమనింపదగ్గ విశేషము. సంజీవని వడసిన తర్వాత కొంతకాలమునకు కచుడు దేవలోకానికి ప్రయాణమైనప్పుడు దేవయాని కచునితో :

"నీవును బ్రహ్మచారివి వి
నీతుఁడ వేమను గన్యకన్ మహీ
దేవకులావతంస రవి
తేజ వివాహము నీకు నాకు మున్
భావజశక్తి నైనయది
పన్నుగ నన్నుఁ బరిగ్రహింపు సం
జీవనితోడ శుక్రుదయ
జేయుము నాకుఁ బ్రియంబు ....."

అన్నది. ఇది తిరిగి వృత్త మవటం గమనింపదగ్గది. ఇలా ఈ పాత్ర పెరగడంతో దేవకార్యము కథలో ద్వితీయ స్థానానికి దిగజారి, దేవయాని భవిష్యమును గూర్చి మనకు ఉత్కంఠ కలిగేటట్లు చేయగలిగాడు కవి.

అంటే మృతసంజీవని విద్యను సాధించడమనే కథ నిర్వహింపబడి కచదేవయానుల కథ పూర్తి అయేటప్పటికి తర్వాత కథకు అప్పుడే కవి మనలను మానసికంగా సన్నద్ధులను చేసి ఉంచాడు. ఇప్పు డిక దేవయాని యయాతిని వివాహమవుతుందని మనం వూహిస్తాము. కాని కథలో ఇంకొక మలుపు కనిపిస్తుంది. ఇంకొక క్రొత్త పాత్ర ప్రవేశపెట్టబడింది. ఈమె శర్మిష్ఠ. ఇకనుంచి దేవయాని శర్మిష్ఠ లిరువురూ జంటగా ఒకరి ప్రక్కన ఒకరు కనబడుతూ ఉంటారు. కాని చిత్రం ఏమంటే మొదటినుండీ తుదివఱకు దేవయానిదే పైచేయి. కాని మనకు సానుభూతి మాత్రం శర్మిష్ఠ పట్లనే. దేవయాని రాక్షసరాజును, తన తండ్రిని, యయాతిని తన యిచ్చ వచ్చినట్లుగా నడుపగల ననుకొన్నది. తాను పట్టినదే వ్రతం, తన మాటే ఆజ్ఞ అన్నట్టుగా సాగింది ఆమె ప్రభుత్వం. కాని చివరకు ఆమె సాధించుకొన గల్గింది ఏమీ లేకపోయింది. తన మాటను నమ్ముకొని, తండ్రి తన భర్తను శపించగా, తనకేమీ లాభము కల్గకపోగా, శర్మిష్ఠ కొడుకు పూరునికి రాజ్యార్హత కల్గింది.

దేవయాని ప్రక్కనున్న శర్మిష్ఠ మనకు సాళువము చెంగటనున్న పారావతమువలె కనబడుతుంది. మఱీ చిన్నతనంలో

దేవయానిని యేమి ఎగ్గులాడిందో కాని, తర్వాత మాత్రం అంత ఆత్మాభిమానము గల మగువ కానరాదు. అయినా దేవయాని ప్రక్కన శర్మిష్ఠ ఉంటే అందరి చూపు శర్మిష్ఠ మీదనే ఉంటుంది. వా రిద్దరూ కలిసిఉన్న సందర్భములు కథలో మూడు నాల్గు చోట్ల ముఖ్యంగా కనబడతాయి. మొదటిసారి మళ్ళీ చిన్నతనంలో శర్మిష్ఠ దేవయానితో కలిసి జలక్రీడ లాడినప్పుడు. అప్పుడు గాలికి వారి పరిధానములు కలిసిపోగా, "దేవయాని పుట్టంబు శర్మిష్ఠ గట్టికొనిన, మఱి దాని పరిధానంబు పుచ్చుకొనక, రోసి, శర్మిష్ఠం జూచి యిట్లనియె :

"లోకోత్తర చరితుండగు
నా కావ్య తనూజ నీకు—నారాధ్యను నేఁ
బ్రాకట భూసుర కన్యక
నీ కట్టిన మైల గట్ట—నేర్తునె...?"

ఈ మాటలలోని అహంకారము స్పష్టమే. శర్మిష్ఠ ఇలా అన్నదట :

"మాయయ్యకుఁ బాయక పని
సేయుచు దీవించి ప్రియము—చేయుచు నుండున్
మీ యయ్య వెండి మహిమలు
నా యొద్దను పలుక నీకు—నానయు లేదే ?"

దేవయాని మాటలలోని గీర్వాణ శబ్దాలన్నీ ఆమె అహంకారానికి నిదర్శనమైతే, శర్మిష్ఠ సమాధానంలోని దేశీయమైన పలుకుబడి ఆమె ముద్దరాలని సూచిస్తోంది. శబ్దాలక్కు అర్థ మెక్కడానికే విచారిస్తే శర్మిష్ఠ సమాధానంలో ఔచిత్యాన్ని అతిక్రమించినట్లు రూఢి అవుతుంది. దేవయాని ఆమె మాటలలో అంతవరకే చూడగల్గింది. కాని, శబ్దమునకు కేవలము అర్థమే కాదు ప్రాణము : ఉచ్చారణ, కాకువు, నుడికారము మున్నగునవన్నీ కలిసి వాక్కునకు ప్రాణాన్ని పోస్తాయి. అప్పుడు నిఘంటువు లిచ్చే అర్థానికి ప్రాముఖ్యం సన్నగిల్లి మాటాడే వ్యక్తియొక్క మనసు, మూర్తిమత్వము మనకు ఆవిష్కరింపబడుతాయి. ఇది లోక వ్యవహారంలో మనకు అనుభవంలో నున్నదే కాని, దీనిని కావ్యములోనికి గొనిరాగల్గడము లోకోత్తరమైనది. ఇట్టి సొగసులు అనువాదయోగ్యమైనవి కావు. ఇవి మహాకవిచేతనే ప్రకాశింపగలవు కాని పది మూలము లున్నప్పటికీ అనువాదంలో కనిపించలేవు. ఇట్టి సొగసులను అవలీలగా కవిత్రయము సాధించగల్గారు. కనుకనే వారి కావ్యాన్ని అనువాద మనడం శిల్పదృష్టి లేమిని తెలియజేస్తుంది.

రెండవసారి మళ్ళీ దేవయాని శర్మిష్ఠలు కనిపించినప్పటి పరిస్థితి వేఱు. మొదటిసారి శర్మిష్ఠ కన్యకా సహస్ర పరివృత అయి దేవయానీ సహితముగా వనమునకు వెళ్ళింది. అప్పుడు శర్మిష్ఠ రాచకూతురు. ఇప్పుడు శర్మిష్ఠ దాసియై దేవయానిని కొలుస్తోంది. రాచకూతురుని వన విహారములో వింత ఏమీ లేదు కనుక అక్కడ ఆ విషయం వచనంలో వివరింరింపబడినది. కాని ఇక్కడ తారుమారయిన పరిస్థితులలో :

"వనకేళీ కౌతుకమున
జనియెను శర్మిష్ఠఁ దొట్టి—సఖులెల్ల ముదం
బునఁ గొలిచి రాఁగ విభవము
దన కమరఁగ దేవయాని—తద్వనమునకున్.'

విషయం వెనుకటిదే : విషయంలో విశేషం లేకపోయినా దేవయాని కబ్బిన సిరి క్రొత్తది కనుక ఆమె భాగ్య ప్రకటనకు అనువైన ఆమె ప్రవర్తనను రూపు కట్టించడానికి పద్యం వాడబడింది.

ఆ వనమున వీ రందరు "పుష్పావచయంబు సేయుచు, వివిష్ట వినోదంబుల నున్న యవసరంబున" యయాతి అక్కడకు వచ్చాడు. ఇక్కడకు అతనిని తీసికొని వచ్చినది అనిలుడనే దూతయట ! ఈ విషయాన్ని చెపుతూ నన్నయ వ్రాసిన పద్యం భాషకు ఒక అపూర్వమైన సంపద :

"అంగనాజనుల యు—త్తుంగ సంగత కుచ
కుంకుమ చందన—పంకములయు
వారివ ధమ్మిల్ల—భారావకలిత ది
వ్యామోద నవపుష్ప—దామములయు
వారివ ముఖన క—ర్పూర తాంబూలాది
వాసనా సురభిని—శ్వాసములయు
వారివ పరిధాన—చారు ధూపములయు
విలసిత సౌరభా—వలులు దాల్చి
యనిలుఁ డను దూత పోయి తో—డ్కొనియెఁ దెచ్చె
దేవయాని పాలికి మృగ—తృష్ణఁ జేసి
కాననంబునఁ గ్రుమ్మరు—వాని వీరు
నతి పరిశ్రాంతుఁడైన య—యాతి నంత.
(1—3—156)

నన్నయ అధ్యాత్మిక తత్వాన్ని ఎంతగా ఆదరిస్తాడో, ఇంద్రియానుభూతిని అంతగా హృదయాన్ని హత్తుకునేటట్లు చేయగలడు. ఘ్రాణేంద్రియానికి సంబంధించిన అనుభవాన్ని ఇంత చిక్కగా పద్యంలో నిబంధించిన కవులు ప్రపంచంలోనే కొద్దిమంది ఉంటారు. ఇంద్రియానుభవములకు కవితలో శాశ్వత రూపాన్ని కల్పించగల్గిన పెద్దనకు కూడా యీపద్యము ఆదరార్హమైనదే.

వచ్చిన యయాతిని అప్పటి కన్యలు పూజించారు :

"తరళ నయనాబ్జ దళములు

నెరయఁగఁ జై మున్న చల్లి—నృపసుతుఁ బూజిం
చిరి నవకుసుమ మయాలం
కరణ విశేషముల నచటి—కాంతలు ప్రీతిన్.
(1—3—157)

పై సీసములోను, ఈ పద్యములోను గల రచనా విధానము తర్వాతి ప్రబంధకవులకు మార్గదర్శక మవడం అలా ఉండగా, ఇందులోని విశేషము గమనింపదగ్గది. ఈ రెండు పద్యములు కథలో ఒక లిరికల్ ఎలిమెంట్‌ను, రొమాంటిక్ వాతావరణాన్ని ప్రవేశపెడుతున్నాయి. చరిత్రలా నడుస్తున్న కథను కవిత్వపు పొంగు ఒక్కసారి ముంచివేసింది. ఈ పొంగునకు కారణము దేవయాని మాత్రము కాదు. శర్మిష్ఠ అని మనకు తెలుసును. యయాతి కూడా "యతిశయ రూపలావణ్య గుణసుందరి యయిన శర్మిష్ఠ నెఱుంగ వేఁడి, 'మీ రెవ్వరి వారలు మీ కులగోత్ర నామంబు లెఱుంగ వలయుం జెప్పుం'డ"ని అడిగాడు. రాజ ప్రశ్నకు సమాధాన మిచ్చినది దేవయాని. తన్ను వివాహమాడుమని రాజును కోరినప్పుడు కూడ శర్మిష్ఠ ప్రసక్తి తీసికొనిపోవడం దేవయానికి తప్పలేదు. 1

తన పెద్ద కొడుకుకు కన్న తర్వాత ఒకసారి, ముగ్గురు కొడుకులకు తల్లి అయిన తర్వాత మఱొకసారి, శర్మిష్ఠ దేవయానితో కలిసి కథలో కనబడుతుంది. ఈ రెండు సందర్భాలలోను కూడ శర్మిష్ఠయే మన సానుభూతిని పొందగల్గుతోంది. యయాతివల్ల శర్మిష్ఠకు గలిగిన సంతానాన్ని చూసి "కర మనురాగిల్లెఁ గన్యకా నివహంబున్" అన్నాడు నన్నయ. ఈ కన్యకా నివహములో లోకము, దైవము, కథకుడు, శ్రోత ఉన్నారని గమనించాలి.

పూర్వ కథలోని దేవయాని శాపగ్రస్త. మఱికొంత కాలానికి శర్మిష్ఠచే నొక నూత ద్రోయబడింది. ఈ రెండింటినీ తనకు అనుకూలమైన వరములుగా మార్చుకొన నిశ్చయించింది దేవయాని. శాపగ్రస్తురాలు కావడము వలన యయాతికి భార్య కాగల అర్హత ఉన్నది; నూత ద్రోయబడడంవలన అత డామె కరగ్రహణము చేయ నవకాశము కల్గినది. అంతే గాక శర్మిష్ఠవలన పొందిన అవమానాన్ని కూడా ఉపయోగపరచుకొని దేవయాని శర్మిష్ఠను కన్యకా సహస్రముతో తనకు దాసిగా చేసుకొన్నది. దీనివలన తనకు రాణి అయే అర్హత కల్గిందని కూడా భావించి ఉంటుంది. యయాతిని ఒడబరచి అతని వివాహమాడింది.

కాని వారి వివాహము కాకమునుపే రాజు శర్మిష్ఠ పట్ల ఆర్ద్రహృదయుడని మన మెఱుగుదుము. ఇది కథలో ఇంకొక సంక్లిష్టత. దీనివల్ల రాబోయే కథ ఒడుదుడుకులు లేకుండా సాగదని మనకు అనుమానం కల్గుతుంది. ఈ అనుమానానికి తోడుగా ఈ శర్మిష్ఠను దేవయాని రాచనగరునకు తీసికొని వచ్చింది. కాని శుక్రుడు యయాతికి శర్మిష్ఠను చూపి, "దీనికిం బ్రియంబున నన్నపాన భూషణాచ్ఛాదన మాల్యాను లేపనాదుల సంతోషంబు సేయునది. శయన విషయంబునఁ బరిహరించునది" అని చెప్పాడు. ఇది కథలో ఇంకొక మలుపు. రాజునకు ఆమెపట్ల గల అభిమానాన్ని మన మెఱుగుదుము; శుక్రుని నిషేధాన్ని కూడా మనము విన్నాము. ఈ నిషేధము చిత్రమైనది. శర్మిష్ఠకు అన్ని భోగములను కల్పించవలెను గాని ఏతత్ భోగ పర్యవసానముగ నుత్పన్నమగు భోగవాంఛను మాత్ర మాదరింపరాదు.

యయాతి శర్మిష్ఠ పట్ల శుక్రుడు కోరినట్లుగా ప్రవర్తించి యుండవచ్చును. కాని దానితో కథ కంచికి వెడుతుంది. అది అలా ఉండగా ఈ కథలోని విశేష మేమంటే ఎవరేమి కోరుకున్నా వారి కది లభించినట్లే ఉంటుందికాని అనుభవములోనికి రాదు; ఫలించదు. దేవతలు కచుని దేవయాని చిత్తమును వడయు మన్నారు. అత డామె మెప్పును పొందగల్గాడు. కాని తన్ను వివాహము చేసుకొనుమన్నది.

కచునికి సంజీవని లభించినది; కాని తాను ప్రయోక్త అయే అర్హతను పోగొట్టుకొన్నాడు.

దేవయానిని శర్మిష్ఠ నూత ద్రోసింది. చక్కగా బుద్ధిచెప్పా ననుకొన్నది. కాని దీనికి ఫలితముగా దేవయానికి దాసి కావలసి వచ్చింది.

రాజు దేవయానికి సాయము చేయబోయి నూతి నుండి వెలికి తీశాడు; తన్ను వివాహ మాడుమన్నది దేవయాని.

రాజు చూపు అంతా శర్మిష్ఠమీద; వివాహమాడింది దేవయానిని.

ఇప్పుడు శర్మిష్ఠను శయన విషయమున పరిహరించునది అని శుక్రుడు ఆదేశించినా, ఫలితము దానికి వ్యతి

---

1. "నన్ను వివాహమై సహాన
వందన యీ లలితాంగిఁ బొట్టె యీ
కన్నియ లందఱున్ దివిజ
కన్యలతో నెనయైనవారు నీ
కున్నతిఁ బ్రీతి సేయఁగ వృ
షోత్తము నానవుఁ బోలి లీలతో
వి న్నరలోక భోగము ల
నేకము లందుము నీవు (నావుడున్)."
(3—1—161)

లేకముగా ఉంటుందని మనకు తెలుసును. యయాతి శర్మిష్ఠకు బురుకాలోచితాన్ని ప్రసాదించినప్పుడు యయాతి శుక్రుని ఆదేశాన్ని ఉల్లంఘించినప్పటికీ, యీ కథ అంతటికీ ఇదే ఎంతో పవిత్రమైన ఘట్టమువలె మనకు తోస్తుంది. యయాతి శర్మిష్ఠకు కనబడడమే "దాని పుణ్య స్వరూపంబు సన్నిహితంబైన యట్లు"న్నదట! ఆమె కొడుకులు ముగ్గురు,

"కరువలివేఁ దూలు—కపిల జటాలియు
కరమొప్పు తెలుగాఁ—గనకరత్న
మయజాల భూషణా—మలదేహ దీప్తుల
తేజంబుగాఁ బవి—దీవ్యమాన
యాగ శతంబుల—నర్చితంబైన మూఁ
డగ్నులు ప్రత్యక్ష—మైన యట్లు."

(1—3—182)

ఉన్నారట. ఈ బాలురను దేవయాని దృష్టిపథములో పడకుండా ఉంచడమంటే అగ్నిని చీర చెఱగున దాచడం వంటిది. వారిని దేవయాని చూడనూ చూసింది, యయాతి శర్మిష్ఠవలన లబ్ధ సంతాను డగుటను తెలిసికొన్నది.

ఇది కథలోని కడపటి మలుపు. ఇప్పుడు దేవయాని తిరిగి కోపోద్దీపిత అవుతుందని మనకు తెలుసును. బహుశః తండ్రి దగ్గరకు కూడ వెడుతుంది. అయితే అతడు కూతునే సమర్థిస్తాడా? వెనుక నొకసారి అతడు దేవయానికి ఒక హితవు చెప్పాడు

"అలిగిన నలుగక యొగ్గులు
పలికిన మఱి వినని యట్లు ప్రతి వచనంబుల్
పలుకక బన్నము వడి యొడఁ
దలఁపక యున్నతఁడ చూవె—ధర్మజ్ఞుఁ డిలన్."

(1—3—147)

కాని యీ కథలో అన్నీ వింతలే. ఇప్పుడు దేవయాని తన అవమానంతో అధర్మాన్ని కూడ జోడించింది. "అధర్మంబున ధర్మంబు గీర్పఱచి యుష్మద్గృహంబు డాసురంబున వాసురియం దనురక్తుండై పుత్త్రత్రయంబు పడసి నా కవమానంబు సేసె!" అన్నది. వెనుకటి తన సూక్తిని తానే మఱచాడు శుక్రుడు. అయితే అప్పటి పరిస్థితి వేఱు. అది పిల్లల తగవు. ఇప్పు డలా కాదు. తన కట్టడినే రాజు ఉల్లంఘించాడు. ఇది నిజానికి శుక్రునికి పరీక్షాసమయము. అత డలుగకుండా ఉంటే మనమెంతో సంతోషించి ఉండెడివారము. కాని అప్పు డాతనిలోని మానవత మాయమయి పోయెడిది. అందుచేత శుక్రుని "జరాభార పీడితుండవు గ"మ్మని శాప మివ్వడం మనకు ఆశ్చర్యాన్ని కల్గించదు.

కాని తర్వాత యయాతి ప్రార్థనను ఆలకించి శుక్రుడు "నీ ముదిమి నీ కొడుకులయం దొక్కరుని పయిం బెట్టి వాని జవ్వనంబు నీవు గొని రాజ్య సుఖంబు లనుభవింపుము. నీవు విషయోప భోగతృప్తుండవైన మఱి నీ ముదిమి నీవ తాల్చి వాని జవ్వనంబు వానికి నిచ్చునది. నీ ముదిమిఁ దాల్చిన పుత్త్రుండు రాజ్యంబున కర్హుండును వంశకర్తయు నగు!" నన్నాడు. యయాతిని శపించుటలో శుక్రుని మూర్తిమత్వము కొంత దెబ్బతిన్నప్పటికిని ఈ కడపటి వాక్యములో అతని న్యాయదృష్టి చాలా ఉదాత్తముగా గోచరించి అందఱిని తృప్తిపరుస్తుంది. కూతును తృప్తిపరచడానికి యయాతి కిచ్చిన శాపము శర్మిష్ఠకు వరమై, ఆమె కడగొట్టు కొడుకును రాజునుగా, వంశకర్తనుగా చేసింది.

యయాతి మహారాజు చరిత్ర గోదావరి వంటి నది అయితే అందులో కచదేవయానుల కథ, శర్మిష్ఠ దేవయానిని నూత ద్రోయడము మున్నగునవన్నీ చాల కోలాహలంగా ఉరకలు పరుగులు వేసుకుంటూ ఒక మహానదిలో కలిసిపోయే ఉపనదుల వంటివి. యయాతి తన రాజ్యభారాన్ని పూరుని కిచ్చిన తర్వాత నడచిన కథ అంతా ఉరుకులు పరుగులు లేక కొండలలో నుండి బయటపడ్డ గౌతమి వలె కనబడుతుంది. బయల ప్రవహించు ఈ అఖండ గౌతమి వలెనే కథలో కూడా విశ్రాంతి ఉన్నది, విస్తరిల్లి ఉన్నది. ఇక్కడే మనకు యయాతిలో కౌరవాన్వయమునందలి రాజులలో కనబడే సుగుణాలు (చూ 1—1—86), వారి పరిమితులు కనబడతాయి. యయాతి చరిత్ర అనే గౌతమీ వాహిని ఇలా విస్తరిల్లి, ఇతరులను పవిత్రులను చేసి కౌరవ వంశ చరిత్ర అనే "వారి రాశి" లో కలుస్తోంది. అదే యీ కథా నిర్మాణములోని సొగసు.

* * * *

యయాతి చరిత్రలోని పద్యరచన కథన శిల్పములోని భాగముగా అక్కడక్కడ వివరింపబడినది. దీనికి సంబంధించిన రెండు మూడు అంశములు గమనింపదగినవి.

ఈ కథలోని వరములు, శాపములు (సురను గూర్చి శుక్రుడు చేసిన శాసనమును శాపముగా భావింప నక్కరలే దనుకుంటాను) అన్నీ వచనములోనే కనబడతాయి. ఈ శాపముల వలన కథలో పెద్ద మార్పు రావడము కన్న, పాత్రల ప్రవర్తన విధానము వల్లనే కథాగమనము ముఖ్యముగా నిర్ణయింపబడినది. కనుక ఈ శాపములకు పద్యపుటందలముల నెక్కించ నవసరములేక పోయినది. దేవయాని కచుని శపించుట వలన కచునికి కాని, దేవతలకుగాని, నష్టమేమీ లేదు. వారి కార్యము వారికి నెరవేరింది. దేవయాని యయాతిని వివాహ

మాడడానికి లోకదృష్టిలో కనబడే ఒక హేతువు కచుడామెను శపించడం. కాని అంతకన్న ముఖ్యమైన విషయ మేమంటే ఆమెలో రాచసిరి ఉన్నది. ఆమె పగ రాచనాగ వలె తీక్ష్ణమైనది. కేవలం కన్యగా ఉన్నప్పుడే వృషపర్వుని కూతును తనకు దాసిగా చేసికొన్నది. అట్టి స్త్రీ సాధారణ మానవుని ఎన్నడూ వివాహమాడదు. ఆమె జీవలక్షణమునందే పాలక వర్గమునకు చెందినది కాని పాలిత వర్గానికి చెందినది కాదు. అందుచేతనే ఆమె పొందిన శాపము కూడా ఆమె శీలమునకు అనుగుణముగా ఉన్నది. ఆమె తండ్రినుండి పొందిన వరము కూడా తాను యయాతిని వివాహమాడడానికి నిశ్చయించిన తర్వాత తీసికొన్నదని గమనించాలి.

శుక్రుడు యయాతిని శపించాడు. ఈ శాపములో చూడవలసినది శుక్రుని శీలము. శుక్రునికి కూతురే దైవము. ఆమె కప్రియము జరుగుతే లోకాలన్నీ తలక్రిందులైపోయినట్లే అతడు భావిస్తాడు. అందుచేత అల్లునిలోని యౌవన గర్వము కూతునికి అపకారణమైనదని జరాభార పీడితుడవు గమ్మని శపించాడు. కాని ప్రాజ్ఞుడు, పండితుడు, సహజంగా ధర్మనిర్ణేత గనుక తొందరగా అల్లుని కరుణించాడు. "నీ ముదిమి నీ కొడుకులయం దొక్కరుని పయింబెట్టి వాని జవ్వనంబు నీవు గొని రాజ్యసుఖంబు లనుభవింపుము .... నీ ముదిమిఁ దాల్చిన పుత్రుండ రాజ్యంబున కర్హుండును వంశకర్తయు నగు !" నన్నాడు. దీనివలన శుక్రుని ప్రతిష్ఠ పెరగడమే గాకుండా, కథలో చాల బన్నములు పడుట శర్మిష్ఠకు న్యాయము చేకూరడము గమనింపదగ్గది. అందుచేతనే శుక్రుని యీ వరముతోనే కథనుండి దేవయాని, శర్మిష్ఠ పాత్రలు ఉపసంహరింపబడినవి. ఎవరు చేసుకున్నంత వారికి అనుభవము లోనికి వచ్చిందన్న తృప్తి శ్రోతకు కల్గేటట్లున్నది యీ వరము.

యయాతి కొడుకుల కిచ్చిన శాపము ఒక దృష్టితో చూడగా కట్టుడివలె కనబడుతుంది. ఇంద్రుడు యయాతిని స్వర్గలోకభ్రష్టుని చేయుచు, "నీ గర్వంబు నిన్నింత సేసె !" అన్నాడు. అనగా ఒకరు ఇంకొకరి కేదో శాప మివ్వడం అన్నది ఎక్కడా లేదు. బుద్ధి కర్మానుసారిణి మాత్రమే. యయాతి పదభ్రష్టుడవడానికి హేతువు యయాతి శీలమే. ఇంద్రుడు కేవలము ఆ సన్నివేశమును కల్పించాడు. ఆమాట అన్నాడు. అలాగే ఇతర సందర్భాలలో కూడా చూచుకోవాలి.

అందుచేతనే యీ శాపములు వచనముతో నుండడం కూడా కథా నిర్మాణములోని ఒక భాగమే. అలాగే యీ కథలోని ఒక్కొక్క సీసము ఒక్కొక్క మణిపూస. ఒక్కొక్క సీసము కథలోని ఒక్కొక్క మలుపునకు దారితీసింది. మొదటి సీసము పూర్తి అయేసరికి కచుడు దేవయాని మనసును చూరగొన్నాడు. రెండవ సీసములో యయాతి.

"వరుణదేవు తోడు—గర మర్థి జల నివా
సంబు విడిచి భూస్థ—లంబు వలని
కరుగుదేర నున్న—వరుగేంద్రు దేవియు
పోని దాని దేవ—యానిఁ గనియె."

మూడవ సీసము యయాతి కన్యకా సహస్రముతో నున్న శర్మిష్ఠ దేవయానుల వద్దకు ఆకర్షింపబడిన సందర్భముమున చెప్పబడినది. ఇక నాల్గవ సీసమున పూరునికి రాజ్యము నప్పగించేటప్పుడు యయాతి వానికి బోధించిన నీతి 'పరమ వివేక సారథ' సమన్వితమైనది.

ఈ నాల్గు సీసపద్యములలోను నాల్గు రచనా విధానములు కూడ కనబడతాయి. మొదటి సీసమునందు కథనమునకు ప్రాముఖ్య మున్నది. రెండవదానిలో ఎంతో శ్రద్ధగా దిద్ది తీర్చిన చిత్రము గోచరిస్తుంది. మూడవదానిలో రొమాంటిక్ (కాల్పనిక) కవిత పొలము నందుకొన్నది. నాల్గవ సీసము డిడక్టివ్ (అనుమానిక) కవితకు మేలుబంతి. కాని, ప్రతి ఒక్క సీసము కూడ కథ నథఃకరించి మన దృష్టి నాకర్షించకుండా, దేని కది కథానిర్మాణములోని భాగముగా అమాయకముగా అణగి ఉన్నట్లు తోచడమే నన్నయ కథన శిల్పములోని విశేషము.

కథలోని పాత్రలను రెండు విధములుగా చూడవచ్చును. ప్రతి పాత్రను ఒక వ్యక్తిగా చూస్తూ, వాని మనసుల గంపొరల నన్నింటినీ పరిశీలించవచ్చును. ఆ పాత్రలనే కథాశిల్ప దృష్టితో కూడ చూడవచ్చును. ఈ రెండవ పద్ధతిలో వ్యక్తులకన్న కథకు ప్రాముఖ్య మెక్కువ. ఆలోచించగా ఈ పద్ధతియే ఉత్తమమైనది. ఏమన ఒకానొక పాత్ర మనసున గల పొరలన్నీ కథకు అవసరమైనప్పుడే అందగిస్తాయి కాని, కథకు వెలిగా నున్నప్పుడు వాని ప్రయోజనము సన్నగిల్లి పాత్రలు కథను కబళించడమో, ఆ పాత్రయే కథకు అవసరము లేక కేవలము ఉత్సవ విగ్రహముగా తయారవడమో జరుగుతుంది. యయాతి చరిత్రలోని పాత్రలను ఈ దృష్టితో పరిశీలిస్తే, ఇందులోని పాత్రచిత్రణము కూడ కథానిర్మాణములోని భాగముగ కనబడుతుంది. ఇక్కడ పాత్రలను గూర్చి చేసే పరిశీలన ఆ దృష్టితో చేసింది కాని, ఇది పాత్ర చిత్రణము గూర్చిన సమగ్ర పర్యాలోచనము కాదు.

ఈ కథలో మొదట మనకు కానవచ్చు పాత్ర కచుడు. నన్నయ కచుని ఒక నిలువుటెత్తు విగ్రహముగా రూపొం

ఠించలేదు; అతని మనసులోని పొరలలో ఏమున్నదో తెలియజేస్తూ ఆ పాత్రను చిత్రించలేదు. కథలో ఈ పాత్ర ప్రయోజన మెట్టిది ? దేవతల దృష్టి నుండి చూస్తే సంజీవని సాధించాలి; దానికై శుక్రుని మెప్పును పొందాలి. దేవయాని అనురాగానికి పాత్రుడవాలి, కాని ఆమెను వివాహము చేసుకొనుట కంగీకరించరాదు. అందుచేత నన్నయ యీపాత్రను మూడు రేఖలలో తీర్చి చూపాడు. "అమ్ముని కుమారుని (1) సుకుమారత్వంబును (2) వినయ ప్రియవచన మృదు మధురత్వంబును (3) ననవరత నియమవ్రత ప్రకాశిత ప్రశాంతత్వంబునుం జూచి" శుక్రుడు అబ్బురపడ్డాడు. మొదటి రెండింటివలన దేవయాని అనురాగాన్ని చూరగొన్నాడు. అతనిలోని మూడవ లక్షణము వలన ఆమె మోసపోయింది. కచునిలో యీ లక్షణాలు కథకు చాలును. ఈ పాత్రను పెరగనివ్వడం కథానిర్మాణమునకు ఆటంకమని మహాశిల్పి నన్నయకు తెలుసును. ఆ పాత్ర నింక పెరుగనివ్వలేదు.

ఇంతకంటె చిత్రమైన పాత్ర వృషపర్వుడు. ఇతడు దానవుడు, రాక్షసుల రాజు. సాధారణంగా దానవుడంటేనే మనకు పెద్ద ఏహ్యభావం. కాని చిత్ర మేమంటే ఇంత మంచి రాజు ఎవ్వరూ లేరేమో అనిపిస్తుంది. "వృషపర్వుని పురమును నేను జొరనొల్ల" నని దేవయాని అంటే, శుక్రుడు కూడా "నాకు నీవ గతివి" అను కూతును అనుకరించాడు. ఈ విషయాన్ని వృషపర్వుడు విని "శుక్రునొద్దకు వచ్చి నమస్కరించి యిట్లనియె.:

"దేవతలన్ జయించుటయు నీ—తి స్థిర సంపదలం ద్వితీయ వి
ద్యా విభవంబు పెంపునను—దానవు లుద్ధతులైరి కాని నేఁ
డీ వనరాశిలోఁ జొరరె—యింతకు నంతక కోపులైన య
ద్దేవ పతాకినీపతుల—దివ్య నిశాత మహాయుధాహతిన్.

(1—3—151)

"వారణ ఘోటక భాండా
గారంబులు మొదలు గాఁగఁ—గల ధనములతో
సూరినుత యుండఁటము నీ
వారకములు గాఁగ మమ్ము—వగవుము బుద్ధిన్.

(1—3—152)

"ఈ దేవయాని కెద్ది యిష్టంబు దాని యిత్తు నడుగు" మనిన, దేవయాని "ఆశ్లేని శర్మిష్ఠఁ గన్యకా సహస్రంబుతో నాకు దాసిగా నీ వలయు" ననగానే వృషపర్వుడు నిస్సంకోచముగా ఆమె కోర్కెను తీర్చాడు. కథలో వృషపర్వుడు నిర్వహించవలసిన పాత్ర కనుగుణమైన వర్చస్సు మాతనికి కల్గి ఉండడమే కాదు, అతని ప్రవర్తన వలన శర్మిష్ఠ మనకు మరింత ప్రీతిపాత్రురాలైనది. శర్మిష్ఠ వంశకర్తకు జనని కాబోతున్నది. ఆమెపట్ల మనకు ఎంతో సానుభూతి అవసరము. ఆ సానుభూతి నంతా ఆమె తండ్రి గడించి ఆమెకు అరణముగా ఇచ్చి పంపుతూన్నట్లుగా ఉన్నది యీ ఘట్టము.

నన్నయకాక పాత్ర చిత్రణలో సిద్ధహస్తుడైన మరొక కవి అయితే శర్మిష్ఠ పాత్ర పట్ల గల మమకారాన్ని వదులుకొనలేక ఆమెను కొండంతగా చిత్రించి ఉండేవాడు. కాని కథానిర్మాణములోని ఔచిత్య మర్యాద నెఱిగిన నన్నయ యీ పాత్రను చాల మెలకువతో దిద్ది తీర్చాడు. హోమర్ తన కావ్యములో ఒక్కొక్క ప్రధాన పాత్రకు ఒక్కొక్క విశేషణాన్ని ఎప్పుడూ వాడుతాడట ! దీనివలన ఆ పాత్ర యొక్క ప్రత్యేకత మన మనసునకు బాగా హత్తుకుంటుంది. అలాగే శర్మిష్ఠ మాట వచ్చినప్పుడల్లా నన్నయ "కన్యకా సహస్రంబుతో" అంటాడు. ఆమె దాసిగా నీయబడినప్పుడు కూడా "కన్యకా సహస్రంబుతో" దేవయానికి దాసిగా నీయబడింది. "కన్యకా సహస్రంబుతో శర్మిష్ఠ" దేవయానితోబాటు యయాతిని రాచనగరునకు అనుగమించింది. శర్మిష్ఠ దేవయానులు విరుద్ధ ప్రవృత్తులు. శర్మిష్ఠ పుట్టుకతో రాచకూతురు, ముద్దరాలు, బొంకినా ఎంతో మధురముగా ఉంటుంది. దేవయాని పుట్టుకతో బ్రాహ్మణ కన్య, కాని ప్రౌఢ, నిజము చెప్పి కూడా మన మెప్పును పొందలేదు. ఈమె ఎదురుగా ఉంటే మనకు మండుటెండలో నిలచినట్లుగా ఉంటుంది. శర్మిష్ఠ మన కెదురుగా నిలవడానికి జంకుతూ తిరోహిత అవుతూన్నట్లు ఉంటుంది. కాని ఆమె ఎంత దూరముగా ఉన్నా, ఎంత తెఱమఱుగున ఉన్నా, అమృతకిరణ ప్రసార మేదో ఆమెనుండి ఉద్భవిల్లుతోందని, దానికి తెరలు అడ్డు రావని తోస్తుంది. కథా ప్రారంభములో దేవయాని పట్ల మనకున్న సానుభూతి కథ చివరకు క్రమముగా సన్నగిల్లుతూండగా, శర్మిష్ఠ పట్ల మన సానుభూతి క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. ఇద్దరూ యయాతిని వరించారు. ఇద్దరూ తమ కోర్కెలను తామే బయట పెట్టారు. ఇద్దరూ శుక్రనీతిని ఆశ్రయించే అతనిని పొందారు. కాని; తన్ను వివాహమాడుమని రాజును దేవయాని కోరినప్పుడు ఆమె వలపన్ని అతని నిరుకున పెడుతోందని మనము బాధపడతాము; శర్మిష్ఠ తనకు ఋతుకాలోచితాన్ని ప్రసాదించమని రాజును అడిగినప్పుడు ఆమె మౌగ్ధ్యము మనకు జాలిని కలిగిస్తుంది. కథ పర్యవసానమును దృష్టిలో పెట్టుకొని చూస్తే యీ పాత్రల పాత్రీకరణానికి కథా నిర్మాణమునకు గల సంబంధము విస్పష్ట మవుతుంది.

కథలో ఎన్నిచోట్ల కనబడినప్పటికీ శుక్రుడు కూడా కథానిర్మాణమున కనుకూలమైనంత వఱకే చిత్రింపబడినాడు

కాని అంతకు పీస మెత్తు కూడా అతనికి అదనపు రంగు పూయబడలేదు. కథలో ఒక్కొక్క చోట ఒక్కొక్క మానసిక స్థితిలో శుక్రుడు ప్రత్యక్షమవుతాడు. కచుని తొలిసారి చూడగానే "పినిం బూజించిన బృహస్పతిః బూజించినయట్ల!" అని భావించాడు శుక్రుడు. ఇంకొకసారి "తన దివ్యదృష్టి నమర వ్యాపాదితుండైన కచుంగని వానిం దోడ్కొన తేర మృతసంజీవనిం" బనిచినాడు. ఈ శుక్రుడు వేఱు; ఈతడు దేవతలకు భీతిగొల్పే శుక్రుడు. సురాపాన మోహితుడైన శుక్రుడు చాల దిగజారినా, "కచుడు సుగతికి చనుగాక! విచారించకు!" అన్నాడు కూతురుతో. దేవయాని నిర్బంధమువలన సురవల్ల కల్గిన మోహము పటాపంచలై పోగా, ప్రసన్నుడైన శుక్రుడు కేవలము అమృతమూర్తి, వేదమూర్తి. ధర్మాధర్మములను నడుపుచు నిఖిలలోక పూజ్యుడైన శుక్రుడౌక డున్నాడు. ఈతడు యయాతి వద్దకు వచ్చినప్పుడు "తన దివ్య తేజమున నవ్వన మెల్ల" వెలిగెనట! ఇంతటి మహానుభావత్వము నిముడ్చుకున్న శుక్రుడు "దుహితృ స్నేహంబునం జేసి యద్దేవయాని పలుకులు" అతిక్రమించలేడు. ఆమె "వృషపర్వు నగరమును చొరను" అంటే, "నాకు నీవ గతివి, నీ తోడు నేనును వత్తును!" అంటాడు శుక్రుడు. తన్ను మోహ ప్రరచిన సురకు అలిగి :

> "మొదలి పెక్కు జన్మ—ములఁ బుణ్య కర్మముల్
> పరఁగు జెక్కుచేసి—పడయఁ బడిన
> యట్టి యొఱుకజనుల—కాక్షణ మాత్రన
> చెఱుచు మద్యసేవ—సేయనగునె ?"
>
> (1—3—120)

అని ఆనతిగాడు. సురపట్ల గల తన అభిమానాన్ని మాన్చుకొన గలిగాడు కాని, కూతుపట్ల మోహాన్ని త్రెంచుకొనలేక పోయాడు. తనకు శర్మిష్ఠకు దాసిగా నీయవలెనని దేవయాని కోరగా, వృషపర్వుడామె కోర్కెను తీర్చగనే శుక్రునకు "మనః ప్రియంబు" కల్గినదట. ఆ పితృ హృదయాన్ని చూసి మనము హర్షోత్కర్షమును పొందాలో, వాని పామరత్వాన్ని చూసి జాలిపడాలో తెలియని సందర్భ మిది!

కథకు అవసరమైన అన్నివిధములైన మనస్తత్వాలు శుక్రునిలో కనబడతాయి. దేని కది విడిగా చూస్తే, యీ మనస్తత్వాలు ఒకదాని కొకటి పొసగవు. కాని, నన్నయ శిల్పములో ఇన్ని మనస్తత్వాలు ఒకే వ్యక్తిలో కానరావడంలో ఆశ్చర్యం కనబడదు. ఎంతో శ్రద్ధగా పరీక్ష చేస్తేనేగాని శుక్రుని పాత్రలోని విరుద్ధ తత్వము పడుగు పేకల వలె అల్లుకొని ఉన్నాయని మనకు అనుమానము కూడ కలుగదు.

శుక్రునికన్న చిత్రమైన వ్యక్తి యయాతి. శుక్రుని శాపమును పొందేవఱకు మనకు కనబడే యయాతికి, ఉత్తర కథలో కనబడే యయాతికి పోలికలేదు. పూర్వ కథలో కనబడే యయాతి మనవంటి మానిసి. అతనిలో ఎంతో మోమాటము, ఊగిసలాట కనబడతాయి. కావాలనుకున్నది చేజిక్కినా అనుభవించడానికి సందేహిస్తాడు. కాని, అది సందేహము వఱకే; ఎలాగో మనసును సమాధానపరచుకొని ఆ భోగమును అనుభవించకుండా ఉండలేడు. (176—179) తనకు అక్కరలేనిది అక్కరలేదని కూడా చెప్పే సాహసం కానరాదు. "శుక్రునికి ఈ వివాహము అంగీకారయోగ్యమైనదైతే నిన్ను వివాహమాడతా" నంటాడు దేవయానితో. ఎన్నో యాగాలు చేశాడు, ఎంతో అనుభవించాడు. విషయోప భోగతృప్తుడు గాక, "విషయోప భోగాభిలక్షణ మింకను నాకు వదలక పెరుఁగుచున్నది!" అని వాయి విడిచి పుత్రులతోఁ చెప్పుకుంటాడు. ఈ భాగములో కనబడే యయాతి అంతఃపురములోను, ఉద్యానవనములోను కనబడే యయాతి. ఇంత ఆర్ద్రంగా చిత్రింపబడ్డ రాజులు ఎక్కడో కాని సాహిత్యంలో కనబడరు.

అయితే ఉత్తర కథలో ఇంకొక యయాతి ప్రత్యక్షమవుతాడు. ఈతడు ధర్మాసనం నుంచి మాట్లాడే రాజు. ఆ యయాతి నుండి యీ యయాతిలోనికి మార్పును నన్నయ చమత్కారంగా సాధించాడు. అది పూరునికి తాను రాజ్యాభిషేకము చేసేటప్పుడు ప్రకృతిజనములు వెలిబుచ్చిన సందేహానికి యయాతి చెప్పిన సమాధానముతో ప్రారంభమవుతుంది. అయితే యీ ఉత్తర కథను గూర్చి వెనుకనే చెప్పాను; ఇది కొండలలో నుండి బయటపడ్డ గౌతమి. ఇది నిజానికి యయాతి కథ కాదు. కౌరవ వంశ చరిత్రలో ఒక భాగము; యయాతి కరిగి కౌరవవంశ వారాశిలో భాగమై పోయాడు.

సమ్యగ్దర్శనము

శ్రీ చిట్టిప్రోలు కృష్ణమూర్తి

గగనభాగము సర్వమ్ముఁ గప్పివైచి
కటిక చీఁకటు లఖిలలోకమున నించి
విలయ గర్జారవమ్ము గావించునపుడు
మెఱుపుఁదీఁగనె తిలకింతు మేఘమందు.

అచలరాజులు గజగజలాడిపోవ
వసుమతీ చక్ర మెల్ల సంభ్రమము నొందఁ
దీవ్రముగ వీచునెడ జ్ఞప్తి దెచ్చుకొందు
నా సమీరుఁడు తా జగత్ప్రాణుఁ డనుట.

బహుళ కల్లోలపంక్తు లంబరమునంట
బిట్టు చెలరేఁగి చెలియలికట్ట దాఁటి
భూతలము ముంచివేయ నుప్పొంగు వేళ
రత్నరాసులె కందు నర్ణవమునందు.

భయద ఫూత్కారరావముల్ పరిఢవిల్ల
నుగ్రహాలాహలజ్వాల లుప్పతిల్ల
గడురయమ్మునఁ గాటందఁ గడఁగుతఱిని
మణినె వీక్షింతు ఫణిఫణామండలమున.

అక్బర్ ఇల్హాబాదీ

శ్రీ సదాశివ

మొన్నటి డిసెంబర్‌నెల భారతిలో శ్రీ ఉమాపతి పద్మనాభరావుగారు 'కవిత్వము, అలంకారము, ఛందస్సు' అనే శీర్షికతో ఒక మంచి వ్యాసం వ్రాశారు. అందు ఒకచోట అక్బర్ ఇల్హాబాదీ పద్యాన్ని ఉదాహరిస్తూ, "పారసీ కవి అక్బర్ ఇల్హాబాదీ చెప్పెను" అన్నారు. ఉదాహృత పద్యం పారసీదే కనుక ఆ సందర్భంలో అక్బరును పారసీ కవి అనుట పొరపాటు కాదు. ఆ ఉద్దేశంతోనే పద్మనాభరావుగారు అలా అని ఉంటారు. కాని, నిజానికి అక్బరు ఉర్దూ కవి. ఉర్దూ కవు లనేకులు లాంఛనంగా పారసీ కవిత చెప్పారు. గాలిబ్, ఇక్బాల్ మొదలయినవారు విశేషంగా చెప్పారు, అక్బరు అడపా దడపా చెప్పి ఉంటాడు.

ఉర్దూ కవుల్లో విలక్షణ ప్రతిభాశాలి అక్బరు. అతన్ని గురించి ఉర్దూలో పరిచయంలేని ఆంధ్ర సోదరులకు తెలుపా లని చాల నాళ్లనించి అనుకున్నాను. పద్మనాభరావుగారు ప్రస్తావించారు. అది మిషగా ఈ వ్యాసం వ్రాస్తున్నాను. విమర్శ దృష్టితో కాదని మనవి.

అప్పటి కాలపరిస్థితులు!

అక్బర్ హుస్సేన్ అక్బర్ క్రీ. శ. 1846 వ సంవత్సరంలో జన్మించాడు. అప్పటి సంప్రదాయాన్ననుసరించి ఉర్దూ, పారసీ అరబీ భాషలు ఇంటివద్ద అభ్యసించాడు. మిషన్ స్కూళ్లలో ఇంగ్లీషు నేర్చాడు. చిల్లరమల్లర పనులెన్నో చేశాడు. చివరికి మున్సిఫ్ మేజిస్ట్రేట్, సబ్‌జడ్జి, డిస్ట్రిక్ట్ సెషన్‌జడ్జి పదవులు క్రమంగా నిర్వహించాడు. ప్రభుత్వ మతని సేవను ప్రశంసించింది. 'ఖాన్ బహదూర్' అనే ఉపాధి ప్రసాదించింది. క్రీ. శ. 1921 వ సంవత్సరంలో మరణించారు.

పద్యరచన అతనికి పసివాడే పట్టుపడింది. మూడు సంపుటాల్లో సంకలనం చేయబడిన అతని "కుల్లియాత్' లో పదకొండేళ్ల ప్రాయంలో చెప్పిన పద్యా లున్నవి.

ఆదిలో అందరివలె అతడు ప్రణయవస్తుత్వం గల "గజల్లు" చెప్పాడు. కాని మారుతున్న కాల పరిస్థితుల్ని బట్టి అతడు తన నడక మార్చుకున్నాడు.

అక్బరుకు బుద్ధి తెలిసేనాటికి దేశ చరిత్ర తారుమారయింది. పాలకులైన భారతీయులు హిందువులూ, ముస్లిములూ, పాలితులై పోయారు. వర్తకానికని పైవించి వచ్చిన ఫిరంగివారు ప్రభువులై కూర్చున్నారు. విప్లవంలో పాల్గొన్నారనే మిషతో అనేకుల్ని, ముఖ్యంగా ముసల్మానుల్ని, కష్టపెట్టటం ప్రారంభించారు. దేశ పరిస్థితుల్ని, తనవారి నిస్సహాయ స్థితినీ, ఆంగ్లుల అంతరంగాన్ని బాగా గుర్తించిన సర్ సయ్యద్ అహమద్‌ఖాన్ పాలకుల పక్షం వహించటమే కర్తవ్యమని భావించాడు. బోధించాడు. ప్రయత్నించాడు. అలీగర్‌లో ముస్లిమ్ విశ్వవిద్యాలయం వెలిసింది. ముసల్మానులు ఆంగ్లభాషను అభ్యసించారు. ఆంగ్ల సభ్యతను అవలంభించారు. సయ్యద్ కృషిని కొందరు భూషించారు; కొందరు దూషించారు. ఎవ్వరేమన్నా అతడు కాలగతి నెరిగిన మహనీయుడు.

ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌హాలీ గాలిబ్ శిష్యుడు— గొప్ప విద్వాంసుడు. సరసకవి—విమర్శకుడు. అభ్యుదయ భావాలు కలవాడు. సమాజాన్నీ, సారస్వతాన్నీ సంస్కరించాలని ఆభిలషించేవాడు.

సయ్యద్ దృష్టి అతనిమీద పడింది. తనతో కలుపుకున్నాడు. భావన సయ్యదుది. ప్రచారం హాలీది. ముసల్మానుల నుద్దేశించి ముసద్దస్ (షట్పదావళి) వ్రాశాడు హాలీ. అది ముస్లిమ్ సమాజంలో అలజడి కలిగించింది. తన కావ్య సంకలనానికి సుదీర్ఘమైన పీఠిక వ్రాశాడు హాలీ. అది సారస్వతలోకంలో విశేష పరివర్తనం తెచ్చింది. ఆ కాలంలోనే 'ఆబె హయాత్' రచయిత మొహమ్మద్ హుస్సేన్ ఆజాద్, ఇస్మాయిల్ మీరఠీ మొదలయినవారు సాంప్రదాయికమైన కవితను నిరసించి ప్రకృతి వర్ణన, పీడిత ప్రజల వర్ణన చేస్తూ కవిత వ్రాయటం ప్రారంభించారు. హాలీ ఆ పద్ధతిని ప్రచారం చేశాడు. "భార

తియుకవి పారసీక వాతావరణాన్ని సృష్టిస్తున్నాడు. అంతంలేని ప్రియురాలి కురుల్లో చిక్కుపడి, భావాభావ మధ్యమైన మధ్యాన్ని అన్వేషిస్తూ తాను వ్యర్థజీవి అయిందే కాక సమాజాన్ని వ్యర్థం చేస్తున్నాడు. ఈ పద్ధతి మారవలె. కొత్త భావాలు రావలె. క్రొత్త భాష రావలె"—ఇలా వ్రాశాడు హాలీ.

సారస్వతంలో మార్పు : సమాజంలో మార్పు

అది సంధికాలం ఆ మార్పు యువకుల్లో ఉత్సాహమూ, వృద్ధులలో విచారమూ కలగాయి.

అక్బరు వయసు ననుసరించి యువకుడు. భావాల ననుసరించి వృద్ధుడు. సనాతన ధర్మంమీద అతనికి అభిమానం జాస్తి. అతని దృష్టిలో పూర్వ సంప్రదాయ మేదైనా శ్రేష్ఠమైంది. పాశ్చాత్య సంప్రదాయం ఏదైనా అల్పమైంది. తూర్పు పడమరల తేడాను అతడు మరువలేదు. ఆ తేడా ఇంతా అంతా !

"కహా మన్సూర్‌నే ఖుదా హూఁ మైఁ
డార్విన్ బోలా బోజినా హూఁ మైఁ."

(తూర్పువాడు) మన్సూర్ "నేను ఈశ్వరుడను" (అనల్హక్) అన్నాడు. (పడమటివాడు) డార్విన్ "నేను కోతిని" అన్నాడు. ఇంతటి తేడా !

అయితే ఈ దృష్టి సరియైంది కాదు. పక్షపాత దృష్టి; పెద్ద లోపమే. కాని ఆ పరిస్థితు లట్టివి. అతని సంస్కారం అలాటిది. అతడు నేర్చిన విద్య అపాటిది.

కనుక అతడు, తప్పో ఒప్పో, అలానే భావించాడు. అంతా ఆంగ్లమయం అవుతుంటే చూచి బాధపడ్డాడు. స్వయంగా తన కొడుకు ఇంగ్లాండ్‌లో చదివి తలమునుకలుగా ఆంగ్లత్వంలో మునిగి వస్తే బాధ పడ్డాడు. తాను చేస్తున్నది ఆంగ్లుల ఉద్యోగం. కనుక తన బాధను సవ్యంగా ప్రకటించ లేకపోయాడు. దిగ్రమింగలేకపోయాడు. వంకర త్రోవ అన్వేషించాడు. హాస్యరసాన్ని అవలంబించాడు.

అతని కవిత పరిహాసమయం. అందులో ఆంగ్లపదా లనేకం. అయితే ఆ హాస్యం తేలికయింది కాదు. బరువైంది. సహృదయులను ఆలోచింపజేసేది.

"క్యా కహూఁ ఇస్కామై బద్—బఖ్తియా—నేటివ్‌కె సివా
ఇస్కా ఆతా నహీ కుచ్‌భీ, ఇమిటేషన్ కె సివా."

"దీన్ని జాలి దౌర్భాగ్యం అనక ఏమనాలి ! దీనికి అనుకరణ తప్ప అన్యమేదీ రాదు." అంటాడు అనుకరణ శీలమైన సమాజాన్ని గురించి.

ముస్లిమ్ స్త్రీలకు 'పర్దా' ఉండేది. ఈ నవజాగృతిలో అది పోయింది. ఆ సందర్భంలో అక్బరు కవిత,

"బేపర్ద కల్ జో ఆయిఁ నజర్ చంద్ బీబియాఁ
అక్బర్ జమీఁమే గిరతె ఖోమీపె గడ్‌గయా
పూఛా జో ఉన్‌సె ఆప్కా పర్దా వో క్యా హువా
కహ్నెలగీఁ కె అకల్‌పె మర్దోంకి పడ్‌గయా."

"నిన్న కొందరు మహిళలు పర్దాలేకుండ కలిశారు. అక్బరు జాత్యభిమానంవలన తల దించుకున్నాడు. 'అమ్మా ! మీ పర్దా ఏమైంది ?' అని ప్రశ్నిస్తే వారు, 'అది పురుషుల తెలివిమీద పడింది' అన్నారు."

ఇది సంస్కారప్రియు లయిన పురుషులమీది కోపం. స్త్రీలలో మాత్రం ఆ ధర్మనిష్ఠ ఉన్నదా ? అదీ లేదాయె.

"నూరె—ఇస్లామ్‌నె సమ్‌ఝా థా మునాసిబ్ పర్దా
షమ్మ—ఖామూష్ కొ ఫానోస్ కీ హాజత్ క్యాహై."

"ఇస్లామ్ ప్రకాశానికి పర్దా అవసర మనిపించింది. ఆరిపోయిన దీపానికి గాజుబుడ్డి యెందుకు ?"

అయినా నవ సంస్కృతి అలవరచుకున్న యువకుల కోసం స్త్రీలు పర్దా వేసుకోవలసిన అవసరమూ లేదు—అక్బరు దృష్టిలో.

"నజర్‌మే తీరగీ హై, జోర్ రగోమ్మే నాతవానీ హై
జరూరత్ క్యాహై పర్దేకీ జహాఁ బొంబయి కా పానీహై."

"కళ్లకు చీకటి, నరాల బలహీనత—ఇది బొంబాయి నీళ్ల ప్రభావం. ఇంకా పర్దా ఎందుకు ?"

ఇక నవ సంస్కృతి అన్నా అతనికి పడదు. పరస్త్రీలు పర పురుషులు అన్న భేదం లేదాయె. ఒకని భార్య ఒకని చెంత నిల్చోవలె—అది సంస్కారము.

"ఖుదాకె ఫజల్‌సే బీబీ మియాఁ దోనోఁ మొహజ్జిబ్‌హైఁ
హిజాబ్ ఇన్కా నహీ ఆతా—ఉన్హే గుస్సా నహీ ఆతా."

"దేవుని దయవలన భార్యాభర్త లిరువురూ సంస్కారులే. ఆమెకు సిగ్గులేదు. అలా లేనందుకు అతనికి కోపం రాదు."

నాయకులు, ప్రభుత్వాధికార్లతో కలుస్తూ డిన్నర్లు తింటూ ఏదో జాతి కొరకు బాధపడుతున్నామనే అంటారు.

"ఖోమ్‌కె గమ్‌మె డినర్ ఖాతేహైఁ హుక్కామ్‌కే సాథ్
రంజ్ లీడర్‌కొ బొహత్ హై మగర్ ఆరామ్‌కే సాథ్."

"జాతిమీది బాధవలన అధికార్లతో కలిసి డిన్నరు తింటారు. నాయకులకు బాధ చాలనే ఉన్నది. కాని కులాసాగా ఉన్నది."

యువకుల పరిస్థితి—చెప్పదగిందేమీ లేదు.

"క్యా కహేఁ అహబాబ్ క్యా కరే-నుమాయాఁ కర్‌గయే.
బి ఏ హువే నౌకర్‌హువే, పెన్షన్‌మిలీ, ఫిర్ మర్‌గయే"

"మిత్రులు ఏమి గొప్పపని చేశారంటె ఏమి చెప్పను ? బి ఏ చదివారు. ఉద్యోగం చేశారు. పెన్షన్ పుచ్చుకున్నారు. మరణించారు."

మరి ప్రభుత్వం దృష్టిలో గౌరవనీయులెట్టివారు ?

"హైఁ మొఅజ్జిజ్ షక్స్, లేకిన్ ఉన్‌కా "లాయిఫ్" క్యా లిఖూఁ
గుఫ్తనీ దర్జేగజిట్, బాకీ జొహై నాగుఫ్తనీ"

"మనిషి మర్యాదస్థుడే. అయినా అతని జీవిత విశేషాలేమి వ్రాయవలె ? తెలుపదగినవి 'గజిట్' లో తెలుపబడే ఉన్నాయి. కడమవి తెలుపగూడనివి."

ఇలా కొత్త చదువుల్ని, కొత్త సభ్యతని, క్రొత్త సమాజాన్ని పరిహాసం అడ్డుగా పెట్టుకొని విమర్శించాడు అక్బరు. దీనంతటికి కారణం సర్ సయ్యద్. కాని అక్బర్ సయ్యదును గౌరవించేవాడు. అతడు జాతికి మేలు చేస్తున్నాడనే విశ్వసించేవాడు.

అంటే అక్బరు నవజాగృతిని, ఆంగ్ల విద్యను ద్వేషించినవాడు కాదు. గ్రుడ్డిగా పాశ్చాత్య వ్యామోహంలో పడిపోయిన వడుచువారిని విమర్శించేవాడు.

ఖ్వాజా హాలీ సాంప్రదాయిక కవిత్వాన్ని నిరసించి ఆంగ్లంలో వలె "నేచ్యురల్ పొయుట్రీ" వ్రాయవలెనని ప్రచారం చేశాడు. అతడు తరుచు 'నేచ్యురల్' అనే పదం వాడేవాడు. కనుక అక్బరు అతన్ని 'నేచరీ' అనేవాడు. అతనివల్ల గౌరవమే అయినా అప్పుడప్పుడు అతన్ని ఉడికించే ప్రయత్నం చేసేవాడు.

"నయీ ఫేషన్‌మెహీఁ హర్ బార్ నజర్‌ఆతే హైఁ
హాలీ హెూతే హువే కల్దార్ నజర్ ఆతేహైఁ"

"ఎప్పుడూ క్రొత్త ఫేషన్‌తోనే కన్పిస్తూంటాడు. హాలీ అయివుండి కల్దారువలె కన్పిస్తూంటాడు."

హాలీ ఉస్మానియా నాణెము—కల్దార్ బ్రిటిష్ నాణెము.

ఇలాటి కవిత్వమే కాక సూఫీతత్వ విలసితమైన కవిత్వం కూడ చాలా చెప్పాడు అక్బరు.

"దున్యామెహూఁ, దున్యాకా తలబ్‌గార్ నహీఁహూఁ
బాజార్‌సే గుజరాహూఁ, ఖరీదార్ నహీఁహూఁ."

"ప్రపంచంలో ఉన్నాను. కాని దీన్ని వలచినవాణ్ణి కాను. అంగడివీధిగుండా వెళ్లాను. కాని, ఏవీ కొనుక్కున్నవాణ్ణి కాను."

"ఇస్ ఖానా—యె—హస్తీ సె గుజర్ జావుంగా బేలోస్
సాయాహూఁ, మగర్, నక్ష్—బదీవార్ నహీఁహూఁ."

"జీవితమనే ఈ యింటిలోంచి దేంతో ఏమీ తగులమి లేకుండా వెళ్ళిపోతాను. నేను నీడనే కాని గోడమీది చిత్తరువును కాను."

హిందువులూ ముసల్మానులూ కలిసి ఉంటేనే స్వాతంత్ర్యము సాధ్యం కాగలదని అక్బరు భావించాడు. ఈ యిరువురూ పరస్పరం పోట్లాడుకోవటం చూచి ఇలా సలహా చెప్పారు.

"కహతాహూఁ మై హిందూ—వ—ముసల్మాఁ సె యెహీ
అప్‌నీ అప్‌నీ రవిష్‌పె తుమ్ నేక్ రహో
లాఠీహై హవాయె దహర్, పానీ బన్‌జావో
మౌజోంకి తరహ్ లడో, మగర్ ఏక్ రహో."


"నేను హిందువులతో, ముసల్మానులతో ఇదే అంటాను. మీమీ పద్ధతి ననుసరించి మంచిగా ఉండండి. కాలం బడితె లాటిది. మీరు జలం వలె మారండి. బడితెతో కొట్టిన అలలవలె ఘర్షణ పడినప్పటికీ మళ్లీ ఒక్కటి కండి."

తాను ఇలా సలహా లీయవలసినవాడే కాని ఆచరించవలసినవాడు కాడు. అప్పటికి వృద్ధుడు. అందులో ప్రభుత్వోద్యోగి. అయినా అందరివలె దేశం కొరకు ఏదో చేయవలెనన్న ఆకాంక్ష లేకపోలేదు అతనికి.

"ముఝ్హాందయే గవర్నమెంట్, అక్బర్ అగర్ నహోతా
ఉసూకోభీ ఆప్ పాతే గాంధీకీ గోపియోఁమేఁ."

"ప్రభుత్వోద్యోగంలో లేకుండా ఉంటె మీరు అక్బరును కూడ గాంధిజీ గోపికల్లో చూచిఉందురు." అంటాడు.

డాక్టర్. ఎక్బాల్ అక్బరును అనుసరించే ప్రయత్నం చేశాడు. అతని అలాటి కవిత్వం "అక్బరీ—ఎక్బాల్" అనే పేర ప్రచురింపబడినది.



లోకం నవ్వింది!

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

బుట్టలో పాములా స్తబ్దంగా ఉంది ప్రకృతి. ఉక్క పోస్తూ ఉంది జగతి. కర్మసాక్షి కన్నెఱ్ఱచేస్తే కలువలు మూతి ముడిచి, తెందామరలు విచ్చి వికసించాయి. గుక్కెడు నీళ్ల కోసం కొలనుగట్టు దిగాడు ముత్యాలు.

అమడ దూరానికి పైగా కాలికి కాలు కొట్టుకుంటూ నడవడం .... కడుపులో తడి లేకపోవడం .... కడిగి తోసినట్లున్న ఆకాశం నిడిసిపడుతూ ఉండడం—నిండు గుంటను చూసేసరికి ముత్యాలు పిడచగట్టిన పెదవులపై పోయిన ప్రాణం లేచివచ్చిన సంతృప్తి తొణికిసలాడింది. దుమ్ము నిండిన మడమలు నీళ్లలో మునిగాయి. దోసెడు నీళ్లకోసం రెండు చేతులు కలిపి నీటిపైకి వంగాడు. నీళ్లను అందుకోబోయి అలావే నిలబడిపోయాడు!

తీసి కాస్తున్న ఎండ .... ఆకు అల్లాడకపోయేసరికి అలల్ని సద్దుగిల్లి నిర్మలంగా ఉన్న నీరు....ఆ నీటి వెనుక కాలప్రవాహంలో ఉర్లిపడి, కాస్త దూరం దొర్లి, అక్కడ వో వెంట్రుక వాసి ఆధారానికి తగులుకొని కొట్టుమిట్టాడి నిలబడిన వో దీనాకృతి! ఎండి వెన్నెలు చీలిన పులకమడిలో చచ్చి చావక నిలబడిన నాచులా తలమీద తీసిపోయిన వెంట్రుకలు .... పేదరికం లేకుండా పెరిగిన గడ్డం .... పందెం వేసుకొని పీక్కుపోయిన కళ్లు, బుగ్గలు—అబ్బ! ఎంత వికృతంగా ఉంది!

తన రూపం తనకే అసహ్యమనిపించేసరికి చూచి సహించలేక గబగబ ఆ రూపాన్ని చెరిపివేశాడు ముత్యాలు. రెండు దోసిళ్ల నీళ్లతో ప్రాణం కుదుటబడింది. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఏవేవో అభిప్రాయాలకు, అభిరుచులకూ అలవాటుపడ్డ రెండు జీవితాలను కలిపేది పెండ్లిపీట అయితే—
—అలాంటి రెండు పట్టణాలను కలిపే రాచబాట అది. అంగిట బెల్లముంచుకొన్నవారు, నొసటితో వెక్కిరించగల నేర్పరులూ, తడిగుడ్డతో గొంతుకోయగల నిపుణులూ, వేడినీళ్లతో కొంపలు కాల్చగల కోవిదులూ .... స్వార్థులూ .... నిస్వార్థులూ .... అపర చాణక్యుల మధ్య నివసిస్తూ, అందరికీ అనుగుణంగా జీవితాన్ని బహు చాకచక్యంగా ముందుకు లాక్కుపోగల వో మానవుడిలాంటి ఆ బాట మిట్టపల్లాలను, వంక వాగులను, కొండ లోయలను అధిగమిస్తూ వచ్చి అక్కడ వో అర్ధవృత్తాకారాన్ని రూపొందించుకొనింది. ఒక్క దెబ్బలో రెండు పిట్టలు కొట్టగల ప్రజ్ఞాశాలుడైన మానవుడు ఆ అర్ధవృత్తాకృతిలో కాస్త మట్టిని తీసి అవతల పోసి, ఆ బాట మలుపు వెంబడి చింత చెట్లు, వెలగచెట్లు నాటాడు. నిజము సంగతి ఏమో కానీ, నీరు మాత్రం ఆ పల్లాన్ని గుర్తించి నిలకడగా నిలబడిపోతే అది మంచినీళ్లగుంట అయింది. ఆ కట్టపై నాటిన చెట్లు నీటి పట్టుతో బాగా ఎదిగి, శాఖోపశాఖలై వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు కూడుపెట్టే తనయుల్లా పెంచిన మానవులకు చల్లని నీడ నిస్తున్నాయి. చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తంగానో, లేదు, రాబోయే జన్మలో మరింత మంచి స్థితిని పొందాలనో వాంఛించిన మానవుడు ఆ వెలగచెట్టు క్రింద వో బండను తిన్నెలా అమర్చినాడు. ఆ బండమీద కూర్చుని నీరసించిన కట్టెలాంటి శరీరాన్ని వెలగచెట్టుకు చేరగిలవేశాడు ముత్యాలు.

కాసేపు వూపిరి బిగబట్టి లోకాన్ని ఉక్కిరిబిక్కిరి చేసి ఆమీదట 'పోనీలే!' అని దయతలచి ఒక్క శ్వాసను వదిలాడో సమీరుడు—లేదు ఈలాంటి అభాగ్యులను చూచి బాధగా నిట్టూర్చాడో తెలియదు కాని, ఎంతలో ఎంత మార్పు! —మెల్లగా చెట్లు కదిలాయి. అంతకంటె మెల్లగా కదలుతూ ఆకులు వింజామరలు వీచాయి. ఆ గాలి మంచినీటి మీదుగా వస్తూ, వస్తూ చల్లదనంతోపాటు మరింత సౌరభాన్ని వార్చుకొని హృదయంగమంగా వీస్తూ ఉంది. తల్లిప్రేమలాంటి చల్లని నీడ .... అంతకంటె చల్లనిగాలి—నిద్ర చోటెరుగలేదు. ముత్యాలు నూగన్నుగా కన్నుమూశాడు. "గానుగెద్దులా ఉన్నావ్!—కళ్లు కనబడ్డంలేదూ ?! వూళ్లోకి పోరా అంత తిండి దొరుకుతుంది!"

నీటికోసమో, చెట్టు నీడ కోసమో నిలబడిన బాటసారులు కనీసం 'ఆకు వక్క అయినా కొనకపోరులే!' అన

౨

తలంపుతో వెలగచెట్టుకు రెండు బారల దూరంలో పూరి గుడిసెలో చిల్లరంగడి జరుపుతున్న అలిమేలు కనిపించింది. అదిరిపడి కళ్ళు తెరిచాడు ముత్యాలు! దిగులుగా, మనసులో గుబులుగా గుంట కట్ట దిగిపోతున్నా డొక పదేండ్ల పిల్లవాడు! ఈనెపుల్లను మరపించే సన్నవాడు!!— కాయకష్టం చేసి బ్రదికే వాళ్ల కండ్ల కత డొక సోమరి. కలిగినవాళ్ల దృష్టి కతడొక ముష్టి వెధవ; కాదు, గానుగెద్దు!!

"అసలు మానవుడు, ఆత్మాభిమానము, సిగ్గు, బిడియము—ఆదిగాగల, మానవత్వానికి మెరుగులు దిద్దగల సుగుణ రాశిని వదలి, సాటి మానవుని ముందు 'దేహి!' అని ఎందుకు చెయి చాపుతాడు?— అది పుట్టుకతో వచ్చిన గుణమా? లేదు పరిస్థితుల ప్రోద్బలమా?" ఈ భావన మనసులో మెదిలిందేమో, బాగా పెరిగిన గడ్డాన్ని వ్రేళ్లతో రాచి, తడిమి చూచి పెదవి విరిచాడు ముత్యాలు. అంగడికి బేరం వచ్చిందేమో, అంతలోనే ఆప్యాయతను ఒలకబోస్తూంది అలిమేలు. అల్లంతదూరంలో ఎర్రని ఎండలో ఎద్దులు లాగలేక లాగుతూంటే 'కిర్రు' మని శబ్దంచేస్తూ ఉంది నూనె గానుగ. ముత్యాలు మనస్సు ప్రస్తుతం నుండి ఒక్కసారిగ ఇరవై సంవత్సరాల వెనుక్కు తిరిగింది.

అప్పుడు తన వయస్సు సరిగ్గా అంతే. ఆ వెళ్లిపోయిన పిల్లవాని కున్నంతే ఉంటుంది. ఆ వయసులోనే తాను లోకం మీద పడ్డాడు. ఆకలిబాధకు తట్టుకోలేక, ఆర్జించే మార్గం గోచరించక అథవా గోచరించినా అందుబాటులేక, పిడికెడు కూటికి బోలెడు తిట్లు తిన్నాడు. చాలసార్లు చద్దామని ప్రయత్నించాడు. తానేమో ఎలుగెత్తి ఆహ్వానించినా తనవైపు చూడనైనా చూడలేదు చావు. అదేమి చిత్రమో, కావాలని కోరుకొని, అహరహము కలలు కని, అందుకై పరితపిస్తే అందుబాటు కావు కొన్ని! వద్దనుకొంటే కూడ అనుకోకుండా వచ్చి నెత్తిన పడుతాయి కొన్ని!! లేకపోతే గీచిన గీతలా సవ్యంగా సాగిపోవలసిన బ్రతుకుబాట, వంకర టింకర లుగ చేసి వదలిందా ఒక్కమాట! ఆ ఒక్కమాటే తన లేత హృదయాన్ని కోతలా బాధపెట్టింది. యమపాశంలా గొంతుకు తగులుకొని బరబర లాగి విసరి పారవేస్తే, కొండ కొమ్ముమీద పడ్డ రాయిలా తన బ్రతు కీనాడు ....! ఆరోజు తాను ఇంట్లోనే కూర్చుని అయ్యవారు చెప్పిన ఇంటి పాఠాన్ని వ్రాసుకొని ఉంటే ఇంత జరిగేది కాదు. వ్రాయాలనే అనుకొన్నాడు. అనుకోవడము, ఆచరణ ఏకమై, అనుకొన్నట్లుగ జరిగిపోతూంటే, ప్రగతికామియైన మానవుని పరిస్థితి ఎలా ఉంటుందో మరి?! పలకా పుస్తకాలు తెచ్చి ముందర వేసుకున్నాడు. పుటికమీద బుడ్డి దీపం నిశ్చలంగా వెలుగుతూ ఉంది. పుస్తకం విప్ప బోయాడు. అంతలోనే పాట వినిపించింది. మనస్సు పాఠాల వైపు నుండి పాటవైపు మొగ్గింది. పాట వినిపిస్తున్నవైపు దృష్టి మరలడంతో బయటితట్టు చూశాడు. దాదాపు జాము రాత్రి కావస్తూంది. పుచ్చ పూసినట్లు పున్నమినాటి పండు వెన్నెల, చుట్టూరా పచ్చని పైరుచేలు. ఆ చేలు ఉండుండి చిలకరించే పన్నీటిజల్లుల చల్లని గాలులు. ఆ గాలి మోసు కొస్తున్న పాట; జానపద గేయాల్లో వజ్రాల మూట.

"తందిలో గుమ్మడి—ఇంటెనక సిక్కుడు
పోరాని కల్లకంత—పాయురా తీగె
నేనేమి రంకాడితి ?
నా రంకయిన తెలపరా ? రాజాతి మగడా ?
నేనేమి రంకాడితి ??"

కమ్మగా వినిపిస్తూంది పాట. తనకు తెలియకనే తన కాలు లయ నందుకొంది. ఒక్క అడుగులో ఎగిరి నడివీధిలో పడ్డాడు.

పంచె మోకాలిపైకి ఎగతీసి గోచిపెట్టి, కాలికి గజ్జె కట్టి, సుంగువిడిచి తలకు పాగా చుట్టి, జోడు కోలాట పుల్లలు చేతబట్టి 'కోపు' పట్టారు కుర్రకారు. పాటపాటకు కోలాటపుల్లల లయ. లయకు దగ్గ అడుగు. దుమ్ము లేచి పోతూంటే, ఆ ఊళ్లోవాళ్లంతా రచ్చబండమీద, ఇంటి ముందు అరుగులమీద కూర్చుని చెవులు రిక్కించి వింటున్నారు. ముత్యాలు హృదయం గంతులువేసింది. ఒకజత కోలాటపుల్లలు అందుకొని తాను జట్టులో కలిసిపోయాడు. పాట తారస్థాయి నందుకొంది. 'అయ్ .... హా! అయ్ ....హా!' అని అడుగు పాటకు తోడు కలిసింది. ముసలి ముతక 'బలె బలె' అని మురిసి, అనుభవాలను నెమరువేసుకొంటూ ప్రోత్సహిస్తున్నారు. లోతు బావుల్లో నీళ్లు తోడి వెతలుబడ్డ రైతాంగము వేసవి వెన్నెల్లో, ఆనందపు వెల్లువల్లో తేలి, కాస్త సేద దీర్చుకొంటున్నారు. 'థూత్' అన్నాడు ఉన్నట్లుండి రెడ్డి కొడుకు. కడివెడు పాలల్లో ఒక కల్లు ఉప్పులా పరిణమించిం దా మాట. ఆ మాటతో కోలాట లయ తప్పి ఆగి పోవడం, తన చెంప 'చెళ్లు' మనడం క్షణంలో జరిగి పోయాయి. తానేమీ గ్రహించలేకుండా బిత్తరపడి తేలమొహం వేస్తే, తన ఇష్టమొచ్చినట్లు నోరు పారవేసుకొంటున్నాడు రెడ్డికొడుకు. ఎవరో వో నడికా రాయన "ఏం జరిగింది నాయనా?" అంటూ ఆతురతగా ఆ జనంలో నుండి లేచి వచ్చాడు. "చూడండి! గాడిద!!—చేతకాకపోతే ఊరకుండాలి! ఎవరు పిలిచా రీ వెధవను తాంబూలం పెట్టి? .... చేతికేసి కొట్టాడు." కొరకొర చూస్తూ, కోపాన్ని కక్కుతూ చేతి వ్రేళ్లు నొక్కుకున్నాడు రెడ్డి కొడుకు. దెబ్బ తగిలిన చిహ్న లేమీ కనుపించలే దక్కడ.

"పోనీలే! నాయనా! అబ్బ అమ్మకు పుట్టిన బిడ్డయితే అదుపు ఆజ్ఞలుండి ఏడుస్తాయి. ఈ అతిమాత్ర ఎక్కడా యింతే" అని సర్దుబాటు చేశాడు మధ్యవర్తిగా ఆ నడికా రాయన.

ముత్యాలు గుండెల్లో ముండ్లు గ్రుచ్చుకొన్నాయి. సాధారణంగా దారి నడిచేటప్పుడు తగిలే ముండ్లయితే కాసేపు ఏడిపించి విడిచిపెట్టుతాయి. కానీ, ఇవి సూటిగా గుండెల్లో గ్రుచ్చుకొన్న ముండ్లు!

ముత్యాలు కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. గుండె బరువులో, నిండు వెరపుతో అక్కడనుండి చల్లగా జారుకొన్న వో స్త్రీ ఆకారాన్ని ఎవ్వరూ గమనించలేదు. మరొక్కక్షణం ముత్యాలు అక్కడ నిలబడలేకపోయాడు. మెల్లగా ముందుకు సాగాడు. రచ్చబండ దూరమవుతున్నకొద్దీ పిచ్చి నవ్వులు మాత్రం భారంగా, కారంగా వెన్నాడుతున్నాయి బాధిస్తూ. ఆ బాధతోపాటు ఆలోచనలు.

అవును ! తాను ఈ విషయాన్ని గురించి ఎన్నడూ ఆలోచించలేదు. అసలు ఆలోచించే అవసరమే లేకపోయింది. ఏదో కూలినాలి చేసి అమ్మ అంత కూడు ముద్దు మురిపాలతో రంగరించి తినిపించడం, తాను బడికి వెళ్లడం గా దశవర్షాలు మహర్దశను చవిచూశాయి. కానీ, ఈనాడు నలుగురిలో తల ఎత్తలేని అవమానం జరిగింది. దీని కంతకూ కారణం అమ్మ !— 'ఈవేళ ఏమైనా సరే !..... అమ్మను నిలదీసి అడగాలి!' అనుకొనేసరికి తన కాళ్లు కాస్త వేగాన్ని పుంజుకొన్నాయి. ఇంట్లో అడుగుపెట్టాడు. పాత పూరిల్లు...... సరిగపాదలాంటి పైకప్పునుండి వానజల్లు, వెలుగు వెన్నెలలు నిష్పక్షికంగా పారే యిల్లు .... నేలంతా వెన్నెల పొడలు మింటిని చుక్కల్లా మిసకరిస్తున్న యిల్లు పూరికి వో మూలగా, మూలుగుతూంది ఒంటిగా. అందులో పుటికమీద బుడ్డి దీపం గాలి ధాటికి రెపరెపలాడుతూ ఉంది. ఎదురైన అమ్మ మొగం అంతకంటె 'వెలవెల' పోతూఉంది !

"ఏవి నాయనా ? పలకా పుస్తకాలు ఎక్కడి పక్కడ పారేసి, ఆ పుటికమీది దీపం కూడా గూట్లో పెట్టకుండా, పరుగెత్తావే ? ఇప్పుడే ఇలాగయితే ఎలాగయ్యా ?" గుండెను నమిలే బాధకు ముసుగు వేయాలని నసిగింది అమ్మ. ఆ మాటలు తన చెవుల్లో పడలేదు సరిగదా, చెవుల్లో పడిన మాటలు మాత్రం తూట్లు పొడుస్తున్నాయి. తన నిర్ణయం మారలేదు.

"చెప్పమ్మా ? .... మా నాన్న ఎవరో చెప్పు ?"

చూపులు సూటిగా ఉన్నాయి. మాటలు ఘాటుగా ఉన్నాయి. మేక కంటపడ్డ లేత ఆకులా అల్లాడిపోయింది ఆమె హృదయం.

"నిజమే ! తాను ఆయనచేత వంచింపబడింది. తన జన్మకారకు లెవరో తెలియని శైశవదశనుండి పంచన చేర్చి పెంచివారు. తనకు వయసు, వయస్సుతోపాటు అందం, అన్నిటికీ మించి అందుబాటు, గృహపాటుతో గృహిణి చెల్లుబాటు—జరిగేసరికి వినియోగించుకొన్నారు 'పెండ్లి' పేరులో. వయస్సులు పోల్చిచూస్తే తండ్రి బిడ్డల తారతమ్యానికే మాత్రం తీసిపోకపోయినా, కృతజ్ఞత అనేది ఈ లోకంలో ఉంటే అది మొదట తన గుండెల్లోనే పుట్టినట్టు భావించి అంగీకరించింది వివాహానికి, అంతరాత్మ అంగీకరించకపోయినా. తీరా తన కడుపు పండబోతున్న సంగతి తెలిసి వచ్చేసరికి ఆయనకు తన అంతస్థు, కులమూ, గోత్రమూ, గౌరవము అన్నీ తెలిసి వచ్చాయి. పోనీ, అంతటితో వదలిపెడినా బాగుండేది. పలుకుబడితో పదిమందిని పంచన చేర్చి తన్ను వాళ్లముందు నిలబెట్టాడు ముద్దాయిలా. వారు చేరిన కారణం, వినబోయే మాటలతీరూ వూహించుకొనేసరికి తల కొట్టేసినట్లవుతూఉంది. అయినా నిలబడలేకపోతే విధిలేదు, చూస్తూ చూస్తూ ఉండగానే ఆయన గొంతు బాగా గద్గదమైపోయింది. కళ్లు చెమ్మగిల్లాయి. ఎవరినీ ఉద్దేశించకుండా, దీర్ఘస్వగతంలా, పూర్వస్మృతిలో, తనలో తాను గొణుక్కొన్నాడు. "చిన్నప్పటినుండి పెంచి పెద్దచేశాను. కడుపున పుట్టిన బిడ్డకంటె ఎక్కువగా ప్రేమించాను. అంతకంటె ఎక్కువగా ఆదరించాను. కాలం కలిసిరాస్తే ఎవడి చేతుల్లోనైనా పెడదామనుకొంటే ...." ఆపై మాటలు పెగలనట్లుగ అసలే గద్గదమైపోయిన గొంతు బాగా పూడుకపోయింది. ఆ మాటలు చెవిని పడుతూఉంటే, ఎదమీద ఎవరో సమ్మెటతో బాదినట్లుంది. విని నిభాయించుకోలేక ఒక్క విసరుతో లోపికెళ్లింది. వాళ్ల మొగం చూడలేక కుంచించుకపోయిన మనస్సు మాత్రం మళ్లీ వాళ్ల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంది.

పాపం ! కాస్త తమాయించుకొని మరలా ఆరంభించాడు ఆ పెద్దమనిషి. "అనకూడదు కానీ—అనరాని, వినరాని పనే చేసింది బుద్ధిలేని గాడిద—తాను చెయ్యరాని పనిచేసి నాచేత చెయ్యరాని ......!—రామ ! రామ !! ఎలా భరించా లీ బాధను ?" —వాలిపోయిన తలను రెండు చేతులు పొదివి పట్టుకొని పేద దేర్చితే, వేడి నిట్టూర్పులు మాత్రం కట్టలు త్రెంచుకొని బయటపడ్డాయి. ఆ వేడి ధాటికి కుప్పగ కూలిపోయింది తాను!

"ఎందుకు బావా ? దీని కింతగా వగవడం ? నాలుగు దన్ని మెడబట్టి అవతలికి గెంటితే సరి ! నీ వెర్రిగానీ ! హ్హ హ్హ హ్హ ! కుక్కలోకకు దబ్బులు కట్టాలనుకున్నావ్ ?" ఏహ్యభావంతో బాహాటమైన బుద్ధిమంతుని మాటలు !

కల్పించిన మాట కలవారి నోట కళోరసత్యమై నాటకం బాగా రక్తికట్టింది. తన బ్రతుకు నడివీధిలో కడిగిపోసినట్లయింది. ఆత్మహత్యా పాపానికి భయపడి, కడుపు తీపితో పూరుకాని పూరు చేరి వో కొడుకును కనుక్కొనింది. ఆ కొడుకు ఈనాడు ఎదిగి, ఎదుట నిలబడి, నిలదీసి అడుగుతున్నాడు "ఎవరు తన తండ్రి ?" అని.

"ఏమని చెప్పడం ?"

"ఏమో, ఎందుకు చెబుతావ్? .... జరిగిం దేదో చెప్పు!"

"చెబితే నమ్ముతాడా ?"

"నమ్మించాలి మరి ?"

"అంత అవసర మేమొచ్చింది ?"

"అవసరముండేగా అడుగుతూండడం !"

"అందరి అవసరాలకు నేను బాధ్యురాలనా ?"

"అందరి సంగతీ అటుంచు. వాడు నీ బిడ్డ!!"

"అందుకేగా ఇంకనూ బ్రతికివున్నాను."

"నీ బ్రతుకు వాడికి కంటకప్రాయంగా తయారవుతూంది !"

"అయితే చావనా ?"

"చచ్చినా మచ్చ మచ్చే !"

.... అనంతంగా సాగిపోయే ఆలోచనలు ఏ కొలిక్కి రావడంలేదు ఎంత ఆలోచించినా ?

"చెప్పమ్మా ! నే నడిగినదానికి సమాధానం చెప్పు !"

"ఇప్పు డెందుకులే నాయనా ఇదంతా ? పెద్దవాడవైతే తెలుసుకొందువులే !....."

నోట్లో మాట నోట్లో ఉండగానే ఆమె గబగబ వెళ్లిపోయింది. మారు మాట్లాడకుండా అక్కడ నుండి కదిలాడు ముత్యాలు. బరువెక్కిన గుండెలను మోయలేక మోస్తున్నాయి అడుగులు. వెళ్లి పడుకొన్నాడే కాని నిద్రపట్టలేదు.

"అసలు అమ్మ తప్పు చేయకుంటే ఎందు కిలా కప్పిపుచ్చుతుంది. తండ్రిని తెలుసుకొనే హక్కు—పోనీ అదృష్టం బిడ్డకు లేదా ? 'నీకెందు కిదంతా అంటుందే !'—పోనీ, అమ్మకు నా దగ్గర దాపరిక మెందుకూ ? ఇదే నిజమైతే— ఉదయాన వూళ్లోవాళ్ల మొగమెలా చూడాలి ?"

ఆలోచించేకొద్దీ హృదయం కుతకుత ఉడికిపోతూంది. చూరుకప్పు బొరియలగుండా తొంగిచూస్తూ చందమామ "పిచ్చినాన్నా ! పడుకొని నిద్రపోరా !" అని హెచ్చరిస్తున్నాడు. ఎక్కడో నక్కల అరుపులు ...జొన్నచేలవద్ద కావలి కాస్తున్న వాళ్ల అదలింపులు .... పూరింటి అరుగుమీద పడుకొని ఉన్న ఏ స్త్రీ మూలుగులు .... అర్ధరాత్రి సమయంలో అదోవిధమైన రొద .... ప్రకృతి పసిపిల్లల వల్లెకూటంలా ఉంది. మరునాటి ఉదయాన్ని వూహించుకొని ముత్యాలు తుంగ చాపమీద గడగడ లాడిపోతున్నాడు. తెల్లమీద తేనెటీగల్లా ముసిరిన ఆలోచనలు .... ఆగని కాలం .... అర్ధరాత్రికి పైగా దాటినట్లుంది.ఆపూరింట్లో ఏదో కదలిన శబ్దం—పిల్లిలా అడుగులవేస్తూ పీడలా నడిచింది ఏ ఆకారం. ఏ క్షణం నిలబడి వెనక్కు తిరిగి చూచింది. తొమ్మిది నెలలు మోసి యమయాతనలో ప్రసవించి, పది సంవత్సరాలు పోషించిన అమ్మ !— పైటచెరగు షాప్పుగా కటికనేల తల్పంగా అరుగుమీద అస్తవ్యస్తంగా పడి నిద్రపోతూంది. లెక్కలేనన్ని ఆలోచనల ఫలితంగా రూపొందిన ఏదో నిర్ణయంతో ఘనీభవించిన హృదయం, ద్రవిస్తే కండ్లు వాగులైనాయి. ఆ వాగుల్లో ఉవ్వెత్తుగా లేచిన సుడిగుండంలా వెలువడిన 'అమ్మా !' అన్న ఆర్తనాదాన్ని పెదవులు నొక్కిపట్టితే, ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయాడు ముత్యాలు ఆ దృశ్యాన్ని చూచి. ఊళ్లోవాళ్లంతా అమ్మ ముందు నిలబడి వికటంగా నవ్వుతూ, తనవైపు ఆదోవిధంగా చూస్తూ, చెవులు కొరుక్కుంటున్నారు. ఒకప్రక్క పౌరుషము, ఒకప్రక్క అవమానము, తన్ను సమస్థాయిలో లాగుతుంటే, చూస్తూ సహించలేక, అటువైపు చూడలేక మొగాన్ని రెండు చేతులతో కప్పుకొని వెనక్కు తిరిగాడు. ఆ నిశీధినిలో ఎక్కడికో, ఎందుకో, గమ్యం తెలియని గమ్యానికి బయలు దేరాడు. ఏ రమ్యాతి రమ్యమైన ఆకర్షణలు అక్క డున్నాయో మరి ?

ఆమీదట తన జీవిత గుడారాన్ని తిండి దొరకని చోటునుండి, కాస్త తిండి దొరికే చోటుకు రవాణాచేస్తూ అక్కడ తిండికి బదులు తిట్లు తింటూ, ఏ చెట్టునీడనో తల దాచుకొంటూ, మరో ఏడెనిమిది సంవత్సరాలు నెట్టాడు. ఆ రవాణాలో ఏసారి రైలు ప్రయాణం తటస్థించింది. నడిరేయి .... క్రిక్కిరిసిన మూడవ తరగతి రైలుపెట్టె .... ఎక్కడివా రక్కడ నిద్రమత్తులో వూగిసలాడుతున్నారు. వాకిలి వద్ద కాస్త చోటు చేసుకొని నిలబడి ఉన్నాడు. కాళ్లు పీకుతూ, కళ్లు మూతలు పడుతున్నాయి. చాల దగ్గరలో 'గుర్ .... గుర్' మన్న శబ్దం వినిపించింది. అటువైపు చూశాడు. అంత అవస్థలో కూడ చూస్తుంటే తనకు నవ్వు పుట్టుకువచ్చింది. ఏ లావుపాటి ఆసామి దానికి మించిన లాభసాటి వ్యాపారం లేదన్నట్లుగ పెట్టె తలగడగా, సామాను లుంచే అటక పడకగా అమరిఉంటే, గుర్రుపెట్టి నిద్ర పోతున్నాడు. ఆ కొద్దిపాటి సౌభాగ్యానికి మానవుడు పడే యాతనను గమనిస్తూ నిలబడ్డాడు ముత్యాలు. అంతలోనే ఏదో స్టేషను రావడం, బండి ఆగి కదలడం, మంచి వేగాన్ని లంఘించుకొనడం జరిగింది. ఆ కుదుపుల్లో అతడు ప్రక్కకు వత్తిగిలి, చేతిని తలగడగా సర్దుకొన్నాడు. రైలు యథా విధంగా నడుస్తూంది మహా మేరువులా పేరుకుపోయిన చీకటిని చీల్చుకొంటూ. చోటు దొరికినవారు 'సౌఖ్యమంతా మాదే!' అన్నట్లు కాళ్లు నిగడదన్ని ఒదిగి నిలబడ్డవాళ్లు, కూర్చున్నవాళ్ల మీద అలిగి, 'మానవత్వము, కరుణ, సర్దుబాటు'లాంటి పదజాలాన్ని చక్కటి వాక్యాలలో పొదిగి అందిస్తున్నారు. కొందరు ప్రభుత్వ నిందాస్తుతిలో పడ్డారు. 'దేనితో నాకు నిమిత్తంలేదు గమ్యం నా లక్ష్యం !' అని పరుగులుతీసే రైలు మళ్లా ఆగింది.

అదొక చిన్న రైల్వేస్టేషన్. ఆ ప్రదేశమంతా చీకటి ఒడిలో ప్రశాంతంగా ఉంటే, ప్లాట్‌ఫారం కొసల్లో పోర్టరు పాదువు ఉద్యమంలో ఇరుక్కొని కొన వూపిరితో ఉన్న రెండు కిరసనాయిలు దీపాలు, శాంతిభంగం చేయాలనేమో అల్లాడిపోతున్నాయి. కాస్త చోటు దొరికితే చాలు కాస్సేపు నడుం వాల్చవచ్చునన్న సదుద్దేశంతో నేమో, దిగే వాళ్లను కూడా దిగనీయకుండా ఎగబడుతున్నారు ప్రయాణికులు ఉద్దకు ముగ్గురు తక్కువైతే కూడా. ఆబండి రాక కోసమే ఏ విర్ణిత వేషంలో తయారైన స్టేషనుమాస్టరు పుట్టి మునిగినట్లు అటు, ఇటూ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. ఈ పరిణామాన్నంతటినీ అధిగమిస్తూ "అయ్యో ! నా పెట్టె ! .... నా పెట్టె !!" అన్న అరుపులు వినబడేసరికి అందరూ అటువైపు చూశారు. పాపం! అటకమీద నిద్ర మత్తులో గుటుక పెడుతూ ఉండిన ఆసామి, పెట్టెకోసం దేవులాడుతూ, దిగమింకిస్తూ దిగలేక తంటాలు పడుతున్నాడు.

ఇంతవరకు పెట్టె అతనికి తలగడగా ఉండడం అంత నిద్రలో కూడ అతడు అప్పుడప్పుడు పెట్టె ఉందో లేదో అని తడిమి చూసుకోవడం—గమనిస్తూనే ఉన్నాడు ముత్యాలు. అంత లోపలే మాయమయింది. 'ఆశ్చర్యంగా ఉందే!' అనుకొని ప్లాట్‌ఫారం వైపుచూశాడు. అంతవరకు తనప్రక్కనే నిలబడి ఉండిన ఓ'సూటు' మహాశయుడు [చకచక నడచివెళ్ళుతున్నాడు ప్లాట్‌ఫారం మీద! చేతిలో పెట్టె ఉంది. ఆపెట్టె వైపు దీక్షగా చూశాడు. సందేహ మేమీ లేదు. నిజంగా ఆపెట్టె ఈలావుపాటి ఆసామిదే!—అంతే 'దొంగ!'...దొంగ!!' అని అరుస్తూ ఎగిరి ప్లాట్‌ఫారం మీద దూకి ఆ'సూటు వాలా'ను వెంబడించాడు. 'దొంగ' అన్నమాట చెవిని పడడంతో అందరూ, 'దొంగ! దొంగ!!' అని ముక్తకంఠంతో అరిచారు. ఎవరు దొంగో! ఎక్కడిదొంగో!! అర్థంకాకపోయినా, తాము చూడక పోయినా.

స్టేషన్‌మాస్టర్ ఎఱ్ఱదీపం చూపాడు. అడుగు ముందుకు వేయలేదు రైలుబండి. ఆపెట్టెలో ఓ ఆరేడుగురు దిగి అటువైపు పరుగెత్తారు. స్టేషన్‌మాస్టర్, గార్డు కూడ పరుగెడుతున్నారు దొంగకోసంకాదు—పోలీసుకోసం! మొదటి తరగతిలోనైనా మెత్తని పరుపులమీద మత్తునిద్రలో మునిగిన పోలీసు ఒళ్ళు విరుచుకుంటూ, ఈ ఆర్భాటాలకు విసుక్కుంటూ పైకిలేచాడు. అనుకొని ఈపరిణామంతో, పెట్టెను వదలిపెట్టి, చీకటిలో కలిసిపోయాడు సూటువాలా. 'పోతే పోయ్యాడు వెధవ! సొత్తుదక్కిందిలే!' అని పెట్టెను చేతి కందుకొన్నాడు. అంతే! పెట్టె చేతికి వచ్చిందో, లేదో, నాలుగు చేతులు కలిసి తనను పరామర్శిస్తే, ఆగుంపును చీల్చుకొని వచ్చిన పోలీసు ఆకారం బాగా సత్కరించింది.

మాసిన గుడ్డలు .... పెరిగిన గడ్డము .... సంస్కారాన్ని చవిచూడని జుట్టూ, ప్లాట్‌ఫారంమీద ఎగిరి దూకి పరుగిడుతూంటే ఎక్కడో రాలిపోయిన టిక్కెట్టూ, తన సహృదయత చుట్టూ దిట్టంగా గోడలు కట్టాయి. తత్ఫలితంగా నాలుగేళ్ళ జైలుకమ్ములు లెక్కపెట్టాడు గోళ్ళ గిల్లుకొంటూ! అది కూడ అటూ ఇటూ కాదు. ఏవైపునుండి ఏ కమ్మిని చూపినా దాని నంబరు కచ్చితంగా చెప్పగల సామర్థ్యం అలవడేవరకూ లెక్కపెట్టాడు. ఈ సామర్థ్యాన్ని గుర్తించిన జైలు అధికార్లు అతనిని వదలిపెట్టారు, ఇక బ్రతకగలడన్న ధీమాతోనేమో!

ముత్యాలు బయటపడ్డాడు. కాదు— జగన్నాటక సూత్రధారి సంతలో అడుగుపెట్టాడు. నాలుగు గోడల మధ్య కూర్చుని, అమాయకుడు ఏమేమో వూహించుకొన్నాడు కానీ, ఇక్కడ ఒకటే తన వూహ కందలేదు. వూహ కందింది అర్థం కావడంలేదు. ఏమిటో మరి ?—రైళ్ళు పరుగెడుతూనే ఉన్నాయి. మోటార్లు, కార్లు, లారీలు, పంతం వదలడం లేదు. కొనడం, తినడం, లేకపోతే ఏడవడంతో మానవులు పోటీ పడుతూనే ఉన్నారు. అన్నిటినీ మించి ప్రొద్దు పుట్టుతూ ఉంది. పోతూ ఉంది. ఏమిటో గమ్యం ? ఇలాంటి స్థితిలో తనలాంటి వాళ్లను గురించి ఆలోచించడానికి, కన్నీళ్లు కార్చక పోయినా కనీసం కాస్త సానుభూతినైనా ప్రకటించడానికి ఎవరికి ఆస్కారం ఉంటుంది తన పిచ్చి కానీ.

ఆ సంతలో తన పాత్రౌచిత్యాన్నిగురించి కాస్సేపు ఆలోచించవలసి వస్తే, తన చిన్ననాటి విషయం ఒకటి గుర్తుకు వచ్చింది. తన పూరింటి నట్టింట గూట్లో వో బుడిగ హుండీ ఉండేది. పావలా కూలి డబ్బుల్లో వో కానీ మిగిల్చి అందులో వేస్తూ, శనివారంపూట ఉపవాసముండి ఆ హుండీని పూజించేది అమ్మ! ''ఇదేమిటమ్మా ?'' అని అడిగితే ''ఏడుకొండల వాని ముడుపు నాయనా !'' అంటూ ఉత్తరంగా మళ్ళీ రెండు చేతులు జోడించేది. అలాంటి దేవుణ్ణి తాను ఇంత వరకు చూడలేదు. తలంపు కలిగిందే తడవుగ నడక సాగించాడు. కాస్త వోపిక పట్టితే వోపూట తిండి తిప్పలను, మరి కొంచెం వోపిక ఉంటే వో రెండు మూడు రాత్రులు నిద్రను, అతను జయిస్తే ఈ ప్రపంచంలో సంబంధాన్ని వదులుకో వచ్చునేమో కానీ, ఎంత నిబ్బరమున్నా ఈ ఆలోచనలను అవతలికి నెట్టడం అసాధ్య మనిపిస్తుంది. కీకారణ్యంలో దట్టమైన పొదల్లా ఎదురయ్యే ఆలోచనలను అతి ప్రయత్నంతో తప్పుకొంటూ, ముందుకు సాగిపోతున్నాడు ముత్యాలు !

మిట్ట మధ్యాహ్నం. నడిమిట్టన నిలుగుతూండిన సూర్యుడు కాస్త పడమటిప్రక్కకి వాలి మబ్బుల మాటున మినుకరిస్తున్నాడు. బాట ప్రక్కనే వూడలు దిగిన మర్రిచెట్టు బాటసారుల వరప్రసాదినిలా ఉంది. ఆ చెట్టుక్రింద కూర్చున్నాడు ముత్యాలు. కాళ్లు కుక్కలు పీకినట్లు లాగుతున్నాయి. కడుపు మండిపోతూఉంది. చేతిలో చిల్లిగవ్వ లేదు. భవితవ్యం దుర్గమంగా తోస్తే, ఏమి చేయమా తోచకుండా, ఆ చెట్టువంక పరిశీలనగా చూస్తున్నాడు. కనువిప్పే విప్పని 'కార్ కార్' మంటున్న గువ్వపిల్లలు చిడుగు టొడుగు గూటిలో తల్లిగువ్వ మేత ముక్కు కందిస్తూ ఉంటే, కేరింతలు కొడుతున్నాయి. గూటి నిర్మాణం కోసం యాతన పడుతున్న సాలె పురుగును ఏమరితే కబళిద్దామని పొంచిఉంది ఒక బల్లి. రెండు గువ్వలు ఆకులమాటున వో రెమ్మమీద కూర్చున్న మూగభావాల ముద్రలో మురిసిపోతున్నాయి. గోలకు మారుపేరు కాకులు కూడ నిందను మాపుకోవాలనేమో గట్టున కూర్చున్నాయి. అనంతవిశ్వాన్నే జ్ఞప్తికి తెస్తూ ఉంది ఆ మర్రిచెట్టు. అన్ని జీవరాసులకు ఆయువుపట్టు !!—ఆ జీవరాసులపై ఆ మర్రిచెట్టుకున్న మమత మానవాళిలో ఉంటే ....!

ఇక ఆలోచించలేకపోయాడు ముత్యాలు. దృష్టి మరోవైపు మళ్లింది. ఇంకనూ దాదాపు మైలుదూర మున్నట్లుంది తిరుపతి. అతి సమీపంలో విశ్వవిద్యాలయ భవనాలు సర్వశోభాయమానంగా ఉన్నాయి. మధ్యాహ్న భోజనానంతరమేమో కళాశాలలల్లో చదివే అమ్మాయిలంతా చకచక నడిచిపోతుంటే, సందెడు పుస్తకాల బరువుతో సన్నని నడములంతా ఒగిరిస్తున్నాయి. వాళ్లను చూస్తుంటే ముత్యాలు కళ్లు చెమ్మగిల్లాయి. అవును ! తన చదువు సరిగ్గా సాగిఉంటే, తాను

కూడ ఈవరకు ఇలా కళాశాలలో చదువుతూ ఉండవలసింది. ఇంకనూ చదువడమేమిటి ? ముప్ఫైయేళ్ళ నెత్తిమీద సవారి చేస్తుంటే, ఈపాటికి ఏదైనా ఉద్యోగం చేస్తూ అమ్మను పోషిస్తూ ఉండేవాడు. అమ్మ ! .... ఏమైపోయిందో, ఏమో? తనలాంటి వో నిర్భాగ్యుణ్ణి కని, గాలికి వదలి, తాను కదలీ మెదలకుండా కూర్చుని ఉంటుంది. తాను సమాజపు కట్టుబాట్లు త్రెంచుకొని తనకు వో కట్టుబాటు లేకుండా చేసింది లోకంలో ! నలుగురి నోళ్ళల్లో నానేటట్లు చేసింది ! ఆమెను గురించి ఆలోచించడం కూడా .... !

కామెర్లకంటి వానికి ప్రపంచమంతా పచ్చగా గోచరించినట్లు, పిరికివాని కంటికి లోకమంతా అనుమానాస్పదంగా గోచరిస్తుంది. "నీది తప్పుడు పుట్టుక! ఈ సంఘంలో నీకు తావు లేదు." అని వేలెత్తి చూపించే ఓ అనుమానభూతం ఆవరిస్తే ఆమ్రచెట్టు బోదెకు ఆనుకొని పరధ్యానాన్ని పరామర్శిస్తున్న ముత్యాలు 'కెవ్వు' మన్న కేకతో ఎగిరిపడ్డాడు. పాపం! గడగడలాడుతూ తన మెడకు బల్లిలా హత్తుక పోయింది ఆ పసుగందు. ఒక్క 'సడన్ బ్రేక్'తో లారీని నిలబెట్టిన 'డ్రైవరు' 'హమ్మయ్య!' అని నిట్టూర్చి, పట్టిన చెమటను కాస్త తుడుచుకొని తమాయించుకొని ముందుకు సాగిపోయాడు. ముత్యాలు పాపను మరలా మర్రిచెట్టు క్రిందికి మోసుకొని వచ్చాడు. క్రింద దింపాడు. చెట్టుతోనే రంగుతిరిగిన నిమ్మపండులాంటి పసిమిఛాయ..... నాలుగైదు సంవత్సరాల వయస్సు ఉంటుందేమో!.. ముద్దులమూట కట్టినట్లుంది పాప. చెవులో లోలకులు, మెడలో గొలుసు, మంచిదుస్తులు, కలిగినయింటి బిడ్డగానే కనిపిస్తూ ఉంది. దడ తీరలేదేమో? ఇంకనూ వణికి పోతూనే ఉంది.

"నీపేరేమిటమ్మా?" గోముగా బుజ్జగిస్తూ అడిగాడు ముత్యాలు.

"రమ" మురిపాల మూటలోనుండి ఓముద్దు—కాదు ఓమాట జారిపడితే ముత్యాలు హృదయం ఆనందాన్ని వారు (దోచు)కొనింది.

"మీ యిల్లెక్కడమ్మా?"

చేయెత్తి చూపింది పాప! అటు వైపు చూశాడు. బాటకు దక్షిణంగా, కవలపిల్లల్లా కావిరంగుతో ఒకటి చూసినట్లు మరొకటిగా ఓ అయిదారు మేడ లున్నాయి. ప్రతిఇంటిచుట్టూ ప్రహరీ గోడ, ఆగోడ లోపల తోట., ఆతోట లోపల మధ్యగా మేడ, ఊహను దృఢపరచుకున్నాడు ముత్యాలు.

"......అయితే ఈ ఎండలో ఎందుకిలా వచ్చావమ్మా?"

"ఆలుకోటానికి!" నిస్సంకోచంగా సమాధానం చెప్పింది రమ.

"ఇంటిముందరో, లేదు, ఈచెట్ల క్రిందనో ఆడుకోకుండా బాట కాప్రక్క కెందు కెళ్ళావమ్మా? ఎప్పుడూ బస్సులు, లారీలు, కార్లు పరుగెత్తుతుంటాయే!" మెల్లగా మందలించాడు ముత్యాలు.

"నాబంతి పోయింది! బంతికోసం నేవెళ్ళాను!" చేతిలోని బంతివైపు ఆదోలా తాను చూచుకొంటూ, తనకు చూపింది రమ.

పాప తెలివికి పూబంతి అయింది ముత్యాలు హృదయం. తనివిదీర ఒక్క ముద్దు పెట్టుకోవాలని హృదయం తహతహ లాడింది. ఆవాంఛతోపాటు బాల్యస్మృతులుకూడ తీలగా మనస్సులో మెదిలాయి. అవును. ఎప్పుడైనా, ఏదైనా అమ్మ అడిగిన దానికి తడుముకోకుండా చిలిపిగా బదులు పలికితే ఆమె హృదయం కొండంత అయ్యేది. గుండెల కదుముకొని, "ఎంత తెలివమ్మా వాడొర! ఏడూళ్ళు ఏలి తీరుతాడు!" అంటూ సంతృప్తిగ నిట్టూర్చేది. మాటల్లో కోరికలు మాటలుగానే నిలబడిపోతే, అనిట్టూర్పుల్లో బాధలు మాత్రం తన్ను వదలి పెట్టడంలేదు. ఇల్లువదలింది మొదలు ఈనాటివరకు ఇలాంటి ఘటన కానీ, ఆలోచించే అస్కారంకానీ కలుగలేదు. ఈనాడు తనహృదయం ప్రేమతో తొణికిస లాడుతూ ఉంది! అందుకేనేమో రెండుచేతులతో ఆ అమ్మాయిని పొదివి పట్టుకొని అక్కున చేర్చుకోబోయాడు. మాసినగుడ్డలు, గిజిగాని గూడు లాంటి గడ్డము, నెత్తిన ముంతడునీళ్ళు చల్లుకొని ఎన్నాళ్ళయిందో, అదో విధమైనవాసన, పాపం! రమకు తగని అసహ్యమయిందో! ఆ ఆకారానికి జడుసుకొనిందో—లేదు సహజమైన సిగ్గు పొటమరింపిందో, తెలియదుకానీ, పట్టు తప్పించు కోవాలని విలవిల కొట్టు కొంటూ ఉంది. ముత్యాలు అదేమీ గమనించే స్థితిలో లేడు. అంతలోనే తనచెంప 'ఛెళ్ళు' మనింది. ఆ దెబ్బతో పట్టువదలి పైకిలేచి నిలబడ్డాడు. చెంపమీది చేతి వ్రేళ్ళ గుర్తులను మాసినగడ్డంమూసి పెట్టినా, కెంపు తిరిగిన కనుగ్రుడ్లు మాత్రం కన్నీళ్ళను కప్పిపుచ్చలేక పోయాయి; ఆణిముత్యాల్లా టపటప నేలరాలి, ఇంకి పోయాయి. అది వాటి లక్షణం కాబట్టి.

"ఎవడివిరా నువ్వు....ఒంటరిపాటున చేతికి చిక్కిందని గొంతుపిసికి పారేద్దామనుకొన్నావా?....... ఉండు నిన్ను పోలీసుల కప్పచెప్పుతాను!"—అంటూ పొగలు గక్కుతున్నాడు రమ తండ్రి నీలమేఘం.

"అదేనండీ! నేను చెబితే మీరేమో పట్టించుకోక పోతిరి. పాప అరచి నట్లుంది చూడండి—అంటే, పసిపిల్లలతో కలిసి గోలచేస్తూ ఉంటుందంటిరి. ఇప్పుడేదైనా రాకపోతే పాపగతి ఏమై ఉండేది?.....అయ్యో! నాచిట్టి తల్లి!!" అని వాపోతూ ఉంది రమతల్లి లీలావతమ్మ.

అంతదుస్థితిలో కూడ ఆ ఇరువురిని ఒక్కసారి పరీక్షగా చూచి ఓ చిరునవ్వు నవ్వాడు ముత్యాలు!

"..........పైగా నవ్వుతావటరా నువ్వు? నే నెవడను కొన్నావో ఏమో? అనుకొంటే నిన్ను నిముషాలమీద అరెస్టు చేయించగలను." గుర్రురుముతున్నాడు నీలమేఘం.

వింతగా అతనివైపు చూస్తున్నాడు ముత్యాలు. ఇదంతా ఏమీ అర్థంచేసుకోలేని రమ మాత్రం తల్లికాళ్ళు పొదివిపట్టుకొని బిక్కచూపులు చూస్తూఉంది. ఏమో చెప్పాలని ఆరాటపడే ఆపసి హృదయం, తండ్రి ఉద్భృతాన్నిచూచి అసలే మరచి పోయింది.

"ఎవడో పిచ్చి వెధవలాగున్నాడు. వాడితో ఎందుకు పోనీలెండి!" అంటూ రమను చంకన వేసుకొని వెళ్ళిపోయింది శీలావతమ్మ. మళ్ళీ ఒక్కసారి నవ్వాడు ముత్యాలు.

"అయ్యో! పిచ్చితండ్రీ!! పోలీసులు జైళ్ళు నాకేమీ కొత్తగాదు. మీరనుకొన్నంత పనిచేయడానికి కూడ సమర్థులే. అయితే నేను నవ్వడమంతా నాఅదృష్టాన్ని తలంచుకొని!" అన్నట్లుంది ఆనవ్వు. ఆనవ్వులో మరీ రెచ్చిపోయాడు నీల మేఘం.

"ఏరా ! నీకంతా నవ్వులాటగా ఉంది కదూ?!.... అయితే ఉండు!" అంటూ ఒక్క ఉదుటలో ఇంటివైపు వెళ్ళాడు నీల మేఘం.

ఇక్కడ ముత్యాలు తనను గురించి, ఆ పైన భగవంతుని అస్తిత్వాన్ని గురించి కాసేపు ఆలోచించవలసి వచ్చింది. ఏమిటో తన బ్రతుకు తనకే అర్థంకావడంలేదు. పుణ్యానికి పోతే పాప మెదురవుతూ వుంది. పాపం!.....ఎప్పుడో, ఎక్కడో, అనుభ వించవలసిన కష్టాలకు చక్కని నామకరణం. ఇక్కడే, ఇప్పుడే తనని ఓరాగాన వదలి పెట్టడం లేదు. మొలలోతు నీళ్ళల్లో తలమునిగే వరకు ముంచి, ఉపిరాడకుండచేసి తీరా ఆకాస్త ఉపిరిపోటోయేసరికి 'పోనీలే'! అని దయతలచి వదలిపెడుతూ ఉంది. తాను చేసిన తప్పేమి? తనను, తనపుట్టుకను హేయ భావంతో అవహేళన చేసే వాతావరణాన్ని వదలి రావడం తప్పా? కండ్లముందు జరిగే అన్యాయాలకు అడ్డుతగలడం తప్పా? లేదు. సాంఘిక నీతినియమాలకు ప్రేమించడం తప్పా? అను భవం సముపార్జించిన తెలివితో ముత్యాలు ఆలోచనా పరం పర ఓస్థాయిలో సాగిపోతూ ఉంది. ఆలోచనతో పోటీ పడ్డ ముత్యాలు, నీలమేఘాన్ని, ఆయన పంతాన్ని పూర్తిగ విస్మ రించాడు.

"ఓ !....వీడా?" మాట, మాటవెంబడి నవ్వు, ఒకదాని నొకటి తరుముతున్నట్లుగ వూడి పడ్డాయి ఉన్నట్లుండి. ఉలిక్కిపడి లేచి నిలబడ్డాడు ముత్యాలు. ఎదురుగ పోలీసు ఆఫీసరు తనవిదీర నవ్వుతున్నాడు. ఆ నవ్వులో పరిచయస్తుణ్ణి గుర్తించిన పట్టు, పోలీసు ఆఫీసరు బెట్టు నిండుగ ఉన్నాయి. నీలమేఘం దర్పంగా చూస్తున్నాడు. 'చూశావా నా దెబ్బ?' అన్నట్లున్నాయి ఆ చూపులు. 'వదలితే చాలు!' అని వేట కుక్కల్లా వేచి ఉన్నారు పోలీసులు.

ఒకసారి చేతిలో డైరీవైపు, మరొక్కసారి ముత్యాలువైపు చూశాడు పోలీసు ఆఫీసరు సందేహ నివృత్తికోసం. సందే హానికి తావు లేకపోతే, విచారణకు అవసరమే లేకపోయింది. 'వూ'! అన్నాడు పోలీసు దొర. ముందు వెనకాడకుండా ముంజే తులకు కంకణాలు తొడిగారు ముత్యాలుకు పోలీసులు. తన పాత చుట్టాన్ని గుర్తించడములో వాళ్ళేమీ పొరపాటు పడ లేదు. తత్ఫలితంగా "అత్తగారింటి ఆదరణ" ద్విగుణీకృతమై ఆరేళ్ళు అతనిని వదలి పెట్టలేదు!.....

* * * *

ఆరేళ్ళ తర్వాత మళ్లీ బయట పడ్డాడు. బయట పడిందే తడవుగ నడుస్తున్నాడు. ఎటుపడితే అటు గాకుండా దారి వెళ్ళినట్లు తాను వెళ్ళుతున్నాడు. ఆ నడకలో ఏదో నిర్ణయం, ఆ ఆకారంలో ఏదో ఆక్రందనం, ఆచూపుల్లో ఏదో అన్వేషణ. ఏమిటో అతని గమ్యం?

ముత్యాలు తన నడక మానలేదు. అయితేమాత్రం ఎంత కాలమని అలా కాలంతో పోటీ పడ గలుగుతాడు? పరిస్థిత లనుకూలించినంతవరకూ మానమన్నా మానలేదు. కానీ, ఆపైన మాత్రం ఆగకతప్పదు.

ఓ పల్లెముందు చెట్టుక్రింద కూర్చున్నాడు ముత్యాలు. ప్రొద్దు గూట్లో పడుతూ పడుతూఉంది. మేతకోసం రెక్క కొద్దీ ఎగిరి, దేశమంతా గాలించి, పొట్ట నింపుకొన్న పక్షులు గూళ్ళు చేరడానికి గుంపులు గుంపులుగా వస్తున్నాయి. అడ వికి మేత కేగిన ఆలమందలు ఇంటిముఖంపట్టి, గెవిన్లో ఎదురుపడ్డ లేగదూడలను ఎదకు హత్తుకోలేకపోయినా శరీరమంతా నాకుతున్నాయి ఆప్యాయంగా. పొలంనుండి అర మూట ధాన్యాన్ని మోయలేక మోసుకొస్తున్న మగనికి ఎదు రైన మగువ, ఆ మూటనందుకొంటే, అతగాడు మెడ విరుచు కొంటూ, కొంటె చూపులు చూస్తున్నాడు. ఆ చెట్టుక్రిం దనే కంసాలి కొలిమి. ఆ కొలిమిలో బూడిదనంతా తీసి ఆ ప్రక్కనే గుట్టగా పోశారు. ఆ బూడిదలో పడుకొంది వో కుక్క. సుమారు నాలుగైదు చంటిపిల్లలు పాలు జుర్రు కొంటుంటే ఎంతో ఆప్యాయంగా పిల్లలవైపు చూస్తూ మైమరచి పడిఉంది ఆ కుక్క. అన్నిటినీ పరీక్షగా చూశాడు ముత్యాలు. కాలచక్ర గమనంలో ఇలాంటి సంఘటనలు తన కంట పడకుండా ఉండడానికి, నాలుగు గోడలమధ్య కట్టు దిట్టాలతో పెంచబడిన బుద్ధుడు కాదు తానేమీ! అయితే ఏనాడూ ఇలాంటి అనుభూతి మాత్రం అతనికి కల్గలేదు. అదేమి చిత్రమో సృష్టిఅంతా ప్రేమమయంగా గోచరిస్తూంది. కాగా అతని వదనం ప్రసన్నతతో తొణికిసలాడింది. లేని ఉత్సాహం నరాలమీద పని చేస్తే మళ్లీ మెల్లగా ముందుకు సాగాడు: బహుశా ఇంత కరుణామయమైన ప్రపంచంలో కాస్త చోటు, సహృదయతకు కాస్త సానుభూతి లభించకపోదులే అన్న ఆశతో నేమో!


ఆ ఆశతోనే మూడామడలు కాళ్లీడ్చుకొంటూ వచ్చి కూలబడ్డాడు ఆ వెలగ చెట్టుక్రింద, గుంటలో గుక్కెడు నీళ్ళు త్రాగి. అక్కడ తన కంటపడింది ఆ పదేళ్ల కుర్రవాడు. వాణ్ణి చూస్తుంటే గుండెలు తరుక్కుపోతున్నాయి. తనను గురించి ఆలోచించేవాళ్ళు లేక తన్నుకు చస్తుంటే తాను ఇంకొకరిని గురించి ఆలోచిస్తున్నాడు; తన్ను మాలిన ధర్మంలా.

పాపం! వాడూ తనలాగే వీధులపాలై ఉంటాడు. కంటికి మున్నగా కనిపించిన వాడినంతా, "చదువుకోవాలి! తల్లి దండ్రి ఎవ్వరూ లేరు. సాయం చేయండి"అని బతిమాలి ఉంటాడు. అది ఫలించకపోగా, పనికోసం ప్రాధేయపడి ఉంటాడు. "వూరూ పేరూ లేని వెధవలకు పనెవరిస్తారు? పోరా!!" అని కసిరికొడితే తిట్లకు, చీవాట్లకు అలవాటుపడి కడకు అడుక్కు తినడానికి తయారయిఉంటాడు. వాలాంటి, ఇలాంటి దౌర్భాగ్యు లెంద రున్నారో ఈ లోకంలో? అబ్బ! ఎంత విషాదం గూడు కట్టుకొనిఉంది ఆకళ్ళల్లో! ఎన్ని కనీళ్ళు నిట్టూర్పు సెగలతో ఆవిరై పోయాయో ఆ చెక్కిళ్ళపై!......"

దారిన పోతూండిన ఆ పదేళ్ళ పిల్లవానిని గురించిన ఆలోచనా స్రవంతి గుండెలో పొంగి తన జీవితంతో నో సమన్వయాన్ని కుదుర్చుకొనేసరికి ఏదో అజ్ఞాతావ్యక్తమైన సాను భూతి, ఆ కుర్రవాని భవిష్యత్తుపై నిష్ఫలమైన ప్రీతి తనను వీపుతట్టి పైకి లేపాయి. పైకి లేవబోయాడు ఎంతో ప్రయాసతో. మూన్నాళ్ళుగా పట్టి కడుపు. పైన కాసిన్ని మంచినీళ్లు పడడం పైత్యం ప్రకోపించిందేమో, ఎవరి మాట లో అలా ఉంచి శరీరం తన మాటలనే లెక్క చేయడంలేదు. కళ్లు తిరుగుతున్నాయి. కాళ్లు తడబడుతున్నాయి. ఎట్లో నిబ్బరించుకొని 'బాబూ!' అంటూ ఒక్కఅడుగు ముందుకు వేయబోయాడు. అంతే.........

ఎక్కడో అత్తగారి పోటుకుతో అల్లాడిపోయే ఓ మహాసాధ్వి తెగించి పిడికెడు మెతుకులు దోసెడుతో తెచ్చి విదిలిస్తే సంతృప్తిగ నవ్వుకొన్నాడు ఆ పదేళ్ళ కుర్రవాడు.

ఒక్క అడుగు ముందుకు వేయలేని నీరస స్థితిలో కుప్పగ కూలబడ్డాడు ముత్యాలు. కాలచక్రం ఒడిదుడుకుల్లో చిక్కుకొని, ధక్కాముక్కీలుతిన్న తనువులాంటి ఎముకల గూడు నేలకు అతుక్కుపోయినా, గ ట్లో నిశ్చలంగావెలిగే దివ్వెల్లా మునిశిత మైన దృక్కులుమాత్రం దేవులాడుతూనే . ఉన్నాయి దేని కోసమో? ఏమయికొనిందో ఏమో?.......లోకం నవ్వింది! దాని తీరే అంత మరి!!



వరణ ఏన్డి తామ్రశాసనము

శ్రీ మునునూరి సాంబశివరామమూర్తి

తూర్పు గోదావరిజిల్లా రాజమండ్రి తాలూకా మురమండ గ్రామమునకు చెందిన పాటిదిబ్బలందు ఆయూరి హైస్కూలు విద్యార్థులకు 1956 ఆగష్టు మాసమున ఈ శాసనము దొరికినది. ఆ హైస్కూలు ప్రధానాంధ్రోపాధ్యాయులు శ్రీమాన్ ప్రతివాద భయంకర అణ్ణన్ గోవిందాచార్యులు వారిచే సంపాదింపబడి అదివరలో వారికి సహోపాధ్యాయుడుగా పనిచేసియున్న నాకు వారివద్దనుండి చేరినది. మే మిర్వురమును ఈ విషయమునకు గ్రొత్తవారమే. అయినను నా యోపిన కొలది కృషిచేసి శాసనము చదివి దీనియందలి విషయములను ఈ క్రింది విధముగా రూపొందించియున్నాను. ఈ శాసనము రాగిరేకులు ఆంధ్రా హిస్టారికల్ రీసెర్చి సొసైటీ మ్యూజియమ్‌లో భద్రపరుపబడినది. ఈ శాసనము జర్నల్ ఆఫ్ ది ఆంధ్ర హిస్టారికల్ సొసైటీ 24 వ సంపుటి (1956—58) పుట 149—152 లో సంక్షేపముగా ఆచార్య రాళ్లబండి సుబ్బారావుగారిచే ప్రకటింపబడినది. దీని నిపుడు సవిమర్శనముగా ప్రచురింపబూనుకొంటిని.

శా స న స్వ రూ ప ము

ఒక రాగి కడియముచే బంధింపబడిన అయిదు రేకులపై ఆరువదేడు పంక్తులలో ఈ శాసనము సంపూర్ణముగా నున్నది. ఒక్కొక్కరేకు 7.3 3.7 కొలతలు గలిగినది. దాని చుట్టును నూలువాసి దళసరి జవ. మొదటి రేకున మొదటి పుటయందును, అయిదవ రేకున రెండవపుట యందును (మొదటి ఆఖరు పుటలు) ఏ విధమైన యక్షరములుగాని గుర్తులుగాని లేవు. మిగత (లోపలి) పుటలలోని ఆరు పుటలకు ఒక్కొక్క పుటకు తొమ్మిది పంక్తులు వంతున 54 పంక్తులును, ఏడవ పుటయందు ఎనిమిది పంక్తులును, ఎనిమిదవ పుటయందు (ఆఖరుపుట) ఐదు పంక్తులును మొత్తం 67 పంక్తులుగల శాసనము. ఆఖరు పంక్తిలో "శ్రీ" అను నొక్క యక్షరము మాత్రమే గలదు. రేకులను కలిపు రాగి కడియము రాజ ముద్రికచే బంధింపబడిన రాగి గొట్టమున బిగింపబడినది. అందువలన ఆ అయిదు రేకులును కుడి ఎడమలకు జరుపుకొనుచు శాసనాక్షరముల చదువుకొన వనువు కలుగుచున్నది.

రా జ ము ద్రి క

శాసనపు రేకుల బంధించిన కడియముపైగల రాజ ముద్రిక కర్ణికాగ్రమున ఉబ్బెత్తుగా పోత పోయబడినది. కడియమును బంధించిన గొట్టముపై నాలుగు పెద్ద దళములును, సంధుల నాలుగు చిన్న దళములును గలిగిన అష్ట దళ పద్మము గలదు.

కర్ణికాగ్రముపై మధ్య భాగమున (అడ్డముగ) "శ్రీ త్రిభువనాంకుశ" అను నక్షర శ్రేణియు, దానిపై నడ్డుగ బరుండబెట్టిన అంకుశమును, దానిపై కుడి మొగమై నిలిచి యున్న వరాహరాజమును, దాని కిరువైపుల వాల్చియున్న చామర ద్వయమును, ఆ పై భాగమున నెడమనుండి కుడికి వరుసగా సూర్యుడు, నెలవంకయును పోతపోయబడినవి. అక్షరశ్రేణికి దిగువ భాగమున ఎడమ వైపున పుష్పవృంతమును, కుడివైపున ద్వాదశ దళాంచిత పుష్పమును పోతపోయబడినవి. మొత్తము మీద రాజముద్రిక జాడ ముచ్చట గొల్పుచున్నది.

శాసనము చిరకాలము భూగర్భముననున్నను దట్టముగ చిలుము పట్టినేకాని అందే భాగమును ఇనుమంతయు చెడలేదు. కాని యది పరహస్తగతముగుటచే గాబోలు. అక్షరముల నచ్చటచ్చట కొలది గోతులు పడినవి.

శా స న లి పి

శాసన నిర్మాత పేరుగాని, శిల్పాచార్యుని పేరుగాని లిఖింపబడలేదు. శాసనాక్షరములన్నియు మంచి ముత్యముల వలె వ్రటువలె, కమ్ముల బిగించినటుల సమమైన యురవ

గలిగి నను మట్టమ్మైన పంక్తులచే కను విందు గొలుచున్నవి. అక్షరములు అర్ధాంకి శిలా శాసనాక్షరముల బోలియున్నవి. 6—11 శతాబ్దములందలి పశ్చిమ, పూర్వ చాళుక్యుల సంధి కాలపు లిపిని గోచరింపచేయుచున్నవి. అందు ముఖ్యముగ పశ్చిమ చాళుక్య లిపినుండి "అ, ఖ, ణ, ధ, న, ప, వ, హ" అను నక్షరములును, పూర్వ చాళుక్య లిపినుండి "ఈ, క, గ, జ, ట, డ, త, థ, ధ, భ, మ, య, ర, ల, వ, శ, ష" అను నక్షరములును స్పష్టము. ఇవిగాక పూర్వ లిపి యందలి "ఱ ౚ" అను రెండక్షరములును వాడబడినవి.

గుణితపు గుఱుతులు

హ్రస్వ దీర్ఘముల భేదము కొన్నిచోట్ల గుర్తింప నసువు గాకున్నవి. "ఆ, ఏ, ఐ. ఓ" ల గుర్తులును కొన్ని చోట్ల సందర్భానుసారముగ జదువ నూహింపవలసి వచ్చు చున్నవి. అనునాసికలు అనుస్వారము ప్రస్తుత ఆంధ్ర లిపి యందువలె ప్రక్క నుండకను, నాగర లిపి సంప్రదాయాను సారముగ అక్షర శిరోభాగమున నుండకను అక్షర శిరోభాగపు కుడిప్రక్కను (ఈశాన్యమునకు) వ్రాయబడెను. పూర్వపు వ్రాతయందువలె అనునాసిక ద్విత్వమునకు బూర్వము బిందు ప్రయోగము 3వ శ్లో. 1 వ పు. 7 పం "బింమ్మ" అను చోట దప్ప వే రెందును మచ్చునకైన గానరాదు. అనునాసిక సంయుక్తములన్నియు ఆంధ్ర సంప్రదాయాను సారమున బిందు సంయుక్తముగాక నాగర లిపి సంప్రదాయానుసారమున వర్గానునాసికా సంయుక్తము గావింపబడినవి. ఆంధ్రలిపి యందువలె తొలి యక్షరము బూర్తిగను కడపటి యక్ష రములు గుర్తులుగా వ్రాయబడక నాగర లిపి సంప్రదాయ సిద్ధముగా మొదటి అక్షరములన్నియు గుర్తులుగాను కడ పటి యక్షరములే సంపూర్ణముగను వ్రాయబడినవి.

వి శే షా క్ష ర ము లు

పూర్వపు శాసనములందు వాడబడిన "ఱ, ౚ" అను రెండు విశేషాక్షరములును వాడబడినవి. "ఱ" కారము. "ర" కారమునకు బదులుగా 3 వ శ్లో 1 వ పుట, 7 వ పం "విఱివ" అనియు "డ" కారమునకు బదులుగా 2 వ శ్లో. 2 వ పు. 8 వ పం. "పృథివరాజోసి" అనియు, దకారమునకు బదులుగా 4 శ్లో, 1 పు. 8 పం. "ఱోలివాయి" అనియును వాడబడెను. అట్లే "ౚ" అను అక్షరము "ళ" అను అక్షరమునకు బదులుగా 3 వ శ్లో. 1 పు. 7 వ పం. "దౚ బింమ్మ" అనియును "డ" కారమునకు 4 వ రే. 1. పే. 6 వ పం. "పెద్దకౄల" అనియును, ఆ తరువాతి పంక్తిలోనే "ల" కార సంయుక్తమునకై "స్తీ ముల" అనియు వాడెను. సంయుక్తమున "ర" కారము కడపటిగల యక్షరముల ప్రస్తుత విధానముగ "ల" క్రావ డినే వాడెను. కాని "ర" కార ప్రారంభముగల సంయుక్తా క్షరముల ప్రస్తుత ఆంధ్రాక్షర విధానమున "౦" కారము గాని, పూర్వపు టాంధ్రాక్షర సంప్రదాయాను సారముగ "ౘ" వలవలగిలవలగాని ప్రయోగింపలేదు. నాగరలిపి సంప్ర దాయమున అక్షర శిరోభాగమందు "ٲ" గుర్తు వాడబడెను.

లే ఖ న దో ష ము లు

ప్రమాద వశమున కొన్ని అక్షరము లచ్చటచ్చట వ్రాయ విడిచెను. ఉ. 2 వ శ్లో 1 వ పు 3 వ పం. రాజ(న్య); 3 వ శ్లో 1వ పు 8 వ పం (ను) పాల(నే) నోపాయ; 4 వ శ్లో 2 వ పు3 పం. భాగ((వ) తా; 4 వ శ్లో 2 వ పు 6 వ పం. భ(వ)తి మొదలైనవి.

శా స న భా ష

శాసనభాష పరిహద్దులు మాత్రము తెనుగు. తక్కిన భాగ మంతయు సంస్కృతము. గద్య పద్యాత్మకము. కావ్య రీతిని వివిధ వృత్త సమన్వితము. అనుష్టుభులతోబాటు మాలిని, శార్దూల, ప్రహర్షిణి, ఉపేంద్రవజ్ర, ఆర్యా, శాలినీ, వసంత వృత్తములు వాడబడినవి. దానస్థల నిర్ణయ పరిహద్దుల వాడ బడిన బాష నన్నయ భట్టారకుల బూర్వపు దగుటచే గొప్ప తావుల పర్తము సులభగ్రాహ్యము కాదు. వంశము, విజయ ములు, దానము, ఫలశ్రుతి సంస్కృతమే.

శా స న వి ష య ము లు

ఈ శాసనము ఆంధ్రదేశమున 6—11 శతాబ్ద ముల బరిపాలవాదక్కడని పేరెన్నికగన్న చాళుక్య వంశోద్భవు డైన భీమ మహీపాలునిచే గావింపబడెను. అందు మొదటి భాగము:– 1—6 పం. గద్య. చాళుక్య వంశోన్నతి. రెండవ భాగ ము:– 6—31 పం. గద్య పద్యాత్మకము. తూర్పు చాళుక్య వంశ వర్ణన. 3 వ భాగము:– 32—38 పం. గద్య పద్యాత్మకము. దాత గుణ గణ వర్ణనము. 4 వ భాగము:– ప్రతిగ్రహీత వంశోన్నతి, దాన శాసనము, 39—48 పం. గద్య పద్యాత్మ కము. 5 వ భాగము:– 48—55 దాన స్థల నిర్ణయము. గద్య. పరిహద్దులు, గ్రామములు తెలుగుభాష. 6 వ భాగము:– ఫలశ్రుతి 56—63 గద్య పద్యాత్మకము.

చాళుక్య వంశోన్నతిలో క్రొత్త విషయములు గాన రావు. అయితే తరువాతి శాసనములందువలె పురాణ వంశ ప్రసక్తిగాని, అంతకుపూర్వపు శాసనములందలి "లక్ష్మీ ర్నిజాని రఖ్య—నారాయణః పాతువః" అను ధ్యాన శ్లోకముగాని లేవు. చాలవరకు చాళుక్య భీముని చీంవెల్లి శాసనము (3—7) రాజ రాజనరేంద్రుని మండతామ్ర శాసనములోని (23—27) పంక్తులే యుల్లేఖింపబడినవి. కావున చాళుక్య శాసనముల వంశోన్నతి వర్ణనమందలి మార్పున కిదియె నాందియేమో యనుకొను నవకాశ మేర్పడుచున్నది.

వం శా ను క్ర మ ణి క

వేంగీ దేశమును సర్వాశ్రయ వల్లభుని తమ్ముడైన కుబ్జవిష్ణు వర్ధనుడు పదు నెనిమిదేండ్లును, జయసింహుడు

ముప్పదేండ్లును, వాని తమ్ముడు ఇంద్ర భట్టారకుడు ఏడు రోజులును, విష్ణురాజు తొమ్మిదేండ్లును, మంగి యువరాజు ఇరువదేండ్లును, జయసింహుడు పదమూడేండ్లును, అతని సవతి తమ్ముడైన కొక్కిలి ప్రభువు ఆరు మాసములును, అతని తమ్ముడు విష్ణువర్ధనుడు ముప్పదేండ్లును, విజయాదిత్యరాజు పదునెనిమిదేండ్లును, విష్ణురాజు ముప్పదియారేండ్లును, అతని పుత్రుడైన విజయాదిత్యుడు "నరేంద్ర మృగరాట్" బిరుదముతో నలుబది ఎనిమిది సంవత్సరములును రాజ్యము చేసిరి. ఈ విజయాదిత్య నరేంద్ర మృగరాట్ గాంగ రాజులతో నూట ఎనిమిది యుద్ధములు చేసి జయించి తద్దోష పరిహారార్థమై సమాన సంఖ్యగల నూట ఎనిమిది శివాలయముల గట్టించెను. అతని కుమారుడును, ఉన్నత విక్రముడును అయిన విష్ణువర్ధనుడు రాజరాజువలె సంవత్సరమున్నర కాలము పరిపాలించెను. అతని పుత్రుడును, విజయాదిత్య సన్నిభుడునైన విజయాదిత్యుడు నలుబది నాలుగు సంవత్సరములు భూమిని పాలించెను. అతని సోదరుడగు యువరాజ విక్రమాదిత్యుని కుమారుడైన భీముడు శత్రు సముదాయమును దూది పింజెల నగ్నిహోత్రునివలె దహించి నిజ గుణ గణ కీర్తనముచే భూ మండలమును సాటిలేనివాడై ముప్పదేండ్లు పాలించెను. ఆ పిదప నాతని పుత్రుడైన విజయాదిత్యుడు గజయూథముతో నెదుర్కొన్న కలింగాధిపుని యుద్ధమున జయించి తులాభారము తూగిన బంగారముతో దానశౌండుడై శుభ సూచకమును, శాసన పూర్వకమునైన జయ స్తంభ మెత్తించి ఆరు మాసములు రాజై విరాజిల్లెను. ఆ విజయాదిత్యుని తనూజుడైన అమ్మరాజు ఏడేండ్లు రాజ్యమేలెను. అతని పుత్రుడు విజయాదిత్యుడు ఒక పక్షము రాజయ్యెను. అంత తాడపరాజు నెల రోజులు విక్రముడై పాలించెను. విజయాదిత్య తనూజుడైన భీముని సవతి తమ్ముడగు విక్రమాదిత్యుడు సంవత్సరము పాలించెను. (ఆ తరువాత) సామన్తులైన ఇతర సైన్యమును వశపరచుకొని అందుండు అధికారులచే నధికార దండమును పొంది శత్రు రాజులతో గూడుకొన్న ధూర్తలోకమును తుడిచిపెట్టి యుద్ధమల్లుని దరిమివేసెను. అట్టి మహాబల పరాక్రమవంతుడును విజయాదిత్య నందనుని సవతి తమ్ముడగు భీమ మహీపాలుడు తన పైతృక సంబంధమైన రాజ్యమునకు (పటము గట్టుకొనెను) పట్టాభిషిక్తుడాయెను.

దాత గుణ గుణాలు

గొప్పదియు వీరభోజ్యమునగు కీర్తికాంత ఆదిశేషునితో సమానమగు నీతిని భుజస్కంధమున నిల్పెనని దిగన్తములందున్న వైరి వీరులు చేగొనియాడబడెను. ఇంధనము అగ్నియందు వ్రేల్చబడినట్లు ప్రతి రాజ మార్తాండు లెవనిచేత యుద్ధమునందు నశించుచుండిరో, ఎవడు రాజ మార్తాండుడో, ఎవని సేనల బుట్టిన భూపరాగము శత్రు రాజులను మలువుగా పాలించుటకు సాధనమగుచున్నదో, ఎవడు శక్తి త్రయాత్ముడైన శివునివలెను, లక్ష్మీపతియగు నారాయణునివలెను తక్కిన సృజనాత్మకుడగు బ్రహ్మవలె (విరాజిల్లెనో) అట్టి సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన, మహా రాజాధిరాజ, రాజ పరమేశ్వర, పరమ భట్టారక, పరమబ్రహ్మణ్యుడు (అనబడు భీమ మహీపాలుడు) ఇకట మన్థని విషయమందలి రాష్ట్రకూట ప్రముఖ కుటుంబుల బిలిపించి ఇట్లాజ్ఞాపించెను.

ప్రతి గృహీత

శోభాయుక్తమైన పాలమున్నిటి కుద్ధియగు హైహయ వంశమున సత్య శౌచాభిమాన సంపన్నుడును, నిజ భుజ విక్రమశాలియునగు పోలయ రాజునకు సమస్త గుణముల చేతను తండ్రిని మించిన అన్నమరాజు జాదయించె. అతనికి అతిరథ ధవల ప్రియతనూజయగు రాయిత కాంబవలన జన్మించిన వాడును, హస్తినాపురవాసియు, గంగా పారియాత్రమందలి మాహిష్మతీ పుర ప్రభువును, హైహయ వంశోన్నతుడును, నరశిరోదర్పణ ధ్వజమును గలిగియుండి కుత్సితులైన రాజుల నశింపజేయు ప్రసిద్ధుడైన చంద్రవ రాజునకు మార్తాండ పితామహుడగు తాళరాజు విక్రమాదిత్యుడు యుద్ధమల్లుడు మొదలైన శత్రు రాజుల జయించుటవలన నాతని సేవా పరాయణత్వమునుండి విడుదల గావించి అన్ని పన్నులు తొలగించి "పరణపిన్ది" అను గ్రామమును ధారా పూర్వకముగ గావించుచు ఆజ్ఞాపించెను.

దా న స్థ ల ము ఎ ల్ల లు

తూర్పున పెనుంబ్రరు, దక్షిణమున పెనుంబల్లి, పడమర వెల్మదూరు, ఉత్తరమున దారమపల్లి, క్షేత్రసీమ సరిహద్దులు. "పశ్చిమతః దొరివాయి"

ఫలశ్రుతి:— శాసనసామాన్యమైన వ్యాస భగవానుని శ్లోకములే.

శాసన విశేషములు

(1) చాలుక్య వంశ ప్రశస్తియు, రాజవంశ వర్ణనలోని అనుష్టుప్పులును, కొన్ని పాదములును యథామాత్రకముగ (మొదటి) చాలుక్య భీముని పిసరి (చించెర్ల) శాసనమున గానబడుచున్నవి. అయితే ప్రారంభమందలి మంగళా శాసన శ్లోకమగు "లక్ష్మీజాని రశీష......నారాయణః పాతునః" అను విష్ణు ప్రార్థన ఇందు లోపించినది. పిరి తరువాతి శాసనములందువలె చంద్రవంశ వర్ణనము నిందు లేదు. అనగా తూర్పు చాళుక్యుల పురాణ వంశ వర్ణనల పూర్వాపరముల కిది సంధి కాల మనదగియున్నది.

(2) కొల్లభిగండ విజయాదిత్యుని విజయ పరంపరలు అతని తండ్రియగు (మొదటి) భీముని చీంచెర్ల (సేపలి) శాసనమున వర్ణితములయ్యెను. అందు గాంగ, కళింగ, విజయములును, పాండ్య, పల్లవ, చోళ, కేరళ, ప్రభృతుల సేవోపాయనములును వర్ణింపబడెనేకాని ఈ శాసనము మందలి

22—23 పంక్తుల నుదాహరింపబడిన హేమ తులాభారము, వదాన్యత, జయన్తుంభ కథానకము లా తరువాతివారి శాసనము లందే కానబడుచున్నవి.

(3) అమ్మరాజ విష్ణువర్ధను పిదప బాలుడైన విజయాదిత్యుని పారద్రోలి తాడపరాజు రాజ్యమేలినట్లుగనే తరువాతి శాసనములు దెల్పుచున్నవి కాని, ఈ శాసనమందలి 25—26 పంక్తులందున్న (బేటి లేక అయిదవ) విజయాదిత్యుడు ఒక పక్షము రాజ్యమేలినట్లున్నది. ఈతని రాజ్య విషయమును పలువురు చరిత్రకారులు నంగీకరించియున్నారు. అయితే తరువాతి శాసనములలో నీ విజయాదిత్య రాజ్యకాలము ఎట్లు లోపించినదో తెలియరాదు.

(4) శాసనకర్త చాళుక్య (తృతీయ) అమ్మ భీమ నృపాలుడు. రెండవ విక్రమాదిత్యుని తరువాత అమ్మ రాజ విష్ణువర్ధనుని కుమారుడును, బేటి (అయిదవ) విజయాదిత్యుని సవతి తమ్ముడునగు (తృతీయ) భీమరాజు తన పైతృకమైన రాజ్యమునకు పట్టభద్రుడైనట్లు ఈ శాసనము 31 వ పంక్తి వెల్లడించుచున్నది. అయితే తరువాతి శాసనములలో ఈభీమ రాజు పే రుదాహరింపబడక విక్రమాదిత్యుని పిదప తాడప రాజ కుమారుడగు (రెండవ) యుద్ధమల్లుడు రాజ్య మేలిన ట్లుదాహరింపబడెను. అయినను ఈ భీముడు ఎనిమిది మాసములు రాజ్య మేలినట్లు పలువురు చరిత్రకారు లంగీకరించియున్నారు. అంతేగాక జర్నల్ ఆఫ్ ఆంధ్ర హిస్టారికల్ రీసెర్చి సొసైటీ సంపుటి 16, పుట 131—136 లో ప్రచురింపబడిన తామ్ర శాసను పేక్కైక మధ్యస్థ పుట యందలి 8 వ పంక్తి (ఆఖరు పంక్తి) ఈ మూడవ భీమరాజు విక్రమాదిత్య భూపాలుని జంపి రాజ్య మేలినట్లు వెల్లడించుచున్నది. కావున ఇతర శాసనములలో ఈ (మూడవ) అమ్మ భీముడు ఉదాహరింపబడకున్నను, ఈ రెండు శాసనములవల్లను అమ్మభీముడు రాజ్యమేలినట్లు ధ్రువపడుచుటయు, అందు ప్రస్తుతము లభించిన శాసనములలో అమ్మ భీముని సంపూర్ణ శాసనమిది యొక్కటియే యగుటయు గొప్ప విశేషమై యున్నది.

(5) దాన ప్రతి గృహీత హైహయ వంశోద్భవుడైన చన్దన రాజు. ఈ హైహయ వంశపు రాజులు సాగర విషయమును (కోనసీమను) 12—13 శతాబ్దముల పరిపాలించినటుల గానవచ్చును. అయినను 8 వ శతాబ్దమునసే రెండవ విజయాదిత్యుని కాలమునందే పేరెన్నికగన్న సర్వ సైన్యాధిపతులై తమ కాశ్రయ మొసంగి (రాజులకు) చాళుక్య నృపులకు విజయముల జేకూర్చు మహాశూరులని హైహయ నృపరుద్రుని విజయములే చాటుచున్నవి. అట్లే ఈ హైహయ వంశోద్భవుడైన చన్దన రాజును తాను సేవించిన తూర్పు చాళుక్య (మూడవ భీముడు) అమ్మరాజ భీమ విష్ణు వర్ధన మహారాజునకు నమ్మకమైన సేవానియై, (ఆబాల్య స్నేహితుడై), తన తండ్రియగు అమ్మరాజు కాలమునుండియు దాయాదుల యుద్ధములందు తన కంగ రక్షకుడై, మార్తాండ (పరాక్రమ) పితామహ తాళరాజు, విక్రమాదిత్యుడు, (రెండవ) యుద్ధమల్లులతో బోరి పారద్రోలి, రాజును పైతృకమగు రాజ్యమునకు పట్టాభిషిక్తునిగావించిన అపర చాణక్యుడైనాడు. కావుననే ఈ రాజ శిఖామణియు, తన కృతజ్ఞతా సూచకముగ "వరణ ఏన్ది" యను నీ గ్రామమును నిర్వ్రాత్యభావమున ధారవోసెను.

అయితే ఇంకొక్క సందేహము. అంత ప్రతిభాశాలి యుండ తిరిగి ఎనిమిది మాసములకేల యుద్ధమల్లునిచే జంపబడెననునది. శూర వీర శిఖామణి కందరు శత్రువులే. అందు తండ్రి కాలమునుండియు శత్రు బాధలే కదా. అపర చాణక్యుడై అంగ రక్షకుడైన చంద్రనరాజు నిర్వ్రాత్య భావమున రాజసేవనుండి విముక్తుడయ్యెను. అయ్యది శత్రు రాజులకు చాల అదునైనది. అంతేగాక యుద్ధానంతరము రాజులకు యాగ సమాచరణము పరిపాటైనది. అట్లే "రాజా రాష్ట్రకృతం పాపం రాజ పాపం పురోహితః" అన్నట్లు రాజచే నభివృద్ధి కార్యముల జేయించు మంత్రి దండ నాయకులును రాజుతో భాగస్థులే కావున విశ్రాంతి కాలమున తీర్థ యాత్రలకు బోవు నాచారము కలదు. అట్లే ఈ చంద్రన రాజును ఉద్యోగ విరతి కాలముననే తీర్థ యాత్రలకు బోయియుండ నీ విపరీతము సంభవించియుండవచ్చును. అందుచే యుదార (కృతజ్ఞతా) పూర్వకమైన యీ దానమే ఈ అమ్మ భీముని నాశనమునకు కారణబీజ మయ్యెనేమో యను శంక గూడ గలుగుచున్నది.

చంద్రన రాజును "హస్తినాపుర వాస్తవ్యాయ" అని యుదాహరించియున్నారు. అయితే ఈ 9—10 శతాబ్దము లందు ఉత్తర దేశమందున్న హస్తినాపురము (ప్రస్తుతము ఢిల్లీ పట్టణము) నందు సుప్రసిద్ధ క్షత్రియులుగాని వారితో ఈ దక్షిణ దేశములకు ఏ విధమునను సంబంధము కలిగి యున్నట్లు గాని ఏ చారిత్రికులు నుదాహరించినట్లుగాన్పించుట లేదు. అయితే ఈ హైహయ వంశమువారే 12—13 శతాబ్దములందు సాగరవిషయమైన కోనసీమ నేలిన క్షత్రియు లగుటచేతను, 8 వ శతాబ్దినుండియు తూర్పు చాళుక్యుల సర్వ సేనా నాయకులుగా నుండుట చేతను, వీరు నివసించిన యీ హస్తినాపురము యీ కోనసీమయందున్న యే "ఏనుగల మహాలు" లేక "ఏనుగుల పల్లి"యే యైయుండి, దానినే "హస్తినాపుర"మను పేర శాసనమందు సంస్కృతీకరణము గావించి యుండునను యూహ పొడముచున్నది.

ఈ చంద్రనరాజు "నర శిరోదర్పణ ధ్వజుడు" అని పేర్కొనబడినది. అది యీ చన్దన రాజునకు మాత్రమే కలదో లేక హైహయ వంశ రాజు లందరకును గలదో చారిత్రకులును, పురాణ వేత్తలును బరిశీలింపవలసి యున్నది. అంతేగాక "నరశిరో దర్పణ ధ్వజము" అను దాని కర్థము పొడ చూపకున్నది. అయితే పూర్వపు రాజులు యుద్ధము

వందు తాము హతమార్చిన రాజుల శిరముల (పుర్రెలను) కోట సింహ ద్వారముల తోడుగు నాచారము పూర్వపు రాజుల కథ లందు గానవచ్చుచున్నది. అది వారి పరాక్రమ సూచిత లక్షణము. అట్లే కాళికాదేవి "నర శిరోమాలాలంకృత" యనియు, రుద్రుడు "కపాల మాలాలంకృతుడ"నియు, గజవీరుడు "అంగుళీ మాలాధరుడ"నియు ప్రతిబింబించి యున్నారు. కావున ఈ వంశీయులు శూర వీరాగ్రేసరులై సర్వ సేనా నాయకులై అసాధారణ శత్రు పరంపరల హతమార్చి జయముగైకొన్నవారను చిహ్న రూపమున "నరశిరో దర్పణ ధ్వజుడు"—శత్రు రాజుల శిరముల (పుర్రెల) ప్రతిఫలింపజేయు ధ్వజము—కలవాడు అనియు ననవలసి వచ్చును.

దా న స్థ ల ని ర్ణ య ము

దానమీయబడిన "వరణ ఏన్ది" అను గ్రామముగాని, దానికి సరిహద్దు గ్రామములైన "పెనుంబల్లి" "పెనుంబల్లు" "వెల్మదూరు" "దారమువ్వాడి" అను గ్రామములుగాని యే యొక్కటియు నిప్పుడు గానరాకున్నవి. అవి కాలగర్భమున నశించినట్లున్నవి. లేక మారుపేర్లతో యుండెనేమో పరిశీలింప వలసియున్నది. ఆ గ్రామములు ఇతర శాసనములందువలె "గుద్దవాడి", "గుద్రాహారము", "సాగర విషయము" అను ప్రసిద్ధ విషయముల వాడక అతి వింతముగ వాడిన "శకట మన్నని నాడు" లోనివని యుదాహరింపబడెను.

శకట మన్నవినాడు చాళుక్య భీమవరములోని రాజ నారాయణస్వామి దేవాలయమందలి మల్లపదేవుని శాసనములందున్న ట్లుదాహరించియున్నారు (సౌత్ ఇండియన్ ఇన్ స్క్రిప్షన్స్ వాల్యూమ్—5, పుట 62-66). చరిత్రకారులు ఆ శకట మన్నని నాడునకు చుట్టున నర్వవరము ప్రోలునాడుగను, నవఖండవాడ ప్రోలునాడుగను, పెద్దాపురము కిమ్మిరనాడుగాను, కోనసీమ సాగరనాడుగను ఉద్ఘాటించియున్నారు. కావున ఈ శకట మన్నవి నా డా నాడుల మధ్యస్థమైన తుల్యా గౌతమీ మధ్యస్థ ప్రదేశమని నిర్ధారింపవలసి వచ్చుచున్నది. అంతేగాక ఎక్కువగా తుల్యాతీరమే శకట మన్నని నాడేమో బాగుగా పరిశీలింప వలెను. ఏమన పూర్వకాలమున ఇప్పటివలె ఎక్కువగా ప్రయాణ సౌకర్యములుగాని, విరివిగ రాచబాటలుగాని కానరావు. అందును జల మధ్యస్థ (నదీమధ్య) ప్రదేశములకు రాక పోకలు చాల తక్కువ. అకారణమున సాగర విషయమునను, భీమ ఖండమునను నదీ ప్రవాహము లెక్కువగా నుండుటచే రాచబాట కంతరాయము కల్గి నదీ బాహ్య ప్రదేశమైన (తాలివాయ:) తుల్యా తీరముననే రాచబాట యున్నట్లు గాన్పించుచున్నది. తుల్యా తీరముందున్న కేసవరమునకు "దండు కేసవరము" అను పేరున్నది. చిక్కవోలు, బ్రహ్మదేవముల దక్షిణ భాగమున తీరము వెంబడినే దండు పుంతయు గలదు. అనగా ఆ దండుపుంత తూర్పు భాగము చాళుక్య భీమవరమును సమీపించినది. ఈ దండుకేసవరము ఈ శాసనము దొరికిన మురమండ గ్రామమునకు సమీపమం దున్నది. "దండు" అన సేన. దండు (రథ, గజ, తురగ, పదాతాదుల)తో గూడుకొని యుండి, ఆ సైన్య శకటములచే నిత్యము రాపిడిగల రాచబాట యగుటచే నా ప్రదేశమునకు "శకట మన్నవినాడు" అను సార్థక నామమయ్యెనను యూహ కవకాశ మున్నది. అంతేగాక రాజ మహేంద్రవరమునుండి ద్రాక్షారామమునకు పోవుమార్గమున "దండు గంగమ్మ" ఆలయ మొకటి గాన్పించుచున్నది. మొదటి కులోత్తుంగచోళ దేవుని భీమవర శాసనమునను (ఎపిగ్రాఫియా ఇండికా వాల్యూం 4, పుట 219-233 నం. 1187) ద్రాక్షారామ శాసనమునను (ఎస్. ఐ. ఐ. వాల్యు—5 నం. 1281) రాజేంద్రచోడ చతుర్వేది మండలమున "చింతపల్లి" గ్రామము (కాకినాడ తాలూకా) ఉదాహరింపబడియున్నది. ఈ పై విషయముల గమనింప భీమ మండలమున పేర్కొనబడిన రామచంద్రపురము తాలూకా కొంతవరకు కాకినాడ తాలూకా ముఖ్యముగ తుల్యానదీ తీరము "శకట మన్నవి నాడని" స్థిరపడగుచున్నది.

"వరణఏన్ది" గ్రామము సరిహద్దు గ్రామములు కావచ్చుటలేదు; సరిగదా, "ఏన్ది" అను పదాంత్యముగల పదములాంధ్ర సంస్కృతములందున్నట్లు తెలియవచ్చుటలేదు ఈ శాసనము రాజమండ్రి తాలూకా మురమండ గ్రామమునకు ఉత్తరమున అరమైలు దూరమందున్న పాటిదిబ్బయందు దొరికినది. అది ఇపుడు బాడవ గర్భ మయ్యు పూర్వము నదీతీర చిహ్నములు గలవు. 1336 ఫసలీబూబందు లెక్కల బరిశీలింప ఈ పాటి దిబ్బలకును, మురమండ గ్రామమునకును మధ్యనున్న పుంత నె 47 రు. "నాగులపాడుపుంత", నె 48 "వేడి మంగళం పుంత"యనియు నమోదులు గాన్పించుచున్నవి. శాసనమందుగల "వరణఏన్ది"యు ఆ బూబందు లెక్కలందున్న "వేడిమంగళంపుంత"యు గమనింప నా రెండు పదముల సన్నిహిత సంబంధముగల యొకే పదము కాలక్రమమున మార్పు జెందిన రెండవ రూపమని గోచరించుచున్నది. ఒక దానియందు "వరణ" అనియు, మరొక దానియందు "మంగళ"మనియు శ్రేష్ఠ వాచకము లుపయోగింపబడినవి. ఈ రెంటి యందును ఏన్ది లేక వేన్ది" అను పదము మాత్రము ముఖ్యమైనదై యున్నది. వరణ పూర్వ పదముగను, మంగళం ఉత్తరపదముగ నుపయోగింపబడిన కర్మధారయ సమాసముగ నొప్పుచున్నది. ఇక ఏన్ది లేక వేన్ది లేక వేడి అను పదము పరిశీలింపవలయును. ఈ శాసనము నన్నయకు పూర్వ మొక శతాబ్దము నాటిది. అప్పటికి తెనుగుభాష సంస్కరింపబడకపోవుటచేతనేగదా నన్నయ భట్టు ఆంధ్ర భాషానుశాసను డైనాడు. అట్టి నియమ రహితమైన భాషయందు ఏన్ది యను పదముండి జనసామా

న్యమున 'వేన్డి' అను పదము వాడుకయైనది. అనగా ప్రశస్త పదము "ఏన్డి" అను పదము. నదీ వాచకమైన "ఏరు" పదమునకు షష్ఠీ విభక్తిక ప్రత్యయమైన "టి, ంటి, ంతి" యనునవి చేరినట్లు "ండి" అను ప్రత్యయము గూడ చేరగా "ఏఱు + ండి" "ఏన్డి" అయియుండును. కావుననే ఏఱు + కోల—ఏడికోల, ఏడి, ఏటి, ఏండి" అను పదములు వాడుకలో నున్నట్లు ఆంధ్ర భాషా చరిత్ర సమాస ప్రకరణమున (778 పే.) గానవచ్చుచున్నది. అందువలననే వరణ + ఏన్డి—వరణఏన్డియే ఏన్డి + మంగళం — ఏన్డిమంగళముగా మారి, కాలక్రమము వేడిమంగళమై యుండును. ఆ గ్రామమునకు పశ్చిమమున (తోలివాయి) దొలివాయి అనబడు తుల్యానది గలదు. తుల్యా నదికి "షడ్భిస్తుల్యా తుల్యా" అను ప్రమాణ వచనముచే ఆ "ఏన్డి" అను గ్రామమును "తుల్యా" అను శ్లేష పదమునకు సంబంధించిన "వరణ ఏన్డి" గ్రామముగా వాడబడినది. ఆ శ్లేష వాచకము లేనిదే "ఏన్డి" అను పదమునకు షష్ఠీ సంబంధ ప్రత్యయముగ గలది "ఏండిడి" అను గ్రామము ఆ తుల్యా తూర్పు తీరమున నిప్పటికి గలదు. కావున, తుల్యా తీరమున తూర్పున "ఏడిది" అను గ్రామమును, తుల్యా తీరమున చేరి (ఆత్రేయ, భారద్వాజ నదులు విడిపోకుండ కలిసియున్న) "ఏన్డి" వరణ ఏన్డి" గ్రామముగ వ్యవహరింపబడి కాల క్రమమున వేడిమంగళమై, క్రమమున నశించి దానికి అర్ధమైలు దూరమున ప్రస్తుతము మురమండ అను పేరున వ్యవహరింప బడుచున్నది. కావున ప్రస్తుతము మురమండ గ్రామమున కుత్తరమున బాడవలకు చేరిన పాటిదిబ్బలే (ఈ శాసనము దొరికిన తావే) వరణఏన్డి గ్రామమనియు, ఉత్తర భాగమందున్న ద్వారపూడియే పూర్వము "దారమపల్లి" అయియుండుననియు, ప్రస్తుతము (బహు పురాతన గ్రామమై ఐదు నిలువుల వరకును పాటి మట్టిగల) వీరవర గ్రామమే పశ్చిమ దిశ నుదాహ రింపబడిన "వెల్మదూరు" అయియుండుననియు నిర్ధరింపనువు కలుగుచున్నది. అంతేగాక మురమండ గ్రామమున శివాలయ మొక్కటే కలదు. విష్ణ్వాలయ మున్నగాని శివాలయము కట్టరాదను శిష్టాచారము గలదు. అట్టి తరి ఈ గ్రామము విష్ణ్వాలయము లేకుండ శివాలయ మొక్కటే యున్నదన్నచో విష్ణ్వాలయమున్న పూర్వపు గ్రామము నశించినదని, క్రొత్తగా కట్టబడిన యీ యూరు శివాలయమున్న ప్రదేశమనియు గుర్తింప వలయును. అందుకు తగినట్లే 3, 4 సం. క్రితము మురమండ గ్రామమున ఆగ్నేయ దిశనుగల (క్రొత్తగా వెలసిన) ఇండ్ల మధ్యను మట్టి త్రవ్వుచుండగా గోదావరి సన్న ఇసుకయు, జలచరముల గుల్లలు, ఎముకలు, కొన్నివు బూడిద దాచిన అస్థి శకలముల కలశము, వేణుగోపాలస్వామి విగ్రహము దొరికి నవి. అనగా ఆ ప్రదేశము పూర్వము ఊరి బయటనున్న నదీ తీరస్థమగు శ్మశాన వాటికయని తోచుచున్నది. అంతే గాక ఈ గ్రామమునం దా పాటిదిబ్బలయందే సర్వాలంకార భూషితయు, అల్ప వస్త్రధారిణియు, పద్మాసనాసీనయునగు మూరెత్తు స్త్రీ విగ్రహ మొకటి దొరికినది. అది హైందవ సంబంధియగు పార్వతీ విగ్రహమో లేక జైనారాధన దేవతయగు కాకతమ్మ విగ్రహమో పూర్తిగా చెప్పజాలను. ఏది ఎట్లున్నను ఈ పూర్వపు చిహ్నములను నదీ గర్భమును, నీటి (ఏటి) వాళ్లను గమనింపగా, పూర్వము ఈ శాసనమందలి "వరణ ఏన్డి" గ్రామమే కాల గర్భమున లీనమై దాని ప్రతిబింబముగ ప్రస్తుతమున్న మురమండ గ్రామముగా నిలిచియున్నదని నా నమ్మకము.

కాల మనంతమైనది. దాని ప్రభావము సర్వజ్ఞునకు నైత మనవగాహము. రాజులు, రాజ్యములు, వంశములు, రూపు మాసినను వారొనరించిన కార్యకలాపములు మాత్ర మాకల్పాంత స్థాయి లనుటకు ఈ తామ్ర శాసనములు ప్రముఖ పాత్ర వహించినవని దెలుపుట కానందించుచున్నాను.

తెలిసియు దెలియని జ్ఞానముతో ఆశా పరిపూరితా వేశమున వాయోపిన కొలది ఈ శాసనము నింతవరకు వివ రించి లోకమున కర్పించుకొని ఆత్మ సంతృప్తుడైతిని. అయితే ఇందలి దోషముల మన్నించి ఎఱుక పఱచిన విద్యార్థివలె పరిగ్ర హించి ధన్యుడ నయ్యెదను. ఇం దేమాత్రమైనను విజ్ఞులచే బరిగ్ర హింపబడినచో ధన్యుడనై వారికి నా కృతజ్ఞతాభివందనము లర్పించుకొనుచున్నాను.

తూర్పు చాళుక్య వంశము

జయసింహ వల్లభ మహారాజు (విష్ణువర్ధనుడు. కదంబ, గాంగ, రాష్ట్రకూట విజేత.)

విజయాదిత్యుడు (రణరాగుడు)

శ్రీ పులకేశి వల్లభ మహారాజు (సత్యాశ్రయ, రణవిక్రమ)

కీర్తివర్మ

(మంగళేశుడు)

సత్యాశ్రయ పృథ్వీవల్లభుడు, (పులకేశి మహారాజు, రాజపరమేశ్వరుడు. పశ్చిమ చాళుక్య వంశకర్త.)

కుబ్జ విష్ణువర్ధనుడు. (18 సం.) (విషమసిద్ధి: పూర్వపశ్చిమ సముద్రవ్యాప్త మహీపాలక, పిష్టపుర పీఠాధీశ, కదంబ, చేది, గాంగ, మౌర్య, కళింగవిజేత. (తూర్పుచాళుక్య వంశకర్త.)

ఇంద్ర భట్టారకుడు (7 రోజులు)

జయసింహ వల్లభుడు (33 సం. సర్వసిద్ధి: వేంగీపుర పీఠాధీశ.)

రెండవ విష్ణువర్ధనుడు. (9 సం.)

మంగి యువరాజు. (25 సం సర్వలోకాశ్రయ, విజయసిద్ధి)

రెండవ జయసింహుడు. (13 సం.)

మూడవ విష్ణువర్ధనుడు (37 సం.)

కొక్కిలి విక్రమాదిత్య భట్టారకుడు. (6 నెలలు) (ఎలమంచిలి ప్రభుత్వాధీశ. విజయసిద్ధి)

విజయాదిత్య భట్టారకుడు (18 సం. విజయసిద్ధి, విక్రమాంక)

వినయాదిత్యుడు

నాలుగవ విష్ణువర్ధనుడు. (36 సం) (మహారాజాధిరాజ, సమస్త భువనాశ్రయ, చాళుక్యార్జున, రాజపరమేశ్వర, శ్రీ త్రిభువనాంకుశ, నరేంద్ర మృగరాట్ బిరుదాంకిత, చేది, గాంగ రాష్ట్రకూటవిజేత, అష్టోత్తర శతశివాలయ ప్రతిష్ఠాపనాచార్య.)

కోకిల (శ్రీ అనివారితశక్తి త్రయ) (ఎలమంచిలి)

రెండవ విజయాదిత్యుడు. (48 సం. హైహయవంశ నృపరుద్ర యుద్ధవిజయ పరిపాలక)

కలివిష్ణువర్ధనుడు. (1 సం. 7 మా. సర్వలోకాశ్రయ, విషమసిద్ధి, వేంగీనాథ, పరమేశ్వర)

గుణాంకనల్ల విజయాదిత్యుడు. (44 సం. గణితశాస్త్ర విశారదో గుణకవిజయాదిత్యః)

యువరాజ విక్రమాదిత్యుడు.

నృపకాముడు

యుద్ధమల్లుడు.

చాళుక్యభీమ విష్ణువర్ధనుడు. (30 సం. క్రీ. శ 892 పట్టాభిషేకము: శా. శ. 814. మేష చైత్ర కృష్ణ ద్వితీయా శనివాసరానూరాధా నక్షత్ర మిథున లగ్నము.)

తాడపరాజు. (1 మా)

రెండవయుద్ధమల్లుడు:(7సం)

కొల్లభిగండ బాప్పర విజయాదిత్యుడు (7 మా. కళింగవిజేత, హేమతులాభారుడు)

విక్రమాదిత్యుడు (1 సం లేక 11 మా.)

అమ్మరాజ విష్ణువర్ధనుడు. (7 సం. సర్వలోకాశ్రయ, రాజమహేంద్ర శ్రీత్రిభువనాంకుశ)


రెండవచాళుక్య భీముడు (10 సం)

బేటవిజయాదిత్యుడు. (15 రో. బేట విజయాదిత్య వంశకర్త.)

మూడవ విష్ణువర్ధనుడు (8 సం. శకటమన్ననీ వరణపిన్ని తామ్రశాసనకర్త. 967—946.)

రెండవఅమ్మరాజు విష్ణువర్ధనుడు (75 సం. పిరియూరు తామ్రశాసనకర్త.)


ప.ా ల పు



మొదటిరేకు - రెండవవైపు

స్వస్తి శ్రీమతాం సకల భువన సంస్తూయమాన మానవ్యసగో
త్రాణాం హారితి పుత్రాణాం శ్రీకౌశికీవరప్రసాదలబ్ధ రాజ్యానాం మాతృగణ
పరిపాలితానాం స్వామి మహాసేన పాదానుధ్యాతానాం భగవన్నారాయ
ణప్రసాద సమాసాదిత వరవరాహ లాంఛనే క్షణ క్షణ వ
శీ కృతారాతి మణ్డలానాం అశ్వమేధావబృథస్నాన పవిత్రీకృత
వపుషాం చాలుక్యానాం కులమలంకరిష్ణోః॥ [1]సత్యాశ్రయ వల్లభ
స్య భ్రాతా ష్టా దశ వత్సరాన్ । అభూత్పూర్వం కుబ్జ విష్ణువర్ధనో వేంగీవల్లభః॥ జ
యసింహ వల్లభో భూ త్రింశ త న్త్రికసంయుతాన్॥ తద్భ్రాతేన్ద్రాఖ్యభట్టారో రాజా
న సప్తదినే నాభూత్॥ నవాబ్దా న్విష్ణురా[2]జ్యోతో జజ్ఞే మంగియువరాజః। పంచవిం


1 అనుష్టుప్. 2 రాజ్యోతో = రాజోతో.



రెండవరేకు - మొదటివైపు

శతి మ[3]తోఽభూ జ్జయసింహ త్రయోదశ॥ ద్వైమాతు రానుజ స్తస్య షణ్మాసా
న్నో[4]కిలిః ప్రభుః స ప్త త్రింశత మబ్దానా స్త ద్భ్రాత్రా విష్ణువర్ధనః॥ త[5]తో ఆసీ ద్విజ
యాదిత్యో రాజాష్టాదశవత్సరాన్। తతో [6]భూ ద్విష్ణురాజః ష ట్త్రింశత మితే
శ్వరః॥ తత్పుత్రో విజయాదిత్యో న రేన్ద్ర మృగరాడితి। చ త్వారింశ
త మష్టేచ వత్సరాన్ వత్సరాజవత్॥ గంగరట్ట బలాభ్యాం యో యు
ద్ధ్వా తద్యుద్ధసంఖ్యయా శివాలయా నష్టశతం కృతవా న్పానుత్త
మే॥ కవి విష్ణు వర్ధన స్తస్య సూనురున్నత విక్రమః। సార్ధసంవత్సరం రా
జరాజేవ సదృశాననః॥ తత్సుత్రో విజయాదిత్యో విజయాదిత్య సన్నిభ
ః॥ చత్వారింశత మబ్దానాం చతూ[7]చ్ఛిర్భువ మన్వశాత్॥[8] తదనుజయువ


3. అతోఽభూత్ = అత్రాభూత్. 4. కోకిలిః = కొక్కులిః. 5. త్రాస్ = తతఆస్. 6. తతోఽభూ = తతోఽభవ. 7. చతూచ్ఛిర్భువ = చతుర్భిర్భువ. 8. మాలినీవృత్తము.



రెండవరేకు - రెండవవైపు

రాజా ద్విక్రమాదిత్యనామ్నః ప్రభు రభవ దరాతివ్రాత తూలా[9]విలేపుః
నిరుపమ నృప భీమః త్రింశతం వత్సరాణా న్నిజగుణగణ కీర్తివ్యాప్త దిక్చ
క్రవాలః ॥[10] త త్పుత్ర స్తదన న్తరేణ విజయాదిత్యో విజి త్యాహవే స్వేనై కేన
గజేన వారణపుటారోహో న్కలింగాధిపా[11] అరుహ్యోజ్వల హేమ
కల్పిత తులాకోటీ వదాన్యే జయస్తంభం కీర్తిమయం నిధాయ
[12]విరజా షణ్మాస మాసీ న్నృపః తత్సూను రమ్మరాజోపి సప్త సంవత్స
రా న్నృపః యేన హేమతులారోహో జనానా మభినన్దినీ తత్పుత్రో విజయాది
త్యః పక్షమేక మభూ త్ప్రభుః తత స్తాడపరాజోపి మాస మాశాస్య విక్ర
మః విజయాదిత్య రాజస్యార్భమిద్వైమాతు రానుజః విక్రమాదిత్య భూపా

9. తులావిలేపుః = తూలానిలోపమః. 10. శార్దూలవిక్రీడితము. 11. అధిపా – అధిపాన్. 12. విరజా–విరజాః.




మూడవఱేకు - మొదటివైపు

లస్సంవత్సర మపాలయత్ ।[18]సామ౦స్త శ్శబర చమూగృహీత పట్టే రట్టానామ ధిపతినా ప్రణీతదణ్డః । అన్యేపి ప్రభవ ఇవాతిధూ ర్తలోకం వ్యాలుమ్పమ్భ వ మవధూయ యుద్ధమల్లే[14] తానుద్ధాయ [15]మహాబలపరాక్రమః । ద్వైమాతురా నురాజస్య విజయాదిత్య నన్దనః భ్రాతా భీమ మహీపాలః పట్టం బధ్నాతి పైతృకం॥[16] భుజా స్తరే శ్రీభుజగేన్ద్రసారే భుజేస్య తిష్ఠ త్యురు పీరలక్ష్మీః ఇతీవ యత్కీర్తివధూ ర్దిగన్తా నధ్యాస్య సంరం భయతి ద్విషేపి॥[17] యేనచ నిహతే సంయతి ద[18]డ దింమ్మనిన్నితివరాజమార్తాణ్డ యశ్చబల భూప[19]రాగః పరన్నపతీనాం[20] పాలానోపాయః । [21]యశ్చశివ ఇతి శక్తిత్రయాశ్రయః నారాయణఇవ లక్ష్మీపతిః బ్రహ్మేవ సామయోని స్స

---


13. ప్రహార్షిణి. 14. అనుష్టుభ్. 15. పాదార్థంలేదు. 16. ఉపేన్ద్రవజ్ర. 17. ఆర్యావృత్తము. 18. దడ దిమ్మ = దళితిధ్మ. 19. యన్చబల భూపారాగః=యన్చబల భూపరాగః. 20. పాలానోపాయః=పాలవేనోపాయః. 21. గద్య.



మూడవరేకు - రెండవపైపు

సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధనమహారాజాధిరాజపరమేశ్వర పరమభ
ట్టారకః పరమబ్రహ్మణ్యః శకట మన్థని విషయవాసినో రాష్ట్రకూట[22] ప్ర
ముఖా కుటిమ్బినః స్సమాహూయేద్ధ మాజ్ఞాపయతి॥ శ్రీమతి[23]పయఃప్రయో
ధి ప్రతినిభిర్హైహయ వంశే సత్యశౌచాభిమాన సంపన్నో ని
జభుజ విక్రమశాలి పోలేయన రాజాభిధానో జాతస్తస్య
సూను రనుపమ గుణాత్యితర మనుకుర్వన్నన్నకరాజస్తస్య నృప
తేరతి రథదవల ప్రియదుహితా రాత్తుకంబాయాశ్చ ప్రియతనయో య
స్తస్మై హాస్తినాపుర వాస్తవ్యాయ గంగాపారియాత్ర మాహిష్మతీపురపర
మేశ్వర హైహయవంశోద్భవ నరశిరోదర్పణధ్వజ[24] మాల్యతేపోషణ


22. ప్రముఖకుటిమ్బినః = ప్రముఖకుటుమ్బినః. 23. పయఃప్రయోధిప్రతినిభి = పయఃపయోనిధి ప్రతినిధి.
24. ధ్వజమాల్యతేపోషణ = ధ్వజాయ ల్యతేపోషణ.



నాలుగవఱేకు - మొదటివైపు

ప్రశస్తి విరాజమానాయ దశ్వర్మ[25]నరాజాయ మార్తాణ్ణ పితామహా విక్రమాది
త్య యుద్ధ మల్లాదికం విజిత్య తత్ర నిర్భృత్య భావ నిమిత్తేన సర్వ క
ర పరిహార ముదక పూర్వక మ్మాన్యం కృత్వా వరణవేణ్డినామ గ్రామోస్మా
భి ర్దత్త ఇతి విదిత మస్తు వః॥ అస్యావధయః పూర్వతః పె
నుంబఱ్ఱు దక్షిణతః పెనుంబల్లి పశ్చిమతః వెల్మదూ
రు॥ ఉత్తరతః దారమపల్లి। క్షేత్రసీమ పూర్వతః పెద్దక్క
ల్ల చిన్త। ఆగ్నేయతః ప్లేదుల పదుగకడిలినల్లజిన్తా దక్షిణతః
గోరగ పన్నస। నైరృత్యతః ముయ్యాల్కుట్టిన నుజ్జుంజిన్త। పశ్చిమతఃఱో
లివాయి। వాయువ్యతః ముయ్యాల్కుట్టిన పెద్ద చిన్త। ఉత్తరతః దారమ


25. చిన్ద్ర[?]న = చన్ద్రినః.



నాలుగవరేకు - రెండవవైపు

పల్లి సీమోావ సీమ । ఈశానతః నిదుదపదుగ॥ అస్యోపరి నకేన చి ద్బా
ధా కర్తవ్యా॥ యః కరోతి స పఞ్చమహాపాతక సంయుక్తో నర
కం గమిష్యతి । తథాచోక్తం భ[26]గతా వ్యాసేన । స్వదత్తాం పరదత్తాం
వా యో హరేత వసున్ధరామ్ షష్టిం వర్షసహస్రాణాం వి
ష్టాయాం జాయతే క్రిమిః॥ యశ్చ పాలయతి స స్వర్గే ఫ
లమను[27]భవతి తథాచోక్తమ్ । బహుభి ర్వసుధా దత్తా బహుభి శ్చానుపా
లితా । యస్యయస్య యదా భూమి స్తస్య తస్య తథా ఫలమితి
[28]సర్వానేతా న్భావినః పార్థివేన్ద్రా న్భూయోభూయో యాచతే రా

26. భగతా = భగవతా. 27. మనుభతి = మనుభవతి. 28. శాలినీవృత్తం.



అయిదవ రేకు - మొదటి వైపు

మభద్రః సామాన్యోయం ధర్మ సేతుర్నృపాణాం కాలేకాలే పాల
నీయో భవద్భిః॥[29] మద్వంశజాః పరమహీపతి వంశజా వా పాపా ద
పేతమనసో భువి భావిభూపాః యే పాలయన్తి మమ ధ
ర్మ మిమం సమస్తం స్తేషా మ్మయా విరచితో[30]జంలి రేష మూ
ర్ధి॥

29. వసంతతిలకము. 30. విరచితోజంలి = విరచితోంజలి.

శ్రుతిలో అపశ్రుతి

శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

కళ్ళలో కాటుక చెదరకుండా
ఏడ్చింది ఘృతాచి;
లిప్‌స్టిక్ చెదరకుండా కరగకుండా
ముద్దిడమంటుంది లలామ;
పతి ధిక్కారము సైపలేక
సతి విలాపిస్తున్నది లయతాళబద్ధంగా;
అయ్‌ఉణ్ ఋలృక్ లణ్ జభయ్ గఢధస్
శివుడు డమరుకం మ్రోయిస్తూ తాండవం చేస్తున్నాడు;
హిమకన్య ప్రణయ బాధతో వేగిపోతున్నది;
మరణంలో మాధుర్యం
తరచి చూస్తూన్నాడు భావుకుడు;
అమాత్యుని కడుపు నొప్పికి
ఎమ్మెల్లె వైద్యుడిచ్చాడు విషవల్లరి;
దిక్కులు చూపించేది దిక్సూచి
వైయాకరణుడు ఖసూచి
తార్కికుడు అధఃసూచి
నడుం విరిగినవాడు అధఃసూచి;
అధస్సు పాతాళం
నడుం విరిగితే పాతాళం;
బెనిఫిట్ నాటకానికి టిక్కెట్లు
అమ్ముతున్నది కలెక్టర్ భార్య
టిక్కెట్ల కోసం ఎగబడుతున్నాయి మందలు;
స్వర్గంగా తీరంలో కల్పలతలూ మందారాలు పీకేసి
కాబేజి నాటమన్నాడు అమాత్యుడు

దరిద్రుడుకి అనంతకోటి ఉపాయాలు;
జభయ్.గఢధస్ నిస్వనం అసురులను
తరిమి తరిమి కొట్టింది
తిరుమబడేవాళ్ళు దేవతల్ని తరిమి కొట్టారు;
పరాశరుడు సంహితా పారాయణ చేస్తుంటే
శిష్యుడు ఎలుక రంధ్రాన్వేషణ చేస్తున్నాడు
అషాఢభూతి ప్లాను ఫలిస్తూ ఫలిస్తూ పతాపంచలైంది;
అణుబాంబులు పగులుతుంటే
సోమయాజులు జపిస్తున్నారు శాంతిమంత్రాలు;
యిజములు యిజములు ఢీకొని ప్రిజములై
బాధిస్తున్నాయి ప్రజలను;
ముందు తరాలవాళ్లను వెనక్కి తోసి
వెనక తరంవారు వెనక్కిపోతున్నారు;
కృష్ణాగ్రజుని హాలాయుధం తుప్పు పట్టినా
పాగిడేవాళ్ళ సంఖ్య తగ్గడం లేదు;
ప్రబంధసుందరిని కౌగలించ లేక
జులపాల బక్కకవి ఒగురుస్తున్నాడు;
సినీసత్శ్రుతి దంపతుల జగడాలు చూచి
గంధర్వులకు భూలోకంపై అసహ్యమేసింది;
టోలుగూ సినిమావాళ్ళ గ్రంథ చౌర్యానికి ముగ్ధులై
బెంగాలిరైటర్సు యివ్వబోతున్నారు బహుమతులు;
కస్మై దేవాయ హావిషా విధేమ అంటే
తరచితరచిన జిజ్ఞాసువు ఎవరికీ వద్దంటున్నాడు;
టోలుగూ పండిట్ అనాచారాన్ని ఖండించడానికి
బూళ్లేరు ముక్కలు నేరుస్తున్నాడు;
బక్కెట్టు నీళ్ళతో పిపీలికానికి జలప్రళయం
హీరోరంగ్రావ్ సుబ్రావ్ ది గ్రేట్ తలపడ్డారు;
మశకాలదర్పాన్ని చూచి విధాత చిరునవ్వునవ్వేడు;
నాదబ్రహ్మ సరస్వతి గొంతు పిసికి అపభ్రంశపరస్తుంటే
ప్రజ లడ్డుపడి నివారించారు.

జాతి పద్యము

అంతరాక్కర

శ్రీ బండి నాగరాజు

అక్కరలు అను జాతి పద్యము లైదింటిలో నాల్గవది "అంతరాక్కర". దీని లక్షణము: "ప్రతిపాదమునకు క్రమముగా ఒక సూర్యగణము, రెండింద్ర గణములు, ఒక చంద్ర గణము ఉండవలెను. మొత్తము నాలుగు గణములు గనుక, మూడవ గణము (పై ?) న—చివరి యక్షరమున—వళియుండవలెను. జాతి పద్యముగాన, ప్రాసయతి పనికిరాదు. ప్రాస నియమము ఉన్నది. నాలుగు పాదము లుండుట మామూలు."

ఇది తటాలున చూచినప్పుడు తేటగీతి, ద్విపద మొదలయిన వానివలె భాసించును. అట్లనుకొని చూచిన ఎడల దాని అసలు నడవడి మనకు స్ఫురింపదు. పాదమును యతి వరకు తుంచుకొని, నడక సరిచూడవలెను.

1920 లో ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు ప్రచురించిన కావ్యాలంకార చూడామణి (27 పు.) లో ఈ పద్యము గూర్చి పుట యడుగున, ఇది గీతమువలె నున్నట్లు శ్రీ జయంతి రామయ్యపంతులుగారు సూచించినారు. అవును, ఇదంతయు తేటగీతివలెనే యున్నది!—

"కమల మిత్రుండు సురరాజ—గణయుగంబు
కమల శత్రునితో జెంది—కందళింప
నమరు ప్రావళ్ళ నర్ణంబు—నలితయుల్లి
నమల మగు నంతరాక్కర—మబ్ధి సంఖ్య"

ఈ పద్యమందలి 'అబ్ధిసంఖ్య' యతి స్థాన నిరూపకము. అబ్ధి—నాలుగు. అనగా, నాలుగవ గణారంభమున యతి యుండవలెనని విన్నకోట పెద్దనగారి లక్షణము. అంతేగాక, చివర నుండవలసిన చంద్రగణమును, రెండు సూర్యగణములుగా విరుగునట్లు కూర్చినాడు. అందువల్ల ఇది పూర్తిగా ప్రాసమున్న తేటగీతియైనది! అతే, ఇట్లను వ్రాయవచ్చునని పెద్దన పాత నడకకు మారుపేరుపెట్టి మన కిచ్చినాడు.

పాదమందలి గణ సంఖ్యను రెంటిచే భాగించి, శేషము వచ్చిన ఒకటిగా కలుపుకొని, ఆమీది గణారంభమున యతి చెప్పుట జాత్యుపజాతులందు సంప్రదాయము. ఈ పద్యమందలి నాలుగు గణములను రెంటిచే భాగింపగా రెండు వచ్చినవి. రెంటికి తరువాతి గణారంభమున (మూడవ గణారంభమున) యతి చెప్పుట లక్షణ మర్యాద. కాని, విన్నకోట పెద్దన నాల్గవ గణారంభమున యతి చెప్పినాడు. అట్లే నిలిపినాడు.

అనంతుడు, 'అక్కరల యతి నిర్ణయము' నిట్లని చెప్పియున్నాడు :

"విరతి—చతుర్గణము మహో
క్కర మేకోనాక్షర త్రిగణ మంతరకున్
వరగణయుగ యతి నల్పా
క్కర మధ్యయు మధురయుం ద్విగణయుతుల—హరీ!"
(ఛందో. 3—45.)

"ఏకోనాక్షర త్రిగణము విరతి, అంతరాక్కరకు" అనగా, మూడవ గణమున చివరి అక్షరమునకు ముందు విశ్రాంతి ఏర్పడును. మూడవ గణము చివరి యక్షరమున వళి నిలుచునని సారాంశము. (మనకు విశ్రాంతి పాటింపలేదు. వళి—అక్షరమైత్రి—మాత్రమే ముఖ్యము.) అనంతుని అంతరాక్కరకు ఉదాహృతి ఇది:

"ఇను డాకందును నింద్రు—లిద్దరును వాక్క
వనజ వైరియు గూడి—వైభవ మొనర్ప
గనక వప్రము నిగ్రహ—కైటభుని గొల్వ
రనుచు జెప్పుదు రంత—రాక్కర బుధులు"
(ఛందో. 3—43)

ఈ పద్యము "కర్ణాట చతుష్పద" (ఐదు మాత్రల గణములు మూడు, ఒక సూర్య గణము.) రీతిగాను, 'ద్విపద' రీతిగాను నడచినది (చివరి పాదము). రెండవ పాదము తేటగీతి రీతిగా గూడ నడచును. (ఒకటి, మూడు పాదములును తేటగీతివలె నడచునుగాని యతి పడలేదు.)

అనంతునకు తరువాతివారగు చిత్రకవి పెద్దనార్యుడును, అప్పకవియు ఇట్లే త్రిగణాంత వర్ణమున యతి నిలుప వలెనని చెప్పిరి.

ఆద్యుడగు 'కవిజనాశ్రయ' కారుడేమి చెప్పినాడో చూతము :

"ఇను డొకడు, సురేంద్ర యుగ + మిందుం డొక్కడుం
బొవరియుండ బ్రావళ్ల పూర్వంబు గాదు
ననగ, నాల్గింట—యతి—త్రి + కాం + త్యంబు వర్ణ
మనుప మానాంత రాక్క + రా + ఖ్యంబు రేచ!"
(కవిజ. జాత్య. 28; వావిళ్ల ప్రతి—1960,54 పు.)

"యతి నియమము పూర్వమువలె గాదు. మామూలు ప్రకారమైతే మూడవ గణారంభమున నుండవలసినది. దీని కిక్కడ అట్లుకాదు. నాల్గవ గణారంభమునగాని, మూడవ గణము చివరి యక్షరమునగాని యతి పడవచ్చును." అని అర్థము చెప్పదగునా? నాల్గవ గణారంభమున గూడ, చివరి రెండు పాదము లందు యతి నిలచియున్నది గదా! ఐతే, నాల్గింటన్—నాలుగు పాదములందును, మూడవ గణము చివరి యక్షరము యతియై యుండుననియు అర్థమగుచున్నది; లక్ష్యముతో సమన్వయించుచును ఉన్నది. కనుక, అర్థమింతే యని చెప్పుటకు వీలగుటలేదు.

(ప్రావళ్ల—ప్రాసము, వళులును. 'ప్రావళ్ల పూర్వంబు గాదు:' అనుచోట అన్వయ కాఠిన్య మేర్పడినది. ప్రాస నియమమున మార్పులేదు గదా! 'వళ్ల పూర్వంబు గాదు' అని ఏక దేశ సమన్వయము చేయవలసి యున్నది. "కాదు + అనగ" అను చోటను వ్యాకరణ దోషము నెలకొన్నది. కాదున్ = కాద నియు, అనగన్ = అనునట్లు—అని చెప్పవలసి యుండును.)

ఈపాఠమునకు పుట యడుగున పాఠాంతర మిట్లు న్నది :

"ఇన సురేంద్ర చంద్రంబు + లిప్పాట వచ్చి
పావరి యుండంగ బ్రావళ్ల + పూర్వ భంగి
నన, గణంబులు నాలుగిం + టం జెనంగ
ననుప మానాంత రాక్కర + మయ్యె రేచ"

మొదటి పాదమున త్రిగణాంతాక్షరయతి నిలచినది. తక్కిన పాదములలో నాల్గవ గణారంభములందు కుదిరినది. (పై రెండు పాదములందును నాల్గవ పాదమున మూడవ గణారంభమునను యతి చూపట్టుచున్నది.) ఈలక్షణము మిక్కిలి అస్పష్టముగా మన్నది.

["ఇన—సురేంద్ర—చంద్రంబులు, ఇప్పాటన్ = ఈవిధముగా (ఈ పాదమున కూర్చబడినట్లు) వచ్చి, ప్రావళ్ల పావరి యుండగ, పూర్వ భంగిన్ = మొదటి పాదము రీతితో, అన్ = అనునట్లు, గణంబులు = గణముల క్రమము (1 సూ + 2 ఇం + 1 చం) నాలుగింటన్ = నాలుగు పాదములందును, పెనంగ అనుప మానాంత రాక్కర మయ్యెను" అని అన్వయము చెప్పినప్పుడు, యతులను గూర్చి లక్షణ మేమియు తెలియుటలేదు. "అపూర్వ భంగిన్, అనన్, గణంబులన్ = గణముల మొత్తము లోపల, (ప్రా) వళ్ల, నాలుగింటన్ = నాల్గవ గణారంభమున, పెనంగన్" అని పదములతోడి అన్వయమును అంగీకరింత మన్నను మొదటి పాదమునకు మోసమగును. మూడవ పాదమున 'అనునాసి కాక్షర యతి' మార్గమున 'సరస' మైన 'అఖండ యతి' పడినది : "భంగి—నన గణంబులు నాలుగి + ంటం జెనంగ" ఇన్ని 'త్రిప్రాసము' లున్న పాఠాంతరమును సమర్థించుటకు వలను పడుటలేదు.]

మొత్తముమీద రేచన, యతిస్థానములను రెండింటినీ అంగీకరించెనా అను సందేహము కలుగుచున్నది.

త్రిగణాంతాక్షరమున యతి నిలిపినప్పుడు ఒక రకముగాను, చతుర్థ గణాదిని యతి నిలిపినప్పుడు మరొక రకముగాను నడక సాగుచున్నది. తేటగీతి, కర్ణాట చతుష్పద, ద్విపదలవలెగాక, అన్య విధముగా నడచు అంత రాక్కర పాదములు కొన్ని చూపుచున్నాను.

(1) "రవియు విద్ద రమర్త్య—రాజులును రాజ
నవన పుత్ర ఈ నాల్గు—పాదముల రాగ
నవని విరచింప నంత—రాక్కర యనంగ
నవును త్రిగణాంతవర్ణ—మయ్యతులు గాగ."
(లక్షణ సార సం. 2—107)

తొలి పాదము కర్ణాట చతుష్పద వలెనే నడచినది.

[ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి తృతీయ ముద్రణములో నాలుగవ పాదమునందు నాలుగవ గణారంభమున యతి (సరిపోవును) గుర్తింపబడినది. అదిప్పుడు తేటగీతివలె నడచును.]

చిత్రకవి పెద్దనార్యుడు దీనిని అక్కర లైదింటిలో కడపటిదిగా పేర్కొనినాడు. తక్కిన వారందరు దీనిని నాల్గవదిగానే చెప్పిరి. నాల్గవదిగా చెప్పబడుటయే సమంజసమని తోచుచున్నది.

(2) "భాను డిద్ద రాదిత్య—పతులు చంద్రుండు
పూని నాలుగు చరణ—ముల ద్రిగణాంత
మైన వర్ణంబు విరతి—నంత రాక్కరంబు
భాను శితాంశు నేత్ర—పద్మా కళత్ర"
(అప్ప 4—279)

ఇందలి రెండవ పాదము, యతివరకు కర్ణాట చతుష్పదవలెను, తరువాత ద్విపద వలెను నడచినది.

మూడవ పాదమున గణభంగము జరిగినది: "ఐన| వర్ణంబు| విరతి + నం| తరాక్కరంబు" ఇందు కడపటి గణము "జవాము"; చంద్ర గణములలో లేదిది. దీని కొక పాఠాంతర మిట్లున్నది :


"భాను డిద్దరాదిత్య + పతులు తమిస్రాపతియు
జాను మీర నీ నాలుగు + చరణములకు ద్రిగణాంత
మైన వర్ణంబు విరతి + నంత రాక్కరంబు
భాను శీతాంశు నేత్ర + పద్మాకళత్ర."

ఇందు తొలిమలి పాదములందు గూడ గణభంగ మేర్పడినది! ఇది పై దానిని మించిపోయినది!! దీనిని సవరించుట కంటె పై దానినే స్వీకరించుట సుఖము.

"ఐన వర్ణంబు విరతి + నం తాక్కరంబు"— ఛందోభంగము లేకుండ నిట్లు సవరణ చేయనగునేమో?—అని, పరిష్కర్తలు సూచించినారు. ఐతే, అంత రాక్కర—'అంతాక్కర' అయినది! ఒక లోపము సవరించబోయిన మరొక వెత్తి ఏర్పడినది. 'అంతరాక్కర' అనియే చెప్పినారు గాని, అంతాక్కర యని వాడుక లేదు. అర్థ మొకటే యున్నను, వ్యవహార ప్రతీతి బలవత్తరము గదా! "ఐన లిపి నడి నంత + రా క్కరము దగు" అని సవరించిన పేరు కుదురునుగాని అదన ప్రసంగమ్మైన 'తగు' వచ్చి పడినది!

తేట గీతి, కర్ణాట చతుష్పద, ద్విపద మొదలగువాని నడవడులను పుడికి పుచ్చుకొన్న ఈ పద్యము, ప్రయోగమున మరింత వ్యాప్యము చూపగలదని తలంతుము. రససిద్ధులైన కవీశ్వరులు ఈ యక్కరను గుర్తించి దీని అంతరమో, అంతమో చూతురు గాక!




విశ్వావసు ఉగాదికి MSC వారి విశేష కానుక
తెలుగు సాహితీ సౌరభ, సౌందర్యాలకు వాచవి
అసలు తెలుగులిపి ముడిసరుకుగా మొదలైన నాటినుంచి ఆధునిక యుగందాకా సుమారు 2000 ఏండ్ల సాహిత్యాన్ని-అందికగా, పొందికగా పన్నెండు సంపుటాలలోకి కుదించి....
ఏ పాఠకుడికైనా - సాధారణ పాఠకుడు గావి, సాహితీపరుడుగాని - సమగ్ర ఆంధ్ర సాహిత్యంతో సన్నిహిత సంబంధం ఏర్పడాలని....
ప్రాచీన, నవీన సాహిత్యాలలో ప్రామాణికంగా ఆరితేరి, ప్రజాకవిగా, ప్రజారచయితగా ప్రజాసామాన్యంలో పటిష్ఠ ప్రతిష్ఠ సంపాదించుకొన్న సవ్యసాచి సాహితీ మూర్తి శ్రీ ఆరుద్ర నిర్వహిస్తున్న....
సమగ్ర ఆంధ్రసాహిత్యం
మొదటి సంపుటం
చాళుక్య యుగం
ఆరుద్ర
చెప్పుకోదగ్గ కవుల కథలూ, వారి కావ్యాల సౌందర్య, సౌరభాల వివరణ ·
సాహిత్య ప్రాడ్వివాకుడు డా॥ రాజమన్నారు గారి ఉపోద్ఘాతంతో
పన్నెండు సంపుటాలలో
రమారమి 3000 పుటలు
పాఠకప్రజా సామాన్యానికి విశ్వావసు ఉగాది కానుకగా యం. శేషాచలం అండ్ కో ముద్దుగా, ముచ్చటగా ప్రచురణగావించి.... క్వాలిటీలో అట్టలో, కంటికింపైన కూర్పు తీర్పులో....
మార్చి, 66
ఫిబ్రవరి, 66
జనవరి, 66
డిశంబరు, 65
నవంబరు, 65
అక్టోబరు, 65
సెప్టెంబరు, 65
ఆగస్టు, 65
జులై, 65
జూన్, 65
యం. శేషాచలం అండ్ కో
మచిలీపట్టణము, సికిందరాబాదు, మద్రాసు.

అధికార భాషా సమస్య

శ్రీ తెన్నేటి విశ్వనాథం

భారతాధికార భాషా సమస్య సమగ్రముగ అర్థము కావలెనని అంటే, సంవిధానమందును, శాసనమందును ఏది గలదు, దాని అర్థమేమి, అర్థము ప్రకారము అమలు జరిగినదా, జరిగినట్లయిన జగడమెందుకు, జరగకుంటే దాని బాధ్యత ఎవరిది, దాని సవరణ చేసుకునే పద్ధతి ఏమిటి ?- ఈ వివరములన్నీ మనము తెలిసికోవలెను.

ఏది ఎలాగు ఉన్నా, ఆచరణలో మాత్రము దేశముయొక్క సమైక్యానికి ఎట్టి భంగము రానివిధముగ ప్రభుత్వాదరణ ఉండవలెను అన్న సూత్రము సర్వ జనాంగీకార మైనది.

సంవిధానము:— (1) ఇండియా అనగా భారత దేశములోగల 'రాజ్యముల' (స్టేట్సు) యొక్క కూటమి (యూనియను). ఇది మన దేశముయొక్క రూపము.

ఇక మన యూనియను ప్రభుత్వము వాడవలసిన భాష విషయంలో ఈలాగు ఉన్నది.

అధికార భాష:- 343 (1) యూనియను యొక్క అధికార భాష హిందీ. లిపి దేవనాగరి.

అధికార వ్యవహారములందు వాడవలసిన అంకెలు (స్వరూపము) అంతర్జాతీయముగ వాడబడుచున్న ఇండియను అంకెలు (స్వరూపము).

ఈ రెండు విధులున్నూ, శాశ్వతమైనవి. అయితే ఇంతవరకు ఇంగ్లీషు భాషలో వ్యవహారము జరుగుతూంది. వెంటనే హిందీలోకి మారడమనేది కుదరదు కాబట్టి ఈవిధంగా తరువాత విధిలో చెప్పారు.

343 (2): అయినప్పటికి సంవిధానము అమలుపరిచిన తేది లగాయితు పదిహేను సంవత్సరములవరకు (అనగా జనవరి 26, 1965) ఇంగ్లీషు భాష ఇతఃపూర్వము ప్రభుత్వ వ్యవహారమందు ఏలాగు వాడుకలో ఉన్నదో అలాగు వాడుకలో ఉండగలదు.

ఈ పదిహేను సంవత్సరముల గడువు, అనుభవమునుబట్టి తక్కువ అని నిర్ధారణ అయినది. లోకజ్ఞానము గలిగినవారు, ప్రభుత్వాధినేతలైనవారు గ్రహించవలసిన విషయము.

సంవిధానము అమలులోనికి వచ్చిన అయిదేండ్లకు పార్లమెంటు ఒక విచారణ సంఘము వేయాలనిన్ని, హిందీ ఎంతవరకు ముందుకు సాగినది అన్న విషయము విచారించవలెననిన్ని, పదిహేనుగురు పార్లమెంటు సభ్యులుగల ఒక సంఘము పై విచారణ సంఘము చేసిన సిఫార్సులను పరిశీలించి హైకోర్టులు శాసనములు మొదలుగాగల వాటికి ఏ భాష వాడవలెనో, హిందీ ఎంత వరకు ఏకాధికార భాషగ వాడుటకు వీలగును అన్న విషయములపై రాష్ట్రపతికి తమ సలహాలు ఇవ్వవలెను అనిన్ని 344 వ విధియందు వ్రాయబడినది. ఇందులోగల చర్యలు అన్ని సక్రమముగనే జరుపబడినవి. అయితే ప్రతిమారు కూడ మెజారిటీ వోటు పైనే నిర్ణయములు జరుగుతూ వచ్చినవి కాని సర్వ సభ్యాంగీకారముపయిన కాదు.

పై విధులలో ఈలాగ ఉన్నప్పటికీ కూడ ఎందుకైనా మంచిదని, సంవిధాన ప్రారంభానంతరము పదిహేను సంవత్సరాల వరకే ఇంగ్లీషు ఉండగలదని వ్రాసిన పిమ్మట దూరదృష్టితో ఈ దిగువ ప్రకారము 343 (3) విధి వ్రాశారు.

> 343 (3) : పై విధితో చెప్పినది ఎలాగు ఉన్నను, పదిహేను సంవత్సరముల తరువాత కూడ ఇంగ్లీషుభాష అధికార భాషగ అమలులో ఉండ గలదు అనే శాసనమును చేయుటకు పార్లమెంటుకు అధికారము ఇవ్వడమైనది.

ఈ విధియే సంవిధానమందు లేకున్న మనము ఎంత బాధపడేవారమో తెలియదు. హిందీకి బంగళా దేశములో కొంతవరకు, ఆంధ్రదేశములో మరికొంతవరకు, తమిళ, కేరళ దేశములలో అంతకన్న హెచ్చుగ వ్యతిరేకత ఉండి ఉన్నది.

లక్ష్యము సరిఅయినది అయినను మార్గము అపసవ్యముగుటయే ఈ వ్యతిరేకతకు కారణము. 1965 వ సంవత్సరము రాక మునుపే ఏడేండ్ల ముందుగనే దక్షిణదేశములోగల కొన్ని కేంద్ర ప్రభుత్వోద్యోగములకు దరఖాస్తులు పిలిచినప్పుడు వారికి హిందీ జ్ఞానము అవసరమని చెప్పడమూ, మనిఆర్డరు ఫారాలు మొదలైనవి దక్షిణ దేశాలలో హిందీ భాషలో అడుగున మడుగున పంపించడము, తరువాత హిందీ రాని వారికి ఇంక్రిమెంట్లు ఆపుదల చేయడము మొదలయినవి జరుగుతూవచ్చాయి. తెనుగు, తమిళము రానివారు తెనుగు దేశమును, తమిళ దేశమును పరిపాలించ గలిగినపుడు హిందీరానివారు ఎందుకు పరిపాలించలేరు? అధికారభాష కేవలము ఉత్తరాదివారు అధికారము తమ హస్తగతము చేసికొనేందుకు చేయుచున్న ఒక పెద్ద ఎత్తు ఏమో అని ఒక పెద్ద అపోహ కలిగినది. ఎటొచ్చి ఈ విషయములో తమిళులు ముందు మేలుకొన్నారు.

అపసవ్య మార్గము సవ్య లక్ష్యములకు చేర్చదు అన్న ఆరోక్తి, మహాత్మాగాంధి చెప్పిన సూక్తి హిందీవాదులు, భారత జాతీ

యంతా సముద్ధరణానక్తులు గ్రహించిన వ్యవహారములు చక్కబడగలవు.

ఏకమైన భారత దేశానికి ఏకమైన అధికార భాష ఉండవలెను అన్న సూత్రము సర్వ జనులు అంగీకరించినది. అయినను సమస్య క్రింద ఎందుకు పరిణమించినది? పదమూడు పళ్లు రావడానికి తగిన పేక ముక్కలు చేతిలోగల బిడ్డ ఆటగాడు, తెలివైనవాడు కాకుంటే, ఏలాగో అలాగ ఆరు పళ్లు తెచ్చికొని చచ్చి చెడి బయట పడుతాడు. ఆ అవస్థయే మన భారత దేశము యొక్క ప్రభుత్వమునకు పట్టినది. అందుచేత అవతల బెంగాలు మొదలుకొని క్రింద కన్యాకుమారి వరకు ఒక వినాశకరమైన స్థితి బయట పడినది. భారత దేశమునకు అధికార భాష హిందీ అని మన సంవిధానములో 343 (1) విధిలో ఉండనే ఉన్నది. అయితే (2) వ విధిలో ఇంగ్లీషుభాష 1965 సం. వరకు మాత్రము వాడకములో ఉండగలదు అని ఏ కాలపరిమితి చెప్పి ఉన్నదో ఆ కాలపరిమితి ఇంగ్లీషునుండి, హిందీలోకి మారుటకు సరిపోదు అన్న విషయము ఆనాడు మన పెద్దలుగాని, మనముగాని గుర్తించలేక పోతిమి. ఒకరి నొకరు అనుకొని లాభము లేదు. అది అందరియొక్క తప్పు. ఇంగ్లండులో రోమను రాజ్యము పోయిన వేయి సంవత్సరముల వరకు ఉద్గ్రంథములన్నియు లాటినులోనే వ్రాస్తూఉండేవారు.

ఈ విషయము జవాహరులాల్ నెహ్రూగారికి 1957 లో చెన్నపట్నము వచ్చినపుడు బోధపడి, ఆయన వెంటనే ఇంగ్లీషు అవసరమయినంత కాలము నడవగలదు అని మాట ఇచ్చారు. 1959 సంవత్సరములో పార్లమెంటులో ఆ విషయమే వివరించారు. దానిని పురస్కరించుకొనే, 1963 లో మన సంవిధాన శాసనములో మార్పుచేయ నక్కరలేకుండ అధికార భాషా సమస్యను పార్లమెంటు ఆమోదించినది.

అందులో నెహ్రూగారు, మిగిలిన పెద్దలు కూడ చెప్పినది:

(1) సంవిధానములో 343 (1) విధివల్ల హిందీ భాషేతర రాజ్యాలలోని వారికి అధికార భాష విషయమునగాని, భారత ప్రభుత్వము అధీనములో ఉన్న ఉద్యోగముల విషయములోగాని ఎట్టి ఇబ్బంది, అనర్హతలు ఉండజాలవు అని గట్టిగా నిర్వచనము చేశారు. (2) దానికి తగిన రీతిగ 1965 జనవరి 26 వ తేది అనంతరము ఇంగ్లీషు భాష, అదనమైన అధికార భాషగ ఉండును అని శాసనము చేశారు.

రాజనీతిలో శుద్ధజ్ఞానముకన్న లోకజ్ఞానము హెచ్చుగ కావలెను. నెహ్రూగారు 1957 లో, 1959 లో, 1963 లో గ్రహించారు. అధికార భాషా శాసనాన్ని చేయించారు. తరువాత పెద్దలు హిందీ అత్యభిమానుల చేతిలో పడ్డారు.

అయితే అల్లరులు ఆగిన తరువాత ప్రస్తుత ప్రధానిగారు పట్టవలసిన మార్గము

గ్రహించారుగాని, గ్రహించినదానిని శాసన బద్ధము చేయుటకు ఆలస్యము చేయుచున్నారు. ఇంకను సమావేశములు వాయిదాలు జరుగుచున్నవి.

ఈ విషయములో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము త్రొక్కిన మార్గము ఇప్పటివరకు సరి అయినది; సంతోషకరమైనది. తదనుసరణముగ

(1) యూనియను అధికార భాష హిందీ.


(2) హిందీ భాషేతర ప్రదేశాలలో ఇంగ్లీషు కూడా హిందీకి ప్రత్యామ్నాయ భాషగ వాడవచ్చును.

(3) ప్రదేశములందు ఆ ప్రదేశ భాషలు అధికార భాషలు.

(4) ఇంగ్లీషులో సమానముగ హిందీ అన్ని ప్రదేశములందు అర్థమయే వరికి విద్యా విధానము, న్యాయ స్థానముల భాష, ఇండియా శాసనము భాష యావత్తు మన అధికార భాషలలో జరుగవలెను.

ఈ పై సూత్రములు ఆచరణీయములు, దేశీయ సమైక్య సాధనములు, ఆత్మగౌరవ ప్రదములు, లోకజ్ఞాన ప్రతిష్ఠితములు.





వెండితెర నవల వెల ఒక రూపాయి, ప్రతులకు శ్రీ వెంకటసాయి పబ్లికేషన్స్, మద్రాసు-17.

పక్కింటిగౌరి

శ్రీ గోవిందరాజు శ్రీనివాసమూర్తి

తనకు అరవైయేళ్లు నిండాయని రిటైరైన రోజున తెలిసింది ముకుందరావుకు. ఈ అరవైయేళ్ళజీవితంలోనూ "ఫలానారోజు నీ పుట్టినరోజు" అని గుర్తు చేసినవాళ్లు ఎవరూ లేరు. ఆయన పెళ్ళి చేసుకోలేదు. "ఎందుకు చేసుకోలేదు?" అని ఆయనను ఎవరైనా ప్రశ్నిస్తే చిరునవ్వుతో "పిల్లనిచ్చే వాడు కనుపించలేదు" అని జవాబిస్తాడు. ఆ చిరునవ్వు వెన కాల ఒక విషాదం ఉంది. వారాలు చేసి చదువుకుని లా పరీక్ష ప్యాసయిన రోజున ముందుముందు జడ్జి అవుతానని చిన్న అనుమానం కలిగినా పెళ్ళిచేసుకుని ఉండునేమో! వారాల చదువు వాడికి పిల్లనిచ్చినవాడు కనుపించలేదు అపాడు. జడ్జి అయిన తర్వాత ఒక్కొక్కప్పుడు ఆయనలో ఆ కుతూహలం కలిగినా, తన వయస్సు గుర్తుకువచ్చి సిగ్గేసేది. "వెర్రి ఆలోచనలు!" అని పించేది.

ఏమైతేనేం ముకుందరావు జీవితమంతా బ్రహ్మచారి గానే గడిపేశాడు. ఇంకా ఏంచూసుకొని బతకాలనో, జీవిత మంటే యూవ చావలేదు. రిటైరుకాగానే ఆయన చేసిన మొద టిపని, ఊరిచివరగావున్న నరసింహమూర్తిగారి మేడ కొనటం. ఈ మేడ కొనేందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి : ఊరికి దూరంగా ఉండడం, ప్రకృతీ, మేఘాలూ, చంద్రుడూ, వెన్నెలా గట్రా విచ్చల విడిగా అనుభవించాలన్న దురాశ. రెండు: నరసింహమూర్తిగారి మనమరాలి పొరుగుగా ఉండవచ్చున్న ఆశ. డబ్భైవేలూ ఇచ్చేసి ఇల్లు తనపేర రిజిస్టరు చేయించుకున్నాడు ముకుందరావు.

డబ్బైవేల ఇంటిని ఖాళీగా ఉంచితే బోసి కొడుతుందని కుర్చీలూ, టేబుళ్లూ, సోఫాలూ పుష్కలంగా సరఫరా చేయిం చాడు ఇంటికి. అందంగా అలంకరించేందుకు నరసింహమూర్తి గారి మనమరాలి సాయం కోరుదామనుకున్నాడు కాని, ఆరోజు ఆమె ఊళ్ళో లేదు. మొగుడూ పిల్లలతో కలిసి ఢిల్లీ వెళ్ళిందట. మరోవారం రోజులకు గాని రాదట. పిల్లలనేప్పటికి గుండె గుభిల్లుమంది ముకుందరావుకు. ఆయన ఈ అరవైయేళ్ళ లోనూ దేన్నైనా అసహ్యించుకున్నాడంటే—అది ఈ "క్రూరు కుంకల". ఒకరోజు ఒకస్నేహితుడి ఇంటికి వెళ్ళి ఆయనతో మాట్లాడుతున్నాడో లేదో "ఓ క్రురవెధవ" టమటమాల బండి తనముందు నుంచి ఈడ్చు కెళ్ళాడు. "బాబూ, అవరా నాయనా" అంటే విన్నాడుకాదు. "వెధవా, అవు" అంటే మరీ టమటమ అనిపించాడు. ఆయనకు వినుగెత్తి ఆబండీ తీసి కిటికీలోంచి అవతల పారేశాడు. ఆస్నేహితుడు ఏం దిక్కు మొహం వేశాడోననికూడ చూడకుండా ఇంటికి తిరిగివచ్చేశాడు. అంత చిరాకు పిల్లలంటే.

పక్కింట్లో పిల్లలున్నారని ముందే తెలిసుంటే ఈ ఇల్లు కొనకపోను. కాని నరసింహమూర్తిగారి మనమరాలు ఆ మేడమీద మమకారం పెంచింది. ఆపిల్లని పదేళ్ళ వయస్స ప్పుడు చూశాడు. తెల్లగా, సన్నగా, గులాబిరేకులా ఉందాపిల్ల. అల్లరి చేసే ఘటంలా లేదు. దీపాల్లా వెలిగిపోతున్న ఆమె కళ్ళ అతణ్ణి ఆకర్షించి ఉండవచ్చు. అబ్బో, ఇప్పటిమాటా—పది హేనేళ్ళయింది! ఇప్పుడు ఆపిల్ల తన పొరుగింటిది. ఇప్పుడెలా ఉందో చూడాలి.

ఇల్లు సర్దటం ప్రారంభించాడు ముకుందరావు. వెంకటేశ్వర్లు సాయపడుతున్నాడు. వెంకటేశ్వర్లంటే ఆయ నకు వంటచేసి పెట్టేవాడు; ఒక్కొక్కప్పుడు ఆయన అనుంగు మిత్రుడు.

కుర్చీలూ, టేబుళ్లూ సర్ది గోడకు పటాలు కొడు తూంటే ముకుందరావు "అలా వంకరగా కొట్టి ఏడవకు. రేపు గౌరి చూస్తే నవ్వుతుంది." అన్నాడు. అని ఆయనే టేబిలెక్కి పటాల్ని జాగ్రత్తగా అమర్చాడు. పటాలంటే ప్రకృతి దృశ్యాలు కావు. అందమైన తారల బొమ్మ లంతకన్నా కావు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా — ఆయ నెవరో పెద్ద లాయరుట, ఇంగ్లీషువాడు, ఆయనదొకటి—వీటన్నిటి కన్న పెద్ద ఫోటో స్వామి శ్రీ వివేకానందుడిది—అంతకన్న కొద్దిగా చిన్నది రామకృష్ణ పరమహంస—ఒక గుమ్మంపైన వెండితోచేసి చెక్క

మీద పొందుపరచిన హనుమంతులవారి విగ్రహం— ఇదీ ఆయన డ్రాయింగురూము. హనుమంతుడి బొమ్మ చూస్తే వెంకటేశ్వర్లుకి చచ్చేనవ్వు. వాడికీ పెళ్ళి కాలేదు. ఒకరోజు ముకుందరావు హుషారుగా ఉండటం చూసి "ఈ బొమ్మని అవతల పారేస్తేనేగాని మనకి పెళ్ళిగాదు.:" అన్నాడు. మండిపడిపోయాడు ముకుందరావు. వెంకటేశ్వర్లు వణికిపోయి "అబ్బెబ్బె, మనకి అంటే "నాకు" అని సమర్థించుకున్నాడు.

మేడమీద బెడ్‌రూం పక్కన స్టడీరూమ్ ఏర్పాటు చేసుకున్నాడు ముకుందరావు. బీరువాలనిండా పుస్తకాలే. ఇవన్నీ ఎప్పుడు చదివానా అని ఆశ్చర్యం వేస్తుంది ఆయనకు. ఈ బీరువాల మధ్యన, ఈపుస్తకాలమధ్యన, ఒకటేబిల్—దానిముందు ఒకకుర్చీ—ఇక్కడా ఆయన తన 'ఆత్మకథ' మొదలుపెట్టేది.

తన 'ఆత్మకథ' రాసుకోవాలని ఇప్పటికి పదేళ్ళుగా ప్రయత్నిస్తున్నాడు ముకుందరావు. ఇదిగో ఇవాళంటూ, రేపంటూ రిటైరై కూచున్నాడు. ఇప్పుడన్నా రాయలేకపోతే జీవితం నుంచే రిటైరై పోతానని భయంపట్టుకుంది. 'ఆత్మకథ' తనకోసం కాదు. అచ్చు వేయించి బజార్లో అమ్మించాలని ఆయన అభిలాష.

రాత్రి వెంకటేశ్వర్లు వంట కమ్మగా భోంచేసి మేడ మీదకు వెళ్ళి ఆకుర్చీలో కూర్చుని తనకథ మొదలెట్టాడు ముకుందరావు.

వెంటనే ఆయనకు ఓ అనుమానం పట్టుకుంది. కలం ముందుకు కదల్లేదు!

ఎంత వెదికి చూసినా తన జీవితంలో ఒక్కమధుర ఘట్టం కూడ లేదే. మధురఘట్టం లేకుండా ఏ ఆత్మకథేనా ఎలా రాణిస్తుంది?......వారాలు చేసుకుని చదివి లా పాసై, ఉద్యోగం దొరక్క నానా అవస్థలూ పడి అరవై రూపాయలకు ఒక లాయరు వద్ద కుదిరి నలభై యేళ్ళవరకూ నరకం చూసిన తన కథ ఎలా గుబాళిస్తుంది? నలభై యేళ్ళ పైబడి ఏవో నాలుగు రాళ్ళు సంపాదించాడు. తర్వాత అదృష్టం కలిసొచ్చి జడ్జి అయ్యాడు—అది వేరే సంగతి. కాని తను నరకంలో ఉండగా యువ్వనం తనను చూచి నవ్వింది; వికృతంగా వికటాట్టహాసం చేసింది. తనకు స్తోమత కలిగినప్పుడు యువ్వనంమీద కసితో పగతీర్చుకుందా మనుకున్నాడు. కాని వయస్సు మృత్యు దేవతలా అడ్డునిల్చింది. ఆఖరకు ఆయనకు మిగిలింది లోకం మీద కసి!

"నా కథను చదివి ఏ పాఠకుడు సహిస్తాడు! కనుక ఏదో కాస్త కల్పించి రాయాలి. సుందరిని గురించి ఒక ఇరవై పేజీలు రాస్తే బాగుంటుందేమో!"

సుందరి అప్పట్లో తనతోటి లాయరు భార్య. అందకత్తె కాకపోతే ఆపేరు ఇప్పుడు గుర్తుకు వచ్చేదికాదు. ఆమెను ఒకమాటు చూసింతర్వాత ఐదారేళ్ళు ఆమె రూపమే క్షణ క్షణానికి ఎదుట నిల్చేది.

కలం పక్కన పెట్టి సుందరిని గురించి ఆలోచించటం మొదలెట్టాడు ముకుందరావు. ఏ అర్ధరాత్రో పక్కమీదకు చేరాడు.

తర్వాత వారం రోజులూ ఇలాగే అయింది. 'ఆత్మకథ' కుంటుపడుతుందేమోనని భయంపట్టుకుంది ఆయనకు

ఒకరోజు పొద్దుటే కాఫీతాగి మేడమీద వరండాలో ప్రకృతి అనుభవిస్తున్న ముకుందరావు చెంగున గంతువేశాడు. పక్కింటి గౌరివాళ్ళు వచ్చారల్లేఉంది— ఇల్లు సందడిగా ఉంది. గిన్నెల చప్పుడు వినిపిస్తున్నది. ఆయన మనసు ఆనందంతో నిండింది. వెళ్ళి చూద్దామనుకున్నాడు. కాని ఆపిల్ల గుర్తు పడుతుందో లేదో! అయినా తను జడ్జి. తనంతవాడు ఒక సామాన్యురాలింటికి వెళ్ళడానికి అహం అడ్డొచ్చింది. మధ్యాహ్నం నరసింహమూర్తి రాకపోతాడా, ఆపిల్లా, దాని మొగుడూ తనింటికి రాకపోతారా!

కాని రెండు రోజులయినా నరసింహమూర్తి అయిపు లేడు. ఇదివరలో అప్పుడప్పుడు కనుపించేవాడు. మరేం జబ్బో ఈ ఇంట్లోకి వచ్చింతర్వాత మళ్ళీ కనుపించలేదు. పోనీ, కబురుపెడితే—అందుకూ మనసు అంగీకరించలేదు.

ఆరోజు సాయంత్రం మబ్బుగా ఉంది. చల్లటిగాలి వీస్తున్నది. ముకుందరావులో హుషారు పెల్లుబికింది. "మంచి వాతావరణం, ఏమైనా సరే కథ మొదలెట్టాలి." టేబిల్ ముందుకు కుర్చీలాక్కుని చేతులోకి కలం తీసుకున్నాడు.

కెవ్వు మన్నకేక, భోరున ఏడుపూ—గతుక్కుమన్నాడు ముకుందరావు. గబగబ వరండాలోకి వచ్చి పక్కింటి దొడ్లోకి చూశాడు. రెండేళ్ళపిల్ల కెవ్వున ఏడుస్తున్నది. ఐదేళ్ళ కుర్రవాడు చిన్నకర్రతో దానినెత్తిన కొడుతున్నాడు. అది ఏడుపు ఆపదు. వీడు కొట్టడం మానడు. ఆ ఇంట్లోవాళ్ళు ఏమై పోయారో ఎవరూ బయటకురారు. ఆ గౌరి ఏమై పోయిందో? "దానిల్లు బంగారం కానూ, మూడు రోజులాయె, ఇంతవరకూ కనుపించక పోయె."

ఈ కుర్రకుంకల అల్లర్లతో, ఏడుపులతో, తన కథ ఎలా సాగుతుందో అర్థం కావడంలేదు ఆయనకు. వీళ్ళను ఒక అదుపులో పెట్టకపోతే లాభంలేదు. అబ్బెబ్బె, పిల్లలా! పిశాచాలా! ఈ పిల్లల్ని పుట్టించిన భగవంతుడంటే పళ్ళు మండింది ఆయనకు.

తిరిగివచ్చి టేబిల్‌ముందు కలంపట్టుకుని కూచున్నాడుకాని ఆ రెండేళ్ళ పిశాచి ఏడుపు ఇంకా వినిపిస్తూనే ఉంది. కుర్రవెధవ కాకిగోల చేస్తున్నాడు. "ఎలా రాసి చచ్చేది?"—విసుగుతో కలాన్ని విసిరి టేబిల్ మీద కొట్టాడు. వెంటనే ఒక ఆలోచన కలిగింది. కలం తీసుకుని చిన్న చీటి రాశాడు.

"గౌరమ్మకు,

నీ పిల్లల్ని కాస్త అదుపులో పెట్టు. ఏదో రాసుకుంటున్నాను. నీ పిల్లల అల్లరి మూలంగా కలం కదల్టంలేదు. మరేమనుకోకు."

ఈ చీటి వెంకటేశ్వర్లుకు ఇచ్చి పంపాడు. ఏం జరుగుతుందో చూదామని వరండాలోకి వచ్చాడు. వెంకటేశ్వరు ఆచీటి ఇవ్వడం మాత్రమే కనుపించింది. వెంకటేశ్వర్లు తిరిగివచ్చిన అయిదు నిముషాలకు గౌరి దొడ్లోకి వచ్చింది. పదిహేనేళ్ళ తర్వాత ఆమెను చూడటం ఇదే ప్రథమం. తనూహించిన గౌరిలా లేదు. బాగా ఎదిగి పోయింది. పచ్చగా, బొద్దుగా దబ్బపండులా ఉంది. ఆమె కేసే కన్నార్పకుండా చూస్తున్నాడు ముకుందరావు.

"అల్లరి చేయకండి నాన్నా, లోపలికి రండి."—మృదుమధురంగా ఉంది ఆమె కంఠం. మాతృత్వంతో మూర్తీభవించి ఉందామె. ముకుందరావు మనసు ఆనందంతో నిండి పోయింది. తనంటే ఎంత గౌరవం!

"పక్కన తాతగారు ఏదో రాసుకుంటున్నారుట—పిల్లలాడుకునేప్పుడే రాసుకోవాలి కాబోలు—లోపలికి పదండి."

ముకుందరావు ముఖంమీద ఎవరో బలంగా గుద్దినట్టయింది. ఈ వాక్యం తన నుద్దేశించే. "హమ్మ—ఎంత పొగరు!"

ఆమె అందం సంగతి మరచి పోయాడు. వళ్ళు రవరవ మండిపోయింది. విసురుగా గదిలోకి వచ్చేశాడు.

"ఆమె ఉద్దేశం ఏమిటి?—అనలేమిటంట, ఆమె ఉద్దేశం, అనలేమిటని—హమ్మా—పిల్లలాడుకునేప్పుడే రాసుకుంటున్నానట. హు, నేను రాసుకుంటున్నప్పుడే ఆడుకుని ఏడవాలి కాబోలు! గొంతు పిసికి అవతల పారేస్తేసరి. నేను జడ్జి అన్నా గౌరవం లేకపోయె—హమ్మా!"

ఆయన చేతులు కోపంతో గజగజలాడి పోతున్నాయి. పిల్లలు ఎంత భయంకర వ్యక్తులో నిరూపిస్తూ తన ఆత్మకథలో రెండు అధ్యాయాలు రాసి పారేయాలని నిశ్చయించుకున్నాడు. కాని ఎంత తన్నుకు చచ్చినా తన చిన్నతనం గుర్తుకు రాలేదు. తను అల్లరి చేసినట్టు అసలు గుర్తుకు రావటం లేదు.

"ఒకవేళ మహా అల్లరి చేసినా, ఇదిగో, ఈ కుర్రకుంకల లాగే చేసుంటాను."

కలం చేతులోకి తీసుకుని గబగబ ఓ ముప్పై పేజీలు రాసేశాడు. అక్కడితో తన బాల్యదశను గురించి రాయటం అయింది.

ఆరాత్రి బయట వెన్నెల విరగ గాస్తున్నది. పదకొండైనా ముకుందరావుకు నిద్ర పట్టటం లేదు. ఆ ముప్పై పేజీలు కాక మరో ఇరవై పేజీలు రాశాడు అప్పటికి. చేతి వేళ్ళు జివ్వున లాగుతున్నాయి. అదీకాక ఎందుకో గబుక్కున సుందరి గుర్తొచ్చింది. ఆమె గుర్తొచ్చిన రాత్రి పడుకుని తెల్లారి చూసుకుంటే కళ్ళు చింతనిప్పుల్లా ఉంటాయి, ఎంచేతనో?

వరండాలోకి వచ్చాడు. పక్కింటి దొడ్లో సిమెంటు పాపమీద ఆ గౌరే గాబోలు మొగుడి వళ్ళో వాలుంది. ముకుందరావుకు వళ్ళు గగుర్పొడిచింది." ఛీ, ఛీ—ఏం పనులు నడిబజార్లో!"—అది నడిబజారు అవునో గాదో అతడికే తెలియాలి.

కాని ఆదంపతుల ఆలింగనాల్లో అతడి మనసు వెర్రి ఆనందంతో ఉరకలు వేసింది. జీవితంలో ఏదో ముఖ్యమైన వస్తువు కోల్పోయిన వాడిలా బాధపడ్డాడు. వివాహం చేసుకోలేదు కాబట్టి తన గార్హస్థ్య జీవితాన్ని గురించి ఏమని రాసుకుంటాడు తనకథలు? కనీసం తనకథ కోసమైనా వివాహం చేసుకుని ఉండాల్సింది. పాతికేళ్ళకుపైగా తనవద్ద పడున్న హనుమంతులవారి విగ్రహం అంటే చిరాకు కలిగింది. "రేపు నిజంగానే ఆ బొమ్మను అవతల పారెయ్యాలి!"

ఇహ మిగతారాత్రంతా అటువంటి ఆలోచనలే.

మర్రోజు సాయంత్రం కింద బాత్ రూములో స్నానం చేస్తూంటే పూలమొక్కలకు నీళ్ళు పోస్తూన్న గౌరి కనుపించింది. బాత్‌రూం పైభాగంలో కట్టిన 'మెష్' లోంచి అవతలి దొడ్డి పూర్తిగా కనుపిస్తుంది. తను ఎవరికీ కనుపించడు. కాళ్ళు పైకెత్తి మెడసారించి చూడటం మొదలెట్టాడు. గౌరి ఎంత అందంగా ఉందని!—మేనక, తిలోత్తమ, రంభను గురించి చదివాడేగాని ఈరోజు తన కళ్ళతో తాను చూస్తున్నాడు. అవతల కుర్రవాళ్ళ కేరింతాలు అసలు వినిపించడం లేదు అతడికి. రెండు నిముషాల్లో ఇంట్లోకి వెళ్ళి పోయింది గౌరి.

తువాలు నడ్డికి చుట్టుకుని మేడమెట్లు ఎక్కుతూంటే తను రిటైరైన జడ్జి నన్న సంగతి గుర్తొచ్చింది అతడికి. తను చేసింది ఎంత అసహ్యకరమైన పనో తలపువచ్చి సిగ్గుతో కుంచించుకు పోయాడు.

"ఛీ—నాకూ, ఓ కాలేజీ కుఱ్ఱాడికి తేడా ఏమిటి?"

ఆరోజు రాత్రి భోజనం చేసి తనకథలోని నాలుగో అధ్యాయం ఇలా మొదలెట్టాడు:

"మూడు అధ్యాయాలు రాసికూడ నాభార్యపేరూ, ఆమెతో నా జీవితం గురించి రాయటం మరచిపోయాను. చచ్చి ఏలోకాన్న ఉన్నదో కాని ఈనాటికీ నావెన్ను చరిచి నాజీవితాన్ని దిద్దుతూనే ఉన్నది. నాకు వెలుగు చూపిస్తూనే ఉన్నది. అమృతంలాంటి ఆమె మనస్సు, ఈనాటికీ నాకు లోకంమీద తీపిని పెంచుకోవడం నేర్పింది. ఆమెపేరు సుందరి. వెన్నెలలో పిమెంటు సోఫాలమీద, ఆమె నాకు చెప్పిన కథలు ఈనాటికీ నాకు వెలుగుబాటలు. పూల మొక్కల్నిసైతం తన పిల్లలుగా చూచుకునే ఆ వనదేవతని ఇన్ని పేజీలు రాసికూడ ఎలామరచి పోయినానో అని విచారం కలుగుతున్నది............................"

ఈ విధంగా సాగిపోయింది రచన. రాత్రి ఒంటి గంటకు మరో నంభై పేజీలు ముగించి, ఆవులించి పక్కమీదకు చేరాడు ముకుందరావు.

మఱ్ఱోజు సాయంత్రం పక్కదొడ్లో ఏడెనిమిది మంది పిల్లలు స్వైర విహారం చేస్తున్నారు. ఒకడు చెట్టెక్కి కొమ్మలు గలగల ఊపేస్తున్నాడు. ఇద్దరు పిల్లలు క్రికెట్ ఆట ఆడుతున్నారు. ఆ రెండేళ్ళపిల్ల కేరింతాలు కొడుతున్నది. ముకుందరావు కోపంతో గజగజలాడి పోతున్నాడు.

ఇంతలో ఆ కుఱ్ఱవాళ్ళ ఆడుతున్న బంతి ఎగిరి వచ్చి తన దొడ్లో పడింది. బంతికోసం గోలెత్తి పోతున్నారు పిల్లలు. పిట్టగోడ అడ్డమూలాన ముందు గేటులోంచి తిరిగిరావాలి. వచ్చేందుకు ఈ తాత ఏమంటాడోనని భయం. "బంతి ఇటు పడెయ్యండి" అని కాకిగోల మొదలెట్టారు.

"చిక్కారు, దొంగవెధవలు!" ముకుందరావు గబగబ మెట్లు దిగివచ్చి దొడ్లోని బంతిని చేతులోకి తీసుకున్నాడు. బంతి చేతిలోకిరాగానే, ఆబంతి పక్కింటి పిల్లల్దనీ, అది వాళ్ళకు ఇచ్చేయాలన్న సంగతి మరచి పోయాడు. కుఱ్ఱతనపు ఉత్సాహం ఆయనలో పెల్లుబికింది. బంతిచేతిలో పుచ్చుకుని చెయ్యి గిర గిర తిప్పటం ప్రారంభించాడు. అవతలి కుఱ్ఱవాళ్ళ "బంతి, బంతి" అని ఇంకా గోలచేస్తూనే ఉన్నారు. అలా చేయి తిప్పితిప్పి విసురుగా అవతలి దొడ్లోకి విసిరాడు ఆబంతిని. కాని అది అవతలి దొడ్లో పడలేదు. ఎగిరి పక్కింటి కిటికీలకు పైన అందంగా అమర్చిన గాజుఫ్రేముకు తగిలింది. ఫెళ్ళుమని గాజుఫ్రేము ముక్కలయింది. కంగారుగా పరుగెత్తుకొచ్చి మేడమీద తనగదిలో దూరాడు ముకుందరావు. గుండె దడదడ కొట్టుకుంటున్నది. గౌరి ఏమంటుందో నన్న భయంతో వణికి పోతున్నాడు. పావుగంటవరకూ ఏ ప్రమాదమూ జరగలేదు. దిండు వెన్ను కాచ్చి నిశ్చింతగా వెనక్కు వాలాడు.

రెండు నిముషాల తర్వాత వెంకటేశ్వర్లు వచ్చి ఎవరో తన కోసం వచ్చారని చెప్పాడు. లోపలకు రమ్మన్నాడు. ఆ వచ్చింది ముప్పైయేళ్ళ యువకుడు. పచ్చగా, నిటారుగా అమెరికన్ సినిమాలో హీరోలా ఉన్నాడు. అతణ్ణి చూచి చిరునవ్వు నవ్వాడు ముకుందరావు. కాని ఆవ్యక్తి నవ్వలేదు.

"మీరేనా ముకుందరావుగారు?" అన అడిగాడు.

"ఔను, ఏం?"

"నేను ఈ పక్కింటిలో ఉంటున్నాను."

"గౌరి భర్తవన్నమాట."

దీనికి సమాధానం చెప్పలేదు ఆవ్యక్తి.

"చూడండి, మొన్న నాభార్యకు, మాపిల్లల అల్లరి విషయమై ఒక చీటీ పంపారు. మాఇంటిలో మాకు స్వేచ్ఛ లేకుండా చేసేందుకు మీకు అధికారం లేదు. కాని ఆరోజున సహించాను. ఇవాళ నేను ఫలహారం చేస్తూంటే కిటికీ గాజు పెంకులు విరిగి నా ప్లేటులో పడినై. ఇది మీ రెండో తప్పిదం. మీరు నాకంటె వయస్సులో పెద్దవారు. పైగా జడ్జీగారట. ఈరెండూ కాని పక్షంలో ఏం చేసేవాణ్ణో మీరూహించి ఉండరు." పిడికిలి బిగించి పళ్ళ పటపట కొరుకుతున్న ఆవ్యక్తిని చూచి వణికి పోయాడు ముకుందరావు.

"ఇక మీదటన్నా మావిషయంలో జోక్యం కలుగజేసుకోకండి." సమాధానం ఆశించకుండా గిరుక్కున తిరిగి వెళ్ళి పోయాడు ఆవ్యక్తి.

కుర్చీలో కూలబడిపోయాడు ముకుందరావు. అతడికి నోటంట మాట రావటంలేదు. వెంకటేశ్వర్లును కేకేద్దామనుకున్నాడుకాని మాటలు పెగలటంలేదు. ఆ వచ్చిన వ్యక్తిని నమిలి మింగేయాలన్నంత కోపంగా ఉంది.

ఆరోజు శనివారం కావటం మూలాన వెంకటేశ్వర్లు ఏదో ఫలహారం చేశాడు. తను కొద్దిగా తిని మిగతాది పక్కింట్లో ఇచ్చిరమ్మని పంపాడు. పక్కింటివాళ్ళ అది నిరాకరించలేదు.

రాత్రి తన కథలో ఆరో అధ్యాయం మొదలెట్టాడు ముకుందరావు.

"వయస్సులో నేను చాల అందంగా ఉండేవాణ్ణి. పచ్చగా, నిటారుగా, అమెరికన్ సినిమాలో హీరోలా ఉండేవాణ్ణి. అందంగా ఉన్నా ఎప్పుడూ కస్సుబుస్సుమంటూండేవాణ్ణి. ఇంత చిరాకు నాలో ఎందుకు కలిగించాడా, అని మనస్సులో భగవంతుణ్ణి నిందించుకుంటున్నాను.............................." ఇలా సాగి పోయింది రచన.

ఇరవై రోజుల తర్వాత ఓ మాటు నరసింహమూర్తి వచ్చాడు ఇన్నాళ్లూ కనుపించక పోయిన అతణ్ని చూసి ముక్కుమీద గుద్దేయాలన్నంత కోపంవచ్చింది. కాని నరసింహమూర్తి తనకు ఊపిరాడనంత కబుర్లతో ముంచెత్తడంతో కోపం ఇట్టే ఎగిరి పోయింది. గౌరి తనింట్లో కాఫీచేసి ఇద్దరికీ పట్టుకువచ్చింది. తనింట్లో అడుగుపెట్టిన గౌరిని చూసేప్పటికి అతడి మనసులో వేయిదీపాలు వెలిగినాయి.

"గౌరి మొగుడు మహాకోపిష్ఠోయ్ నరసింహమూర్తీ" అన్నాడు కాఫీ చప్పరిస్తూ ముకుందరావు. కాని గౌరికేసి చూస్తూ ఏమీ మాట్లాడ లేకపోయాడు.

గౌరి వెళ్ళిపోయిన తర్వాత తన ఆత్మకథను గురించి నరసింహమూర్తికి చెప్పి రాసినంతవరకూ చదివి అభిప్రాయం చెప్పమని ఇచ్చాడు. ఆయనది చదివేందుకు రెండు గంటలు పట్టింది.

అంతా చదివి నరసింహమూర్తి మహదానందంతో ముకుందరావుని ఆలింగనం చేసుకున్నాడు.

"చాల గొప్పగా రాశావోయ్. నేను తెలుగులో చాలా కావ్యాలు చదివానుకాని ఇంత గొప్ప కథ నేనింతవరకూ చదవలేదు. నీ చిన్నతనం, నీ వివాహజీవితం నాకళ్ళకు కట్టినట్లుగా ఉంది—సరేకాని, నీకు వివాహం అయిందనీ, నీభార్య పోయిందనీ నాకింతవరకూ చెప్పలేదేం? అయితే నీకు పిల్లలు లేరా?" అన్నాడు నరసింహమూర్తి.

ముకుందరావు సిగ్గుతో తలవంచుకున్నాడు.

"ఒకడు పుట్టి వెంటనే పోయాడు." అన్నాడు సన్నగా. ఇన్ని అబద్ధాలు ఎందుకు చెబుతున్నాడో అతడికి అర్థం కావడంలేదు.

"మిగతాదికూడ త్వరగా పూర్తి చేసేయ్." అన్నాడు నరసింహమూర్తి.

తర్వాత, తను బెంగుళూరు వెడుతున్నాననీ, మూడు నాలుగు నెలలు ఉంటాననీ, ముకుందరావుని కూడ తనతో రమ్మనీ కోరాడు నరసింహమూర్తి. ముకుందరావు వెంటనే అంగీకరించాడు.

మూడు రోజుల తర్వాత ఇల్లు వెంకటేశ్వర్లకి అప్పచెప్పి బెంగళూరు బయలు దేరాడు ముకుందరావు.

* * *

బెంగుళూరులో నాలుగు నెలలూ, హుషారుగా గడిచి పోయినాయి. స్నేహితులూ, క్లబ్బులూ, 'కింగ్ ఆఫ్ కింగ్స్' ఓల్డ్‌స్కాచ్ విస్కీలూ—ఈలోకాన్నీ, తన 'ఆత్మకథ' నూ మరచిపోయాడు ముకుందరావు.

* * * *

నూతనోత్సాహంతో తన ఊరు తిరిగివస్తూన్న ముకుందరావు తన కథను మరింత గొప్పగా రాయాలని ఉత్సాహపడుతున్నాడు. గౌరిని చూడాలని అతడి మనసు ఆరాటపడుతున్నది.

భోంచేసి కాసేపు విశ్రమించి సాయంత్రం వరండాలోకి వెళ్ళాడు ముకుందరావు. ఏడైనా పిల్లలు ఆడుకునేందుకు దొడ్లోకి రాలేదు. ఆరైంది. ఆరున్నరైంది. పిల్లలు ఏమైపోయారో!

రాత్రి ఏడైనా పక్కింట్లో లైట్లు వెలగలేదు. వాళ్ళేమైపోయారు! కంగారుగా వెంకటేశ్వర్లని కేకేశాడు. వెంకటేశ్వర్లు వచ్చి చెప్పిన కథ అతణ్ని శూలాలొత్తి గుచ్చింది.

"పెలరోజుల క్రితం ఆ పక్కింట్లోని భార్యాభర్తలు దెబ్బలాడుకున్నారట. అతడికి మరో అమ్మాయితో సంబంధం ఉన్నట్లు గౌరికి అనుమానంట. ఆ విషయమై ఘర్షణపడి ఆమె తన పుట్టింటికి వెళ్ళిందట—అంటే ఆ ఊళ్లోనే ఉన్న నరసింహమూర్తి గారింటికి. ఇప్పుడు ఆమెభర్త ఒక్కడే ఈ ఇంట్లో ఉంటున్నది. ఎక్కడో నాలుగు మెతుకులు కలికి, ఆ కొత్త అమ్మాయితో కులికి రాత్రి ఏ పదకొండింటికో ఇల్లు చేరతాడట."

ఈ కథ విన్న ముకుందరావుకు మనసు మనసులో లేదు. నాలుగునెలల ప్రశాంత జీవనంలో తెచ్చుకున్న నూతనోత్సాహం అంతా కరిగిపోయింది. గౌరి లాంటి భార్య ఉండగా ఈ కుర్రవాడికి ఇదేం తెగులు? సరే, ఎవరెలా పోతేనేం అని మనసుకు సమాధానం చెప్పుకున్నాడు.

రాత్రి తన కథ పునఃప్రారంభించేందుకు నానా అవస్థలూ పడ్డాడు. ఎంత ప్రయత్నించినా కలం కదలడం లేదు. గౌరి ఎంత బాధపడుతున్నదో నని ఊహించుకుని దిగులు పెంచుకున్నాడు. తండ్రిలేని ఆపిల్లలు గతి ఏమిటి?

ఆ రాత్రంతా కలత నిద్ర పోయాడు ముకుందరావు.

తర్వాత వారంరోజులూ ఇలాగే గడిచిపోయింది. ఎంత ప్రయత్నించినా తనకథ అంగుళం కదల్లేదు. ఆవారం రోజుల్లోనూ గౌరిభర్త తనకు కనుపించలేదు. ఎప్పుడు వెడుతున్నాడో, ఎప్పుడు ఇంటికి చేరుతున్నాడో!

ఒకరోజు పొద్దుటే నిద్రలేచి డ్రెస్ చేసుకుని నేరుగా నరసింహమూర్తి గారింటికి బయలుదేరాడు ముకుందరావు. అప్పటికి నరసింహమూర్తి ఇంట్లోలేడు. గౌరికోసం అడిగాడు.

తన ఎదురుగా నిలబడ్డ గౌరిని చూసి తొట్రుపడ్డాడు ముకుందరావు. ఏం మాట్లాడాలో తోచటంలేదు.

"పిల్ల లేరీ?" అనడిగాడు.

ఆ ఐదేళ్ళ కుర్రవాడు తల్లివెనకనుంచి ఇవతలకు వచ్చాడు. తను తెచ్చిన చాక్‌లేట్ల డబ్బా ఆకుర్రవాడి చేతిలోపెట్టి "ఏవో కీచులాటలొస్తే ఇల్లే వదిలేసుకుంటారా గౌరమ్మా?" అన్నాడు.

గౌరి ముఖం వెలవెల బోయింది. ముకుందరావు ఆమెకు మళ్ళీ ఏవో బాధాకరమైన విషయాలు గుర్తు చేస్తున్నట్లు బాధపడుతూ:

"అది నీయిల్లు. నిన్ను ఆయింట్లోంచి పంపేందుకు అతడికి అధికారం లేదు. కావలిస్తే అతణ్నే వెళ్ళిపొమ్మను." అన్నాడు.

"ఈ సంగతులు మీకు అనవసరం అంటే మీరు బాధపడరుగా తాతగారూ." అంది గౌరి నీరసంగా.

"నాపక్కింటి మంచిచెడ్డలు, నీకెంత అవసరమో, నాకూ అంత అవసరమే. మీ పోట్లాటవల్ల నాకథ రాసుకోలేక పోతున్నాను." అన్నాడు.

"అందుకూ నేను బాధ్యురాలినేనా?" అన్నది గౌరి.

దీనికి సమాధానం చెప్పలేదు ముకుందరావు. ఆకుర్ర వాణ్ణి ఎత్తుకుని,

"మీ అమ్మంత మొండి ఘటాన్నీ, మీనాన్నంత కోపిష్టినీ నేనెక్కడా చూళ్లేదు. పిల్లలతో నీకెందుకూ నాతో వచ్చెయ్. బోలెడు చాక్లెట్లిస్తా." అన్నాడు.

కుర్రవాడు ఊహూ రా నన్నాడు.

"మానాన్నవు కదూ" అని బతిమాలాడు ముకుందరావు.

నరసింహమూర్తి వచ్చింతర్వాత అతడితో ఓగంట సేపు గౌరి విషయం చర్చించి, గౌరికి తనూ నరసింహమూర్తిలాటి వాడి నేననీ, తనయిల్లు ఆమెకు పరాయిదికాదనీ, తనలో వచ్చి ఉండ మనీ ప్రాధేయపడ్డాడు ముకుందరావు.

ఆలోజంతా ఆలోచించుకున్న గౌరి మర్రోజు పిల్లలతో సహా ముకుందరావు ఇంటికి వచ్చేసింది.

ఆమె తనింట్లో అడుగు పెట్టటంతో తనగృహం పావనం అయినట్టు ఆనందపడిపోయాడు ముకుందరావు. ఆమె వచ్చిందో లేదో, వెంకటేశ్వర్లని వంట చేయనివ్వడంలేదు. అన్నీ తనే స్వయంగా చేస్తున్నది. అటువంటి భోజనం ముకుందరావు రుచి చూసి ఎరగడు. పిల్లలు నిమిషనిమిషానికీ పైకొచ్చి "తాతా, ఇదేమిటి, అదేమిటి?" అని ఇల్లు వావా అల్లకల్లోలం చేస్తున్నారు. టమటమాల బండి ఇంట్లో స్వేచ్ఛగా తిరుగుతున్నది. గౌరి ఒక్కొక్కప్పుడు కింద బాత్ రూంలోకి వెళ్ళి గంటల తరబడి ఇవతలకి వచ్చేదికాదు. ఆమె బాత్‌రూంలోకి వెళ్ళినప్పుడు తను పైన వరండాలో నిలబడి పక్కింటి వేపు చూసేవాడు. గౌరిభర్త కనుపించేవాడు కాదు. నిరాశతో గౌరి ఇవతలకు వచ్చేది. తనూ అలాగే ఫీలయ్యేవాడు.

ఈ సమస్యకు పరిష్కారం ఎప్పుడో అతడికి అర్థం కావటంలేదు. తనకథకు ఈ సమస్య ఒక అడ్డుగోడై నిలిచింది. ఏమి రాద్దామన్నా చేతులు నిర్జీవంగా ఉన్నాయి. పిల్లలకేకలు ఆయనకు చిరాకు కలిగిస్తున్నాయి. ఏమీ రాసుకోలేక పోతున్నాడు.

ఒకరోజు సాయంత్రం సెందరాళే ఆమెభర్త ఇంటికి రావడం గమనించాడు ముకుందరావు. గబగబ గౌరిని టాయిలెట్ కమ్మనీ, పిల్లల్ని బజారుకు వెళ్ళేందుకు తయారు చేయమనీ పురమాయించి తనూ డ్రెస్ చేసుకున్నాడు. పిళ్ళని తీసుకొని పక్కింటి ముందుగా నడిచి వెడుతున్నాడు ముకుందరావు. అదేసమయంలో గౌరిభర్త వరండాలో నిలబడి పిళ్ళను చూస్తున్నాడు. గౌరి అటుకేసి ముఖం తిప్పలేదు. ముకుందరావు సరదాగా ఆమెతో కబుర్లు చెపుతున్నాడు. తనచేతిలో వున్న రెండేళ్ళపిల్ల అతణ్ణి కావలించుకుని భుజం మీద పడుకుని వున్నది. అలాఅలా తిరిగి రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికొచ్చారు. అప్పటికీ పక్కింట్లో లైటు వెలుగుతూనే వున్నది.

ఈ కార్యక్రమం క్రమేపీ అలవాటయి పోయింది. సాయంత్రం అయేటప్పటికి కుర్రవాడు "తాతా బజారుకు" అనడం తను బయలు దేరడం, గౌరి అనుసరించడం మామూలు అయిపోయింది.

ఇప్పుడు గౌరిభర్త ఎక్కడకు కదలడం లేదట్లే వుంది. తాము షికారు వెడుతున్నప్పుడు వరండాలో నిలబడి తమకేసి చూస్తూండేవాడు.

ఒకరోజు తనింటి గేటువద్ద వెంకటేశ్వర్లతో అతను ఏదో మాట్లాడుతూండటం గమనించాడు ముకుందరావు. అతను ఏం వ ట్లాడాడో వెంకటేశ్వర్లని పిలిచి అడగలేదు. సమాధానం ఆయనకు తెలుసు.

ఇలాగే మరో వారం రోజాలు గడిచింది. తన కథ ఏ మాత్రం ముందుకు సాగడం లేదు.

ఒకరోజు తన స్వంతపనిమీద బజారుకు వెళ్ళి రాత్రి పది గంటలకు తిరిగివచ్చాడు. తను ముందు హాల్లోకి అడుగెట్టేసరికి గౌరితో ఆమెభర్త మాట్లాడుతున్నాడు. ఇప్పుడు ముకుందరావుకు మంచి అదను దొరికింది.

"నేను లేకుండా నాయింట్లోకి ఎందుకు ప్రవేశించావు?"

ఈ సూటి ప్రశ్నకు బిక్కమొహం వేశాడు గౌరిభర్త.

"నాభార్య......." అని నీళ్ళు నములుతూన్న ఆతనితో "నీవు ఆమెభర్త వని నాకు తెలిసే......" అని ఇంకా ఏదో అన బోయాడు ముకుందరావు.

గౌరిభర్త చివాలున కుర్చీలోంచి లేచి విసురుగా బయటకు వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిన ఒక క్షణానికి "ఏం నాభర్తతో మాట్లాడుకునే అధికారంకూడ నాకు లేదా?" అంది గౌరి.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా గబగబ మేడ మీదికి వెళ్ళిపోయాడు ముకుందరావు.

మర్రోజు నిద్రలేచి కాఫీకోసం కేకవేస్తే వెంకటేశ్వర్లు కాఫీ పట్టుకువచ్చాడు. "గౌరి ఏమైంది?" అంటే, "తనింటికి వెళ్ళి పోయింది" అని సమాధానం చెప్పాడు వెంకటేశ్వర్లు.

తృప్తిగా నిట్టూర్చాడు ముకుందరావు.

ఆరోజు సాయంత్రం పక్కింటి దొడ్లోంచి పిల్లల కోలాహలం తన చెవులకు సంగీతంలా వినిపించింది. ఆరాత్రి వెన్నెల్లో గౌరి, ఆమెభర్త ఒళ్ళో వాలింది. ముకుందరావు మనస్సు ఉల్లాసంగా ఊగిసలాడింది.

అప్పటి కప్పుడే కలం చేతిలోకి తీసుకున్నాడు. టైము చూసుకున్నాడో లేదో కాని, కలం మాత్రం చకచక సాగిపోయింది.

కిటికీ

శ్రీ బాలగంగాధర తిలక్

కిటికీ తెరిస్తే,
గాలీ వెలుతురూతోపాటు
జాలీ జీవితపు ధూళీ జ్ఞాన మధూళీ కూడా వస్తాయి;
తెరచే కిటికీని బట్టి
పరతెంచే పుష్ప పరాగం వుంటుంది.
గదికీ మదికీ కూడా గవాక్షా లుంటాయి,
అంతరిక్షంలోకి జీవితరహస్యంలోకి సృష్టి సమక్షంలోకి
విచ్చుకొనే విచిత్రాక్షి సమూహాలు
ఆనంద శోకాను భూత్య విరళ తటిచ్చకిత వార్షిక వలాహకాలు.

2

కిటికీ తెరిస్తే,
కనపడుతుంది క్షితిజ రేఖ
నాకూ అనంతానికీ మధ్య వ్రాలిన విస్తీల తమాలశాఖ;
నాలోంచి కిటికీ అవతలకి దిగంతాలకి వ్యాపిస్తూన్న నేను,
బయటనుండి కిటికీ లోపలకి సంకోచించుకు పోతూన్న నేను,
ఒకే ఒక కేంద్రంలో కలుసుకొన్న ఉద్రిక్తక్షణంలో
ఉన్మదిష్ణువు సృష్టి వేణువూదిన రహస్యగానం వినపడింది;
ఉత్తాల శిఖరం మీద పగిలిన సూర్యగోళపు కాంతి చెల్లాచెదరయింది;
ఊదారంగు మంచు కురిసిన ప్రథమోదయ దృశ్యం నాకు కనపడింది.

3

కిటికీ తెరిస్తే,
రోడ్డు మీద వచ్చీపోయే జనం
ఆశానిరాశల వంతెనల మీద నుంచి దిగుతున్నారు;
ఆకలీ కామం అవసరాల మార్కెట్‌కి వెడుతున్నారు;

ఒకడు కంగారుగా ఒకడు రహస్యంగా ఓకడు బెదరుగా
ఒకడు ధైర్యంగా విలాసంగా మరొకడు కింగ్లీగా;
ఆవిడ తలవంచుకుని నిత్యపాతివ్రత్య భారవహానంతో,
ఈవిడ ఓరగా చూస్తూ పైట సవరించుకుంటూ లోపల్లోపల గతుక్కుమంటూ,
రోజుల స్తంభాల్ని చుట్టు తిరుగుతూ,
కాలం కారిడర్లలో మసకమసక చీకట్లో పిలాటీలు కల్పిస్తూ
ఎవరికి వారే ఏకాంత పాంథులు.

అదృశ్య శృంఖలా బద్ధ పాదాల
నీడుస్తూ ఏడుస్తూ చప్పట్లు చరుస్తూ
కోలాహల హాలాహల నీలాచల గుహాంతరాలవైపు
కోష్ణకవోష్ణ స్వప్న రంభాపరీరంభపు కైపు
కోసం పోతున్నారు;
దిగులుగా తిరిగి వస్తున్నారు;
మూలగా నక్కి మూట విప్పి చూసికొని
ఏమీ దొరక్క మరేమీ తెలియక
మళ్లీ అడ్రసు లేని ఆనంద ప్రియ బాంధవికోసం
మరో మలుపు మరోదారి మరోవూరు వెళ్లాలని
మంచుకప్పిన స్టేషన్లదగ్గర విమానాశ్రయాల దగ్గర
పడిగాపులు పడి నుంచున్నారు;
ఎడ్వాన్సు బుకింగ్ లేదు; ఎప్పుడు రైలొస్తుందో తెలియదు;
సిగ్నలిచ్చేవాడు తనగదిలో చిత్తుగా తాగి పడుకున్నాడు.

4

కిటికీ తెరిస్తే,
ఏపుగా పెరిగిన చెట్టుమీద ఎర్రని పువ్వొకటి విరిసి
ఎండలో మెరుస్తూ ఇదే నిజం ఇదే నిజం అని నవ్వుతూ
అంతలో రాలిపోయింది;
వింతగా స్మృతిలో మాత్రం మిగిలింది.

ప్రబంధము, కావ్యము భిన్నములా?

మొన్నటి మార్చినెల 'భారతి'లో 'హంసదౌత్యము—భిన్న హస్తకౌశలము' అను పేర శ్రీ నూతలపాటి గంగాధరంగారు రచించిన వ్యాసము ప్రకటితమైనది. దానిని చదివి చాల ఆశ్చర్యము నొందితిని.

కట్టమంచివారు సాహిత్యమును చెవులు ముక్కులు తెగ కోసినట్లు తీవ్రముగా విమర్శించినారనియు, వారు పాశ్చాత్య సాహితీ కన్యను తిలకించిన దృష్టితోనే ఆంధ్ర భాష అనుంగు ఆడబిడ్డయైన ప్రబంధ కన్యను గూడ పరికించి నిర్దాక్షిణ్యముగ నిరసించినారనియు, పాశ్చాత్య కన్య వేషము వేరు, చెయిదము వేరు, తెనుగు బిడ్డ రూపు రేఖలు వేరు చూపు చేష్టలు వేరు, ఇరువురను ఒకే కాపురము చేయుమన్న నెట్లు చేయుదురనియు గంగాధరంగారును నిర్దాక్షిణ్యముగానే నిరసించినారు. కట్టమంచివారు నిర్దాక్షిణ్యముగ నిరసించిరనుట నిజమే. కాని కట్టమంచివారు తమకు దోషములని తోచిన వానిని దోషములుగను, గుణములని తోచిన వానిని గుణములుగను ఎత్తి చూపుటలో వెనుదీయలేదు. నేటి పక్షపాత విమర్శకులవలె ఏక దృక్పథ విమర్శనము వారు ప్రబంధ కన్యపై చేయలేదనుట వారి కవిత్వ తత్త్వ విచారము నిష్పాక్షికముగ పరిశీలించినగాని తెలియదు.

ఇక శ్రీనాథుని నైషధము కావ్యమా? ప్రబంధమా? అను విషయమున 'అనువాద' మను వాటంకమే లేకున్న ప్రబంధమేయని శ్రీ గంగాధరం గారు తమ నిర్ణయము తెల్పిరి. ఎన్నో ఆటంకములు తొలగించి శ్రీనాథునికి సూరనకు దౌత్యము గూర్చినవారు ఈ అనువాదమను వాటంకమును గూడ తొలగించి, నిరాటంకముగా ప్రబంధమేయని తమ నిర్ణయము తెల్పిన బాగుండును. ఈ కోమటి మధ్యస్థ మెందులకు? అసలు కావ్యము, ప్రబంధము భిన్నములా? అభిన్నములా? 'అనువాద' మను వాటంకముచే కావ్యమనియే వారి తీర్మానము గదా!

మూలమగు హర్ష నైషధము కావ్యముగనే ప్రసిద్ధి కెక్కినది. ఎఱ్ఱనకు ప్రబంధ పరమేశ్వరుడని బిరుదము. ఆతడే ప్రబంధము వ్రాసినాడు? "గద్య పద్య మయం కావ్యం, చంపూ రిత్యభిధీయతే" అని కలదు గదా! చంపూ రామాయణమునందును "చంపూ ప్రబంధ రచనాం రసనా మదీయా" అని కలదు. కాగా వారికీ రెండును అభిన్నములనుట తోచలేదు. శ్రీనాథుడే స్వయముగ నీ కావ్య ప్రబంధము లభిన్నముగ వాడియున్నాడు. (1) "పలుకుతోడై తాంధ్ర భాషా మహా కావ్య నైషధ గ్రంథ సందర్భమునకు (2) నంతరించితి నిందు జన్యవంబున యందు హర్ష నైషధ కావ్య మాంధ్ర భాష" (1) నైషధాది మహా ప్రబంధములు పెక్కు చెప్పినాడవు" (2) "నైషధ శృంగార కావ్యం బాంధ్ర విశేషంబున......మాత్ర కానుసారంబునం జెప్పబడిన నైషధ కావ్యంబు" (3) నవరస భావ బంధురంబుగా నొక్క ప్రబంధంబు నిర్మింపం దలంచి... తన్మహా ప్రబంధ ప్రారంభమునకు". ఇట వేదమువారున్ "ప్రబంధంబు—కావ్యంబు" అనియే యర్థ మిచ్చియున్నారు. (4) కావున నాకు నొక్క ప్రబంధంబు.....రచియింపు" (5) "అట్టి నైషధ సత్కావ్య మాంధ్ర భాష ననఘ! యొనరింపుము" (6) "అని పలికిన నేను నమ్మహా ప్రధానునిం గృతి నాయకుం జేసి నైషధ కావ్యంబు చెప్పం దొడగితి" (7) షష్ఠ్యంతా నంతరము "నా యొనర్పం బూనిన యిమ్మహా ప్రబంధంబునకుం గథా నాయకుండు" (8) ఆశ్వాసాంత గద్యలలో గూడ "శృంగార నైషధ కావ్యము" అని కలదు.

మరియు శబ్ద రత్నాకరమున కవుల గూర్చి వ్రాయుచు పెద్దనాదుల కృతుల నన్నిటిని కావ్యములుగనే పేర్కొనియున్నాడు సీతారామాచార్యులు. (ప్రబంధము = కావ్యము శ. ర.)

ఇన్నిచోట్ల నీ రెండును అభిన్నములుగనే కదా ప్రయుక్తములు! ఇట్టి ఎడ కావ్యమా? ప్రబంధమా?—అను శంక యేల కల్గెనో తెలియకున్నది. అనువాదమైనచో కావ్యము, లేకున్న ప్రబంధమని వారి యభిప్రాయము కాబోలు! ఇది ప్రౌఢ కావ్యమనియే ఎన్నబడుచున్నదికాని, ప్రౌఢ ప్రబంధమని చెప్పబడుటలేదు. దీనికి కావ్యమను రూఢియే లోకమున గలదు. ఒకవేళ ప్రబంధమన్నను ఆటంకము లేదు. కవియే రెండు పదములను వాడినాడు కదా! ఈ శంక పెద్దనాదుల కృతుల విషయములో రాలేదు కాబోలు! మనము ప్రబంధ మనగా పురాణేతి హాసములనుండి కథను గైకొని మార్పులు,

కూర్పులుచేసి, నేర్పుతో రచించుట అని తలంచుచున్నాము; పెద్ద వాదుల కృతులన్నియు నట్లే యున్నవి కనుక! అంతేకాని పెద్దవారీ నిర్ణయమును తెల్పియుండలేదు. 'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అనునాటికి ఈ ప్రబంధములున్నచో ఏమని యుండెడివారో! ఈ రెండు నభిన్నములు కావున కావ్య శబ్దము చేతనే ప్రబంధమును గ్రాహ్యము. అంతేకాని ప్రబంధములో అవశ్య పఠనీయములు, పుణ్య ప్రదములు అని కాదుగదా అర్థము! కావున శ్రీ గంగాధరంగారు కావ్య—ప్రబంధముల లక్షణములు దెల్పి, నైషధమున కే గతి కల్పింతురో వివరింప ప్రార్థితులు.

ఈ విచారము అవిచారకముచేసి, దృష్టి నొక్కమారు పింగళి సూరన వైపునకు మరల్చినారు......వెంటనే "హంస దౌత్యము" తలపునకు వచ్చినదేమో! నామకరణము బాగున్నదే కాని పురుడు బాపుటలోనే కొంత వైపరీత్యము కల్గినది. అసలు శ్రీనాథుని కాలము, కావ్యము, రచనా విధానము, కథా సంవిధానము, హంసదౌత్య సంధానము వేరు. సూరన కాలము, కావ్యము, రచనాదులు వేరు. ఇరువుర కావ్యములందును హంస దౌత్యము కలదు. అంతమాత్రమున తోచిన నిర్ణయము కావించి, ఒకరిని కనకపు సింహాసనమునను, మరొకరిని కంచు సింహాసనమునను గూర్చుండబెట్టుట అవిచారక మనిపించుచున్నది.

అయినను మన మిచ్చు తాత్కాలిక సింహాసనములు వారి కేల? ఇరువుర కావ్యములు, పద్ధతులు భిన్నము లయినపుడు ఇక వారితో భేద సాదృశ్య విచారము చేయుట వ్యర్థము కదా! భిన్న హస్త కౌశలము చూపించదలచినవారు హర్ష శ్రీనాథుల హంస దౌత్య కౌశలమే చూపవచ్చునుగదా! ఇట్టిది ఒకే గ్రంథమును భిన్న కవులు అనువదించినపుడుగాని, లేక ఒకే వృత్తాంతమును భిన్న కవులు రచించినపుడుగాని నిర్ణయింపవలయును. "లోకో భిన్నరుచిః" అనుటచే అపుడును ఆటంకమే వచ్చునేమో! నైషధ ప్రభావతీ ప్రద్యుమ్నులకు గల సంబంధ మేమిటి? నైషధమున హంస దౌత్యము కేవలము నల దమయంతీ కల్యాణ సంధానార్థమే కల్పితము. ప్రభావతీ ప్రద్యుమ్నమున కల్యాణార్థమేగాక, వజ్రనాభవధార్థము ఉపాయాన్వేషణ ప్రయోజనము గూడ కల్గియున్నది. అట్టి దానితో కేవల కల్యాణ పర్యవసాయియగు నైషధ హంస దౌత్యమునకు ముడి పెట్టుట ఏల? అట్లయిన హర్షుని హంస దౌత్యమును గూడ తగిలించవలయును. శ్రీనాథుని హంస శ్రీహర్షునిది గదా! మూలము కూడ దీనికి మూలమనుట మరువరాదు.

మరియు దమయంతి ప్రణయచిత్త ప్రవృత్తిని హంస పరీక్షించువిధానము సారస్యముగాలేదని శ్రీ గంగాధరంగారు అనిరి. పచ్చిగా అడిగి వేసినదనిరి. మరి శ్రీనాథుని గూడ ఇట మరువరాదు. కవి స్వభావము కొంచెమో గొప్పో పాత్రలలో ప్రవేశించును. కావుననే ఈ హంస సూటిగానే దమయంతి నడిగినది. నైషధ హంసను గాంచియే సూరన తన హంసకి రూపు రేఖా వాఙ్నైపుణ్యాదులలో మెరుగులు దిద్ది తీర్చుకొని యుండవచ్చునుగదా! నైషధమున 'తామరాకుపై బడిన స్వాతి చినుకు'గా బ్రహ్మవాక్కు పరిణమించినదట. దీని నరసియే సూరన శుక్తిలో బడనైచుకో గల్గినాడు. కావుననే నైపుణ్యము లభించినది.

ఈ సందర్భమున భట్టహర్ష శ్రీనాథులు సూరన ఎదుట తల త్రిప్పుకొని పోవలసి వచ్చినదట. ఇట్టి మన విమర్శలను జూచినవారు దేహమంతయు త్రిప్పుకొనియే పోవుదురు. వారట్లు పోయిన వెంటనే నాటకములో అంతర్నాటకమువలె జగన్నాటక సూత్రధారి వాత విధూత సౌగంధిక పుష్పమువలె వచ్చిపడినాడు. వారితోబాటు వాల్మీకి—శ్రీరామ చంద్రులు ప్రవేశించినారు. వీ రెందులకు వచ్చిరో అనూహ్యము.

రెండు కావ్యములందును హంసలు భిన్నములు. ఒకటి హంస—ఒకటి హంసి. కథలును భిన్నములు. కవులును భిన్నులు. కాలమును భిన్నము. అట్టి ఎడ నిట్టి పొందిక ఎట్లు? వ్యాసకర్తలే ఉపక్రమణికలో కట్ట మంచివారిని విమర్శించుచు, "పాశ్చాత్య సాహితీ కన్య వేషము వేరు. చెయిదము వేరు. తెనుగు బిడ్డ రూపు రేఖలు వేరు" మొదలుగా ననిరి. "వారిరువురను ఒకే కాపురము చేయుమన్న నెట్లు చేయుదురు?" అని ప్రశ్నించిరి. మరి స్వవచన వ్యాఘాతమే తమ వ్యాసమున జరిగినదని వ్యాసకర్త గమనింపలేదు. శ్రీనాథ సూరనల హంసదౌత్యములు వేరు. ఆ హంసల నొకే కాపురము చేయించి, ఒకటి కాపురమున నైపుణ్యము చూపలేదు, మరొకటి నైపుణ్యము చూపినదని నిర్ణయించుట ఎట్లు? "కట్టమంచివారి విమర్శయమున ఈ దృష్టి ఎట్లున్న దనగా బ్రాహ్మణుల విందు భోజనమున జరిగి మాంస భక్ష్యములు లేవని అలిగి వచ్చినట్లున్నది" అనిరి. ప్రకృతము తమ యుపమానుసారమే వ్యాస రచనయు జరిగినది. శ్రీనాథుని హంసవద్దకుపోయి సూరన హంసి లక్షణములు, భావములు, లేవని అలిగి వచ్చినారు వ్యాసకర్త. "యద్భావం తద్భవతి కదా!" అట్టి ఎడ కట్టమంచివారు చక్కని సులోచనములనుండియే చూచిరని తెలియుచున్నది. అవి అన్వర్థకములే.

ఇట్లు పరస్పర సంబంధములేని గ్రంథముల గైకొని సందర్భాదుల విషయమై అసంబద్ధ విమర్శ గావించి అభూత కల్పనలు చేయుచున్నను తమ తుది నిర్ణయానుసారము తుది ముఖనే పరిశీలించి అందరి కౌశలము లేవో తెల్పిన బాగుండును గదా! ఊరక అనామకముగు ఆ నైషధ హంసను బాధింప నేల? పాపము! అది నలునిచేతనే పట్టుబడి బాధింపబడి వదలబడినది.

కర్నూలు: పమిడికాల్వ చెంచుసుబ్బయ్య.

కవిజనాశ్రయ రచనాకాలం

తెలుగు ఛందోగ్రంథమైన కవిజనాశ్రయం జైన సంప్రదాయాలను తెలిపే ఒకే ఒక గ్రంథం. ఇది రేచన రచించినదని కొందరు విమర్శకు లంటారు. ఈ ప్రాచీన గ్రంథం ఇంత వరకు నిలబడడానికి రెండు ముఖ్య కారణా లున్నాయి: ఒకటి, మతసంబంధంకాని శాస్త్రగ్రంథం. రెండు, ఘనుడైన వేములవాడ భీమకవి రచించాడని కవుల ఉద్దేశం. కాని ఈ పుస్తకంలో భీమన పేరు కంటె రేచనపేరే ఎక్కడ పడితే అక్కడ కనబడుతూంటుంది.

రేచన

రేచనకవి వైశ్యకులజుడు. రేచన అనే పేరు ఈకాలంలో ప్రజలలో వాడుకలో ఉన్నట్టు కనబడదు. కాని పూర్వకాలంలో వాడుకలో ఉండేదనడానికి ఉదాహరణ లున్నాయి. కన్నడభాషాకవియైన రన్నకవి క్రీ. శ. 933 ప్రాంతంవాడు. అతడు కూడ వైశ్యకులజుడు. అజిత పురాణము, సాహస భీమ విజయమను గదాయుద్ధము, రన్నకందము అను నిఘంటువును రచించాడు. రన్నకవి వేంగిదేశవాసి. తర్వాత కన్నడదేశం వెళ్ళి గ్రంథరచన చేశాడు. అతని తండ్రిపేరు జినవల్లభేంద్రుడు. సోదరులపేర్లు—దృఢబాహు రేచన,[1] మారయ్య. కళింగదేశాన్ని పాలించిన అనంతవర్మ చోడగంగుని (క్రీ. శ. 1076—1147) సంధివిగ్రహికుడిపేరు[2] సామ్మల రేచన. ఇట్లే మరికొన్ని ఉదాహరణలు ఉండవచ్చు.

కోమటి రేచన కవిజనాశ్రయాన్నేగాక మరి ఇతర గ్రంథాలను గూడ రచించాడని 'ఉరుకావ్య రచనా విలసన్మతి' (పుట 41) అను బిరుదునుంచి ఊహించవచ్చు.

జైన కావ్యాలు

రేచన జైన మతస్థుడు. పూర్వకాలంలో తెలుగు దేశంలో హిందూమతంతోపాటు జైనమతం, బౌద్ధమతం కూడ కొంతవరకు ఉండేవి. అప్పుడు ఆ మతాల తాలూకు తెలుగు గ్రంథాలు వేలకొద్దీ ఉండేవని చెప్పవచ్చు. కాని ఆ మతాలు నశించగా వారి గ్రంథావళి కూడ రూపుమాసింది. మనం ఇంకా కష్టపడి వెతికితే కొన్ని పుస్తకాలు దొరకవచ్చు. కవిజనాశ్రయగ్రంథం జైనకవి వ్రాసుకొన్న రచన.

వాదీంద్ర చూడామణి

శ్రావకాభరణాంకుడైన రేచనయొక్క గురువుపేరు వాదీంద్ర చూడామణి అని కవిజనాశ్రయ గద్యల నుంచి తెల్లమౌతోంది. వాదీంద్రచూడామణి పేరును ఇతరపేర్లతో పారపాటు పడరాదు. పశ్చిమచాళుక్యరాజైన జగదేకమల్లుని (క్రీ. శ. 1144 ప్రాంతం) కాలంలో వాగీంద్ర చూడామణి అను జైనుడు ఉండేవాడు.[3] ఇతనుకూడ గ్రంథకర్త అని తెలుస్తోంది. కాని ఇతను వేరు అని పేర్లలో ఉండేదాన్నిబట్టి తెలుసుకోవచ్చు.

కస్తూరి రంగకవి ఆనందరంగరాట్ఛందం అను పద్య లక్షణగ్రంథంలో మల్లనకవి రచించిన 'హేదాంగ చూడామణి' అను ఛందోగ్రంథంనుంచి ఎనిమిది పద్యాలను ఉద్ధరించాడు. అష్టగణాల అద్భుత లక్షణాలు, ఫలాలు ఆ పద్యాలలో వివరించబడ్డాయి. నావద్ద నున్న కవిజనాశ్రయ తాళపత్రప్రతిలో కూడ ఈ పద్యాలు కొంచెం భేదంగా కనబడుతున్నాయి. 'హేదాంగ చూడామణి' గ్రంథం దొరకలేదు. ఇతరులెవరైన అతని పద్యాలను ఉద్ధరించేరో లేదో తెలియదు. అతని పేరు అంతకుపూర్వం వినబడకపోడం వల్ల అతను అనగా మల్లనకవి, కస్తూరి రంగకవికంటె కొంచెం ముందు వాడేమో! ఈ చూడామణులు వేరువేరు అని పేర్లలోని భేదాలనుబట్టి తెలుసుకోవచ్చు.

1. ఆంధ్రప్రమోదూత సంవత్సరాది సంచికలో పెనుమర్తి వెంకటరత్నంగారి 'కన్నడవాఙ్మయములోని ఆంధ్ర కవులు' అనువ్యాసం, పుట 83.

2. కళింగదేశచరిత్ర — రాళ్లబండి సుబ్బారావుగారు వ్రాసినది. పుట 158.

3. కాకతీయాంధ్రరాజయుగ చరిత్రము— చిలుకూరి వీరభద్రరావుగారు రచించినది—పుట 266.

వే ము ల వా డ భీ మ న

వేములవాడ భీమకవి ఒక 'తెలుంగాధీశు'ని సంబోధించి పద్యం చెప్పాడు. అట్లే శ్రీనాథమహాకవికూడ ఒక 'తెలుంగాధీశుణ్ణి' సంబోధించాడు. కాబట్టి తెలుంగాధీశుడను పేరుగల వ్యక్తి ఒక్కడే ఉన్నాడని చెప్పలేము. అట్లే భీమకవి పద్యాలలో ఒక 'కళింగగంగు'ను పేర్కొన్నాడు. అతడుకూడ ఫలానా రాజని చెప్పలేము. కళింగదేశాన్ని గంగరాజులు కొన్నివందల సంవత్సరాలపాటు పరిపాలించారు. వారందరు కళింగగంగులే! కాబట్టి పైనజెప్పిన రాజులపేర్లు భీమకవి కాలనిర్ణయానికి సహాయపడడంలేదు. భీమకవి రచించిన పద్యాలే అని చెప్పబడే మరికొన్నిటిలో ప్రశంసింపబడ్డ చొక్కరాజా, మైలమభీమన అనువారు కూడ కాలనిర్ణయానికి సహాయపడడంలేదు. కాబట్టి అతని చాటువులు అనబడే కొన్నిటిమీద కాలనిర్ణయానికి కనుక ఆధారపడితే కందుకూరి వీరేశలింగకవి చెప్పినట్లు, అతడు (భీమకవి) ఒకసారి పన్నెండో శతాబ్దివాడని, మరోకసారి పదమూడో శతాబ్దివాడని, ఇంకొకసారి పద్నాలుగో శతాబ్దివాడని, వేరొకసారి పదహారో శతాబ్దివాడని చెప్పవలసి వస్తుంది. కాబట్టి ఈమహాకవి కాలానికి ఇతర ఆధారాలుంటే చూడవలసుంది. అట్టిది కవిజనాశ్రయంలోనే లభిస్తూంది.

భీమన—రేచన

కవిజనాశ్రయాన్ని భీమన రచించాడా లేక రేచన రచించాడా? లేక భీమన ఒక ఛందస్సు, రేచన ఒకఛందస్సు చేయగా అవిరెండు క్రమక్రమంగా కలిసిపోయాయా? ఈ సమస్యలను చర్చించవలసుంది.

కవిజనాశ్రయంలోని గద్యలో ఉన్న 'శ్రావకాభరణాంకుడు' అను జైననామం రేచనది అని గ్రంథంలోని అక్కడక్కడి ప్రయోగాలనుబట్టి తెలుస్తూంది. రేచన తండ్రిపేరు మల్లియ అని గ్రంథంలో అనేక ప్రయోగాలనుంచి గ్రహించవచ్చు.

అయితే భీమన ఎవరు? భీమకవి పేరు అతని తండ్రిపేరు ఒక్కటే. కాబట్టి అతను 'దాక్షారామభీమేశనందనుడు' అని ప్రఖ్యాతి పొందాడు. ఆ అంశాలను కవిజనాశ్రయ పద్యాలుకూడ రుజావు చేస్తున్నాయి:

క. పరగిన విమల యశోభా
సుర చరితుడు, భీమనాగ్రసుతు డఖిల కళా
పరిణతు డయ్యును భూసుర
వరప్రసాదోదిత ధ్రువ శ్రీయుతుడై (పుట1)

క. జనసుత భీమ తనూజా
మనయార్జిత విభవతేజ! సుభగ మహోజా!
వినుత విశిష్ట సమాజా!
యన వంశ్య ప్రాసమగు సహర్పతితేజా! (పుట9)

'భీమనాగ్రసుతుడు', 'భీమతనూజుడు', 'దాక్షారామ భీమేశనందుడు' అని చెప్పబడేవాడు భీమకవి మాత్రమె.

పైన జెప్పిన 'పరగిన' పద్యం తర్వాత ఈ కింది పద్యముంది :

క. అసమాన దాన రవి తన
య సమానోన్నతుడు వాచకా భరణుడు ప్రా
ణ సమానమిత్రు డీ కృతి
కి సహాయుడుగా నుదాత్త కీర్తి ప్రీతిన్ (పుట2)

దీనిలోని 'వాచకా భరణుడు' ఎవరు? రేచన కవికి 'వాచక అను మారుపేరు కూడ ఉంది. యాప్పిరంగంప్ అను తమిళ లక్షణ గ్రంథంలోని పదం 'వాంచి (కా)'[4] అని కూడ చదవబడుతూంది. కాబట్టి 'వాచక' శబ్దము రేచనదే. ఇటువంటి వాడికి భీమకవి 'ఆభరణం'వంటివాడు. కాబట్టి 'వాచకా భరణుడు' అయినాడు. దీనికి అనుకూలమైన మాట ఒకటి కవి జనాశ్రయంలోనె ఉంది. రేచన 'కవీంద్రాభరణాయమానుడు' (పుట 21). వసుచరిత్ర కర్తయైన రామరాజ భూషణుడి పేరూ ఇట్టిదే. రేచన కవి కల్పభూజం. కాబట్టి భీమన అతన్ని ఆశ్రయించాడు.

భీమన సహాయంతో రేచన, కవిజనాశ్రయాన్ని నిర్మిస్తున్నానని చెప్పుకొన్నాడు. ఈ కారణాన్నిబట్టే ఈ గ్రంథాన్ని అనేకమంది భీమన ఛందస్సుగా కూడ వ్యవహరించారు. వారి మాటలు పొరపాట్లు కావు. కవిజనాశ్రయ గ్రంథస్వరూపమ్ము ఇట్టిది. అంతేకాని భీమన వేరే ఛందం వ్రాయలేదు.

ఒకే కవి ఒకే గ్రంథాన్ని ఇతరుల సహాయం లేకుండా రచించాలనే నియమం పూర్వం తెలుగు రచనలలో లేదు. దీనికి ఆంధ్ర భారత భాగవత రామాయణాలే నిదర్శనాలు. నన్నిచోడుడు అట్లు సహాయం పొందినవాడే అని చెప్పవచ్చు. అట్టి గ్రంథ నిర్మాణానికి రేచన భీమనలు మరోక నిదర్శనం.

పే ర్లు, బి రు దు లు

అనేకమంది పూర్వ కవులకు పేర్లే గాక బిరుదులు కూడ ఉన్నాయి. నారాయణకవి (క్రీ. శ. 945 ప్రాంతం)[5]

4. వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సింహావలోకనము అను గ్రంథములోని పుట 3.

5. తెనుగు కవుల చరిత్ర—నిడుదవోలు వేంకటరావు గారు రచించినది, పుట 89.

గజాంకుశుడు; నన్నయభట్టు విపులశబ్ద శాసనుడు; తిక్క నాదులు బిరుదులు గలవారె.

రేచన కవి తన మతాన్నిబట్టి శ్రావకాభరణాంకుడు· భీమకవి తన ఆశ్రయాన్నిబట్టి వాచకాభరణుడు. కొందరు కవులు వ్రాసిన గ్రంథాలకు వారి సంబంధమైన పేర్లు వచ్చాయి. ఉదా :—అప్పకవీయం. కొందరు కవులకు వారు రచించిన పుస్తకాలనుబట్టి పేర్లు వచ్చాయి. ఉదా :— చింతలపూడి ఎల్లన్న. శృంగార రాధామాధవ ప్రబంధాన్ని నిర్మించి రాధామాధవకవి అయ్యాడు. మతసంబంధమైన బిరుదులకు శ్రావకాభరణాంకపదం ఉదాహరణం.

కవిజనాశ్రయకాలం

తమిళ భాషలో పదకొండో శతాబ్దిలో రచించబడ యాప్పిరింగులప్ కారిక్కై అను ఛందో గ్రంథంలో 'రేవియార్ రశిద వడుగు చందం'— అనగా, రేచన వ్రాసిన ఉత్తర (తెలుగు) ఛందం అను ప్రశంస ఉంది.6 కాబట్టి కవి జనాశ్రయం పదకొండో శతాబ్దికి పూర్వపు రచన అని స్పష్టమవుతూంది. అయితే ఎప్పటిది ? రేచన తాను వాదీంద్ర చూడామణి శిష్యుణ్ణి అని గద్యలో చెప్పుకొన్నాడు. నన్నెచోడుడు కుమారసంభవంలో తన గురువైన మల్లికార్జున ముని "పరవాదీంద్ర ఘనానిలుడు" అని తెలియజేశాడు. దీనిలో చెప్పబడ్డ 'వాదీంద్రుడు' డే కవిజనాశ్రయంలోని 'వాదీంద్ర చూడామణి' అని గ్రహించవచ్చు. నన్నెచోడకవి క్రీ. శ. 850 ప్రాంతంవాడని నేను నన్నెచోడునిగురించి వ్రాసిన వ్యాసంలో తెలియజేశాను.7 కాబట్టి రేచనకూడ క్రీ. శ. 850 ప్రాంతంవాడు అని నిర్ణయించవచ్చు.

పూర్వశాసనాల ప్రాముఖ్యం

అంతటి పూర్వకాలంలో తెలుగు లక్షణకర్త లుండేవారా అను పెద్ద సందేహం కలుగవచ్చు. కాని ఇది సందేహమే కాదు. క్రీ. శ. 850 ప్రాంతంలోనివైన ఈ క్రింది శాసనాల లక్షణాలను చూడండి. అద్దంకి శాసనం (క్రీ. శ. 848) లోని తరువోజ, కందుకూరి శాసనం (క్రీ. శ. 850) లోని సీసపద్యం, ధర్మవరం శాసనం (క్రీ. శ. 850) లోని సీసపద్యం మొదలైనవాటిని చూస్తే అంతకు పూర్వమే తెలుగులో లక్షణ గ్రంథా లుండిఉండాలనే సంగతి నిశ్చయమవుతుంది. లక్షణ గ్రంథాలు లేనిదీ పై పద్యరచన ఎట్లు స్థిరమవుతుంది ? కాబట్టి అంతకు పూర్వమె ఎన్నో శతాబ్దాల నుండి తెలుగులో గ్రాంథిక కవిత్వం అమలులో ఉండి ఉండాలి. ఇంక జానపద గేయాలు క్రీస్తుపూర్వమె వందలకొద్దీ ఏండ్ల క్రిందటి నుంచి ఉండేవని చెప్పడానికి సంశయమేముంది !

సంగ్రహరచన

కవిజనాశ్రయంలో—

క. జయదేవాది చ్ఛందో
నయమున సంక్షేప రూపునం జెలువుగ మ
ల్లియరేచన సుకవి జనా
శ్రయుఁడీ ఛందంబు జెప్పె జనులకు తెలియన్.

(పుట. 64)

అని ఉంది. ఇట్లు తెలుగుకవి జనాశ్రయం సంక్షేపంగా మాత్రమే చెప్పబడింది. కాబట్టి అనేక భాగాలు సంగ్రహం చేయబడ్డాయని చెప్పవచ్చు. అప్పటికి కవి జనాశ్రయం అచ్చు ప్రతులలో ఏవేవి విస్తృత భాగాలు? ఏవేవి ప్రక్షిప్తాలు? వీటిని గురించి గట్టి పరిశోధనలు జరగాలి.

కవిజనాశ్రయం—అనుకరణం

కవిరాజ మార్గ అను లక్షణ గ్రంథాన్ని కన్నడంలో అమోఘవర్షుడు (క్రీ. శ. 814—880) రచించాడు. వేంగీ దేశపు పాలకుడైన గుణగాంక విజయాదిత్యుడికి అంకితంగా 'గుణగాంకీయం' అను కన్నడ లక్షణ గ్రంథం8 క్రీ. శ. 885 ప్రాంతంలో రచించబడింది. కాని, ఇది లభించలేదు. కర్ణాటక కవియైన నాగవర్మ (క్రీ. శ. 990 ప్రాంతం) వేంగీ దేశస్థుడు. ఇతను ఛందోంబుధిని రచించాడు. కవి జనాశ్రయానికి ఛందోంబుధికి చాల 9 పోలికలున్నాయి. రేచన క్రీ. శ. 850 వాడు కాబట్టి ఛందోంబుధి కర్త కవిజనాశ్రయాని అనుకరిస్తూ కొన్ని భాగాలను రచించాడని నిర్ణయమవుతూంది.

ప్రక్షిప్తాలు

కవిజనాశ్రయ గ్రంథంలోకి ఇతర రచనలు ఎక్కినట్లుగా విశద మవుతూంది. అప్పకవి—

వికటుకవులు కొన్ని వింతలు గల్పించి
కవిజనాశ్రయమున గలిపినారు.

---

6. దీనిని కనుగొన్నవారు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.

7. కిన్నెర, ఏప్రిల్, మే 1954 సంచికలలో 'నన్నెచోడ దేశికవి' అను వ్యాసం.

8. సుజాత, మే 1953 పుట. 61

9. తెనుగు కవుల చరిత్ర—నిడదవోలు వెంకటరావుగారు రచించినది, పుట 173—175.

అని వ్రాకుచ్చినాడు. అట్టి వాటిని తొలగించవలసిన అవసరముంది. కొన్ని కొన్ని రకాల రచనలను కొట్టిపారవేయుడానికి లేదు. కవిత్వంలో శుభాశుభ ఫలాల నిచ్చే గణాలు, అక్షరాలు, వాటి దేవతలు మొదలైనవి కూడ ఉన్నాయని వెనుకటివారి విశ్వాసం. కాబట్టి అట్టి రచనలు కూడ ఆ పుస్తకాలలోని భాగాలే. కొందరు లక్షణకర్తలు పుస్తకాన్నంతా ఆవిధంగా వ్రాసినవా రున్నారు. దానికి భైరవకవి రచించిన కవి గజాంకుశమే నిదర్శనం. అందువలన కవి జనాశ్రయంలోని అట్టి భాగాలను ప్రక్షిప్తాలని మూలకి తోసివేయవలసిన అవసరం కనపడదు. అవికూడ గ్రంథంలోని భాగాలే. గ్రంథ తత్త్వం గ్రహించి ఇతర కవుల రచనలను మాత్రం వేరుపరచాలి.

వేమనకవి ఆటవెలది తేటగీతలను, పండిత మల్లికార్జునుడు కందాన్ని చేపట్టినట్లే, కవి జనాశ్రయకారుడు కందపద్యాన్ని సాధారణంగా—కొన్ని లక్షణాదులలో తప్ప—వాడాడు. కాబట్టి అతని రచనను నిర్ణయించడానికి అదొకకొలత కావచ్చు. విమర్శకులు దీనిని పరిశీలించ గోరుతున్నాను.

తెలుగులో ఇతర లక్షణ గ్రంథాలు అచ్చయినకొద్దీ కవిజనాశ్రయ ప్రాముఖ్యం కూడ హెచ్చుతుందని చెప్పవచ్చు. ఈ పుస్తకాన్ని మూలము మాత్రమే గాక విపుల టీకతో అచ్చువేస్తే కాని తగినంత ప్రయోజనముండదు.

సత్యవేడు : ఓకుమళ్ల కామేశ్వరరావు.

'అబ్బాయి' పదము వ్యుత్పత్తి

భారతి 65, ఫిబ్రవరి సంచికలో శ్రీ ఉమాపతి పద్మనాభశర్మగారు రచించిన 'భాష—అలంకారము' అను వ్యాసము ప్రచురింపబడినది. అందు మానవుడు తన భావానుభూతులను భాషలో వ్యక్తీకరించుటలో సహజముగానే యలంకారముల నెట్లు వాడుకొనవలసి వచ్చునో చక్కగా వివరించిరి.

ప్రసక్తానుప్రసక్తముగా నాయా భాషలలోని కొన్ని పదముల వ్యుత్పత్తులను వివరించుచు, శర్మగారు కొన్ని తెలుగు పదముల వ్యుత్పత్తిని గూడ వ్రాసిరి. సావధానముగా పరిశీలించక పోవుటవలన నందలి కొన్ని తెలుగు పదముల వ్యుత్పత్తులు సరిగా వ్రాయలేదు. "అబ్బాయి—దీని వ్యుత్పత్తి భ్రాతృ వాచక హిందీ శబ్దము 'భాయి' నుండి నిష్పన్నము చేసికొన వచ్చును. (ఎబోయ్ అను ఇంగ్లీషు పదమునకుకూడ నామాట సన్నిహితముగా నున్నది.)" అను నుదాహరణము నిర్దుష్టము కాదు.

అబ్బాయి—అబ్బ + ఆయి=పిల్లవాడు. తమిళమున దీనికి సన్నిహితమగు పదము 'అప్పాయి' కలదు. 'అప్ప'='అబ్బ' పితృవాచకము. వర్గ తృతీయాక్షర యుక్త రూపముల కన్న వర్గ ప్రథమాక్షర యుక్త రూపములు ద్రావిడ భాషలలో ప్రాచీనము లనదగును. కావున 'అప్ప' లేక 'అబ్బ' యను వానికి 'ఆయి' యను స్నేహసూచక పద మదుకగా 'అప్పాయి' లేక 'అబ్బాయి' లేక 'అబ్బ' యను వానికి 'ఆయి' యను స్నేహసూచక పద మదుకుగా 'అప్పాయి' లేక 'అబ్బాయి' పదములు నిష్పన్నము లగును.

'ఆయి' యను వాత్సల్యతాది సూచకము 'అన్న + ఆయి= అన్నాయి', 'అమ్మ + ఆయి=అమ్మాయి', రామాయి, కిష్టాయి, సుబ్బాయి మొదలగు విధమున భాషలో గనబడుచున్నది. 'ఆయి' యనునది స్త్రీ పురుషోభయ సామాన్య మయినను, సూర్యరాయాంధ్ర నిఘంటువు "ఆయి— ఇది అమ్మ శబ్దము వలె స్త్రీల పేర్ల చివర నుపయోగింపబడును. మంగాయి, గంగాయి" అని స్త్రీమాత్ర పరముగ నుదాహరించినది. అయినను 'అబ్బాయి' రూపము నది పేర్కొనకపోలేదు.

'ఆయి' యనునది వాత్సల్యతాది సూచకముగా వాడుట నప్పకవి గుర్తించియున్నాడు.

"అప్ప యయ్య యన్న యర సవ్వ య మ్మక్క-
యాయి యను పదంబు లడుగు సంధు
లుభయమునకు జెల్లుచుండు నామాంక
వళులవంగ నూదబడకయున్న"

(అప్పకవీయము—తృతీయాశ్వాసము)

ఆయి యనుటకు "... దుష్కృయుంబు పూతమగు గంగాయుని బోడుగన్న దానమాడిన మాత్రన్." అను రాచపూడి వెంకటరయ్య పాటు ధారయును, "సాయుక కొల్చు రామ నరపాల నిరంతర సౌఖ్యదాయి సీతాయి సమస్త శోభన విధాయి మహాఫలసిద్ధి దాయిగన్." అను పలుకూరి గురవరాజు శమంతకమణి చరిత్రములోని పద్యమును నుదాహరణముగా నీయబడినవి.

భ్రాతృవాచక హిందీ శబ్దమునుండి 'అబ్బాయి' యుత్పన్నమైనదనుచో, 'అబ్బాయి' యను ప్రయోగముకాని, 'అ బాయి' లేక 'అ భాయి' యను త్రిక కార్యమునందలి రూపాం

తరములుగాని కన్పట్టవు. ఇక 'ఏటోయ్' అను వాఙ్మపద మునకు ధ్వని సామ్యము గూడ సంతగా లేదు. 'అ=భాయి' 'అబ్బాయి' యయినదేమో యని భ్రమపడుట కవకాశ మిచ్చిన ప్రతికార్య ప్రసక్తి కూడ నిందు లేదు.

"అత్త, అమ్మ, శబ్దములు వరుసగా తాత (:—ఽ= తండ్రి), మామలనుండి యేకాక్షరము దీసికొనబడి 'అ' కార ముతో స్త్రీ వాచకములై వారి యక్కలు (చెల్లెండ్రు) గా వర్త వంతములు." అను వ్యాసకర్త యూహ భాషాశాస్త్ర పరి జ్ఞానముపై నాధారపడినది కాదు.

వానిలో బదాదినున్న 'అకారము' సర్వనామము కాద గును గాని స్త్రీ వాచకము కాదు. ఆయా తెలుగు పదముల వ్యుత్పత్తిని గమనింపదలచినప్పుడు సజాతీయములగు నితర ద్రావిడభాషలలోని రూపములను గూడ బరిశీలింపవలసి యుండును. బంధు సంబంధ వాచకములగు నిట్టి పదముల చరిత్రను గురించి శ్రీ గంటి జోగి సోమయాజిగారు తమ 'ఆంధ్రభాషా వికాసము'న గొంత వివరించినారు. అఖిలభారత ప్రాచ్య విద్వత్సభలో (ఆల్ ఇండియా ఓరియంటల్ కాన్ఫరెన్సు)లో నా రిట్టి బంధుత్వ వాచకములగు తెలుగు పదములను గూర్చి యొక పరిశోధన వ్యాసమును నిరూపించినారు.

తెలుగు పదముల వ్యుత్పత్తిని శాస్త్రీయముగా నిరూ పించుచు నొక నిఘంటువును సిద్ధముచేయ నాంధ్ర విశ్ వవిద్యాలయమువా రొక 'పథకము' చేపట్టిరి గాని, దానిని గొంత కాలమయిన పిమ్మట విరమించుకొనినట్లు తెలియుచున్నది.

తెలుగున కొక (ఎటిమొలాజికల్ డిక్ష్నరీ) పద వ్యుత్పత్తి నిరూపక నిఘంటు వేర్పడు వరకు బహార్వ వ్యాసమున సంభవించినట్లు భ్రమ ప్రమాదములు జరుగు చుండును.

ఏవో కొన్ని తెలుగు పదముల వ్యుత్పత్తిని జేర్కొనుటలో బొరపాటు పడినను, శ్రీ పద్మనాభశర్మగారు తమ వ్యాసములో బ్రతిపాదింప దలచుకొన్న మూలాంశమున కెట్టి కొరత యును గలుగలేదని గ్రహింపగోరుచున్నాను.

సిద్ధిపేట: పరాశరం గోపాలకృష్ణమూర్తి.

రామరాజభూషణుడు - రసభంగము

"స్వైర విహారధీరలగు
సారస లోచనలున్న చోటికిన్
భోరున లాతివారు చొర
బోయినచో రస భంగమౌను."

అని వసురాజ నర్మ సచివుని నోట పలికించిన రామరాజ భూషణుడు అన్యాపదేశంగా పెద్దన్నగారిని హేళన చేస్తున్నట్లు కనిపిస్తున్నది. ప్రవరుడిమీద వరూధినికి కలిగిన అనురాగాన్ని అతడు మన్నించి ఆమెను అంగీకరించలేదు. 'ఏకత్రైవాను రాగ శ్చేత్' అన్నట్లు రసాభాసానికి వరూధిని అనురాగం ఒక ఉదాహరణ అవుతుంది. "అనౌచిత్య ప్రవృత్తత్వే ఆభాసోరస భావయోః" అన్నందున రస భావాలలో అనౌచిత్యం ఉన్నది. మరి "అనౌచిత్యా దృతే నాన్య ద్రసభంగస్య కారణం" అనుటచే అనౌచిత్యంవల్ల రసభంగం కలుగుతున్నది. అనగా రసాభాసమే రసభంగమని ఫలితార్థం.

స్వైర విహార ధీరయైన వరూధిని ఉన్నచోటికి లాతివాడైన ప్రవరుడు చొరబడడమే ఈ రసాభాసం లేక రస భంగం ఏర్పడటానికి కారణమైంది. అలాంటి ప్రమాదం ఏర్పడ కుండా జాగ్రత్త పడ్డాడు వసురాజ నర్మసఖుడు—అని రామ రాజ భూషణుని అభిప్రాయం కావచ్చు.

"కావ్యంలో అంగంగా మాత్రమే ఉండదగిన రసా భాసాన్ని అనుచితంగా విపులీకరించి 'అంగస్య ప్రధాన స్యాతి విస్తరేణ వర్ణనం' అని అంగ విస్తరమనే రస దోషానికి పెద్దన్న గారు లోనైనా"రని కూడా అతని ఉద్దేశం కావచ్చు. 'సారస లోచనలు', 'రసభంగ'మైనందున 'పాలోచనలు' అవుతారన్న వ్యాఖ్యానంకంటె ఇది కవి హృదయానికి దగ్గరగా ఉంటుంది. పెద్దన్నగారంటే రామరాజ భూషణుడికి స్పర్థ దండిగా ఉండే దన్న సంగతి ప్రత్యక్షర విదితమైన సత్యమే గదా!

నర్మ సచివుడు ముందుకు వెళ్ళితే గిరికాదేవి అమాం తంగా వరూధిని ప్రవరుడిని చేసినంత పనీ చేసేదేనా? అలా అని అతడు నిజంగా భయపడ్డాడా? మరి కొద్ది సేపటిలోనే అతడు కపటముని వేషంలో ఆమెముందు నిలబడలేదా? అప్పుడు అలాంటి ప్రమాద మేమీ సంభవించలేదే? రసభంగం కాలేదే? అంతేగాదు. పెద్దన్నగారి గంధర్వుడు వరూధినిని మారు వేషంతో మోసగించగా, రామరాజ భూషణుని కోలాహలుడు శక్తిమతిని బలాత్కరించి ఇంకా ఎక్కువ రసాభాసాన్నీ, రస భంగాన్నీ కలిగించలేదా?—అంటే, ఈ ప్రశ్నలకు రామరాజ భూషణుడు సమాధానం చెప్పడు. అంతే.

తిరుపతి: చెన్నాప్రగడ తిరుపతిరావు.

'కొంకణి' దేవతల భాషయగునా?

గోవా ప్రాంతంలో ప్రజలకు 'కొంకణి' వాడుక భాషగా ఉన్నది. గోవా తీర్మానాన్ని బలపరుస్తూ మైసూరు కౌన్సిల్ శ్రీ ఎస్. డి. గాంవ్‌కర్ ప్రసంగిస్తూ "కొంకణి దేవతల భాష. దేవతలు మాట్లాడుతారుకాని వ్రాయరు. అందుకే

కొంకణి భాషకు లిపి లేదు" అన్నారు. కొంకణి దేవతల భాష కావడం, దేవతలు మాట్లాడడమేకాని, వ్రాయక పోవడం అంతా విచిత్రంగా ఉన్నది.

ప్రాచీన కాలంనుంచి దేవ భాషగా పరిగణింపబడినది సంస్కృతము. అందువలననే 'గైర్వాణి' అని అన్వర్థ సంజ్ఞ వహించినది. ఇంతకూ దేవత లనగా ఎవరు? "విద్వాంగ్ సోహి దేవాః" (శత పథ బ్రాహ్మణము) లోల్లిటి విద్వాంసులు, రాజకీయవేత్తలు ప్రజానీకముచే గౌరవమునంది కాలక్రమేణ దేవత లైనట్లు తెలియుచున్నది. వారి భాష సంస్కృతమనుట నిస్సందేహము. దేవతలు సంస్కృత భాషలో రచించిన గ్రంథములు పెక్కులున్నవి. లిపిలేని భాషలు మనదేశంలో కొన్ని ఉన్నవి. లిపిలేని భాషలంతా దేవ భాషలేనా? కొంత కాలం క్రితంవరకు కోడు, సవర భాషలకు లిపిలేదు. కోడు భాషకు లింగం లక్ష్మీజీ పంతులుగారున్నూ, సవర భాషకు గిడుగు రామమూర్తిపంతులుగారున్నూ నూతనంగా లిపిని సృజించి, వ్యాకరణాలు గూడా వ్రాసియున్నారు. వాస్తవిక స్థితి ఇట్లుండగా 'కొంకణి' దేవతల భాష కావడమేమిటి?

ధేనువకొండ: భానుమూర్తి పండితారాధ్య.

భారత వర్షనామమెట్లు వచ్చినది?

సర్వ సాధారణముగ దుష్యంత కుమారు డగు భరతుని పేర మన భారతదేశమునకు భారత వర్షమను పేరు వచ్చినదను వాదము ప్రచారమునందున్నది. కాని పోతనార్యకృత శ్రీ మదాంధ్ర భాగవత పంచమ స్కంధ ప్రథమాశ్వాసమునందు ఋషభ వృత్తాంత వివరణ సందర్భమున నిట్లు చెప్పబడియున్నది:

సీ. భూవరుడను ఋషభుడు దన రాజ్యంబు
గర్మ భూమిగ నాత్మగాంచి జనుల
కందఱకును బ్రియంబగునట్లు కర్మతం
త్రం బెల్ల దెలువంగ దలచి కర్మ
ములు సేయుటకు గురువుల యొద్ద వేదంబు
సదివి వారల యనుజ్ఞను వహించి
శతమన్యు డిచ్చిన సతి జయంతీ కన్య
బరిణయంబై యుట్టి పడతి వలన

తే. భరతుడాదిగ సుతుల నూర్వురను గాంచె
నట్టి భరతుని పేరను నవని తలము
పురవరాశ్రమ గిరితరు పూర్ణమగుచు
నమరి భారత వర్ష నామమున నింపె.

ఈ రెండు వాదములలో నేది సమంజసమైనదో వివరించి సందేహ నివృత్తి గావింప విజ్ఞ మహాశయులను అభ్యర్థించుచున్నాను.

మచిలీపట్నము: చిట్టా రామకృష్ణ రావు.

ప్రజలు ప్రభుత్వం

శ్రీ జాన్ స్ట్రాచీ

ప్రజాస్వామ్య సంస్థలు పనిచేయడానికి ఒకరకమైన నాగరికతాస్థాయి ఉండాలి. ఆస్థాయి కిందికి దిగజారినప్పుడే లెనిన్ అభిప్రాయాలు వాస్తవమవుతాయి—అనే విషయాలను కాదనగలము అనుకోను. ఈ అభిప్రాయాన్నే నేను మరొకచోట ఈవిధంగా తెలిపాను: ప్రపంచంలో ఓడలకు రెండు పక్కలా ఒక గిరి గీస్తారు. దీనిని "ప్లిమ్‌సోల్ లైన్" అంటారు. ఓడలకు ఇరుపక్కలా ఇలాటి గిరి గీచి, అది నీటిలో మునగనంతవరకు ఓడలో బరువు వేయాలని, ఈగిరి నీటిలో మునిగేటంత బరువు వేయడం చట్టవిరుద్ధమని శిక్షార్హం చేయాలని బ్రిటిష్ పార్లమెంటు సభ్యుడు శ్రీ ప్లింసోల్ 19వ శతాబ్దంలో బ్రిటిష్‌పార్లమెంటులో ఒకబిల్లు ప్రతిపాదించాడు. అది శాసనమయిన తర్వాత ఈగిరికి అతని పేరుతోనే "ప్లిమ్‌సోల్‌లైన్" అనే పేరుపడింది. ఎందుకిలా చేయవలసి వచ్చిందంటే, పేరాసగల అప్పటి ఓడల యజమానులు తమ ఓడలతో అతి బరవులు ఎక్కించేవారు. దానివల్ల ఆఓడలు తుఫానులో చిక్కుకొని మునిగిపోవడం, ఓడలోని వారందరూ ప్రాణాలు కోల్పోవడం తరుచు జరిగేది.

నేనిప్పుడు సూచించే దేమిటంటే, వర్తమాన ప్రపంచంలోని దేశాలన్నిటికీ ఇరుపక్కలా అదృశ్యమైన అలాటి గిరి "ప్లిమ్‌సోల్‌లైను" గీవాలని. రాజ్యమనే ఓడ ఆ గీతకు పైగా నీటిలో తేలుతూ ఉంటే, ప్రజాస్వామ్య సంస్థలు పనిచేయగలుగుతాయి. కష్టాలభారంతో ఆ గిరి నీటిలో మునిగిపోయేట్టయితే, ప్రజాస్వామ్యం సాధ్యంకాదు. ఆ గిరికి దిగువగా, మామూలు అభివృద్ధిలేని దేశాలలో ప్రజాస్వామ్య సంస్థలను నెలకొల్పడానికి ప్రయత్నించడం, తరుచు హానికరంగాను అవుతుంది. ఇలాటి సందర్భాలలో ఏదో రూపమైన నిరంకుశ ప్రభుత్వం, ఎన్నిలోపాలున్నప్పటికీ, అనివార్యం. కొన్నిదేశాలు నిరంకుశ ప్రభుత్వాలు స్థాపించుకొన్నందుకు మనం వాటిని విమర్శించడం కేవలం వృధా. ఎందుకంటే, ఆ దేశాలు ఎన్నో చిక్కుల అతిబరువుతో సతమతమవుతున్నందువనే నిరంకుశ ప్రభుత్వాలను నెలకొల్పుకోవలసివచ్చింది. కాని, ఈప్లిమ్‌సోల్ గిరికి మీదుగా అభివృద్ధి చెందిన దేశానికి—అంటే, నిరక్షరాస్యత, దారిద్ర్యం, జాతిభేదాలు, ప్రపంచంలోని పెక్కుమంది మాత్రమే భరించవలసిన ఘోరభారాలు లేని దేశానికి—ప్రజాస్వామ్య సంస్థలు అమూల్యమైన లాభం కలిగిస్తాయి.

ఏమైనా, ప్రజాస్వామ్యమనేది అప్పటంగా, అంతా ఒక అఖండంగా లభించే వస్తువేమీ కాదు. ఒకదేశంలో అది ఉండే అవకాశం లేకపోవచ్చు; అది లేకమపోవచ్చు. అందువల్లనే నేను మామూలుగా ప్రజాస్వామ్యం గురించి చెప్పడంలేదు. నిర్దిష్టమైన ప్రజాస్వామ్య సంస్థలను గురించే చెప్పాను. సామాన్య న్యాయం గురించి, భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యం గురించి, ట్రేడ్‌యూనియన్‌లను నిర్మించుకొనే స్వేచ్ఛను గురించి, పరస్పరం పోటీచేసే రాజకీయపక్షాలను స్థాపించుకొనే స్వాతంత్ర్యం గురించి, స్వేచ్ఛగా వోటు చేయడాన్ని గురించి చెప్పాను. ఈ సంస్థలే మనం ప్రజాస్వామ్యం అనే దానికి ప్రోది చేస్తాయి. ఇవి ఉత్తరోత్తరా పరస్పరాశ్రయాలనడం వాస్తవం. కాని, కొన్ని ప్రధాన ఘట్టాలలో ఒకదేశం ఈసంస్థలలో కొన్నిటినే ఆచరణలో పెట్టవచ్చు. ఉదాహరణకు ఒకదేశంలో అభిప్రాయ ప్రకటన స్వాతంత్ర్యం లేకపోయినా, సర్వజన నియోజనాధికారంతో ఎన్నుకొన్న ప్రభుత్వాలు లేకపోయినా, సామాన్య న్యాయం సమర్థంగా ఉండవచ్చు. పాకిస్తాన్, ఘనావంటి పెక్కు కొత్త దేశాలు రాజకీయమైన

వియోజనాధికారంతో ఏర్పడే ప్రజాస్వామ్యాన్ని కొనసాగించ లేకపోయినా, సామాన్య న్యాయాన్ని మాత్రం కొంతవరకు కొనసాగిస్తున్నాయి.

ప్రపంచంలో చారిత్రకంగా సుస్థిరంగా స్థాపించ బడినవి, ప్రాచీనతమమైనవి, సంపూర్ణమైనవీ అయిన పశ్చిమ యూరోప్ అమెరికావంటి ప్రజాస్వామ్యదేశాలు తమ ప్రజాస్వామ్య సంస్థలను క్రమంగా, ఒకదాని తర్వాత ఒక్కటిగా అభివృద్ధి చేసుకున్నాయి. ఉదాహరణకు: బ్రిటన్‌లో శతాబ్దాల పాటు సమర్థమైన సామాన్య న్యాయమే ఉంది కాని, సర్వజన వియోజనాధికారమనేది లేదు. ట్రేడ్ యూనియన్‌లను నెలకొల్పే స్వాతంత్ర్యం కూడలేదు. ట్రేడ్ యూనియన్‌లను నెలకొల్పుకొనే స్వాతంత్ర్యంకోసం గడచిన వంద సంవత్సరాలలోను జరిగిన సుదీర్ఘమైన పోరాటాన్ని నేను ఇదివరకే వివరించాను. కనుక బాగా అభివృద్ధిచెందిన ప్రజాస్వామ్యదేశాలవారెవరైనా కొత్తరాజ్యాలు కొన్నింటిలో ఉన్న పరిస్థితులను హేళన చేయడం హానికరం. ఆరాజ్యాలు తమ దేశాలలో ఏమాత్రం కొద్దిపాటి ప్రజాస్వామ్య పద్ధతులను ప్రవేశపెట్ట గలిగినా సంతోషించవలసిందే.

కనుక వీటన్నిటి దృష్టి తో కమ్యూనిస్ట్‌దేశాల పరిస్థితిని ఆలోచించవలసి ఉంటుంది. యూరోపియన్ కమ్యూనిస్ట్ దేశాలన్నిటిలోను ప్రజాస్వామ్య సంస్థలు పనిచేయగలిగిన పూర్వ పరిస్థితులు ఏదోవిధంగా ఉన్నవనడం నిస్సందేహం. అయితే అవి ప్రయోజన శూన్యంకావడం విచారకరం. పోలెండు ప్రజలు, హంగేరీవారు, జెక్‌ప్రజలు, రుమేనియావారు, బల్గేరియా ప్రజలు, రష్యనులు ప్రజాస్వామ్య సంస్థలను నిర్వహించడానికి తగినంత చదువులేనివారు, నిరక్షరాస్యులు, సామాన్య నాగరికత లేనివారు అనడం హాస్యాస్పదమేకాక, అవమానకరంకూడా.

వారికి తగినంత చదువు, నాగరికత ఉన్నాయి. వారు ప్రపంచంలోని అత్యంత సమర్థులు, మేధావులు అయిన ప్రజలలో ఒకరు. కాని, కమ్యూనిస్ట్ వితండ సిద్ధాంతం వారిసాంఘికాభివృద్ధిని కుంటుపరచి, తాము కోరుకునే రాజకీయ, సాంఘిక, ఆర్థికసంస్థలను ఎన్నుకునే స్వాతంత్ర్యం వారికి లేకుండా చేస్తున్నది. ఇది విషాదకరం.

అయితే, ప్రజాస్వామ్యం ప్రపంచమంతా విస్తరించ గలదా? ప్రపంచంలోని పెక్కు ప్రాంతాలకు ప్రజాస్వామ్య విధానం ఇంకా వర్తింపజేయదగింది కాదని నేనూ భావిస్తున్నాను. కాని, ఇలా భావిస్తున్నంత మాత్రాన ప్రజాస్వామ్య విధాన మనేది, కొన్నిదేశాలలో—ముఖ్యంగా చారిత్రకంగా ప్రత్యేకాభివృద్ధి పొందిన అట్లాంటిక్ సముద్రతీర దేశాలలో కేవలం తాత్కాలిక దశేనని కాని, ప్రపంచంలో విస్తరించదని కాని కాదు.

ప్రజాస్వామ్యం ప్రపంచంలో నిష్కర్షగా తమనిర్ణయాలను ఇతర దేశాతో అంగీకరింపజేయగల ప్రముఖ దేశాలలో కచ్చితంగా వ్యాపిస్తున్నది: అత్యంతాభ్యుదయాభివృద్ధులు గలిగి, అందువల్లనే అత్యంత శక్తిమంతమైన దేశాలలో ప్రజాస్వామ్యం ఆచరణ సాధ్యమని రుజువవుతున్నది. కనుక, ప్రజాస్వామ్య విధానమే భావిరాజకీయ పద్ధతి అనడానికి ఇదే హామీ.

ఇప్పటికీ, మరెప్పటికీ కమ్యూనిస్ట్‌దేశాలు కూడా అభివృద్ధి సాధించినకొద్దీ, అన్నిటికన్నామించి ప్రజలు విద్యావంతులైనకొద్దీ, ఏదో ఒక ప్రజాస్వామ్య పద్ధతిని అనుసరించగలవని నేను మరొక మారు చెబుతున్నాను. కమ్యూనిస్ట్ దేశాలో, అభివృద్ధిచెందని కమ్యూనిస్టుదేశాలో 'వెస్ట్‌మిన్స్టర్ మాడల్' అని తరచు మనం వ్యవహరించే—అంటే బ్రిటన్‌లో ఉన్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిగాని, "వాషింగ్టన్ మాడల్" అమెరికాలో ఉన్నట్టు అధ్యక్షుడున్న ప్రజాస్వామ్య (ప్రెసిడెన్షియల్ డెమోక్రసీ) పద్ధతినిగాని తప్పనిసరిగా అనుసరిస్తాయని కాదు. బహుశా కొత్తరకం, తప్పక కొత్తరకం ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవచ్చు. లోగడ నేను చెప్పినట్టు వాస్తవమైన ప్రజాస్వామ్య పద్ధతి ఎన్నికలను భౌగోళిక ప్రాంతాలను బట్టికాక, ఫ్యాక్టరీలు, వ్యవసాయక్షేత్రాలు, ఉత్పత్తి కేంద్రాలను బట్టి నడపాలని రష్యా కమ్యూనిస్టులు మొదట అనుకున్న ఉద్దేశానికి అవకాశం కలిగించి ప్రయత్నించాలని భావిస్తున్నాను. ఈఉద్దేశం చిత్తశుద్ధితో భావించిందనే నా అభిప్రాయం. కమ్యూనిస్టులు అపద్ధతివేకాక, నిజమైన ప్రజాస్వామ్య పద్ధత

అన్నింటినీ తుడిచి పెట్టివేశారు. కాని, వాస్తవమైన ప్రజాస్వామ్యం—అంటే నిజమైన ప్రజల వాంఛితం—అమలు పరచగోరితే మాత్రం సోవియట్ ప్రజలు మొదట చెప్పిన సోవియట్ ఉద్దేశానికే వెళ్లవలసి ఉంటుంది.

ఇంతకూ నేను చెప్పేదం ఏమిటంటే, ప్రజాస్వామ్య పద్ధతి స్వరూపాలు విభిన్నమైనవని. పాశ్చాత్య దేశాలలో రూపొందిన ఒకటిరెండు పద్ధతులే ఆఖరువని కాదు. ఒకపద్ధతి రెండవదానికంటె అంతరంగా మెరుగని ఎవరూ చెప్పే స్థితిలో లేరు. అసలు విషయమేమిటంటే, స్వేచ్ఛగా ప్రజల ఎన్నుకోడం.

నామాటల పర్యవసానమిది: ప్రజాస్వామ్య పద్ధతి సర్వరోగసంజీవనంకాకపోయినా, ఉత్తరోత్తరా భవిష్యత్తుకు తగిన రాజకీయపద్ధతి అని రుజువవుతున్నది. అది సర్వరోగ సంజీవనం ఎందుకు కాదన్నానంటే, మొదటిది: ప్రపంచంలోని విస్తృతభాగాలకు అదింకా తగినది కాదు. రెండవది: తగినదని ఆచరణలో పెట్టినా, మనకాలంలోని అతి కఠినసమస్యలను కొన్నిటిని పరిష్కరించలేక అది విఫలమవుతుంది.

ఏమైనా, ఉత్తమ విద్య, ప్రభుత్వ వ్యవహారాలలో పాల్గొనగల సమర్థత గల వివిధ ప్రజా సముదాయంతో ఉన్నతాభివృద్ధి పొందిన సమాజాన్ని నిర్వహించగల ఉత్తమమార్గం— ఉత్తరోత్తరా సహించదగిన ఏకైకమార్గం— ప్రజాస్వామ్య విధానమే గనుక, అదే భావి రాజకీయ వ్యవస్థ అని భావిస్తున్నాను. ఇలాంటి ప్రజల సమాజాలు చాల శక్తిమంతమైనవి, పలుకుబడి గలవీ గనుక తక్కిన ప్రపంచానికి మార్గదర్శకంగా ఉంటాయి.

కాని, ఇది ప్రజాస్వామ్యాన్ని ప్రయోజనాత్మకంగాను, నిమితంగాను చూడడం వంటిది. ప్రజాస్వామ్యవిధానం అత్యాధునిక సమాజాలను నడిపే అత్యంతాచరణీయ మార్గం మాత్రమే కాదు; అంతకన్నా గొప్పది. ప్రతిమానవ మాత్రుని తుది విలువను గుర్తిస్తున్న ఏకైక రాజకీయ వ్యవస్థ అదే. నేడు విద్యలోను, అవకాశాలలోను, ఒక మానవుని సాటిమానవుని నుంచి బహుశా వేరుచేసే సహజశక్తిలోను కనిపించే పెద్దతేడాలకు, అగాధాలకు అతీతంగా మానవ మాత్రులందరిలోను మానవులుగా ఆఖరుకు సమానత్వమున్నది ఉంది—అనేనమ్మకానికి బాహ్యరూపం కల్పించేది అదే. మనలో ఎవ్వరూ ఏ ప్రభుత్వమైనా సరే, ఒకరు మరొక మానవునికంటె సహజంగానే మెరుగని చెప్పడానికి అర్హతలేదనే నమ్మకాన్ని ప్రజాస్వామ్యం స్పష్టపరుస్తుంది. ఒక్కమాటలో—ప్రజాస్వామ్యం స్వేచ్ఛామానవుల రాజకీయవ్యవస్థ, గులాముల — బానిసల రాజకీయ వ్యవస్థ కాదు.



అప్పకవి పూర్వికుల నివాసము

శ్రీ గుండి వేంకటాచార్యులు

షాదనగర్ బ్లాకులో విద్యా విస్తరణాధికారిగా పనిచేయు చున్నపుడు ఆ బ్లాకులోని గ్రామములను తిరిగి చూచు నవకాశము లభించినది. అట్టి గ్రామములలో కాకునూరు ఒకటి. కాకునూరును, తత్పరిసర ప్రాంతములను దర్శించిన వెంటనే కాకునూరి అప్పకవి స్మృతి పథమున వచ్చెను. ఈ కాకునూరే అప్పకవి పూర్వికుల నివాసమై యుండవోపునను సందేహము కలిగినది. పిదప అప్పకవీయమును దీసి పీఠికను శ్రద్ధతో చదివితిని. అందులో 73 వ పద్యము నా సందేహమును స్థిరపరచినది.

"బాలుడై కాశికా పట్టణంబున కేగి
బ్రహ్మేంద్రునొద్ద శాస్త్రములు చదివె
బ్రహ్మ రాక్షసిచేత గ్రమము చెప్పంబడి
కట్టిన గండ భాగంబునొందె
చరికొండ సీమలో సంతరించెను గాకు
నూరను సర్వాగ్రహార మొకటి
నిడుదవెల్లిని బొద్దినేపల్లి నవదళ
పురిని మాన్య క్షేత్రములు గడించె
నవని సర్వజ్ఞ డగుట గంగాంబికాధి
రాము డగుటను విఖ్యాతి సోముడనగ
మనియె నిల గాకునూరి తిమ్మన సుతుండు
సోము డభినవ చూత సద్గ్రామమునను."

పై పద్యములో చెప్పబడిన గ్రామ నామములు కాకునూరు, నిడుదవెల్లి, బొద్దినేపల్లి, నవదళపురి, అభినవ చూత సద్గ్రామము.

ఈ గ్రామముల గూర్చి అప్పకవీయ పీఠికలో వ్రాయబడిన వాక్యములలో "సోమయ అభినవ చూత సద్గ్రామముల నుండినట్లు పీఠిక 73 వ పద్యమునుబట్టి తెలియుచున్నది. ఈ గ్రామము పేరు క్రొత్త మామిడిపల్లె అయియుండును. మామిళ్ళపల్లె యొకటి బాపట్ల తాలూకాలో నున్నది. మామిళ్ళపల్లె యొకటి బాపట్ల తాలూకాలో నున్నది. మామిళ్ల పల్లి (అగ్రహారము) ఒకటి నూజివీడు తాలూకాలో నున్నది" అని లక్ష్మణరావుగారు ఆంధ్ర విజ్ఞాన సర్వస్వములో వ్రాసినారు.

పై పంక్తులలో నొక్క అభినవ చూత సద్గ్రామము (క్రొత్తమామిడిపల్లె) మాత్రమును పేర్కొని యది బాపట్ల తాలూకాలోనో, లేక నూజివీడు తాలూకాలోనో యుండి నట్లూహించిరి. కాని, మిగత గ్రామముల గూర్చి చర్చింప నైనలేదు. ఇక నేను దర్శించిన షాదనగరు తాలూకాలోని కాకునూరు సమీపమున నిడుదవెల్లి యను గ్రామము కలదు. నిడుదవెల్లికి సమీపమునందే 'శేమామిడి' అను గ్రామము కలదు. ఈ 'లేమాడి'నే యప్పకవి 'అభినవచూత సద్గ్రామము'గా సంస్కృతీకరించియుండునని తోచుచున్నది. కాకునూరికి సమీపములోనే తొమ్మిది రేకుల అను గ్రామమున్నది. నవదళపురి ఈ 'తొమ్మిది రేకుల' అను దానికి సంస్కృతీకరణమని స్పష్టపడుచున్నది. ఇక శేమామిడికి దగ్గరలోనే బోదవాం పల్లి యను గ్రామము కలదు. పై పద్యమునందు చెప్పబడిన బొద్దినేపల్లియే ప్రజల యుచ్చారణమున కొద్దిమారుపాటు చెంది ఈనాడు బోదవాంపల్లియని పిలువబడుచున్నదని తోచు చున్నది.

కావున పైని పేర్కొనబడిన గ్రామములన్నియు (1) కాకునూరు, (2) నిడుదవెల్లి, (3) అభినవచూత సద్గ్రామము (శేమామిడి), (4) నవదళపురి (తొమ్మిది రేకుల), (5) బొద్దినేపల్లి (బోదవాంపల్లి) చాల దగ్గరలోనే కలవు.

అప్పకవి పూర్వికుడు సోమయ శేమామిడి (అభినవ చూత సద్గ్రామము) నివాసముగా గలవాడై సమీపమునగల కాకునూరును సర్వాగ్రహారముగా నొంది, నిడుదవెల్లి

బొద్దివేపల్లి (బోదనాంపల్లి) తొమ్మిది రేకుల (నవదళపురి)లో మాన్య క్షేత్రములు గడించిన వాడని నిశ్చితమగుచున్నది. ఇక ఈ కాకునూరు ననుసరించియే అప్పకవి వంశజులకు కాకునూరివారు అని వాడుక వచ్చియుండును.

ఇక అప్పకవి కామెపల్లి గోపాలదేవుని భక్తుడు. ఇతడు కామెపల్లిలో నుండగా స్వప్నము వచ్చినట్లు, అది అక్కడి మాతృ సంబంధికులు విన్నట్లును చెప్పుకొన్నవాడు. దీనిని బట్టి పలువు రూహించినట్లు అప్పకవి మేనమామల ఇంటనే పెరిగి విద్యావంతుడయ్యెనని తెలియుచున్నది. ఇతడు మేనమామల ఇంట పెరుగుటకు కారణమేదియో, కాకునూరును విడిచి కామెపల్లి కెప్పు డేగుదెంచెనో తెలియరాదు. కాని మొత్తముమీద అప్పకవి కుటుంబము కామెపల్లికి వచ్చి నివసింప సాగినదని చెప్పవచ్చును.

కాకునూరు తొమ్మిది రేకుల మధ్య గల ప్రాంతము చిన్న గుట్టలతో కూడిన మెట్ట ప్రాంతము. పూర్వము దానిని చరిగొండసీమ యనెడివారని అప్పటి వృద్ధులు కొందరు తెలిపియున్నారు.

కావున అప్పకవి పూర్వికులు పోమయ వంశజాలు ఈ షాదనగర్ తాలూకాలోని లేమామిడి గ్రామవాసులై యుండినట్లును, అప్పకవి తన మేనమామలయింట పెరిగి యచ్చటనే తన కుటుంబముతో పిదప నివసించెననియు స్థిరీకరింపవచ్చును. చారిత్రకులు పరిశోధించి సత్యమును దెల్పుదురుగాక యను కోరికతో నా యీ యనుభవమును వ్రాసియున్నాడను.

బాలవ్యాకరణ రమణీయము

శ్రీ కొమ్మనమంచి జోగయ్యశర్మ

బాల వ్యాకరణమునకు నాడు మొదలు నేటి దనుక నెన్నియో టీకలు, సమీక్షలు, వ్యాఖ్యానములు, విమర్శనములు, వెలువడినవి. అవి యన్నియు చాలవరకు సూత్రార్థ వివరణము, లక్ష్య లక్షణ సమన్వయము, రూప సాధన ప్రక్రియా ప్రదర్శనము మున్నగు విషయములనే ప్రధానముగా ప్రదర్శించినవి. శ్రీ దువ్వూరి వేంకట రమణశాస్త్రిగారు ఆ పాత పద్ధతులనే యనుసరించి పిష్టపేషణము సేయక, 'రమణీయమగు నూతన మార్గము నవలంబించి "రమణీయము" అను సమీక్ష రచించిరి. ఆ గ్రంథ పీఠికలో వారు వ్రాసిన వాక్యము లివి :

"వ్యాఖ్యాన పద్ధతిని సూరి మాటల కర్థము వివరించి తెలుపుట అనావశ్యకము కాదుగాని, అంతమాత్రమగాక, ఆయన ఏమనుకొనుచు, ఎట్లు చర్చించుకొనుచు, ఎట్టి తలంపులతో ఏ వాక్యము రచించియుండురో, ఆ హృదయ రీతిని గ్రహించు ప్రయత్నము మిక్కిలి యావశ్యకమని నా తలంపు. అట్టి దృక్పథము తోడనే ఈ సమీక్ష గావించితిని."

అనగా, శాస్త్రిగారు పూర్వ వ్యాఖ్యాతలవలె 'పాడినదే పాటగా' ఏదో వివరణము వ్రాసిపారవేయలేదు. మరి, సుమారు నలుబదేండ్లు బాల వ్యాకరణ పఠన పాఠనాదులతో చిన్నయ సూరిని బాగుగా అర్థము చేసికొని, అతని హృదయమునకు సన్నిహితులై, ఆ గ్రంథమునకు ఒక వినూతనము, విశిష్టమునగు ఆమోదమును గలిగించిరి. ఇతర వ్యాఖ్యాత లెవ్వరును స్పృశించి ఎరుగని విశేషాంశముల నెన్నిటినో ఆవిష్కరింప జేసిరి. సూరి గూడ ముచ్చటపడు ఘట్టముల నెన్నిటినో ప్రదర్శించి ఆంధ్ర పండిత లోకమునకు ఆమెతలు వెట్టిరి.

రమణీయమనెడి ఈ బాల వ్యాకరణ సమీక్షను పూర్వోత్తర భాగములుగా విభజింపవచ్చును. పూర్వ భాగమున 1. అవతారిక, 2. జీవిత సంగ్రహము, 3. గ్రంథావతరణము, 4. ప్రయోగ పరిశీలనము, 5. రచనా ప్రణాళిక, 6. పాండితీ పటిమ, 7. శీల సౌమ్యత, 8. ఉక్తి లాలిత్యము, 9. వ్యాఖ్యాన గ్రంథములు, 10. అనువాద వివేచనము అను పది ప్రకరణములు గలవు.

అవతారికలో వేంకటరమణశాస్త్రిగారు తమ ఈ సమీక్షా రచనా సంకల్ప విధానాదులను, జీవిత చరిత్రలో చిన్నయ సూరి జీవిత విశేషములను ఉగ్గడించిరి.

గ్రంథావతరణ ఘట్టములో చింతామణ్యాది ప్రాచీనాంధ్ర లక్షణ గ్రంథముల స్వరూప స్వభావములను క్లుప్తముగా వివరించి, చిన్నయసూరికి సమకాలమునను, ఇంచుక పూర్వమునను వెలసిన వ్యాకరణముల పుట్టుకకు కారణము నిరూపించి, సూరికి వ్యాకరణ రచనా సంకల్ప మేల కలిగెనో, అందులకై యాత డెట్టి పరిశ్రమ గావించెనో, బాల వ్యాకరణా విర్భావమునకు పూర్వ రంగములుగా నాత డేయే ప్రక్రియ లవలం

టించెనో, తుదికి బాల వ్యాకరణ రచన కాతడెంత పరిశ్రమించెనో సప్రమాణముగా వివరించిరి.

నాల్గవది ప్రయోగ పరిశీలన ప్రకరణము. సూరి సంస్కృత వ్యాసకర్తల సరళియందు గౌరవాదరములు కలవారు గాన వారివలెనే తాను తన సూత్ర విధులకు ప్రమాణములుగా తాను సేకరించిన కవి ప్రయోగములను ఎక్కడి కక్కడ చూప దలపడయ్యెను. అట్లని అసలే చూపకపోను లేదు. సాధారణ విధుల యొద్దగాక విశేషములని తోచిన తావులందు కొలది ప్రయోగములు ప్రదర్శించియు నున్నారు.

సూరి పరిశ్రమను, ప్రయోగ సంగ్రహమును, ప్రయోగ ప్రామాణ్యమును, తత్ ప్రదర్శన విధానమును, శబ్దసాధుతా నిర్ణయ దృక్పథమును సూక్ష్మముగా నిదానించి చూపు నెట్టి నోపికచాలక, స్థూలముగా నాలోచించువారు కొందఱు గలరు. అట్టివారు చిన్నయసూరికి భారత కవులే ప్రామాణికులనియు, ప్రబంధ కవుల ఎడ నాతనికి ప్రామాణ్యము లేదనియు, ప్రబంధ ప్రణేతలగు మహా కవుల ప్రయోగముల నాతడు నిరాకరించుననియు, నతనిది మిక్కిలి సంకుచిత భావమనియు ఏమేమో యనుచుందురు.

ఇట్టి భావములన్నియు అపరిశీలన మూలకములనియు, అనవబోధ కల్పితములనియు నిరూపించి, భాషా స్వరూప నిరూపణమునను, ప్రయోగ పరిశీలనము నెడను సూరి విశాల హృదయము, వివేచన, దక్షత, పరిశోధన పటిమ, లోకజ్ఞత, బాల వ్యాకరణమున లక్షణ విశేషములు నిరూపించు పట్టులందు ప్రబంధములను గూడ ప్రమాణముగా పరిగ్రహించుట మున్నగు నంశములన్నియు సోదాహరణముగను, సోపపత్తికముగను ఈ ప్రకరణమున వివరింపబడినవి.

'రచనా ప్రణాళిక' యనెడి ఐదవ ప్రకరణములో చిన్నయసూరి బాల వ్యాకరణము రచించుటలో నెట్టి ప్రణాళిక యవలంబించెనో, మొత్తము గ్రంథమునంతను పది పరిచ్ఛేదములుగా విభజించుటలో నాతని తలంపెట్టిదో, ఏయే పరిచ్ఛేదములలో నే యే విషయములున్నవో, సూత్రములు, వృత్తులు, వార్తికములు రచించుటలోను, లక్ష్యములను ప్రదర్శించుటలోను అతని తలంపెట్టిదో, సంజ్ఞలు, ఇత్సంజ్ఞలు, పరిభాషలు మున్నగు వ్యాకరణ సాంకేతికములలో నేవిని పూర్వ గ్రంథములనుంచి గ్రహించి నేవిని తానై స్వయముగా కల్పించెనో, ఆ పరిగ్రహణములోగాని, ఆ పరికల్పనములోగాని అతని యాంతర్య మెట్టిదో, గణ పరిగణనము నెడను, కార్య విధానముల పట్టులను సూరి ఎంత జాగరూకత వహించెనో మున్నగు నంశములు కూలంకషముగా చర్చింపబడినవి.

అరవది 'పాండితీ పటిమ'. చిన్నయసూరి తర్క వ్యాకరణ న్యాయాలంకారాది శాస్త్రములయందు గట్టి పండితుడనియు, సర్వ దర్శన సంగ్రహ కుసుమాంజలి మహాభాష్య శ్రీ భాష్య భగవద్విషయాది పాఠ ప్రవచన పారీణుడనియు, అనేక భాషా కోవిదుడనియు నిం దుగ్గడింపబడినది. సూరికి గల శాస్త్ర పాండిత్యము పైపై మాటలతోగాక, బాల వ్యాకరణ సూత్రోదాహరణముల మూలముననే నిరూపించుట శాస్త్రిగారి లోతైన విమర్శన శక్తికి నిదర్శనము.

అట్టి సర్వతోముఖమగు పాండిత్యముగల సూరి శీల స్వభావము లెట్టివై యుండునో, అవి బాల వ్యాకరణమున నెట్లు ప్రతిఫలించినవో 'శీల సామ్యత' యనెడి ఏడవ ప్రకరణమున వివరింపబడినవి.

సూరి హయగ్రీవ మంత్రోపాసకుడు. ప్రపత్తి వైభవము గలవాడు. ఆధ్యాత్మిక ప్రవృత్తియందు అత్యంతాసక్తి గలవాడు. నిత్య దేవతార్చనము (తిరువారాధనము) మున్నగు సాంప్రదాయిక కార్యకలాపమును శ్రద్ధా భక్తులతో సాగించుచు, నైష్ఠిక జీవితము నడపుకొన్నవాడు. స్ఫురద్రూపియై ఎల్లపుడును పరిశుభ్రములై ఇంపు గొలుపు ధవళ వస్త్రములు ధరించువాడు. ధోవతి ఉత్తరీయమేగాక సన్నని పొడవైన అంగరఖాను (చొక్కాయి) వేసికొనుచుండువాడు. సులోచనము లుపయోగించువాడు. ఎవ్వరితోడనేని నగుమోముతో మృదు మార్గమున భాషించుచుండువాడు. ఇట్టి విశేషములు కొన్ని సూరి జీవిత చరిత్రములను బట్టి తెలియుచున్నది.

ఇంతియేగాక, సరళ ఘూకరణ వైముఖ్యము, ప్రసంగ మార్దవము, మాన్యజన గౌరవము, సర్వమత సామరస్యము మున్నగు సూరి సౌశీల్య పరిణతారీతులు బాల వ్యాకరణముననే ప్రతిఫలించునని గూడ సోదాహరణముగను సోపపత్తికముగను చూపి చెప్పినారు శాస్త్రిగారు.

'ఉత్తలావిన్య' మనెడి ఎనిమిదవ ప్రకరణము శాస్త్రిగారి ప్రతిభార్ణవోద్గీర్ణమగు విచిత్ర వచనము. ప్రకరణ ప్రారంభమున వారు వ్రాసిన ఈ వాక్యములు పరిశీలింపుడు :

“చిన్నయసూరి ఈ దేశమందలి బాల బాలికల కందరకు నొక తరగతి నేర్పరచి తా నధ్యాపకుడై బోధించుచున్న తీరు, ఈ గ్రంథమునందు పెక్కు తావుల గోచరించుచు నాతని యధ్యాపనోత్సాహమును వెలువరించుచుండును.

“తాను బోధింపదలచినది, ప్రాచీన భాషా లక్షణము. ఎదుట నున్నవారా, బాలకులు, చిన్న వయసువారు. కావున చెప్పెడు మాటలు శుష్కములై, యుదాహరణ సమన్వయ

మాత్ర ప్రయోజనములై, చప్పనివయి యుండరాదు. మఱి, మృదు మధురములై, సరసములై, నీతి బోధకములై, గంభీర భావ గర్భితములై, పురాణ కథా స్ఫోరకములై, ప్రౌఢ యుంగమములై యుండవలయుననియుఁ దలంచెను. అంతియ గాదు. తిక్తములగు నౌషధములను తీయ తియ్యని యనపానములతో రంగరించినట్లు క్లిష్టములగు వ్యాకరణ ప్రక్రియా భంగులను లలితములగు సూక్తులతో మేళవించి బాలురు విషయ గ్రహణ క్లేశము మరచి యుల్లాసముతో గ్రహించునట్లు బోధించుటయు బాల వ్యాకరణ రచనలో వారని ప్రధాన దృక్పథము. కావుననే గ్రంథారంభమున:

'అనయము లలితోక్తులతో
నొనరుపడం గూర్చి లక్ష్యయోజన మొప్పం
గను బాల వ్యాకరణం
బనఁగా లక్షణ మొనర్తు నాంధ్రంబునకున్'

అని యాతడు తన హృదయము నావిష్కరించి యుండెను. తాను ఏ విషయమును వివరించినను, ఏ లక్ష్యము చూపినను, అందు కుదిరినంత వట్టు అంతర్వాహినిగా లాలిత్య రీతి గోచరించి, బాలురకు నుత్సాహ జనకమై యాకర్షకము కావలయునని యాతని సంకల్పము.

"కష్టములు, కఠినములగు వ్యాకరణాంశములను వివరించునపుడు గూడ లలితోక్తుల తోడనే రచన సాగింప సంకల్పించుటయు, ఆ విధానమును తుదముట్ట నిర్వహించుటయు లాక్షణికులలో నొక్క చిన్నయసూరికే చెల్లినది. క్లిష్ట కర్కశమైన వ్యాకరణాంశము గూడ నాతని పలుకుబడి తీరులో మనోహరమగు కావ్యత్వ సిద్ధి పొందినది. ఇదిమాత్రము ఏ వ్యాకరణమునందును లేని వింత."

ఈ విధముగా శాస్త్రిగారు సూరి యాంతర్యమును సూక్ష్మదృష్టితో గ్రహించి, బాల వ్యాకరణ రచనము నెడ సూరి చూపిన లలితోక్తి చాతురి ఎట్టిదో చమత్కారముగా నిందు ప్రదర్శించినారు. లలితోక్తులతో వ్యాకరణము రచించుటకు సూరి ఎంత నేర్పు చూపెనో, ఆ చాతురి నీ ప్రకరణమున ప్రదర్శించుటకు శాస్త్రిగారు వేయిరెట్లు పనితనము చూపిరి. ఆ చాతుర్య మెఱుగుటకు ఈ ప్రకరణమునంతను తుద ముట్ట నిదానముగా పరికింపవలయునేగాని, యొండు రెండు మాటలతో నిట చూసి చెప్పుట యలవిగాని పని.

వ్యాఖ్యాన గ్రంథము లనెడి తొమ్మిదవ ప్రకరణమున కల్లూరివారి గుప్తార్థ ప్రకాశిక, దూసివారి సర్వస్వ పేటిక, బులుసువారి లఘుటీక, చినసీతారామస్వామిశాస్త్రిగారి ఉద్ద్యోతము అను బాల వ్యాకరణ వ్యాఖ్యా గ్రంథముల స్వరూప స్వభావము లించుక యుగ్గడింపబడినవి.

పదియవది యనువాద వివేచనము. బాల వ్యాకరణమునకు ప్రముఖ వ్యాఖ్యాతలగు కల్లూరి వేంకటరామశాస్త్రిగారు గుప్తార్థ ప్రకాశిక యనెడి తమ వ్యాఖ్యానమున పూర్వభాగమున సూరిగారి యెడ నత్యధిక గౌరవాదరములు చూపియు, నుత్తర భాగమున ఆయనకు న్యూనత గలిగించు ప్రసంగములు కొన్నిటిని గూర్చి వ్రాసిరి. అంతియుగాక, గ్రంథము చివర బాల వ్యాకరణము సూరిగారు స్వయముగా ఆత్మ ప్రతిభచే రచించినది కాదనియు, శిష్టు కృష్ణమూర్తి కవిగారి హరికారికావళికి ననువాద మాత్రమే యనియు, సూరిగారి మూల కర్తృత్వమునకే మోసము తెచ్చిరి.

వేంకట రమణశాస్త్రిగారు హరికారికల మాతృకను వ్రాత ప్రతిని సంపాదించి, దానిని బాల వ్యాకరణముతో ప్రత్యక్షరము పలు తడవలు నిదానముగా పరిశీలించి, బాల వ్యాకరణమే మూల గ్రంథమనియు, హరి కారికావళియే దాని కనువాదమనియు, సప్రమాణముగను, సయుక్తికముగను ఈ ప్రకరణమున నిరూపించిరి. ఈ యనువాద వివేచనమునట్ల శాస్త్రిగారు చూపిన యోర్పును నేర్పును ఆశ్చర్య జనకములు, సర్వాంధ్ర పండిత విమర్శక ప్రశంసాపాత్రములును. కల్లూరివారు సజీవులై యున్న కాలముననే వెలకొల్పఁబడిన ఈ సిద్ధాంతము అప్రతిహతమై నేటికిని అక్షర రూపమై నిలిచినది.

ఇంతతో రమణీయమందలి పూర్వ భాగము పూర్తియగును. ఇందు జీవిత సంగ్రహము తప్ప ఇంచు మించు తక్కిన తొమ్మిది ప్రకరణములందలి విషయమును పూర్వ వ్యాఖ్యాతలుగాని, విమర్శకులుగాని ఎవ్వరు నించుకయు స్పృశింపనిది. శాస్త్రిగారి స్వయం ప్రతిభా ప్రకల్పితమైనదియు.

ఇక అసలైన బాల వ్యాకరణ సమీక్ష రెండవ భాగమ్మున నే ఆరంభమగును.

బాల వ్యాకరణమునకు వింతకుమున్ను నాలుగు ప్రసిద్ధములగు వ్యాఖ్యలు గలవు. అవి యన్నియు చాలవరకు సూత్రార్థ వివరణము, ఉదాహరణ సమన్వయము, రూపసాధన ప్రక్రియ మున్నగు విషయములను ప్రధానముగా ప్రదర్శించినవి.

శాస్త్రిగారు మరల ఆ పద్ధతులనే యవలంబించి చర్విత చర్వణము సేయక, బాల వ్యాకరణ పరిచ్ఛేదములు పదింటను సూత్రములలో వృత్తులలో ఉదాహరణములలో సూరి హృదయ తత్త్వమును వెలువరించు సమన్వయ సారస్యాది విశేషములు

నూతనము లనేకములు ఆవిష్కరింపచేసిరి. అనగా, బాల వ్యాకరణ మూల సూత్రములను, వృత్త్యుదాహరణములను యథాతథముగా నన్నిటిని ప్రదర్శించుచు, అవసరములు నుచితములు నని తోచిన తావులందు విశేషములను వివరించుచు వచ్చిరనుట.

ఇందు చాలవఱకు పూర్వ వ్యాఖ్యానములలో లేని నూతనాంశము లనేకములు శాస్త్రిగారు వెలయించిరి. ప్రమాదవశమున గూడ పిష్టపేషణము చేయలేదు. క్వాచిత్కముగా వ్యాఖ్యాతల యభిప్రాయములు తమ మతమునకు విరుద్ధములుగా తోచిన పట్టులందు ఆ యా వ్యక్తుల పేరైన నెత్తక, విషయమును మాత్రమే ప్రధానముగా గ్రహించి మృదువుగను, మధురముగను సమన్వయము చూపుచు, 'సూరి హృదయ మిదియై యుండునేమో పరికింపు'డని పాఠకులను హెచ్చరించిరి. ఇదమిత్థమని తేల్చలేక ప్రాచీన వ్యాఖ్యానములు తల కొక రీతిని గజిబిజిపడిన పట్టులను నిపుణముగా సమన్వయించి, పఠితలకు ఆహ్లాదపుట్టించిరి. ప్రాచీనులు కొందఱు సూరి హృదయ తత్త్వ మెఱుగక తప్పు టడుగులు వేసిన తావులను నిదానముగా సవరించిరి. ఈవిధముగా ఈ సమీక్షయందు శాస్త్రిగారి రమణీయముగు సరస సమన్వయరీతియే యడుగడుగునను గోచరించును. ఒక్కమాటలో చెప్పవలయునన్నచో శాస్త్రిగారి రమణీయము సూరి హృదయాదర్శము. ఆ యా తావులను ఎత్తి చూపవలయునన్నచో మొత్తము గ్రంథమునంతను ఇచట పునర్ముద్రింపవలయును. సహృదయు లగు జిజ్ఞాసువులు ఆ గ్రంథమును స్వంతము చదివి యానందింతురుగాక.

సమీక్ష యంతయు పూర్తియయిన తరువాత గ్రంథము చివర కృత్తద్ధిత ప్రదర్శిక, యతిప్రాసపట్టిక, గణ శబ్ద సూచిక, శబ్దార్థ నిరూపిక, సూత్రాను క్రమణిక, యనువాద పట్టిక అను బంధముగా ప్రదర్శించుటచే విద్యార్థి లోకమునకును, జిజ్ఞాసువులగు పాఠకులకు నెంతయు నుపయోగకరమై యున్నది.

ఈ సమీక్షకు 'రమణీయ'మని నామకరణము చేయుటలో శాస్త్రిగారి హృదయ సారళ్యమును, లలితోక్తిచాతురియు వ్యక్తమగుచున్నది. ఈ పేరిడుటచే నిది నన్నయ భట్టీయము, అథర్వణీయము, అహోబల పండితీయములవలె గ్రంథకర్తృ నామాంకితమునైనది (వేంకటరమణశాస్త్రి సంబంధమనుట).

ప్రల్లదములుగాని, అసంగతములుగాని, అత్యుక్తులుగాని లేక వ్యాఖ్యాతృ చక్రవర్తి యన్నట్లు "నా మూలం లిఖ్యతేకించి న్నానపేక్షిత ముచ్యతే" యను విధమున నెక్కడ నెంతవట్టు అవసరమో యక్కడ నంతమాత్రమే వివరించుచు, శాఖా చంక్రమణము చేయక, ముద్దుగను ముచ్చటగను సరస రీతి సంతరించిన సమీక్ష సుకీయని నిగూఢ రమణీయ భావ గర్భితమునైనది.

రాష్ట్రసాహిత్య అకాడమీ సభ్యుల పదవీ కాలం

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ సర్వసభ్య సమావేశం గడచిన మార్చి 27 వ తేదీన హైదరాబాద్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆవరణలో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షతను జరిగింది. అకాడెమీ సభ్యుల పదవీకాలం మూడేళ్లనుంచి ఐదు సంవత్సరాలకు పొడిగించాలని తీర్మానం చేశారు.

రెండు నెలలలోపుగా ఈ తీర్మానానికి ప్రభుత్వం అభ్యంతరం తెలుపకపోతే, ఈ తీర్మానం అమలులోకి వస్తుంది.

1964 జనవరిలో ఎన్నికయిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ సభ్యులు ఈ తీర్మానం ప్రకారం 1968 డిసెంబరువరకు సభ్యులుగా ఉంటారు. అకాడెమీ సభ్యత్వకాలం ఐదేళ్లకు పెంచవలెనని, ప్రస్తుతానికి కాకపోయినా, ఇకముందైనా ఇలా చేయాలని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ సర్వసభ్య సమావేశం మూడేళ్లక్రితం తీర్మానించింది. కేంద్ర సాహిత్య అకాడెమీ సభ్యత్వ కాలం ఐదేళ్లు అయినందున రాష్ట్ర అకాడెమీల సభ్యత్వకాలం గూడ అయిదేళ్లకు పెంచాలని ఈ సర్వసభ్యసమావేశం పునఃతీర్మానం చేసిందని అధ్యక్షులు డాక్టర్ గోపాలరెడ్డి తెలిపారు.

సర్వసభ్య సమావేశం అకాడెమీ నిబంధనావళిలో కొన్ని మార్పులు చేసింది. 65 మంది సభ్యులుగల అకాడెమీలో 15 మంది విశిష్ట సభ్యులుగా ఉంటారు. వీరి వయస్సు 55 నుంచి 75 వరకు ఉండాలి. వీరు సాహిత్యానికి చేసిన విశిష్ట సేవనుబట్టి అకాడెమీ శాశ్వత సభ్యులవుతారు. విశిష్ట సభ్యులకు సేవా ప్రశంసతోపాటు ఒక పతకం, శాలువ, నూతన వస్త్రాలు బహూకరిస్తారు. ఈ పద్ధతి ప్రకారం ముందు గౌరవ సభ్యులుగా రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్, ఆస్థానకవి కళాప్రపూర్ణ శ్రీ కాశీ కృష్ణాచార్య, డాక్టర్ గిడుగు సీతాపతి, శ్రీ తాపీ ధర్మారావు, శ్రీ ఆదిరాజు వీరభద్రరావు ఉండాలని తీర్మానించారు.

75 ఏండ్లు దాటిన వారిని గౌరవ విశిష్ట సభ్యులుగా ఉంచి, అవసరమైతే వారికి గౌరవ మాసిక వేతనము ఇచ్చే సంగతి పరిశీలించాలని కూడా తీర్మానించారు.

తక్కిన 50 మంది అకాడెమీ సభ్యులలోను పదిమందిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. ఐదుగురిని కోఆప్ట్ చేసుకోవాలి. ఈ ఐదుగురిలో ఇద్దరు రాష్ట్రేతరులుగా ఉండాలి. మూడు విశ్వ విద్యాలయాలనుంచి ఆరుగురు ప్రతినిధులు ఎన్నిక కావాలి. వీరిలో ముగ్గురు తెలుగు శాఖాధిపతులు విధిగా ఉండాలి. తక్కిన ముగ్గురు తెలుగు, సంస్కృతం, చరిత్ర, ఉరుదు, శిల్పం మున్నగు వాటిలో విఖ్యాతులైన వారిని వరుసగా ఎన్నుకోవాలి. తర్వాత మూడు అకాడెమీలనుంచి ముగ్గురు సభ్యులు ప్రతినిధులుగా ఉంటారు. 20 మంది సాహిత్య సంస్థలనుంచి ఎన్నికవుతారు. తక్కిన ఆరుగురిని ఒక వోటర్ల నియోజకవర్గంనుంచి ఎన్నుకుంటారు. ఈ ఆరుగురిలో పి. హెచ్. డి. లు, ప్రాచ్య కళాశాల ప్రధానాధ్యాపకులు, తెలుగు శాఖాధిపతులు ఉంటారు.

సాహిత్య అకాడమీ ప్రచురణల ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రచురించిన 15 గ్రంథాలను ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు గడచిన మార్చి 27 వ తేదీ హైదరాబాద్ నగరంలోని ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆవరణలో జరిగిన సభలో ఆవిష్కరించారు. అకాడెమీ సేవను ఆయన ప్రశంసించారు.

ఆ పదిహేను గ్రంథాలివి : (1) ఉత్తర భారత సాహిత్యములు, (2) భారత రచయితలు, (3) తెలుగు సామెతలు, (4) అంజాద్ రుబాయీలు, (5) సూరదాసు పదాలు తెలుగు అనువాదము, (6) ఉత్తర రామ చరిత—టీకా తాత్పర్య సహితము (7) తెలుగు కథానికలు హిందీ అనువాదము, (8) పోతన భాగవతము హిందీ అనువాదము (ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షము, అంబరీషోపాఖ్యానము, వామన చరిత్ర, (9) రామాభ్యుదయ ప్రబంధము (చింతలపాటి ఛాయాపతి), (10) సుమతి—వేమన సంస్కృతానువాదము (తెలుగు లిపి), (11) సాహిత్యోపన్యాసములు, (12) ఆంధ్రదేశ హాస్య కథలు, (13) మోమిన్—మీర్ థస్ కిస్ కాజ్మి, (14) నద్రూద్ ఇ పక్త— శ్రీ నజారుర్ రహమాన్, (15) స్వర్గీయ షహీద్ సిద్దిక్.

కవి సార్వభౌముడు అనే నవల వ్రాసిన శ్రీ వోరి నరసింహశాస్త్రికి, కాళిందీ పరిణయం కావ్యం రచించిన శ్రీ విశ్వనాథ వేంకటేశ్వర్లుకు అకాడెమీ రు. 1116 బహూకరించింది.

డాక్టర్ దివాకర్ల వేంకటావధాని తెలుగు గ్రంథాలను గురించి, డాక్టర్ బి. రామరాజు హిందీ, ఉరుదూ గ్రంథాలను గురించి ప్రసంగించారు.

ప్రారంభంలో అకాడెమీ అధ్యక్షుడు డాక్టర్ గోపాలరెడ్డి ప్రసంగిస్తూ, అకాడెమీ స్థాపించి ఎనిమిది సంవత్సరాలు కాబో తున్నదని, త్వరలో మూడు అకాడెమీలకు భవనం రెండు లక్షల 80 వేల రూపాయలలో తయారవుతున్నదని, మూడు అకాడెమీలకూ అందులో స్థలం చాలదు గనుక మరొక లక్ష నలభై వేల రూపాయలు ప్రభుత్వం ఇస్తే భవనం పూర్తవు తుందని అన్నారు.

ఆఖరులో అకాడెమీ కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావు అభినందనలు తెలిపారు.

ఆంధ్రుల చరిత్ర రచనకు ప్రభుత్వం పూనిక

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1,05,600 రూపాయల వ్యయంతో ఆంధ్రుల చరిత్రను క్రొత్తగా వ్రాయించదలచినట్లు సంఘ సంక్షేమశాఖా మంత్రిణి శ్రీమతి టి. ఎస్. సదాలక్ష్మి మార్చి 18 వ తేదీన రాష్ట్ర శాసనసభలో తెలిపారు.

చరిత్ర రచన మూడు సంవత్సరాలపాటు జరుగుతుందని, రచనా కార్యక్రమం పర్యవేక్షణకు 13 మందితో ఒక సంఘం ఏర్పాటుచేయ దలచామని ఆమె తెలిపారు. చరిత్ర రచనకు ఈ సంవత్సరం 15 వేలు కేటాయించారు.

ప్రాచీన లిఖిత పుస్తకాల సంరక్షణానువాదాలకు 4,28,100 రూపాయలు, చారిత్రకాధారాల పట్టిక తయారు చేయడానికి 3,000 రూపాయలు మంజూరు చేశామని మంత్రిణి అన్నారు.

"1800 వ సంవత్సరం నుంచి స్వాతంత్ర్య సంసిద్ధి వరకు ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్యోద్యమ చరిత్రకు సంబంధించిన అధార విషయాలను నాలుగు సంపుటాలలో సేకరించవలసి ఉంది. ఈ కార్యక్రమం స్వాతంత్ర్యోద్యమ చరిత్ర రచనతోపాటు కొనసాగుతుంది.

"హైదరాబాద్ స్వాతంత్ర్య సమర చరిత్ర మూడు సంపుటాలు వెలువడినాయి. నాలుగవ సంపుటం తయారవు తున్నది. 1947 ఆగస్టు 15 నుంచి 1948 సెప్టెంబరు వరకు గల విషయాలు అనుబంధ సంపుటంగా తయారు చేస్తున్నారు.

"ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర 1, 3 సంపుటాలు ముద్రణలో ఉన్నాయి. రెండవ సంపుటాన్ని ఆచార్య శ్రీ మామిడిపూడి వేంకటరంగయ్య పరిష్కరిస్తున్నారు. నాలుగవ సంపుటానికి విషయాలు సేకరిస్తున్నారు." అని ఆమె తెలిపారు.

గ్రంథ విమర్శలు

రూపక సమీక్ష

సంపాదకులు : డాక్టరు ఇ. ఆర్. కృష్ణశర్మ, సంస్కృత శాఖాచార్యులు, శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయము, తిరుపతి. ప్రతులకు : రిజిష్ట్రారు, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయము, తిరుపతి, వెల : నాల్గు రూపాయలు.

శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయ సంస్కృత భాషా శాఖ 1963 జనవరిలో నిర్వహించిన రూపక ప్రక్రియను గురించిన సాహిత్య గోష్ఠియందు చదువబడిన పన్నెండు వ్యాసములను రూపక సమీక్ష యను పేర విశ్వ విద్యాలయము ప్రకటించినది. ఈ వ్యాసము లన్నియు నాంగ్లమున నున్నవి. ఈ గోష్ఠియందు విశ్వ విద్యాలయములో పని చేయువారేకాక అనుబంధ కళాశాలలో పనిచేయువారును, కేవల సంస్కృత భాషాధ్యాపకులుగాక, ఇతరులును పాల్గొనుట ముఖ్యముగా గమనింపదగినది. మరియు ప్రశంసింపదగినది ఈ గోష్ఠిని గుర్తించి చేయూత నిచ్చుచున్నట్లు ఈ వ్యాసములను విశ్వ విద్యాలయము ప్రచురించుట. ఈ విషయమున క్రొత్తగా నేర్పడినను శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయము ఆంధ్ర దేశములో ప్రాతవిగా పాతుకొన్న విశ్వ విద్యాలయములు చూచి నేర్చుకొనవలసినట్లుగా వ్యవహరించినది.

సంపాదకులు శ్రీ శర్మగారు తమ మున్నుడిలో చెప్పిన ట్లిందలి వ్యాసములన్నియు పరిశోధనాత్మకములై పొసఙ్గములుకాకపోయినను రూపక ప్రక్రియకు సంబంధించిన బహుముఖములను చూపుచున్నవి.

"నాటకము — ఉదాత్త రమణీయమైన సాహిత్య ప్రక్రియ" అను శీర్షికను శ్రీ కె. శ్రీరామమూర్తిగారు నాటకేతివృత్తము, పాత్రోన్మీలనము, రసపోషణము మొదలైన విషయములయందుగల నాటకముయొక్క ఉదాత్తతను నిరూపించిరి. శ్రవ్య కావ్యమునకంటె దృశ్య కావ్యముయొక్క మేలిమిని వివరించుటలో, నవల మొదలైన ఇతర సాహిత్య ప్రక్రియలకంటె నాటక ప్రక్రియయొక్క ఆధిక్యమును చెప్పుటలో దాని రమణీయ లక్షణమును చూపించిరి. నాటకకర్త ఎంత బాధ్యతగల రచయితయో శ్రీ శ్రీరామమూర్తిగారు చక్కగా నిరూపించిరి.

శ్రీ వి. ఆంజనేయశర్మగారు ఇతివృత్త, పాత్ర, రసభేదములచేత సంస్కృత రూపక మెన్ని విధములైనదో "సంస్కృత నాటక భేదములు" అను తమ వ్యాసమున విశదీకరించుచు, తద్భేదముల పూర్వాపరములను నిర్ణయించిరి. ఈ నిర్ణయము మొదట భాణమువంటి స్వల్ప రచనలు వచ్చి క్రమముగా ప్రకరణము, నాటకము వచ్చియుండు నన్న మన్‌కడ్-గారి అభిప్రాయమును పట్టుకొనియున్నవి. ఉప రూపకములను గూర్చి కూడ శ్రీ శర్మగారు స్పృశించిరి.

"సంస్కృత నాటకేతివృత్త నిర్వహణ ప్రమేయము" అను పేర కుమారి వి. ప్రభావతిగారు ఆలంకారికులు చెప్పిన నాటక లక్షణములను గ్రుచ్చి యెత్తినది. ఆధికారిక ప్రాసంగికేతి వృత్తములు, కార్యావస్థలు, అర్థ ప్రకృతులు, పంచసంధులు, తదంగములు మొదలైన యంశములను వివరించినది.

శ్రీమాన్ టి. కె. ఆర్. రామానుజాచారిగారు "సంస్కృత నాటకములందలి అతి మర్త్య లక్షణము"ను గూర్చి వ్రాయుచు భారతీయ రూపకములయం దా లక్షణము, ఇతివృత్తములు పురాణేతి హాసములనుండి గ్రహింపబడుటవలన, అధికముగాను మరియు అనవసరముగాను ప్రవేశించినదని ప్రతిపాదించిన విషయము ఆలోచన యోగ్యమైనదిగానున్నది. మరియు నాచార్యులవారు బృహత్కథ, బేతాళ పంచ వింశతివంటి ప్రాచీన కథా వాఙ్మయముయొక్క ప్రభావమును నాటకములయందతి మర్త్య లక్షణము ప్రవేశించుటకు మూలము కావచ్చుననిరి. అభిజ్ఞాన శాకుంతలమున దుర్వాసుని శాప రూపమైన అతి మర్త్య లక్షణ మా నాటకము నెంత శోభావిహీనము చేసినదో వివరించిరి. మరియు నీ లక్షణమును ప్రాకృత్రిమ నాటకకర్త లింకను నెన్ని ప్రయోజనములను సాధించుటకు చేపట్టిరో కూడ ఆచార్యులవారు సంగ్రహముగా వివరించిరి.

సంస్కృతమున 'ట్రాజెడీ'లు లేక పోయినను ఆ ఛాయలు సంస్కృత నాటకములయందు కలవని, శాకుంతలమునందలి చతుర్థ పంచ మాంకములయందు గల తచ్ఛాయను చూపించుచు శ్రీ యస్. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు "సంస్కృతమున ట్రాజెడీలు" అను వ్యాసము వ్రాసిరి. మరియు కరుణరసాత్మకములైన నాటకములొక విధముగా ట్రాజెడీలవంటివని ప్రతిపాదించిరి.

ఆలంకారికుల నియమములవలన సంస్కృత నాటక పాత్రములు వైయక్తికతను కోల్పోయినవై నిర్జీవములైనవనియు, విదూషకుడు, కంచుకి మొదలైన పాత్రములందుకు ప్రబల నిదర్శనములనియు శ్రీమాన్ వి. వరదాచారిగారు "సంస్కృత నాటక పాత్రల"ను గూర్చి వ్రాయుచు భాస కాళిదాసాది మహా కవు లెట్లు తాము తమ పాత్రములను నాత్మ చైతన్యముతో తీర్చి దిద్దిరో కూడ సోదాహరణముగా వివరించిరి.

శ్రీ టి. కోదండరామయ్యగారు "సంస్కృతనాటకములలో విదూషక పాత్ర ప్రయోజనము"ను చర్చించిరి. కాళిదాసుని మూడు నాటకములలోని విదూషకులను పేర్కొ

నిశీధము—అంధకారము ఇత్యాదులన్నియు రచయిత తానై వట్లు వ్రాసికొని పోవుటచేత వివక్షితార్థ మిదమిత్థమని తెలియవచ్చుటలేదు. వ్యంగ్య వ్యంజకముల మాట యటుంచి సను వాచ్య వాచకముల యనుసంధానము విషయమునను రచయిత శ్రద్ధ వహించి చేసిన రచన కాదిది.

"ఓ శిథిల శిల్పములారా! నాకు
సంజ్ఞ చేయుడు నిర్మానుష్యములో
ఓ శిథిల శిల్పములారా! నాకు
అనుజ్ఞ యొసగుడు నిర్వ్యాపకములో
నా ప్రియురాలు పోలు శిల్పముపై
ఎంత మృత్యుధూళి కూడెనో
ఓ వికార శిల్పీ! గత జన్మలోని
శిల్పాలను కనలేవోయి :
నా శిథిల మందిరములో
నా ఏకాంతమును చెరిచె నొకడు
నా శిల్ప సుందరులతో
నా సంభాషణము విన నేతెంచె:
కళా సంస్కృతిలేని
అతడొక లౌకిక ఉన్మాది
కళా శోభాలయములో
అతడొక పాశి పురుగు:
అభ్రమండలమునకు
ఇవి సోపానములు;
సమాధి శరీరానికి పార్శ్వ శలాకలు
నిద్రించిన సిద్ధుల
స్వాప్నిక భవనములు;
పతితుల పశ్చాత్తాప తలములు" (పుటలు 88, 89)

ఈ ధోరణిలో మొత్తము పుస్తకము రచన సాగినది.

దరహాసముపీద చూడగా రచయిత బౌద్ధ మతము, బౌద్ధ శిల్పము, బౌద్ధ ధర్మము ఈ దేశమునందు నశించుటను, శిథిల మగుటను, రూపుమాయుటను సంభావన చేయుటవలని యావేదనము వెల్లడి యగుటగా కనిపించు చున్నది. సమాధి గతములైన యీ మత, శిల్ప, ధర్మముల వ్యుత్థానము విశ్వశాంతికి దోహదము కాగలదన్న విశ్వాసమును రచయితయందు కనిపించుచున్నది. అందువలననే తాదృశమైన విశ్వ శ్రేయము నభిలషించుచు శ్రీ వెన్నం గారి వచన పద్య కావ్యమును సంతరించిరని గ్రహింపవలయును.

"శిల్పి రచించిన వేల్పు
పొందినాడు సకల పూజలు
వేల్పు సృజించిన శిల్పి
పొందినాడు సకల వేదనలు" (పుట 142)

"ఈ భువనము మాత్మ ప్రియులకు
ఉద్యానము కలదిగా తోచు
ఈ భువనము వేదాంతులకు
వృద్ధురాలివలె కనిపించు" (పుట 169)

ఈ రకము సూక్తులు మధ్య మధ్య కలవు. రచయిత కూహించగల శక్తి యున్నది. దానిని క్రమబద్ధము చేయు శక్తి కావలయును. రచయిత కాలోచన యున్నది. అందొక యెడతెగని తపమును పెంపొందించుకొనవలయును. రచయితకు శబ్ద ప్రపంచము తెలియును. అర్థ ప్రసన్నత కయ్యెడు కూర్పు రహస్యము తెలియవలయును. ధర్మమనుడులు, భూసారలు, ఈ స్వార్థ మురికి విష్వవము, శిలాపేర్లు— ఈ జాతి పద బంధ కల్పనమును రచయిత విరమించుట భాషా సంప్రదాయము నెరుగుట కాగలదు.

వచన కవిత్వమునం దాదరము కలవారు సుదీర్ఘమైన కావ్య రచన కుపక్రమించిన శ్రీ వెన్నంగారి నభినందించుచు ఈ కావ్యము నత్యంతము జాగ్రత్తతో చదువ వలయును. ఛందస్సునకు సంబంధించిన ఒక క్రొత్తదనము, భావుకతకు సంబంధించిన ఒక క్రొత్తదనముగల ఈ వచన కవిత్వ మయమైన కావ్యమును తప్పక చదివి రచయిత హృదయమును గ్రహించుట మంచిది.

—క్షేమేంద్ర.

మేఘ సందేశము

అనువాదకులు :—శ్రీ ఎస్. వి. ఆర్. కృష్ణశర్మ. వెల: రు. 2.25 ప్రకాశకుడు : వేములపాటి నారాయణమూర్తి, దేవీ పబ్లిషర్సు, 5/52 మొదటి క్రాస్‌రోడ్, ఎల్లయమ్మన్ కాలనీ, మద్రాసు—6.

"మాఘే మేఘే గతం వయః" అని మహా పండిత మల్లినాథ సూరి భావం. సామాన్యులకు సాధ్యమా మేఘ సందేశాన్ని అర్థం చేసుకొని అనుభవించడానికి!

"కాళిదాస గిరాంసారం!కాళిదాస స్సరస్వతీ,
చతుర్ముఖోథవా సాక్షా ద్విదు ర్నాన్యేతు మాదృశః"

అని కూడ మల్లినాథ మహాశయుని అభిప్రాయమే. అనుభవించి పలవరించడానికే వయస్సు చాలనప్పుడు, దానిని అనువదించడం దుస్తరమైన కార్యమే. భావ కవితా ధోరణిలో ఉన్న ప్రపంచ మహా కావ్యాలలో మేఘ సందేశం విస్పందే హంగా యెన్నదగినది. కావ్య వస్తువు స్వల్పమైనా భావం అనల్పం, అమోఘం, అనన్యసామాన్యం. భారతీయ భాషలలో సందేశ కావ్యాలకు ఒరవడి దిద్దిపెట్టింది మేఘ సందేశం. తరువాత కాలంలో చకోర సందేశాలూ, కీర సందేశాలూ, హంస రాయబారాలూ, చిలుక దౌత్యాలూ ఎన్నో వచ్చినవి. ఎన్ని వచ్చినా మేఘ సందేశం ముందు నిశిలో ఇనబింబం చుట్టూవున్న తారకలు మాత్రమే. కవితా హృదయుండున్న ఎవరైనా మేఘ సందేశం చదవగానే అధునిక జగత్తులో ఉండి పోయి తన్మయత్వంలో మునిగి మరొక కావ్యాన్ని రుచి చూడ లేరు.

అంతటి మహత్తర మేఘసందేశాన్ని అనువదించే కార్యం శ్రీ కృష్ణశర్మగారు చెప్పినట్లు దుస్తరమైన విష

యమే. మేఘ సందేశ గౌరవాన్ని ఇనుమడింపజేయడానికి చేసిన ఈ ప్రయత్నం హర్షింపదగినది. ధారాశుద్ధి గల శైలిలో వ్యర్థ పదాలు క్వాచిత్కంగా మాత్రమే వాడుతూ, మూల శ్లోకాలలోని పూర్తి భావాన్ని అందించే ప్రయత్నం చేశారు. మూలానికి కళంకం తెచ్చేవిధంగా ఎక్కడా జుగుప్సాకరమైన శబ్దాలను వాడలేదు. అర్థం సుబోధకంగా, శబ్దాలు చెవి కింపుగా, రచన రమణీయంగా నడిచింది. ఒకటి రెండు చోట్ల తప్ప రచన అంతా మత్తేభ వృత్తంలో వ్రాశారు.

మహాకవి రచనలను అనువదించేటప్పుడు ఛందము బంధమై భావం క్లిష్టం కారాదు. మరొకరు మేఘ సందేశాన్ని కంద పద్యాలలో అనువదించారు. కావ్యాన్నంతటినీ ఒకే ఛందస్సులో నిర్మించాలనే ప్రయత్నం హర్షింపదగినదికాదు. దీనివలన వచ్చే ప్రత్యేక ప్రయోజన మేమీ లేకపోగా భావాన్ని కుదించడమో, సాగదీయడమో చెయ్యవలసి వస్తుంది.

శ్రీ యం. వి. ఆర్. కృష్ణశర్మగారు దుష్కరమైన ఈ అనువాదాన్ని అతి నిపుణతతో సమర్థంగా నిర్వహించారు. సుధాంశు శేఖరుని చేయెత్తి చూపించిన విధంగా అనువాదం మూలంలోని మాధుర్యాన్ని అణుమాత్రంగా చవి చూపిస్తున్నది. ఎక్కడా అరుచి తోపదు.

కేవలమచేతనమయిన మేఘముచే సందేశ మంపుట లోని ఔచిత్యమును విచారించుచు కాళిదాస మహాకవి "కామార్తాహి ప్రకృతి కృపణా శ్చేతనా చేతనేషు" అని చెప్పగా, చేతనా చేతనంబుల భేదంబులు కాముకులో దెలియగా బోకుందు రప్పట్టులన్! అని కృష్ణశర్మగారు సరియైన యనువాదము నందించిరి.

యక్షుడు మేఘమునకు త్రోవ నిర్దేశించుటలో ఉత్తర భారతదేశపు శోభ నంతను కన్నులకు కట్టునట్లు వర్ణించి నాడు. ఒక రాజ్యము వెనుక మరియొకటి ముఖ్యమగు పట్టణములు, ఆరామములు, నదులు, కొండలు, వనములు ఇవి యని యననేల సమస్త సుందర దృశ్యములను కుంచెతో తీర్చిన విధమున చిత్రించినాడు మహాకవి.

వాస్తవముగా మన కన్నుల ఎదుట జూచినప్పుడు అరుచికరముగా గోచరించు వస్తువును గూడ కాళిదాస మహాకవి అతి నిపుణతతో సుందర తరముగానే వర్ణించును. "పశ్చా దుచ్చై ర్భుజ తరువనం మణ్డలేనా భిలీనః" అను శ్లోకమున నీశ్వరునకు పూర్వము తాను గజాసురుని సంహరించి వాని తోలును అప్పుడే ఒలిచి తీయుటచే నెత్తురోడు చున్న దానిని ఉత్తరీయముగా ధరించుటను పార్వతి వేడుక నడుటను అద్భుతావహముగ వర్ణించినాడు. అనువాదమునకు మూలములోని సౌందర్యము చెడకుండ—

"హర వృత్యాది జపా సుమంబువలె సంధ్యారాగ కాంతిన్ మహే
శ్వరు నత్యున్నత బాహు వృక్షవనిఁ జెంచన్మం డలా రవి
స్ఫురణం జట్టుము, గౌరి నిర్భయముగం జూచుం బ్రశాంతాత్మ నీ
శ్వర రక్తార్ద్ర గజాజినాభిమతమా వాటేల్ల బాటింపగన్"

అని ముచ్చట గొల్పునట్లు వర్ణించినారు.

మేఘ సందేశమునందలి ప్రతి శ్లోకము ఒక్కొక్క చక్కని కథను చెప్పును; ముక్తకములవలె ముచ్చట గొలిపి సుందరమైన దృశ్యమును దోపింపజేయును. అదృశ్య మట్లుండ గనే సుందరతరమైన దృశ్యము వెనువెంటనే శ్లోకములో నుండి దానిని వెనుకకు నెట్టివేయును.

పార్వతీదేవికి నమస్కరింపుమని మేఘునకు నిర్దేశించుచు
"హిత్వా తస్మిన్ భుజగ వలయం శంభునా దత్త హస్తా
క్రీడాశైలే యదిచ విహరే త్పాదచారేణ గౌరీ,
భఙ్గీ భక్త్యా విరచిత వపుః స్తమ్భితాన్త ర్జలౌఘః
సోపానత్వం కురుమణి తటారోహణా యాగ్రయాయీ"

అని చెప్పిన హారములో మెరిసే మణి వంటి ఈ శ్లోకమునకు శర్మగారు,

"గరళ గ్రీవుడు నాగ కంకణము వేగందీసి, క్రీడాచలో
పరిభూమిన్ సతిదత్త హస్తయుతుడై వాహ్యాళికై కాల్నడన్
తరలం బర్వపు దేహమంతరమువన్ స్తంభించి సోపాన వై
ఖరి సేవింపుము రత్న సానువుల నెక్కంబోవు నాగారికిన్"

అని మూల విధేయకమైన మనోహరమగు ననువాదము నిచ్చిరి.

"వామశ్చాస్యాః కరరుహపదై ర్ముచ్యమానో మదీయై
ర్ముక్తాజాలం చిరపరిచితం త్యాజితో దైవగత్యా,
సంభోగాన్తే మమ సముచితో హస్త సంవాహనానాం
యాస్యత్యూరుః సరస కదళీ స్తమ్భ గౌర శ్చలత్వమ్"

అను శ్లోకమునందు మేఘునకు యక్షుడు తన క్షేమమును గూర్చి తెలుపునపుడు గంధర్వ కాంత ఎడమ యూరువు రతి లాభ శకునముగా నదరునని తెలిపెను. అనౌచిత్యమందమా అన చారము! సూక్ష్మ పరిశీలన మందమా యక్షుని పాత్రౌచితికి భంగము! జగన్మాతను భక్తి పారవశ్యముతో స్తుతించుచు "కుచోన్నతే కుంకుమ రాగశోణే" యని వర్ణించిన మహాకవి కవిత్వమందలి ఔన్నత్యమును విస్మరించి ఏమని ఔచిత్య విచార చర్చ జరుపగలము? అనువాదమునందును ఈ శ్లోకమునకు అనౌచిత్య దోషమంటకుండ పద్య రచన సల్పుట అనువాదకుని సామర్థ్యమునకు నిదర్శనము.

భారతీయ కవితాత్మను ప్రతిబింబించే ఈ మహాకావ్యం అనువదింప బడడంతో మరింత గౌరవాన్ని పొందుతుంది. అందుకు దోహదం చేసిన శ్రీ కృష్ణశర్మగారు ధన్యులు.

సమర్థ రామదాసు

కర్త : కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం వెల : 1-50. ప్రకాశకులు : పి. వి. దీక్షితులు అండ్ సన్సు, చిలకమర్తి పబ్లిషింగ్ హవుస్, కాకినాడ—1.

స్వదేశీయ రాజులలో అనైకమత్యము సాధారముగా గొని ఉత్తర భారత దేశమునంతటిని చంద్రధ్వజము క్రిందికి దెచ్చి హిందూ ధర్మములను రూపుమాపి, హైందవ దేవాలయములను దేవతా విగ్రహములను నాశన మొనరించి, సోపాన

ములుగా నుపయోగించుకొను దుర్దినములలో ధర్మోద్ధరణమునకై కంకణము గట్టిన మహనీయుడు సమర్థ రామదాసు. హైందవ ధర్మ ప్రతిష్ఠాపకులలో ముఖ్యుడైన శివాజీ మహారాజునకు గురువు. సమర్థ రామదాసు డనగనే శివాజీ మహారాజు గురువుగానే లోక మెరుంగునుగాని ఆతడి జీవిత చరిత్రను, ధర్మాభి నిరతిని తెనుగు జాతి ఎరుంగదు. ఆ మహనీయుని జీవిత చరిత్రను రచించి, ఏ యే సన్నివేశము లాతని హృదయమును కలచి వైచినవో, ఏ ధర్మోద్ధరణమునకై జీవితాంతము పరిశ్రమించి, అహర్నిశము దానికై అల్లాడవలసి వచ్చినదో తెలియజేయుచు ధర్మమునెడ ప్రజల కాసక్తి నినుమడింప జేసినవారు కళా ప్రపూర్ణులు చిలకమర్తివారు.

చంద్రధ్వజముయొక్క ఏలుబడిమారి యూనియన్ జాక్ తిష్ఠ వేసికొని, రాజ్యపాలనమేగాక సాంఘికాచారములను, కట్టుబాట్లను నిరసించి పరాయి పాలనవేగాక విరుద్ధ మత ధర్మములను గూడ వ్యాప్తిజేయ దొడంగినది. ఏ ధర్మోద్ధరణమునకై సమర్థ రామదాసుడు కంకణము గట్టి ఇస్లాం పాలకుల నెదిరించినాడో ఆ ధర్మోద్ధరణమునకే శ్రీ చిలకమర్తి వారును నడుముకట్టి ఆంగ్లేయుల నెదిరించి, దేశభక్తిని ప్రకటించి, చరిత్రలో మరుగుపడిన మహనీయుల జీవిత చరిత్రలను ఎలుగెత్తి చాటి తెలుగు జాతిని మేల్కొల్పుటకై పరిశ్రమించిరి. ఆ కాలము సుమారు 1923. ఆకాలముననే తెలుగు కవులు తమ రచనలయందు మాటిగనో, వ్యంగ్యముగనో ఆంగ్ల పాలనమును నిరసించుచు కలమును జళిపించిరి. తిరుగేదీ నాటి తెనుగు కవుల ధాటికి?

శ్రీ చిలకమర్తివా రీ గ్రంథము వాంగ్మయములోని యొక గ్రంథమును జదివిన పిమ్మట వర్ధాని సాయమున తెనుగున వ్రాసిరి. వృద్ధాప్యమున దైవ దుర్వినియోగమున వారి కంధత్వము ప్రాప్తించినది. ఐనను వారిలో తేజస్సు దుర్నిరీక్ష్యమై వెలుగొందినది. తెనుగు జాతిని చైతన్యవంతము చేయుటకై, ధర్మము నుద్బోధించుటకై వారి దీక్ష ఏమాత్రము కుంటు వడలేదు. వారు డెబ్బది నాల్గవపేట ఈ గ్రంథమును పట్టు పట్టి వ్రాసిరనిన వారి ధర్మాభి నిరతి నిరంతరము కొనియాడదగినది. వయస్సుతోపాటు వారి శైలియు పరిపక్వము నొంది రమణీయమైన రూపమున నీ గ్రంథమున జాలువారినది. ప్రతి అధ్యాయము ప్రారంభమున భగవద్గీత యందలి శ్లోకముల నిచ్చుచు రామదాసుని చరిత్రను రచించుటయం దెంతయు ఔచిత్య శోభ గలదు. ధర్మమునకై జీవితము ధార వోసిన త్యాగమూర్తి రామదాసుని చరిత్రమున భగవద్గీత నుదాహరించుట సమంజసమైనది.

సమర్థ రామదాసుని కాలమునాటికి సంస్కృతిపరముగా నా సేతు శీతాచల మొకే జాతి యనెడు భావమున్నను ఒకే దేశ మనెడు జాతీయాభిమాన మున్నట్లు కానరాదు. కాని శ్రీ చిలకమర్తివారు దేశాభిమానముతో ప్రతి అధ్యాయము నందును దేశభక్తిని రంగరించి పోసినారు. గణపతి యుత్సవముల పేరిట తిలక్ మహాశయుడు దేశాభిమానము నుద్దీపింపజేయు చుండగా "గణపతి" నవలా రచయిత శ్రీ చిలకమర్తివారు ప్రతి రచన యందును వ్యంగ్యముగ దేశభక్తినే ప్రబోధించినారు. గణపతి యుత్సవములవలన తరువాత కాలములో మత కల్లోలములు చెలరేగినను శ్రీ చిలకమర్తివారి రచనల వలన నట్టి యుపద్రవ మేమాత్రమును కలుగలేదు. 'సమర్థ రామదాసు'వంటి గ్రంథములను జదివిన పిమ్మట భారత దేశాభివృద్ధికై నిరంతరము తపియించిన మహనీయుల చరిత్రమే స్మరణకు వచ్చునుగాని మత ద్వేష మేమియు కలుగదు.

చిలకమర్తివారి శైలి తెలుగువారికి సుపరిచితము. సుబోధకము, సుందరమునగు వారి శైలి అసమానమైనది. లోకోక్తులును, నీతులును వారి రచనలలో విడదీయలేనంతగా మిళితములై శతకములలోని సూక్తులకున్నటువంటి గౌరవమును పొందును. 'దాసబోధ' యందలి విషయమును సూక్ష్మముగా సంగ్రహపరచి,

"మొట్ట మొదటను శ్రీహరి పూజనంబు
దేవసేవకు వెన్కను దేశసేవ
తక్కిన విషయముల యందు దగిన శ్రద్ధ
పూనవలయును మానక మానవుండు"

అను పద్యమునతేట తెల్లము జేసిరి.

సమకాలికులు సమర్థ రామదాసుడు భగవంతుని యవతారమూర్తి యనియు, నత డనేకాద్భుతములు చేసెననియు వ్రాసిరి. చిలకమర్తివారు వానిని నిరాకరించుచు నవి మానవ శరీరములకు సాధ్యము గావనియు, ప్రకృతి శాస్త్ర విరుద్ధము లనియు తెల్పి, రామదాసుడు భగవంతుని యవతారమూర్తి కానంతటి మాత్రమున వాని మహనీయతకు భంగము రాదనిరి. ఇట్టి శాస్త్రీయమైన దృష్టి ప్రశంసింపదగినది.

శివాజీ మహారాజు సమర్పించిన రాజ్యమును తిరిగి ఇచ్చి వేయుటయేగాక అడుగడుగునను తగు సూచన లిచ్చి రాజ్యమును రక్షించినవాడు సమర్థ రామదాసు. అతడు శివాజీకి కానుకగా నిచ్చిన "కొబ్బరి కాయయు, గుఱ్ఱపు లద్దెయు, విభూతియు, గులకరాళ్ళును" సాభిప్రాయముగ ఆశీఃపురస్సరముగ నున్నవి.

సమర్థ రామదాసునువంటి మహనీయుని చరిత్రను చారిత్రక, శాస్త్రీయ, వాఙ్మయ కోణములనుండి పరిశీలించి తీర్చి దిద్ది రచియించిన శ్రీ చిలకమర్తివారి కృషి అజరామరము.

శృంగారవనం

రచయిత : తారాశంకర బెనర్జి. అనువాదకులు శ్రీ నగదాల హరిప్రసాదరావు. వెల : 2-00. ప్రకాశకులు : ప్రజా ప్రచురణలు, ఏలూరు.

ఇది నలుగురు ప్రసిద్ధ బెంగాలీ కథకుల రచనలకు అనువాదం. అనువాదం కత్తిమీద సాము వంటిది. "మూలంలో లేనిది ఏమీ చెప్పకూడదు. మూలానికి విఘాతం కల్పించ కూడదు" ఈ నియమం కథల ననువదించటంలో పాటించటం బహు కష్టం. మూల కథలలో ఉన్న మహా వాక్యాలు

అనువదించగానే సాధారణమైన పలుకులుగా మారిపోతాయి. సూర్యోదయ కాలంలో తామరాకుమీది మంచు ముత్యాలను చూసి ఆనందించి, అంతటితో పూరుకోక వాటిని చేతిలోకి తీసుకోబోగా అవి నీళ్ళుగా కారిపోతాయి. అదేవిధంగా మహా రచయితల సూక్తులు అనువదించగానే మామూలు మాటలుగా పరివర్తనం చెందుతవి.

తారాశంకర్ బెనర్జీ, సుమథనాథ్ ఘోష్, బుద్ధదేవ బోస్, కామాక్షీప్రసాద్ చటర్జీవంటి ప్రసిద్ధ బెంగాలీ కథకుల కథ లిందులో ఉన్నవి. ప్రపంచం దగ్గరగా ఒదుక్కుంటున్న ఈ రోజుల్లో, దేశ సమైక్యం సాధింప బూనుకున్న కాలంలో ఒక భాషలోని మంచి రచనలను మిగిలిన భాషల లోనికి పరివర్తింపచెయ్యటం ఎంతైనా అవసరం. ఈ అనువాద కథా సంపుటి చదువుతూంటే స్వతంత్రమైన రచన చదువుతున్నట్లే తెనుగు నుడికారపు సొంపు ఎక్కడా కుంటుపడకుండా సాగుతుంది. అనువాదకుని సామర్థ్యాని కది గీటురాయి కదా! అనువాదకులు పగడాల హరిప్రసాదరావుగారు తమ కృషిలో కృత కృత్యులయ్యారనే చెప్పాలి. 'తారిణి' 'జల్సాఘర్' అనే కథలు ఉత్తమ స్థాయిలో ఉన్నవి.

'తారిణి' కథలో పల్లెకారుని జీవితం చిత్తరువులోలాగా చిత్రించబడింది. హాస్యం సునిశితంగా ఉండి, ఆహ్లాదం కలిగిస్తున్నది. మచ్చుకొక వాక్యం చూద్దాం. "మీలో ఇంకెవ్వరినీ తీసుకెళ్ళలేను తల్లులారా! మీరు వెంట తెచ్చుకున్న పుణ్యంతో చాల బరువెక్కిపోయేరు. ఇంకెవరూ పడ వెక్కకండి" అని తారిణి పడ వెక్కబోయే పుణ్యమూర్తుల నుద్దేశించి అంటాడు. ప్రమాదంలోవున్న ధనవంతుల అమ్మాయిని రక్షించినందుకు ప్రతిఫలంగా తారిణి "కల్లు నీళ్ళ కో అర్థరూపా యిప్పించండి బాబూ" అని అడుగుతాడు. పల్లెవాళ్ల అమాయిక జీవితాలు చక్కగా వర్ణించారు. పల్లెవాడికి మయూరాక్షినది తల్లి. ప్రకృతి వాడి సర్వస్వం. ఎంతటి ధన్య జీవి. కథ విషాదాంతమవడం మరింత ఉదాత్తతను తెచ్చి పెట్టింది.

'జటిలత' కథలో పని దొరక్క ఒక కంసాలి కొట్లో నౌకరుగా కుదిరిన 'పాట్లా' జీవితపు పాట్లను—అతడు కంసాలి చేతిలో ఎలా మోసపోయిందీ, ముసలి కంసాలి సౌందర్యాన్ని దర్శించి ఎలా వివశుడై ఆరాధించిందీ చక్కగా వర్ణించారు. కథలో బిగువు తగ్గినా మానసిక చిత్రణం ఆ లోపాన్ని కప్పిపుచ్చుతున్నది.

'దయ' కథ చదివేక కలుగుతున్నది జుగుప్స. కసాయి ప్రవృత్తిగల తండ్రి తన కుమార్తెలను ఆవిటివాళ్ళను చేసి, వాళ్ళను ప్రదర్శనలో నగ్నంగా చూపించి డబ్బు సంపాదించటం మరిగాడు. వైద్యు డొకడు అనుకోకుండా కుంటి బాలికను చూసి ఆమె స్థితికి జాలిపడి ఆలోచించి ఆమెకు విష మిచ్చి చంపేస్తాడు. ఈ కథవలన రచయిత ఏమి చెప్పదలచుకున్నారో బోధపడదు.

'స్వభావం' అనే కథలో చక్కని శైలిలో, ఒక వ్యక్తి ఆలోచనలు, ప్రవర్తనా, అతడి ఆరోగ్యమూ, మానసిక స్వాస్థ్యాన్ని అనుసరించి ఉంటాయనే చక్కని సత్యం చెప్పారు.

'జల్సాఘర్' కథలో జమీందారు విశ్వంభరరాయ్ ఆడంబర జీవితమూ, అపారమైన కరుణా, ముందు చూపులేని దాతృత్వమూ, తన జీవితంపట్ల నిర్లిప్తత ఉన్నవాడు. లలిత కళల కాలవాలమైన అతడి జల్సా గృహం మూసివెయ్యడంతో అంతమవుతుంది కథ. ఉదాత్తత కెక్కడా భంగం రాలేదు. జమీందారీ జీవితంలోని లోటుపాటులను అందంగావర్ణించారు.

తారిణి, స్వభావం, జల్సాఘర్ కథలు ఉత్తమ స్థాయిలో ఉన్నవి. 'దయ' అనే కథ ఈ సంపుటిలో చేర్చకుంటే బాగుండేది. 'శృంగార వనం' అనే పేరూ, అందమైన ముఖచిత్రమూ కేవలం ప్రచారంకోసం మాత్రమే ఉద్దేశింపబడ్డాయని అనుకోవాలి.

ఆగిన తుపాను

రచయిత: శ్రీ హీరాలాల్ మోరియా. అనువాదకులు: శ్రీ కొరిపాక. వెల: రు. 3—00. ప్రాప్తిస్థానము: అన్జుమాన్ ఈ తరక్కీ ఉర్దూ, కమ్మంజిల్లా బ్రాంచి, మోహన్‌రోడ్, కమ్మం.

ప్రఖ్యాత రచయిత శ్రీ హీరాలాల్ మోరియాగారి 'తుఫాన్ థమ్ గయా' అనే నవల కిది అనువాదం. మోరియాగారు బహు భాషా పండితులు. సాంఘిక సమస్యలను చక్కగా అర్థం చేసుకోగలిగిన అభ్యుదయ కవి. జనాబ్ సికిందర్ మొహిసిన్ చెప్పినట్లు "స్వతహాగా ఈయన విప్లవ భావుకుడైన సామ్యవాది. మంచికీ మానవత్వానికీ విఘాతం కలిగించేది అది దైవత్వమైనా విసర్జించవలసిందే" నన్నది. ఈయన అభిమతం. ఐతే ఈయన ఈ నవలలో సామ్యవాద విప్లవ పంథా ఏమాత్రం కన్పించదు. పై పెచ్చు విచ్చలవిడి భావాలు, సమాజ వ్యవస్థను క్రమంగాకాక, ఒక్కసారిగా మార్చాలనుకునే ఆవేశమూ కన్పిస్తున్నాయి.

ఇందులో "అవధులు మించిన అంతఃకామనలతో తనకు తానై జీవితంలో భయంకరమైన విష వలయాన్ని సృష్టించుకొని ప్రభ్రష్టమైన ఒకానొక స్త్రీ గాథ చిత్రించబడింది. కాత్యాయిని అనే ఈ స్త్రీ) తారానాథ్ అనే ముసలి జమీందారుని పెళ్ళి చేసుకొంటుంది. వయోవృద్ధునితో సౌఖ్యాన్ని పొందలేని ఈమె జమీందారు చేరదీసిన విశాల్ అనే యువకుని ఆకర్షించి తన ఆకర్షణకు లోబరచుకుంటుంది. ఐతే అతడు జమీందారు సలహాతో అపర్ణ అనే బీదపిల్లను పరిణయమాడుతాడు. అపర్ణ శీలవతి.

కాత్యాయిని, అపర్ణలు సంఘంలోని రెండు వర్గాలకు ప్రతినిధులు. అన్ని హంగులూఉండి సాంసారిక జీవితంలో సుఖపడలేని అభాగిని కాత్యాయిని. ఎంతటి బీదరికంలోఉన్నా శీలాన్ని ప్రాణంగా కాపాడుకుంటూ అందరి అభిమానాన్ని చూరగొంటూ పరిస్థితులను జయించుకొన్నది అపర్ణ. మూడవ తరహా వ్యక్తి మణి. తెలివి అసంతృప్తితో జీవితాన్ని తనివితీర అనుభవించి, నీతి నియమాలను పాప పుణ్యాలకు మనస్సులో చోటీయని వింత వ్యక్తి మణి.

ఆలోచనా రహితంగా, ఆడంబరంతో కేవలం తోడు కోసం యువతిని పెళ్ళి చేసుకొన్న ముసలి జమీందారు తారానాథ్. ఆ యువతికి జరిగిన అన్యాయాన్ని చాల ఆలస్యంగా గుర్తించాడు జమీందారు. పరిస్థితి చేయిదాటిపోయింది. భార్యకు పిచ్చెక్కింది. తన మనస్సు అల్లకల్లోలమయింది. ఆ పరిస్థితిలో తాను చెయ్య గలిగిన ఒకే ఒక్క మంచి పని అపర్ణ కాపురం నిలబెట్టటం. అది చేసి తృప్తి పడ్డాడు జమీందారు. నవలలో—ముఖ్యంగా ఈ ఐదు తరహాల మనస్తత్వాన్ని చిత్రించారు రచయిత.

నవలలో విపరీతమైన వాదాలు ప్రవేశ పెట్టబడినవి. "ఆశలకూ, ఆశయాలకూ ఒక సాధనము అంటూ లేనప్పుడు అనవసర కాలహరణంగా వాటిని పట్టుకు ప్రేలాడడం జీవితాన్ని కోరి అవదలపాలు చేసుకోవడమే అవుతుంది" ఇది నిస్పృహామయమైన నిరాశావాది అభిప్రాయం.

అన్యాయం జరిగిన యువతి ఆవేశంతో "నేను మీవల్ల పొందిన అన్యాయానికి ఇక బహిర్గతంగానే ప్రతీకారం తీసుకుంటాను. ఇక నా పేరే ప్రతీకారం. ఈ దుష్ట సాంఘిక బంధనాలకు ప్రతీకారం చేస్తాను" అంటుంది. విచ్చలవిడి ధోరణిని అంగీకరిస్తే 'మైదానం' మహోదాత్తమైన నవల అని అనాలి.

వీరేశలింగంగారు పుట్టి శతాబ్దమైనాకూడా ఈ సమస్యను పరిష్కారం కన్పించడంలేదు. మోరియాగారు వర్ణించిన స్థితిలో యువతికి పిచ్చెక్కింది. దీనివలన ఏ పరిష్కారం రచయిత సూచిం దలచుకున్నారో బోధపడకుండా ఉన్నది.

అసహ్యమైన ధోరణిలో కాత్యాయని రెచ్చిపోయి "మీ ఊరువుల్లో నా వూరువుల్ని బిగించి నొక్కివేయగల శక్తి ఉందా" అంటూ సుదీర్ఘమైన ప్రసంగం చేస్తుంది. 'సెక్స్' నవలల ధోరణిలోవున్న ఈ ఉపన్యాసం కొంత తగ్గితే మంచిది.

సమస్యాత్మకంగా వచ్చిన రచనలలో ఈ నవల చక్కని శైలిలో ఉన్నది.

త్యాగధనుడు

పద్యకావ్యము. రచయిత: శ్రీ కందాళ వెంకటాచార్యులు. ప్రతులకు: రచయిత, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా.

త్యాగధనుడు లక్ష్మణుడు. వాల్మీకి రామాయణము నందలి ఉత్తర కాండమునగల కొన్ని సర్గలలో నీ మహానుభావుని త్యాగమునకు సంబంధించిన ఘట్టము నొక్క దానిని గైకొని నూట ఎనిమిది చంపకోత్పలమాలలలో పాటముగ దీర్చి దిద్దిన కావ్యమిది. కావ్యమును రచించు టొక ఎత్తు కాగా అంకిత మిచ్చుట మరియొక ఎత్తు. శ్రీ బెండి కూర్మన్న గారు రచింపుమని కోరిన ఈ కావ్యమును శ్రీ సంజీవరెడ్డి గారు ఆవిష్కరింపగా జానకీపతి పాద సన్నిధినుంచినాడు కవి.

కాలునితో సంభాషించుచున్న శ్రీరాముని యాజ్ఞా బద్ధుడై లక్ష్మణుడు ద్వార పాలనము సేయుచుండెను. దుర్వాస మహర్షి వచ్చి తమ రాక శ్రీరామున కెరిగింపుమనగా లక్ష్మణుడు సంకటమున బడినాడు. శ్రీరాముని రక్షించుటకై తాను త్యాగ మొనరింపదలచి దుర్వాసుని రాక నెరింగించి తాను రాజ ధర్మము ననుసరించి దేశాంతర శిక్ష ననుభవించెను. ఇది ఇందలి విషయము. ఆధారభూతములగు శ్లోకము లన్నియు మూలమున గలవు.

శిక్షను విధించుటకై శ్రీరాముడు పడిన బాధను, త్యాగ మొనరింప నిశ్చయించుకొనిన లక్ష్మణుని సంకల్పమును ధారాశుద్ధిగల శైలిలో రచించిరి. అమూలకమగు నభిప్రాయ మందేమియు గానరాదు. "అమ్మయు, నాన్నయు, గురువు నన్నియు నాకిట మీరలన్న యీ తమ్ముడు శిష్యుడన్ మరియు దాసుడ" అని పల్కిన లక్ష్మణుని త్యాగ నిరతికి పరవశుడైన శ్రీరాముడు తానే శిక్ష విధింపవలసి వచ్చినపుడు పొందిన బాధను చక్కగా వెలువరించినారు.

శిక్షను వారించుచు సుమంత్రుడు "ధర్మము మూర్తిమంతమగు దాశరథిన్ దరియంగ జాలునే ధర్మము"ని పలుకగా జానకీపతి తిరస్కరించి ధర్మము తప్పనని ఆదేశించుటయో, వసిష్ఠుడు సమ్మతించి శిక్ష విధించుటయో యుక్తమని నిర్ణయించుటయు కథా కథన శైలిలోనేగాక మానసిక చిత్రణమునకును ప్రాధాన్యమిచ్చుచు రచించినారు.

—రామమోహన రాయ్.

చిత్రకథాగుచ్ఛము

కీ. శే. చిలకమర్తి లక్ష్మీనరసింహముగారి రచన. చిలకమర్తి పబ్లిషింగ్ హౌస్, కాకినాడ, వెల: 2 రూ.

కథలకు అన్ని కాలాలలోనూ ఆకర్షణ కలదు. కాశీమజిలీలవలె అతిలోక ఘటనలతో నిండినా, మెకంజీ రికార్డుల వలె ఆపులే లేక, హనుమంతుని తోకవలె సాగిపోయినా, నేటి చిన్న కథలవలె అంతమందు భావోద్రేకము కలిగించే పద్ధతిలో కత్తిరించి తయారుచేసినవైనా, ఆకర్షిస్తూనే ఉంటాయి. ఈ చిత్ర కథాగుచ్ఛము తాతలు చెప్పే కథలు వంటివి గుచ్చెత్తినదే. వీటిలో అతిలోకత ఉండదు ఒకటే, ఇవి గడుసువారూ, గయ్యాళివారూ, పిసినిగొట్లూ గురించిన కథలై యుంటాయి రెండూ, వీటి లక్షణాలు. ఘటనను వెనక్కి తోసి సాధించే ఆపేక్షయే గాని కథాశిల్పము వల్ల సాధించిన ఆపేక్ష వీటిలో అరుదు. పూర్వకాలపు గాథలు.

యాజ్ఞవల్క్య

నాటిక. శ్రీ తెన్నేటి విశ్వనాథంగారి రచన. తోటపల్లి శాంత్యాశ్రమ ప్రకటితము.

బృహదారణ్యకోపనిషత్తులోని వస్తువును రచయితరూపక రూపమున వ్రాసినట్టిది. బ్రహ్మవేదవాదరుల కాలపు వరకు వాతావరణము స్ఫురింపజేసే చక్కని విష్కంభముతో కూర్చి,

ప్రశస్యమైన ఉపనిషత్తును దృశ్యముగా తీర్చి, తమ వివరణను అప్పటప్పట పాత్రలచేత పలికించిన జన విశ్వాస సనాథులు విశ్వనాథుల ఈ యత్నము శిరోధార్యము.

—మూర్తి.

న క్ష త్ర మా ల

పద్యకావ్యం; రచయిత : శ్రీ కొలచల సూర్యనారాయణ వెల : 0.37 ప్రాప్తిస్థానము, రచయిత గిరిపల్లి కృష్ణాజిల్లా.

స త్య శ్రీ

పద్యకావ్యం: రచయిత : సంకు సత్యనారాయణ వెల : 0.50. ప్రాప్తిస్థానము వెంకటరామా అండ్ కో, విజయవాడ.

తి రు మ ల

పద్యకావ్యం: రచయిత : శ్రీమాన్ మాడభూషి గోపాలాచార్యులు. వెల : 0.75. ప్రకాశకులు : శ్రీ గోదా గ్రంథమాల, శ్రీమన్నారాయణపురం, ఉర్లిపాలెంపోస్టు, కృష్ణాజిల్లా.

శ్రీ వెంకటేశ్వర శతకం

పద్యకావ్యం: రచయిత : వడలి సూర్యప్రకాశరావు వెల : 0.50. ప్రాప్తిస్థానము: రచయిత : ఏనుగ మహల్, కొత్తపేట తాలూకా తూ. గో. జిల్లా.

1. మా అమ్మ

2. శ్రీ పద్య ముకుందమాల

కులశేఖర మహా ప్రభువు సంస్కృత కృతికి కర్రా త్రిమూర్తి, అనువాదం. ధర 0.50. ప్రాప్తిస్థానము : ఆంధ్ర సాహితీ ప్రచార సభ. కేలికస్ లైన్ 1/4 తాల్బుకూర్, 24 పరగణాలు. ప. బెంగాలు.

కోళ్ల పెంపకము

ధర 1—00. శ్రీకాకుళక్షేత్ర మాహాత్మ్యము. రచయిత: డా. చెర్రెపాటి వెంకట సుబ్బయ్య. ధర 1.25. ప్రకాశకులు. శ్రీకాకుళపుర గ్రంథమాల, భవానీదుర్గం, పెదకళ్లేపల్లి కృ. జిల్లా.

శ్రీ వేంకటేశ్వరాక్షరమాలా శతకము

రచయిత : విద్వాన్ వావిలాల వేంకట సుబ్బయ్య గుర్రి రెడ్డిపాలెము.

అచ్చులు హల్లులు గుణింతములను పద్యాది వర్ణములుగా గ్రహించి శ్రీ వేంకటేశ్వరుని గూర్చి రచించిన శతకము.

సమీర కుమార హృదయమ్

(రచన : శ్రీ నోరి సీతారామశాస్త్రి, ఎం. ఏ. బి. ఎల్., అడ్వకేటు, హైదరాబాదు, వెల 0—40.

శ్రీ సీతారామాంజనేయస్వామికి అంకితం చేయబడిన ఈ గ్రంథమున స్వామిని ప్రస్తుతిస్తూ 108 పద్యములున్నవి.

—కే. సభా

విద్యార్థి పద్య రత్నావళి

రచయిత : విద్వాన్ శ్రీ బయిరెడ్డి సుబ్రహ్మణ్యం, 80 పేజీలతో 156 చక్కని పద్యములతో విద్యార్థులు చదువదగిన పుస్తకము. వెల : 1—25 పైసలు. ప్రతులకు : శ్రీనివాస బుక్కుడిపో, బజారువీధి, తిరుపతి.

క ళ్యా ణ రా ఘ వ ము

రచయిత : శ్రీ చిలుకమర్రి రామానుజాచార్యులు. 51 పేజీలతో సీతాకల్యాణం చక్కగా వర్ణించబడినది. వెల : 1/25 పైసలు. ప్రతులకు త్రివేణీపబ్లిషర్సు, మచిలీపట్నము.

చు క్క లు

రచయిత : శ్రీ పొట్లపల్లి రామారావు. సంక్రాంతికి మిత్రమండలి హన్మకొండవారు ప్రచురించిన ఈ 27 పేజీల గేయరచన చదువుటకు బాగున్నది.

జ ల జ

రచయిత : శ్రీ సున్నా అచ్యుతరావు. 20 పేజీలు. సంపాదకురాలు కాట్రగడ్డ ప్రమీలా రాణి, స్నేహపీఠం ప్రచురణలు. వెల : 0—35 పైసలు. ప్రతులకు స్నేహపీఠం, ఆమీనాపేట, ఏలూరు.

దీ పా వ ళి

రచయిత : శ్రీ ముదిగొండ శంకరశాస్త్రి. 14 పేజీలు. వెల: 0.31 పైసలు. దీపావళిమీద గేయములు. చదువుటకు ముచ్చటగా నున్నవి. ప్రతులకు : శ్రీ ముదిగొండ శంకరశాస్త్రి, నెంబరు 8/ 1007, జయప్రకాష్ నారాయణరోడ్, వరంగల్ (ఆంధ్రప్రదేశ్.)

గ ణ ప తి

రచయిత : శ్రీ ముదిగొండ శంకరశాస్త్రి. ఆరు పుటలు. గణపతిమీద మంచి పద్యములతో కూడినది. ప్రతులకు: శ్రీ ముదిగొండ శంకరశాస్త్రి, నెం. 8/ 1007, జయప్రకాష్ నారాయణరోడ్, వరంగల్.

—పి. దా.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street. Madras 1
Editor : S. Sambhu Prasad.